www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మంగళవారం | 7-1-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 263 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: అష్టమి సా. 4.27 తదుపరి నవమి; నక్షత్రం: రేవతి సా. 5.50 తదుపరి అశ్వని; వర్జ్యం: శేషం ఉ. 7.58; దుర్ముహూర్తం: ఉ. 9.03-9.47, రా. 10.07-10.58; అమృతఘడియలు: మ. 3.33-5.04; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.50, సూర్యాస్తమయం: 5.51 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మొత్తం ఓటర్లు 4,14,40,447



మహిళలే తీర్పరులు.. ఓటర్ల సంఖ్యలో అగ్రస్థానం

పురుషులతో పోలిస్తే 7.3 లక్షల మంది మహిళా ఓటర్లే అధికం

2025-తుది జాబితా విడుదల.. పురుష ఓటర్లు: 2.03 కోట్లు

2.1 కోట్ల మంది మహిళలు.. థర్డ్ జండర్ల ఓట్లు: 3,400

14

ఓఎన్‌జీసీకి టోకరా

ఐదేళ్లలో రూ.370 కోట్లకు కుచ్చుటోపీ!

కడప వ్యాపారుల సిండికేట్ నయా దందా



కడప జిల్లాకు చెందిన కొందరు వైసీపీ నేతలు ఏపీఎండీసీకి కోట్లాది రూపాయలు ఎగవేసిన సంగతి తెలిసిందే. అలాగే అదే జిల్లాకు చెందిన కొందరు వ్యాపారులు కేంద్ర సంస్థ ఓఎన్‌జీసీని రూ.370 కోట్ల మేర మోసం చేశారు. ఏపీఎండీసీ నుంచి తక్కువ నాణ్యత గల బ్రైటీస్‌ను కొనుగోలు చేసి ఎక్కువ గ్రేడ్ పేరిట అత్యధిక ధరకు ఓఎన్‌జీసీకి అంటగడుతున్న వైనం తాజాగా వెలుగులోకి వచ్చింది.

- బెరైటీస్ సరఫరాలో గోల్‌మాల్
- సీ గ్రేడ్ కొని బీ గ్రేడ్‌గా అమ్మకం
- ఎండీసీ నుంచి టన్ను రూ.2 వేల చొప్పున కొనుగోలు
- ప్రాసెస్ చేసి 12 వేలకు అమ్మకం
- టన్నుపై రూ.5,426 మేర దోపిడీ
- జగన్ పాలనలో దర్జాగా దగా
- కార్పొరేషన్ అధికారులూ కుమ్మక్కు
- తెర వెనుక కడప వైసీపీ నేత పాత్ర

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ ప్రభుత్వంలో బెరైటీస్ సిండికేట్ వ్యాపారులు అడ్డగోలుగా దోచుకున్నారు. కొందరు ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ(ఏపీఎండీసీ)ను మోసం చేసి బెరైటీస్ తీసుకెళ్తే.. మరి కొందరు ఏకంగా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ)కే కుచ్చుటోపీ పెట్టారు. గత ఐదేళ్ల వ్యవధిలో రూ.370 కోట్ల మేర ఓఎన్‌జీసీని మోసం చేశారు. ఇది ప్రాథమిక అంచనానే. ఈ ఉదంతంపై సమగ్ర విచారణ చేస్తే ఆ విలువ రెట్టింపయ్యే అవకాశముందని సీనియర్ అధికారులు చెబుతున్నారు. తక్కువ నాణ్యత ఉన్న సీడీడబ్ల్యూ గ్రేడ్‌ను ఏపీఎండీసీ దగ్గర కొని, బీ గ్రేడ్ పౌడర్ పేరిట ఓఎన్‌జీసీకి సరఫరా చేశారు. కడప జిల్లాకు చెందిన ఓ సిండికేట్ మోసానికి ఓఎన్‌జీసీలోని కొందరు పెద్ద అధికారులు కూడా

మిగతా 12వ పేజీలో...



- హైదరాబాద్‌లో అనాడు నేను చేసిన అభివృద్ధి ఫలాలు ఇప్పుడు వస్తున్నాయి. తెలంగాణకు హైదరాబాద్ నుంచే ఎక్కువ ఆదాయం వస్తోంది.
- 2014-19 మధ్య రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాం. తర్వాత వచ్చిన వైసీపీ అభివృద్ధిని పట్టించుకోకపోవడంతో రాష్ట్రం అప్పుల కుప్పగా మారింది. - సీఎం చంద్రబాబు

కుప్పం నియోజకవర్గంలో 'పీఎం సూర్యఘర్' పథకాన్ని ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు

కరెంటు బిల్లుల భారం ఇక ఉండదు!

మీ కరెంటుతో మీకే ఆదాయం: సీఎం.. 'కుప్పం'లో పీఎం సూర్యఘర్‌కు శ్రీకారం

3 రోజుల పర్యటన కోసం కుప్పం రాక

- ద్రవిడ వర్సిటీలో 'స్వర్ణ కుప్పం విజన్-2029' ఆవిష్కరణ
- వచ్చే ఐదేళ్లలో నియోజకవర్గ అభివృద్ధిపై ప్రజెంటేషన్
- 'నెట్ జీరో'పై కాన్పూర్ ఐఐటీతో ఎంవోయూ
- చీగలపల్లెలో ప్రకృతి సాగు రైతులతో ముఖాముఖి
- రాత్రికి 4 మండలాల టీడీపీ నేతలు, శ్రేణులతో భేటీ

కుప్పం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): 'నా చిన్నప్పుడు ఇంట్లో కరెంటు ఉంటే గొప్పగా చెప్పుకొనేవాళ్లం. ఇప్పుడు మన ఇళ్లపై మనమే కరెంటు ఉత్పత్తి చేసుకునే స్థాయికి ఎదిగాం. కుప్పంలోని నడిమూరు.. రాష్ట్రంలోనే తొలి సోలరైజేషన్ గ్రామంగా చరిత్రలో నిలువనుంది. దీనివల్ల ఇక కరెంటు బిల్లుల భారం ఉండదు' అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. భవిష్యత్‌లో ప్రతి కుటుంబమూ మిగులు కరెంటును అమ్ముకునే స్థాయికి ఎదిగేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ దిశగానే కుప్పం నియోజకవర్గాన్ని సోలార్ పైలట్ ప్రాజెక్టుకు ఎంపిక చేసి నడిమూరు నుంచి సోలరైజేషన్‌కు శ్రీకారం చుట్టానని చెప్పారు. తాను

మిగతా 13వ పేజీలో...

'రియల్' నిబంధనలు సరళతరం


రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ పుంజుకునేలా చర్యలు 11

2 రోజుల్లో భవన నిర్మాణాలకు కొత్త రూల్స్: మంత్రి

'కాకినాడ' నుంచి సండూర్ దాకా!

విజయసాయిపై ఈడీ ప్రశ్నల వర్షం

- కాకినాడ 'డీల్'పై సుదీర్ఘ విచారణ
- అనూహ్యంగా 'సండూర్'పైనా ప్రశ్నలు
- పెట్టుబడులు ఎక్కడివని ఆరా
- తెలియదు.. గుర్తులేదని దాటవేత
- ఏ-2గా, ఆడిటర్‌గా ఉంటూ తెలియదంటే ఎలా అని ఈడీ ప్రశ్న
- పోర్టు, సెజ్‌లపైనా సూటిగా ప్రశ్నలు
- అవసరమైతే మళ్లీ పిలుస్తామన్న ఈడీ



కాకినాడ సీపోర్టు, సెజ్‌లో వాటాలను బలవంతంగా లాగేసుకున్న కేసులో వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నించారు. 'కాకినాడ'కే పరిమితం కాకుండా... జగన్ అక్రమాస్తుల కేసులో కీలకమైన 'సండూర్ పవర్'లో పెట్టుబడులపైనా ప్రశ్నలు సంధించారు.. అనూహ్యంగా సండూర్ కేసు తెరపైకి రావడంతో విజయసాయి అవాక్కయినట్లు తెలిసింది.. కాసేపు ఆగి 'తెలియదు', 'గుర్తు లేదు' అని బదులిచ్చినట్టు సమాచారం. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఏం జరిగిదంటే...

హైదరాబాద్/అమరావతి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సీపోర్ట్స్, సెజ్‌ల్లోని తన వాటాను వైసీపీ హయాంలో బలవంతంగా లాగేసుకున్నారంటూ ప్రముఖ వ్యాపారవేత్త కర్నాటి వెంకటేశ్వరరావు (కేవీ రావు) ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐడీ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతోంది. ఈ వ్యవహారంలోని మనీ లాండరింగ్ కోణంపై ఈడీ దృష్టి సారించింది. ఈ కేసులోని నిందితులను ఒక్కొక్కరిగా పిలిచి విచారిస్తోంది. ఈ క్రమంలో విచారణకు రావాల్సిందిగా జారీ చేసిన నోటీస్ మేరకు విజయసాయి సోమవారం ఉదయం హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయంలో అధికారుల ఎదుట హాజరయ్యారు. ఉదయం సుమారు 11.30 గంటల ప్రాంతంలో ఈడీ కార్యాలయానికి వచ్చిన విజయసాయి రెడ్డిని ప్రత్యేక బృందం సాయంత్రం వరకు

మిగతా 13వ పేజీలో...

ప్రజాప్రతినిధుల కోర్టులో జగన్‌కు ఎదురుదెబ్బ

'పాస్‌పోర్టు' పిటిషన్ కొట్టివేత 12

గడువు ముగిసినందున కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని ఆదేశం



2

జస్టిన్ ట్రూడో రాజీనామా!

- నాయకత్వ ఎంపిక జరగ్గానే వైదొలుగుతా
- ప్రకటించిన కెనడా ప్రధాని ట్రూడో
- ధరాఘాతం, వలసలు.. విధాన నిర్ణయాలే కౌంట్‌డౌన్‌కు కారణం!
- ట్రంప్ విజయంతో చుట్టుకున్న చిక్కులు
- భారత్‌నూ తరచూ విమర్శిస్తున్న ట్రూడో
- నిజ్జర్ విషయంలో భారత్‌పై ఆరోపణలు

భర్త చనిపోయి ఆరు రోజులైనా..

14

- ఒకే ఇంట్లో ఉండీ గుర్తించని భార్య
- ఆ దంపతుల మధ్య పదేళ్లుగా మాటల్లేవు
- కోయంబత్తూరులో ఆలస్యంగా వెలుగులోకి

ఇద్దరిని బలిగొన్న పొగమంచు

3

- తిరుపతి జిల్లాలో కాలినడక భక్తులపైకి దూసుకెళ్లిన '108'
- ఒకరి పరిస్థితి విషమం.. నలుగురికి గాయాలు
- అదే అంబులెన్సులో ఆస్పత్రికి తరలింపు



ఐఈడీ పేలుడు ధాటికి ఏర్పడ్డ భారీ గొయ్యి.. తుక్కయిన కారు

8 మంది జవాన్ల మృతి

మావోయిస్టుల మందుపాతర

- 25 అడుగుల ఎత్తు ఎగిరి తునాతునకలైన జవాన్ల వాహనం
- 50 కిలోల పేలుడు పదార్థాల వాడకం
- 'హిడ్మా ఆపరేషన్'పై అనుమానాలు
- ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌లో ఘటన

చర్ల, చింతూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): బస్తర్‌లో మావోయిస్టులు మరోమారు పంజా విసిరారు. జవాన్లు ప్రయాణిస్తున్న వాహనాన్ని 50 కిలోల ఐఈడీతో పేల్చేశారు. పేలుడు శబ్దం 10 కిలోమీటర్ల వరకు

మిగతా 2వ పేజీలో...

హెచ్‌ఎంపీవీ కలకలం

భారత్‌లో ఐదు కేసులు

- బెంగళూరు, చెన్నై, అహ్మదాబాద్ నగరాల్లో వైరస్ బారిన పడ్డ ఐదుగురు శిశువులు
- అందరూ నెలల వయసు చిన్నారులే!
- భయపడొద్దు.. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనడానికి సిద్ధంగా ఉన్నాం: కేంద్రం
- పాత వైరస్సే.. ఆందోళన అక్కర్లేదు: వైద్యులు

ప్రతి ఆస్పత్రిలో 20 పడకలు.. సీఎం ఆదేశం



రెండు హెచ్‌ఎంపీవీ కేసులు నమోదైన బెంగళూరు బాప్టిస్ట్ ఆస్పత్రి

బెంగళూరు, చెన్నై, అమరావతి, హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కొద్దిరోజులుగా చైనాను కలవరపెడుతున్న 'హ్యూమన్ మెటాన్యూమోవైరస్ (హెచ్‌ఎంపీవీ)'.. మన దేశంలోకీ అడుగుపెట్టింది. బెంగళూరులో ఇద్దరు చిన్నారులు.. గుజరాత్‌లో ఒక శిశువు, చెన్నైలో మరో ఇద్దరు చిన్నారులు ఈ వైరస్ బారిన పడినట్టు భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) ప్రకటించింది. బెంగళూరులో.. బ్రాంకోన్యుమోనియాతో బాధపడుతున్న మూడు నెలల పాపను ఆస్పత్రిలో చేర్చగా, వైద్య పరీక్షల్లో హెచ్‌ఎంపీవీ పాజిటివ్ వచ్చింది. అయితే, ఆ పాపకు చికిత్స చేసి, డిశ్చార్జి కూడా చేసినట్టు కేంద్ర ఆరోగ్య శాఖ

మిగతా 2వ పేజీలో...

11 లక్షల కోట్ల సంపద ఫట్ 10

వైరస్ కలకలంతో సెన్సెక్స్ 1,258 పాయింట్లు.. నిఫ్టీ 388 పాయింట్లు డౌన్

ఉపాధ్యాయుల పనితీరుకు ప్రభుత్వం నుంచి మరో భారీ ప్రోత్సాహం దక్కనుంది. విద్యార్థులతో మమేకమై వారికి దిశానిర్దేశం చేస్తూ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేసే గురువులకు పాయింట్లు ఇవ్వనుంది. తద్వారా కష్టపడే వారికి బదిలీల్లో ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

టీచర్ల పనితీరుకు పాయింట్లు!

- దాని ఆధారంగా బదిలీల్లో పెద్దపీట? 12
- సబ్జెక్టుల వారీగా వేర్వేరు ప్రామాణికాలు
- పీఈటీలకు స్పోర్ట్స్, సైన్స్ టీచర్లకు ఫెయిర్లు
- గణిత ఉపాధ్యాయులకు ఒలింపియాడ్
- భాషా టీచర్లకూ వేర్వేరు ప్రాతిపదికలు
- పనితీరులో పోటీపడేలా సరికొత్త ఆలోచన
- 'బదిలీ చట్టం'పై పాఠశాల విద్యాశాఖ కసరత్తు

ఇద్దరు పిల్లలను హతమార్చి..

టెకీ దంపతుల ఆత్మహత్య



అనూప్, రాఖీ

- బెంగళూరు సదాశివనగర్‌లో దారుణం
- కుమార్తె ఆరోగ్య సమస్యలతో వేదన?

2



కక్ష్యలో అలసంద మొలకలు

వాటికి రెండేసి ఆకులు.. ఇస్రో 'క్రాప్స్' ప్రయోగం సక్సెస్

2

ఇద్దరు పిల్లలను హతమార్చి.. టెకీ దంపతుల ఆత్మహత్య

» బెంగళూరు సదాశివనగర్‌లో దారుణం

బెంగళూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు సదాశివనగర్‌లో టెకీ దంపతులు తమ ఇద్దరు పిల్లలను హతమార్చి, ఆత్మహత్య చేసుకున్నారు. మృతులను అనూప్(38), ఆయన భార్య రాఖీ(35), కూతురు అనుప్రియ(5), కుమారుడు ప్రియాంశ్(2)గా పోలీసులు గుర్తించారు. ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌కు చెందిన అనూప్ బెంగళూరులో ఓ కంపెనీకి సాఫ్ట్‌వేర్ కన్సల్‌టెంట్‌గా పనిచేస్తున్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పెద్దకూతురు అనుప్రియ ఆరోగ్య సమస్యతో దంపతులు ఒత్తిడికి, తీవ్ర ఆవేదనకు గురయ్యే వారని తెలుస్తోంది. వీరి ఇంట్లో ముగ్గురు పనివారు ఉన్నారు. ఇద్దరు వంటపని చేసేవారు కాగా ఒకరు ప్రియాంశ్‌ను చూసుకునేవారు. ఒక్కొక్కరికి రూ.15వేల దాకా జీతం ఇచ్చేవారు. సోమవారం ఉదయం పాండిచ్చేరి వెళుతున్నామని, తొందరగా పనికి రావాలని ఆదివారం సూచించారు. కుటుంబం ప్రయాణానికి ఆదివారం ప్యాకింగ్ పనులను కూడా పనివారు చేశారు. వీరు సోమవారం ఉదయం వచ్చేసరికి దంపతులు ఇద్దరూ ఉరి వేసుకుని కనిపించారు. బిడ్డలిద్దరికీ విషం ఇచ్చి చంపినట్టు, ఆ తరువాత దంపతులు ఉరి వేసుకున్నట్టు భావిస్తున్నారు. అనూప్ కుటుంబం ఆర్థికంగా పటిష్ఠంగా ఉందని, ఎలాంటి ఆర్థిక సమస్యలు లేవని సమాచారం.

పేపర్ లీక్ నిరసనలతో జైలుకు ప్రశాంత్ కిశోర్

పట్నా, జనవరి 6: బిహార్ పబ్లిక్ సర్వీసు కమిషన్ (బీపీఎస్సీ) నిర్వహించిన పరీక్షా పేపరు లీక్ అయిన వ్యవహారంపై ఆందోళన చేస్తున్న ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు, జన్ సురాజ్ పార్టీ అధ్యక్షుడు ప్రశాంత్ కిశోర్‌ను పట్నాలో పోలీసులు అరెస్టుచేశారు. షరతులతో కూడిన బెయిల్‌ను తీసుకునేందుకు నిరాకరించడంతో ఆయనను జైలుకు తరలించారు. పబ్లిక్ సర్వీసు కమిషన్ నిర్వహించిన పరీక్షా పేపరు గత ఏడాది డిసెంబరు 13న లీకైన విషయం తెలిసిందే. దీనిపై బిహార్‌లో తీవ్ర రాజకీయ నిరసనలు కొనసాగుతున్నాయి. బీపీఎస్సీ పరీక్షలను రద్దుచేయాలంటూ బాధిత అభ్యర్థులు, ప్రతిపక్షాలు ఉద్యమిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రశాంత్ కిశోర్ తన మద్దతుదారులతో కలిసి ఐదు రోజులుగా పట్నాలోని గాంధీ మైదానంలో నిరశన దీక్ష చేస్తున్నారు. అయితే, నిషిద్ధ స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా దీక్ష చేపడుతున్నారంటూ సోమవారం ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అడ్డుకోబోయిన 43 మంది మద్దతుదారులను కూడా అదుపులోకి తీసుకున్నారు.

ఒంటరిగా రావాల్సిందే!

» ఫార్ములా ఈ కేసులో కేటీఆర్‌కు ఏసీబీ ఝలక్

» న్యాయవాదులతో వచ్చిన కేటీఆర్.. లోపలికి అనుమతించని ఏసీబీ

» 9న రావాలని కేటీఆర్‌కు మరోసారి నోటీస్

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా ఈ కారు రేస్ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఏసీబీ విచారణకు హాజరయ్యేందుకు న్యాయవాదులతో కలిసి వెళ్లిన బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, తెలంగాణ మాజీ మంత్రి కేటీఆర్‌ను పోలీస్‌లు ఏసీబీ కార్యాలయంలోకి అనుమతించలేదు. పోలీస్‌లపై నమ్మకం లేకే న్యాయవాదులతో కలిసి వచ్చానని కేటీఆర్ బదులిచ్చారు. దాంతో కొంత గందరగోళ పరిస్థితి నెలకొంది. చివరకు న్యాయవాదులతో కలిసి విచారణకు అనుమతించేది లేదని ఏసీబీ నుంచి కచ్చితమైన ఆదేశాలు రావడంతో గేటు దగ్గర ఉన్న పోలీసులు కేటీఆర్‌కు అదే విషయాన్ని చెప్పారు. దాంతో ఆయన విచారణకు హాజరు కాకుండానే అక్కడి నుంచి వెనుదిరిగారు. తాను చెప్పాలనుకున్నది లిఖిత పూర్వకంగా అందజేసి వెళ్లిపోయారు. ఫార్ములా ఈ కారు రేస్ కేసులో కేటీఆర్ ప్రధానంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. కాగా, ఈ కేసులో కేటీఆర్‌కు ఏసీబీ మరోసారి నోటీస్‌లు జారీ చేసింది. ఈ నెల 9న విచారణకు రావాలని, న్యాయవాదుల్ని అనుమతించేది లేదని అందులో స్పష్టం చేసింది.

సీబీఐ వలలోఎయిర్‌ఫోర్స్ అధికారి

» కాంట్రాక్టర్ నుంచి లంచం డిమాండ్.. వేధింపులు

» రెడ్ హ్యాండెడ్‌గా అరెస్టు.. విశాఖ సీబీఐ కోర్టులో హాజరు

బాపట్ల, జనవరి 6(ఆంధ్రజ్యోతి): అడిగినంత కమీషన్ ఇవ్వకపోతే భవిష్యత్తులో ఇంకే కాంట్రాక్టు దక్కకుండా చేయడంతో పాటు బ్లాక్ లిస్టులోకి పంపిస్తా.. ఇదీ బాపట్ల ఎయిర్‌ఫోర్స్ విభాగంలో పనిచేస్తున్న ఓ అధికారి బెదిరింపులు! దీనిపై బాధిత కాంట్రాక్టర్ విశాఖపట్నంలోని సీబీఐ అవినీతి నిరోధక విభాగానికి ఫిర్యాదు చేయడంతో ఆ అవినీతి అధికారిని బాపట్లలో రెడ్ హ్యాండెడ్‌గా అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే బాపట్లలో ఉన్న ఎయిర్ ఫోర్స్ విభాగంలో చైతన్యకుమార్ అనే వ్యక్తి లాజిస్టిక్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇతనికి ఫ్లైట్ లెఫ్టినెంట్ హోదా కూడా ఉంది. ఎయిర్‌ఫోర్స్‌లో పరుపులు కొనే బిడ్‌ను రూ.4,99,500కు ఓ కాంట్రాక్టర్‌ను దక్కించుకున్నారు. వీటితో పాటు రూ.2 లక్షల విలువ చేసే మరో రెండు పనులను కూడా ఇదే కాంట్రాక్టర్ సదరు విభాగంలో దక్కించుకొని.. పనులు పూర్తి చేసినట్లు తెలుస్తోంది. అయితే ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగి కమీషన్ డిమాండ్ చేయడంతో పాటు తనకు లంచం ఇవ్వకపోతే ఇక్కడ పనులు చేయలేవని సదరు కాంట్రాక్టర్‌ను బెదిరించినట్లు సమాచారం.

నేరుగా సీబీఐ అవినీతి నిరోధక విభాగానికి ఫిర్యాదు

చైతన్యకుమార్ వేధింపులతో బాధిత కాంట్రాక్టర్ విశాఖపట్నంలోని సీబీఐ అవినీతి నిరోధక విభాగానికి వారం క్రితం ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో రంగంలోకి దిగిన సీబీఐ.. రెడ్ హ్యాండెడ్‌గా ఆ అవినీతి అధికారిని అదుపులోకి తీసుకుంది. ప్లాన్‌లో భాగంగా చైతన్యకుమార్‌కు లంచం ఇచ్చేందుకని కాంట్రాక్టర్‌తో ఫోన్ చేయించి.. ఆదివారం ఆయన్ను బాపట్ల రూరల్ గ్రామం భర్తిపూడికి రప్పించారు. అప్పటికే అక్కడ మాటు వేసిన సీబీఐ అధికారులు సదరు అధికారి లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడిని విశాఖపట్నం సీబీఐ కోర్టులో సోమవారం హాజరుపరిచారు. సీబీఐ అధికారులు ఆరు వాహనాల్లో సోదాల కోసం భర్తిపూడికి వచ్చారని ఆదివారం కలకలం రేపిన విషయం తెలిసిందే. మధ్యాహ్నమే ఎయిర్‌ఫోర్స్ అధికారిని అదుపులోకి తీసుకుని సాయంత్రం వరకు అప్పికట్ల రైల్వేస్టేషన్‌లో ఉంచి విచారణ చేసినట్లు సమాచారం. కానీ పూర్తి వివరాలు ఇవ్వడానికి సీబీఐ అధికారులు నిరాకరించారు. సోమవారం విశాఖ సీబీఐ కోర్టులో హాజరుపర్చడంతో కేసు వివరాలు వెలుగులోకి వచ్చాయి.



అమెరికా కాంగ్రెస్ భవనం వద్ద మంచును తొలగిస్తున్న సిబ్బంది

అమెరికాలో మంచు తుఫాను బీభత్సం

» 6 కోట్ల మందిపై ప్రభావం.. 6 రాష్ట్రాల్లో ఎమర్జెన్సీ విధింపు

వాషింగ్టన్, జనవరి 6: అమెరికాను భారీ మంచు తుఫాను వణికిస్తోంది. మధ్య అమెరికాలో శనివారం ప్రారంభమైన ఈ విధ్వంసంతో దాదాపు 6 కోట్ల మందిపై ప్రభావం పడే ప్రమాదం నెలకొంది. పోలార్ వర్టెక్స్ (ధ్రువపు అల్పపీడనం) కారణంగా ఈ తుఫాను సంభవించింది. దాదాపు 30 రాష్ట్రాల్లో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని చోట్ల రోడ్లపై మంచు 15 అంగుళాల వరకు పేరుకుపోయిందని, విజిబులిటీ కూడా సరిగా లేదని, ఇలాంటి సమయంలో ప్రయాణాలు చేయడం ప్రమాదకరమని నేషనల్ వెదర్ సర్వీస్ (ఎన్‌డబ్ల్యూఎస్) హెచ్చరించింది. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో పలు రాష్ట్రాలు అప్రమత్తమయ్యాయి. ఇప్పటికే కెంటుకీ, వర్జీనియా, వెస్ట్ వర్జీనియా, కాన్సాస్, అర్కాన్సాస్, మిస్సోరి రాష్ట్రాల్లో ఇప్పటికే ఎమర్జెన్సీ ప్రకటించారు.

హెచ్‌ఎంపీవీ కలకలం

(మొదటి పేజీ తరువాయి)



బెంగళూరులో హెచ్‌ఎంపీవీ బాధితులు చికిత్స పొందుతున్న ఆస్పత్రి

తెలిపింది. అదే ఆస్పత్రిలో.. అదే సమస్యతో బాధపడుతున్న ఎనిమిది నెలల వయసున్న బాబుకు కూడా హెచ్‌ఎంపీవీ పాజిటివ్ వచ్చింది. ఆ బాబుకు చికిత్స చేస్తున్నామని.. ప్రస్తుతం కోలుకుంటున్నాడని వైద్యులు తెలిపారు. అలాగే.. రాజస్థాన్‌లోని దుంగార్పూర్‌కు చెందిన రెండు నెలల వయసున్న బాబు శ్వాసకోశ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతుండడంతో తల్లిదండ్రులు ఆ శిశువును అహ్మదాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. డిసెంబరు 26న ఆ బాలుడికి హెచ్‌ఎంపీవీ పాజిటివ్ వచ్చింది. తొలుత ఆ చిన్నారికి వెంటిలేటర్ చికిత్స అవసరమైందని.. ఇప్పుడతడి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. అయితే ఈ వైరస్ గురించి అంతగా ఆందోళన చెందాల్సిన పని లేదని.. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా సమర్థంగా ఎదుర్కొనడానికి సిద్ధంగా ఉన్నామని కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. ఐసీఎంఆర్‌తోపాటు, ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్ నెట్‌వర్క్ వద్ద ఉన్న తాజా సమాచారం ప్రకారం.. దేశంలో ఫ్లూ తరహా కేసులు, తీవ్రమైన శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల సంఖ్య అసాధారణ స్థాయిలో ఏమీ పెరగలేదని స్పష్టం చేసింది. అయినా, పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని.. సంవత్సరం పొడుగునా హెచ్‌ఎంపీవీ వ్యాప్తి తీరును ఐసీఎంఆర్, నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ పరిశీలిస్తూనే ఉంటాయని కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా పేర్కొన్నారు. కర్ణాటక, గుజరాత్, మహారాష్ట్ర ప్రభుత్వాలు కూడా.. భయపడాల్సిన పని లేదని ప్రజలకు భరోసా ఇచ్చాయి. బెంగళూరులో గుర్తించినవి ఇప్పటికే దేశంలో ఉన్న పాత వైరస్ రకాలేనని.. అవి ప్రాణాంతకం కాదని, కాబట్టి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కర్ణాటక ఆరోగ్య మంత్రి దినేశ్ గుండూరావ్ ప్రకటించారు. బెంగళూరులో రెండు కేసులు నమోదైన నేపథ్యంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ అధికారులతో ఆయన భేటీ అయి పరిస్థితిని సమీక్షించారు. ఆ శిశువులిద్దరి ఆరోగ్యం సాధారణంగానే ఉందని తెలిపారు. ప్రజలందరూ సాధారణ ముందుజాగ్రత్త చర్యలు పాటించాలని సూచించారు. ఈ వైరస్ ప్రధానంగా పిల్లలపై ప్రభావం చూపుతుందని.. సాధారణ జలుబు తరహా ఇన్ఫెక్షన్‌కు కారణమవుతుందని, కొవిడ్-19 లాగా వ్యాపించదని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికైతే దీనికి సంబంధించి అసహజమైన పరిణామాలేవీ లేవు కాబట్టి.. ఈ వైరస్‌వ్యాప్తి కట్టడికి కొవిడ్ తరహా ప్రోటోకాల్స్ పాటించాల్సిన అవసరం లేదని దినేశ్ గుండూరావ్ తేల్చిచెప్పారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎనిమిది నెలల చిన్నారి కూడా మంగళవారం డిశ్చార్జ్ కానున్నట్టు ఆయన వెల్లడించారు. ఇక.. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనడానికి సిద్ధంగా ఉన్నామని గుజరాత్ ఆరోగ్య మంత్రి రుషీకేశ్ పటేల్ ప్రకటించారు. జనవరి 4నే దీనిపై ఆరోగ్య శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి అంతా అప్రమత్తంగా ఉండాలని సూచించినట్టు తెలిపారు. మరోవైపు.. కేసుల సంఖ్య పెరిగినా ఎలాంటి ఇబ్బందీ లేకుండా చికిత్స చేసేందుకు సిద్ధంగా ఉండాలని ఢిల్లీ ప్రభుత్వం దేశరాజధానిలోని ఆస్పత్రులకు సూచించింది.

పాత వైరస్సే!

నాలుగేళ్ల క్రితం చైనాలో మొదలై ప్రపంచం మొత్తానికీ పాకి లక్షలాది ప్రాణాలు పోవడానికి కారణమైన 'సార్స్ కొవ్ 2' లాగా హెచ్‌ఎంపీవీ కొత్త వైరస్ కాదు. 2001లోనే గుర్తించిన 'కామన్ రెస్పిరేటరీ వైరస్' ఇది. చిన్నపిల్లల్లోనే కాదు.. రోగనిరోధక శక్తి సరిగ్గా లేకపోతే అన్ని వయసులవారిలో ఎగువ, దిగువ శ్వాసకోశ ఇన్ఫెక్షన్లకు కారణమవుతుంది. ఈ వైరస్ సోకితే.. జలుబులాంటి లక్షణాలు కనపడతాయి. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో చలికాలంలో హెచ్‌ఎంపీవీ ఇన్ఫెక్షన్ కేసులు పెరుగుతుంటాయి. ఉదాహరణకు 2023లో ఆస్ట్రేలియాలో వారం వ్యవధిలోనే 1100కు పైగా కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలోనే చైనాలో కూడా చలి ఎక్కువగా ఉన్న ఉత్తరాది ప్రాంతాల్లో హెచ్‌ఎంపీవీ కేసులు పెరిగాయి. కరోనా సృష్టించిన విలయం నేపథ్యంలో.. చైనాలో హెచ్‌ఎంపీవీ కేసులు పెరుగుతున్నాయన్న వార్త ప్రపంచం మొత్తాన్నీ భయంలోకి నెట్టింది. ఇప్పటికే సీజనల్ వ్యాధిగా మారినందున.. హెర్డ్ ఇమ్యూనిటీ వచ్చేసి ఉంటుందని, ఇది కరోనాలాగా మహమ్మారిగా(పాండెమిక్) మారే ముప్పు లేదని వైద్యులు చెబుతున్నారు.



"హెచ్‌ఎంపీవీ ఏమీ కొత్త వైరస్ కాదు. ఇది మన దేశంలో ఉన్న పాత వైరస్సే. ఏటా కొంత మంది దీనిబారిన పడతారు. కాబట్టి ఆందోళన చెందాల్సిన పని లేదు. ప్రజలందరూ సాధారణ ముందుజాగ్రత్తచర్యలు పాటిస్తే చాలు. ఈ వైరస్ వ్యాప్తి కట్టడికి కొవిడ్ తరహా ప్రోటోకాల్స్ అవసరం లేదు"
-దినేశ్ గుండూరావ్, ఆరోగ్య మంత్రి, కర్ణాటక

తీసుకోవాల్సిన ముందుజాగ్రత్త చర్యలు

1 తుమ్మేటప్పుడు, దగ్గేటప్పుడు నోటికి అడ్డంగా చేతి రుమాలు లేదా టిష్యూ పేపర్ పెట్టుకోవాలి.
1 చేతులను తరచుగా సబ్బు, నీరు లేదా ఆల్కహాల్ బేస్డ్ శానిటైజర్‌తో 20 సెకన్లు శుభ్రం చేసుకోవాలి.
1 జలుబు, దగ్గు, జ్వరంతో బాధపడేవారు.. రద్దీప్రదేశాలకు వెళ్లకూడదు.
1 ఒకవేళ బయటకు వెళ్లాల్సివస్తే నాణ్యమైన మాస్క్ ధరించాలి.
1 వైరస్ సోకినవారు సైతం మాస్క్ ధరించి ఉండాలి. ఇతరులకు దూరంగా ఉండాలి (సెల్ఫ్ ఐసోలేషన్).
1 పౌష్టికాహారం తీసుకోవాలి. మంచినీళ్లు ఎక్కువగా తాగుతుండాలి.
1 మనం ఉండే చోట గాలి, వెలుతురు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి.
1 కరచాలనాలు చేసుకోవడం ఆపేయాలి. ఒకరు వాడిన రుమాలు మరొకరు వాడకూడదు.
1 జలుబు, దగ్గు, జ్వరంతో బాధపడేవారికి మరీ దగ్గరగా మెలగకూడదు.
1 చేతులతో ముఖాన్ని కళ్లు-ముక్కు-నోటి భాగాలను పదేపదే తాకకుండా ఉండాలి.

వ్యాప్తి ఇలా...


ఈ వైరస్ సోకినవారు తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు వెలువడే తుంపర్ల ద్వారా, ఆ తుంపర్లు పడిన ప్రాంతాలను/వస్తువులను ఇతరులు తాకడం వల్ల, వైరస్ బారిన పడ్డవారితో సన్నిహితంగా మెలగడం వల్ల.. ఇతరులకు సోకుతుంది. వైరస్ ఇన్‌క్యుబేషన్ పీరియడ్.. అంటే, అది శరీరంలో ప్రవేశించినప్పటి నుంచి లక్షణాలు కనిపించడానికి పట్టే సమయం.. 3 నుంచి 6 రోజులు. నవజాత శిశువులు, ఐదేళ్లలోపు పిల్లలు, ఆస్తమా, ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడే వృద్ధులు, హెచ్ఐవీ వంటివాటితో బాధపడేవారు, అవయవాల మార్పిడి శస్త్రచికిత్సలు చేయించుకుని రోగనిరోధకశక్తిని అణచివేసే మందులు వాడుతున్నవారు ఈ వైరస్ బారిన పడే ముప్పు ఎక్కువ.

ఇవీ లక్షణాలు

సాధారణంగా మనకు జలుబు చేసినప్పుడు ఎలాంటి లక్షణాలు ఉంటాయో.. హెచ్‌ఎంపీవీ సోకినప్పుడు కూడా అవే లక్షణాలు కనిపిస్తాయి. జలుబు, దగ్గు, జ్వరం, ముక్కు దిబ్బడ, ఊపిరి ఆడకపోవడం వంటి లక్షణాలు రెండు నుంచి ఐదు రోజులపాటు ఉండి, ఆ తర్వాత తగ్గిపోతాయి. అయితే.. రోగనిరోధక శక్తి బలంగా లేని పసివారికి, వృద్ధులకు ఈ వైరస్ సోకితే వారు న్యూమోనియా, బ్రాంకైటిస్ బారిన పడే ప్రమాదం ఉందని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. చలికాలంలో వచ్చే చాలారకాల సీజనల్ ఇన్ఫెక్షన్ల వంటిదే కాబట్టి దీని విషయంలో కూడా సాధారణ ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటే సరిపోతుందని వారు పేర్కొంటున్నారు.

లోకం తీరు

పానీ పూరీకి డిజిటల్ చెల్లింపుల పెరుగుదల: జీఎస్టీ వర్తింపు!



హెచ్‌ఎంపీవీపై అప్రమత్తంగా ఉండండి

» ఆరోగ్యశాఖ అధికారులకు సీఎం ఆదేశం

అమరావతి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో హెచ్‌ఎంపీవీ కేసులు నమోదుకాలేదని, ఈ విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. చైనాను వణికిస్తున్న హ్యూమన్ మెటానిమో వైరస్ (హెచ్‌ఎంపీవీ)పై రెండు రోజులుగా వ్యాప్తి చెందుతున్న వార్తల దృష్ట్యా.. ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో సోమవారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కర్ణాటక, గుజరాత్‌ల్లో హెచ్‌ఎంపీవీ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఈ విషయంలో ప్రభుత్వానికి అవసరమైన సాయం అందించేందుకు వైద్య నిపుణులతో ట్రాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. వైరస్ ప్రభావితుల పరీక్ష కోసం రాష్ట్రంలో ఐసీఎంఆర్ గుర్తించిన 10 వైరాలజీ ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అలాగే జర్మనీ నుంచి 3000 కిట్లు కొనుగోలు చేయాలని సీఎం సూచించారు. 4.50 లక్షల ఎన్95 మాస్కులు, 3.52 లక్షల పీపీటీ కిట్లు, 13.71 లక్షల ట్రిపుల్ లేయర్ మాస్కులు, అందుబాటులో ఉన్నాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రాబోయే మూడు నెలలకు సరిపడా శానిటైజర్లు, మాస్కులు సమకూర్చుకోవాలని సీఎం ఆదేశించారు. చికిత్సకు అవసరమైన మందులు, ఇంజెక్షన్లు సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ బోధన, జిల్లా ఆస్పత్రుల్లో 20 పడకల ఐసోలేషన్ వార్డులను సిద్ధంగా ఉంచాలన్నారు. కాగా, ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్ల పరిశీలనకు విశాఖపట్నం వెళ్లిన ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కూడా అక్కడనుంచే ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. వైరస్‌పై అప్రమత్తంగా ఉండాలన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

జస్టిన్ ట్రూడో రాజీనామా!

» నాయకత్వ ఎంపిక జరగ్గానే వైదొలుగుతా.. ప్రకటించిన కెనడా ప్రధాని ట్రూడో

» ధరాఘాతం, వలసలు.. విధాన నిర్ణయాలే కౌంట్‌డౌన్‌కు కారణం!

ఒటావా, జనవరి 6: కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో సోమవారం కీలక ప్రకటన చేశారు. లిబరల్ పార్టీ నాయకత్వానికి, ప్రధాని పదవికి రాజీనామా చేయనున్నట్లు వెల్లడించారు. తదుపరి ప్రధాని, పార్టీ అధినేతను ఎన్నుకునే వరకు తాను కొనసాగుతానని స్పష్టం చేశారు. సర్వేలన్నీ ప్రతికూలంగా ఉండడంతో.. ఈ ఏడాది అక్టోబరులో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లోనూ తాను ప్రధాని అభ్యర్థిగా ఉండబోనని పరోక్షంగా చెప్పారు. భారత ఏజెన్సీలపై ఆరోపణలు గుప్పిస్తూ.. ఇరు దేశాల మధ్య దూరాన్ని పెంచేలా ప్రకటనలు చేసిన ట్రూడో.. ఆ తర్వాత క్రమంగా ప్రజాదరణ కోల్పోతూ వస్తున్నారని సొంత పార్టీ నేతలే విమర్శలు చేశారు. అమెరికాలో ట్రంప్ విజయం సాధించాక.. కెనడాపై ఆంక్షలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో.. ట్రూడో తప్పుకోవాలంటూ కొంతకాలంగా సొంత పార్టీ నేతలే డిమాండ్లు చేస్తున్నారు. "నా రాజీనామా విషయాన్ని గవర్నర్ జనరల్‌కు, పార్టీకి తెలియజేశాను. ఈ ప్రక్రియ కొనసాగేందుకు మార్చి 24 వరకు పార్లమెంట్‌ను ప్రొరోగ్ చేస్తున్నా" అని ట్రూడో ప్రకటించారు. కెనడా చట్టాల ప్రకారం అధికార పార్టీ నేత రాజీనామా చేసిన 90 రోజుల్లో కొత్త నాయకత్వాన్ని ఎన్నుకోవాలి. కెనడా ఉప ప్రధాని, ఆర్థిక మంత్రి క్రిస్టియా ఫ్రీలాండ్ ఇటీవల రాజీనామా చేసిన విషయం తెలిసిందే..! ట్రూడో క్యాబినెట్‌లో ఆమె అత్యంత శక్తిమంతురాలిగా గుర్తింపు పొందారు.

కౌంట్‌డౌన్‌కు కారణాలివే..!

1 ఆహార ధరల పెరుగుదల, రియల్‌ఎస్టేట్ ధరాఘాతం, పెరిగిపోతున్న వలసల కారణంగా ట్రూడోపై ప్రజల్లో ఆదరణ తగ్గడం మొదలైంది. ఈ కారణాలతోనే ఇటీవల టొరంటో, మొంట్రియల్ రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో పార్టీ ఘోరంగా ఓటమిపాలైంది.
1 ట్రూడో విధానాలను డొనాల్డ్ ట్రంప్ వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే..! ఇటీవల ట్రంప్ విజయం సాధించగానే, కెనడా నుంచి చేసుకునే దిగుమతులపై 25% టారిఫ్ వేస్తానని ఆయన ప్రకటించారు. సహజవాయువులు, ఉక్కు, అల్యూమినియం, ఆటోమొబైల్స్ ఎగుమతుల్లో కెనడాకు అమెరికానే అతిపెద్ద వినియోగదారు కావడంతో, ట్రంప్ ప్రకటన ఆర్థికంగా కెనడాకు శరాఘాతంగా మారుతుంది
1 మూడో ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న భారత్ విషయంలోనూ ట్రూడో దుందుడుకుతనం ఆయనకు ఆదరణ కోల్పోయేలా చేసిందనే అభిప్రాయాలున్నాయి. కెనడాలో తలదాచుకుంటున్న ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్యకు భారత ఏజెన్సీలు ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు. నిజ్జర్‌ను ఉగ్రవాదిగా భారత జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) ప్రకటించడాన్ని అప్పట్లో ఆయన తప్పుబట్టారు. వలస విధానాల్లో మార్పులతో కెనడాలో ఉంటున్న ప్రవాస భారతీయులను ఇబ్బంది పెట్టేలా నిర్ణయాలు తీసుకున్నారు
1 అక్టోబరులో జరగనున్న ఎన్నికల్లో.. లిబరల్ పార్టీ ప్రజాదరణ 47% నుంచి 21శాతానికి పడిపోయినట్లు.. కన్జర్వేటివ్ పార్టీ వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నట్లు సర్వేలు వచ్చాయి.

మావోయిస్టుల మందుపాతర... 8 మంది జవాన్ల మృతి

(మొదటి పేజీ తరువాయి)

వినిపించగా.. రోడ్డుపై ఐదు మీటర్ల మేర, ఐదడుగుల లోతుతో గొయ్యి ఏర్పడింది. పేలుడుధాటికి వాహనం 25 అడుగుల ఎత్తుకు ఎగిరిపడగా.. డ్రైవర్, 8 మంది జవాన్ల దేహాలు ఛిద్రమైపోయాయి. వీరంతా దక్షిణ అబూజ్‌మడ్‌లో ఎన్‌కౌంటర్(నలుగురు నక్సల్స్ చనిపోయారు) నుంచి దంతేవాడకు ఎస్‌యూవీలో తిరిగి వస్తుండగా.. ఈ ఘటన చోటుచేసుకుంది. ఇద్దరుముగ్గురు జవాన్ల తల భాగాలు గుర్తించేలా ఉండగా.. మిగతా వారి శరీర భాగాలు చెల్లాచెదురయ్యాయి. ఇటీవల దక్షిణ అబూజ్‌మడ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు నక్సల్స్(ఇద్దరు మహిళలు) మృతిచెందారు. ఆ తర్వాత దంతేవాడ, బీజాపూర్, నారాయణపూర్, బస్తర్, కొండగాం జిల్లాల డీఆర్జీ బలగాలు.. సీఆర్పీఎఫ్ జవాన్లు కూంబింగ్ కొనసాగించారు. అదనపు బలగాలు రావడంతో పలు బృందాలు వెనుదిరిగాయి. ఈ క్రమంలో దంతేవాడ డీఆర్జీకి చెందిన జవాన్లు బామన్ సోడి, బుధ్రామ్ కోస్రా, దుమ్మ మాడ్కమి, హరీశ్, పాండ్రూ, సోముడు, సుబర్నాథ్ యాదవ్, సుదర్శన్ వెట్టి, డ్రైవర్(పేరు తెలియాల్సి ఉంది)తో కలిసి ఎస్‌యూవీ(సీజీ17-కేడబ్ల్యూ7937)లో.. మరికొందరు జవాన్లు ఇతర వాహనాల్లో సోమవారం తెల్లవారుజామున తిరుగు ప్రయాణమయ్యారు. మావోయిస్టులు ఈ సమాచారం అందుకుని, బెద్రా గ్రామశివారులో కుట్రు రహదారిపై సుమారు 50 కిలోల ఐఈడీని అమర్చారు. సోమవారం మధ్యాహ్నం 2.15 గంటలకు జవాన్ల వాహనాల శ్రేణి ఆ ప్రాంతాన్ని దాటుతుండగా.. చివరి వాహనం ఆ ప్రాంతానికి రాగానే ఐఈడీని పేల్చారు. వాహనం 25 అడుగుల ఎత్తుకు ఎగిరి.. 30 అడుగుల దూరంలో పడింది. డ్రైవర్ మృతదేహం చిన్నచిన్న ముక్కలుగా తెగిపోయిందని పోలీసులు తెలిపారు. ఈ వాహనానికి ముందున్న ఎస్‌యూవీలోని ఏడుగురు జవాన్లకు కూడా గాయాలైనట్లు చెబుతున్నారు. ముందు వాహనాల్లోని జవాన్లు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. జవాన్లపై మావోయిస్టుల దాడిని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్‌సాయి ఖండించారు. 2026 నాటికి నక్సలిజాన్ని తుదముట్టిస్తామని అమిత్‌షా పునరుద్ఘాటించారు.



పేలుడు ధాటికి తునాతునకలైన వాహనం

ఛత్తీస్‌గఢ్ జర్నలిస్టు హత్యకేసు.. హైదరాబాద్‌లో నిందితుడి అరెస్టు

చర్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాకు చెందిన ఫ్రీలాన్స్ జర్నలిస్టు ముఖేశ్ చంద్రాకర్ హత్యకేసు నిందితుడిని ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఆదివారం హైదరాబాద్‌లో అరెస్టు చేసింది. నిందితుడు సురేశ్ చంద్రాకర్ హైదరాబాద్‌లోని తన డ్రైవర్ ఇంట్లో తలదాచుకున్నట్లు గుర్తించామని బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసేందుకు 200 సీసీ కెమెరాల ఫుటేజీని జల్లెడపట్టామని, 300 సెల్‌ఫోన్ల కాల్ డేటా రికార్డ్(సీడీఆర్)ను విశ్లేషించామని చెప్పారు. ఓ ఆంగ్ల జాతీయ చానల్‌కు వార్తలు అందజేసే ముఖేశ్ ఈ నెల 3న దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే.! ఆయన మృతదేహం ఓ సెప్టిక్ ట్యాంకులో లభించగా.. పోస్టుమార్టం నివేదికలో అతని తలపై 15 దెబ్బలు, కాలేయంలో నాలుగు పోట్లు, గుండె భాగంలో గాయాలు, మెడ ఎముకలు నాలుగు చోట్ల విరిగి ఉన్నట్లు తేలింది. ఐదు పక్కటెముకలు విరిగినట్లు వైద్యులు గుర్తించారు. "నా 12 ఏళ్ల కెరీర్‌లో ఎన్నడూ ఇంతటి దారుణ హత్యను నేను చూడలేదు" అని పోస్టుమార్టంలో పాల్గొన్న ఓ వైద్యుడు మీడియాకు చెప్పారు.

ఓట్ల కోసం నా తండ్రిని దూషిస్తారా?

» బిధూరీ వ్యాఖ్యలపై ఢిల్లీ సీఎం కన్నీరు

న్యూఢిల్లీ, జనవరి 6: ఢిల్లీ సీఎం ఆతిశీ మీడియా ముందు భావోద్వేగానికి గురయ్యారు. కల్కాజీ అసెంబ్లీ స్థానంలో తనపై పోటీచేస్తున్న బీజేపీ అభ్యర్థి రమేశ్ బిధూరీ వృద్ధుడైన తన తండ్రిని నిందించారని కన్నీరు పెట్టుకున్నారు. ఓట్ల కోసం ఓ వృద్ధుడిని టార్గెట్ చేస్తున్నారని మండిపడ్డారు. ఆతిశీ తన తండ్రినే మార్చేశారని.. ఇదివరకు తన ఇంటిపేరు మర్లేనా అని చెప్పారని.. ఇప్పుడు సింగ్ అంటున్నారని బిధూరి ఆదివారం ఓ సభలో అన్నారు. ఈ వ్యాఖ్యలపై ఆతిశీ సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఉబికివచ్చే కన్నీటిని ఆపుకోవడానికి విఫలయత్నం చేస్తూ.. 'నా తండ్రి తన జీవితమంతా ఉపాధ్యాయుడిగా పనిచేశారు. ప్రస్తుతం ఎవరి సాయమూ లేకుంటే నడిచే పరిస్థితుల్లో లేరు. ఎన్నికల కోసం అలాంటి వృద్ధుడిని నిందించే స్థాయికి బిధూరి దిగజారారు' అని అన్నారు.

కక్ష్యలో అలసంద మొలకలు.. వాటికి రెండేసి ఆకులు..

ఇస్రో 'క్రాప్స్' ప్రయోగం విజయవంతం

బెంగళూరు, జనవరి 6: పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్ ప్రయోగంలో భాగంగా ఇస్రో రోదసీలోకి పంపిన అలసంద విత్తనాలు మొలకెత్తాయని, వాటికి రెండేసి ఆకులు కూడా వచ్చాయని ఇస్రో సోమవారం ప్రకటించింది. రాకెట్ నాలుగో దశలోని పీఎస్ఎల్వీ ఆర్బిటల్ ఎక్స్‌పెరిమెంటల్ మాడ్యూల్ (పోయెమ్-4) ద్వారా 24 పేలోడ్లను ఇస్రో రోదసీలోకి పంపింది. వాటిలో కంపాక్ట్ రిసెర్చ్ మాడ్యూల్ ఫర్ ఆర్బిటల్ ప్లాంట్ స్టడీ (క్రాప్స్) అనే పరికరం కూడా ఉంది. దీన్ని తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (వీఎస్ఎస్సీ) అభివృద్ధి చేసింది. అంతరిక్షంలో సూక్ష్మ గురుత్వాకర్షణ వాతావరణంలో మొక్కల ఎదుగుదలపై అధ్యయనం చేసేందుకు రూపొందించిన ప్లాట్‌ఫాం ఇది. దీనిలో ఎనిమిది అలసంద గింజలు పెట్టి స్పేస్‌లోకి పంపించగా.. అవి నాలుగు రోజుల్లోనే మొలకెత్తాయని, ఇప్పుడవి రెండు ఆకుల దశకు వచ్చాయని ఇస్రో తెలిపింది. 'ఈ విజయం అంతరిక్షంలో మొక్కలు పెంచగల ఇస్రో సామర్థ్యాన్ని తెలియజేయడమే కాకుండా.. భవిష్యత్తులో దీర్ఘకాలిక మిషన్లకు అవసరమైన విలువైన సమాచారాన్ని అందిస్తుంది' అని ఇస్రో ఎక్స్‌లో పేర్కొంది. వ్యోమగాములకు ఆహారాన్ని ఉత్పత్తి చేయగల, గాలి, నీటిని పునరుత్పత్తి చేయగల లైఫ్ సపోర్ట్ వ్యవస్థలను అభివృద్ధి చేయడానికి, మొక్కలు సూక్ష్మ గురుత్వాకర్షణకు అనుగుణంగా ఎలా మారతాయో అర్థం చేసుకోవడానికి ఈ ప్రయోగం చాలా ముఖ్యమని ఇస్రో వెల్లడించింది. 'క్రాప్స్' విజయం అంతరిక్షంలో సుస్థిర మానవ ఉనికి దిశగా ఆశాజనకమైన ముందడుగు అని పేర్కొంది.



స్పేడెక్స్ డాకింగ్ రెండు రోజులు వాయిదా

ఇస్రో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్పేస్ డాకింగ్ ఎక్స్‌పెరిమెంట్ (స్పేడెక్స్) మిషన్‌లో కీలకమైన డాకింగ్ ప్రక్రియ రెండు రోజులపాటు వాయిదా పడింది. గత నెల 30న పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్ ద్వారా జంట ఉపగ్రహాలను కక్ష్యలోకి చేర్చిన సంగతి తెలిసిందే. ఈ మిషన్‌లోని ఛేజర్ (ఎస్‌డీఎక్స్01), టార్గెట్ (ఎస్‌డీఎక్స్02) ఉపగ్రహాలను ఈ నెల 7న (మంగళవారం) అనుసంధానించాలని ఇస్రో భావించింది. అయితే.. మరింత కచ్చితత్వం కోసం క్షేత్ర స్థాయిలో కొన్ని సిమ్యులేషన్లు పూర్తిచేసేందుకు డాకింగ్ ప్రక్రియను ఈ నెల 9వ తేదీకి వాయిదా వేయాలని నిర్ణయించినట్లు ఇస్రో సోమవారం తెలిపింది.

సెర్ప్ సిబ్బందికి 'ఇంక్రిమెంట్' ఇక్కట్లు

- గత ప్రభుత్వంలో 9 రోజుల సమ్మె
- మార్చిలో రావాల్సిన జీతాల పెంపు ఇప్పటికీ దక్కని వైనం.. 3 వేల మంది బాధితుల ఆందోళన
- నెలలుగా ఫైల్‌ను పెండింగ్‌లో ఉంచిన సీఈఓ

అమరావతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని వైసీపీ ప్రభుత్వ హయాంలో 9 రోజులు సమ్మె చేసిన సెర్ప్ ఉద్యోగులకు ఆ సంస్థ సీఈఓ చుక్కలు చూపిస్తున్నారు. అప్పట్లో 9 రోజులు సమ్మె చేసిన సుమారు 3 వేల మంది సిబ్బందికి గత మార్చిలో దక్కాల్సిన ఇంక్రిమెంట్లు ఇప్పటికీ ఇవ్వకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. సమ్మెలో ఉన్న ఉద్యోగులను అప్పట్లో అధికారులు పలు విధాలుగా బుజ్జగించి సమ్మె విరమింపచేశారు. సమ్మె కాలానికి జీతం కట్ చేయకుండా ఇస్తామని చెప్పి నమ్మించారు. అయితే గత ఆర్నెల్లుగా సెర్ప్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న సిబ్బంది జీతం కట్ చేయడంతో పాటు వారికి మార్చిలో రావాల్సిన 6 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో సెర్ప్ సిబ్బంది తమ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చారు. దీంతో ఒక్క కడప జిల్లా మినహాయించి మిగిలిన అన్ని జిల్లాల సిబ్బంది సమ్మెలో పాల్గొన్నారు. ఇదే సమయంలో వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ తదితర సిబ్బంది కూడా తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేశారు. అయితే సెర్ప్ మినహాయించి మిగిలిన శాఖల వారికి సమ్మె కాల జీతాలు కట్ చేయలేదు. వారికి ఇంక్రిమెంట్ల విషయంలో కూడా సమస్యలు లేవు. సెర్ప్ ప్రధాన కార్యాలయం, కడప జిల్లా సిబ్బందికి మాత్రం ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇంక్రిమెంట్లు వచ్చేశాయి. మిగతా 3 వేల సిబ్బందికి జీతాల కటింగ్ ఫైల్‌ను అడ్డుపెట్టుకొని, ఇంక్రిమెంట్ల విషయంలో సెర్ప్ ఆఫీసులోని అధికారులు నాన్చుతున్నారు. ఇప్పటికే మంత్రి పలు దఫాలు అధికారులకు ఆదేశాలిచ్చినా స్పందన లేదు. సెర్ప్ కార్యాలయంలోని అధికారులు మాత్రం సీఈఓ అందుబాటులో లేరంటూ కాలయాపన చేస్తున్నారు. అధికారులు మాట తప్పి నిర్దాక్షిణ్యంగా తమ 9 రోజుల జీతాలను కట్ చేశారని, మార్చిలో రావాల్సిన ఇంక్రిమెంట్‌లు అమలు చేయకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇకనైనా అధికారులు తమ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని సెర్ప్ ఉద్యోగులు కోరుతున్నారు.

వలంటీర్లు వద్దే వద్దు

- నిరుద్యోగ జేఏసీ

అమరావతి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వలంటీర్ల వ్యవస్థను తిరిగి ప్రవేశపెట్టొద్దని నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ షేక్ సిద్ధిక్ ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వంలో వలంటీర్లను అడ్డంపెట్టుకుని వైసీపీ పార్టీ కార్యక్రమాలు నిర్వహించారన్నారు. ఐదేళ్లలో వలంటీర్లకు చెల్లించిన రూ.700 కోట్లను మాజీ సీఎం జగన్ నుంచి రాబట్టాలన్నారు. ప్రజాధానం వృథా చేస్తున్నారని గత ప్రభుత్వ హయాంలోనే హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశామని గుర్తుచేశారు.

పెరిగిన ఏపీ తీరం పొడవు

తాజా లెక్కలతో 1053.07 కి.మీ.గా తీరం

- 1970 లెక్కలతో పోల్చితే 79.37 కి.మీ. పెరుగుదల
- దేశంలో మొత్తం 11,098.81 కి.మీ. తీర ప్రాంతం
- గతంలో కంటే 48 శాతం పెరుగుదల నమోదు
- మలుపులు, ఒంపులు లెక్కతో పెరిగిన పొడవు
- కేంద్ర హోంమంత్రిత్వ శాఖ వెల్లడి



విశాఖపట్నం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సముద్ర తీరం పొడవు పెరిగింది. గతంలో 973.70 కిలో మీటర్లుగా ఉన్న తీరం పొడవు 79.37 కి.మీ. (8.154 శాతం) పెరిగి 1053.07 కి.మీ.కు చేరింది. అదే సమయంలో దేశం తీరం పొడవు 7,516.60 కి.మీ. నుంచి 11,098.81 (48 శాతం) కి.మీ.లకు పెరిగినట్టు తాజాగా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఇండియన్ నేవల్ హైడ్రోగ్రాఫిక్ ఆఫీస్, సర్వే ఆఫ్ ఇండియా కలిసి 1970లో చేసిన సంయుక్త సర్వే ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో ఉత్తరాన ఇచ్ఛాపురం సమీపాన ఉన్న డొంకూరు నుంచి దక్షిణ భాగంలో తడ వరకు 973.7 కి.మీ. తీర ప్రాంతంగా గుర్తించారు. అయితే నేషనల్ మారిటైమ్ సెక్యూరిటీ కో-ఆర్డినేటర్ రూపొందించిన విధి విధానాల మేరకు నిర్వహించిన రీ వెరిఫికేషన్‌లో ఏపీలో తీరం పొడవు 1,053.07 కి.మీ.కు పెరిగినట్టు హోం మంత్రిత్వ శాఖ నివేదికలో వెల్లడైంది. గతంలో ప్రతి 50 కి.మీ. మధ్య దూరాన్ని కొలిచారు. ఇప్పుడు ఐదు నుంచి పది కి.మీ.ల మధ్య దూరాన్ని కొలిచారు. అంటే 1970లో దూరాన్ని నేరుగా కొలవగా, ఇటీవల మలుపులు, ఒంపులు కూడా లెక్కించడంతో తీరం పొడవు పెరిగిందని విశాఖలో జాతీయ సముద్ర అధ్యయన విజ్ఞాన సంస్థ చీఫ్ సైంటిస్ట్ వీవీఎస్ఎస్ శర్మ చెప్పారు. ఈ విధానం వల్ల ప్రతి అంగుళాన్ని కచ్చితంగా లెక్కించారని పేర్కొన్నారు.

కేంద్ర హోంమంత్రిత్వశాఖ విడుదల చేసిన నివేదిక మేరకు రాష్ట్రాల వారీగా తీరం పొడవు (కి.మీ.లో)..

రాష్ట్రం/కేంద్రపాలిత ప్రాంతం	1970లో పొడవు	తాజాగా గుర్తించిన పొడవు
గుజరాత్	1,214.70	2,340.62
మహారాష్ట్ర	652.60	877.97
గోవా	101.00	193.95
కర్ణాటక	280	343.3
కేరళ	569.7	600.15
తమిళనాడు	906.9	1,068.69
ఆంధ్రప్రదేశ్	973.7	1,053.07
ఒడిశా	476.4	574.71
పశ్చిమ బెంగాల్	157.6	721.01
డామన్ అండ్ డయ్యూ	42.5	54.38
పాండిచ్చేరి,కరైకల్, యానాం	47.0	42.65
లక్షద్వీప్, మినికోయ్ దీవులు	132	144.8
అండమాన్ అండ్ నికోబార్	1,962	3,083.5
మొత్తం కి.మీ.	**7,516.6**	**11,098.81**

మూడో స్థానానికి ఆంధ్రప్రదేశ్

తాజా నివేదిక వివరాల ప్రకారం.. దేశంలో సముద్ర తీరం ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో ఏపీ మూడో స్థానం (గతంలో రెండో స్థానం)లో నిలిచింది. గతంలో ప్రథమ స్థానంలో ఉన్న గుజరాత్ ఇప్పుడు 2,340.62 కి.మీ.ల పొడవుతో అదే స్థానంలో కొనసాగగా, 1,068.69 కి.మీ.లతో తమిళనాడు రెండో స్థానంలో నిలిచింది. గతంలో దేశంలో తీర ప్రాంతం 7,516.60 కి.మీ.లుగా ప్రకటించారు. అయితే నేషనల్ మారిటైమ్ కో-ఆర్డినేటర్ రూపొందించిన కొత్త విధివిధానాలను అనుసరించి రీ వెరిఫికేషన్‌లో భారత తీరం పొడవు 3,582.21 కి.మీ. పెరిగి 11,098.81 కి.మీ.లకు చేరిందని వెల్లడైంది. ఏపీలో ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలు తీర ప్రాం తంలో ఉన్నాయి. సముద్రతీరం పరిశీలిస్తే అనేకచోట్ల మలుపులు, ఒంపులు ఉన్నాయి. తీర రక్షణ బాధ్యత పూర్తిగా భారత నౌకాదళం పర్యవేక్షిస్తోంది. నేవీకి కోస్ట్‌గార్డు, రాష్ట్ర మెరైన్ పోలీసులు సహకరిస్తున్నారు.

ఏపీకి పోలవరం జీవనాడి: కిరణ్‌కుమార్‌రెడ్డి



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పోలవరం జీవనాడి అని, పోలవరాన్ని వేగవంతంగా పూర్తి చేసుకోవాల్సిన అవసరం ఉందని మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. నెల్లూరులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం వేగవంతంగా అభివృద్ధి చెందడంతోపాటు రాష్ట్రానికి కేంద్రం నిధులు పెద్ద ఎత్తున అందిస్తోందన్నారు. 7.20 లక్షల ఎకరాలు కొత్త ఆయకట్టు, 23 లక్షల ఎకరాలు స్థిరీకరణ, 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి పోలవరంతోనే సాధ్యమన్నారు. పోలవరం ప్రాజెక్టుకు డబ్బుతోపాటు సాంకేతిక పరమైన అంశాలు చాలా ఉన్నాయన్నారు. ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలతో ఒప్పందాలు చేసుకోవాల్సిన అవసరం తెలుగు రాష్ట్రాలకు ఉందన్నారు. గతంలో తాను ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన సమయంలోనూ ఈ విషయాలను తెలియజేసినట్టు చెప్పారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాల ముఖ్యమంత్రులు కలిసికట్టుగా కృష్ణాజలాలపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. అమరావతిని కూటమి ప్రభుత్వంలో వేగవంతంగా పూర్తి చేయాలని, ఎంత వేగంగా అభివృద్ధి చేస్తే అంతకంటే వేగంగా కేంద్రం నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉందన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల మయంగా మార్చేసిందని, అభివృద్ధిలో బాగా వెనుకపడ్డామన్నారు.

ఆర్థిక శాఖ మంజూరు చేసిన పోస్టులకే ఎంటీఎస్

- ఔట్‌సోర్సింగ్‌కు వర్తించదు.. ఉత్తరులు జారీ

అమరావతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మినిమమ్ ఆఫ్ టైమ్ స్కేల్ (ఎంటీఎస్) ఏ ఉద్యోగులకు వర్తిస్తుందన్న అంశంపై స్పష్టతనిస్తూ ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వ శాఖలు, యూనివర్సిటీలు, సొసైటీల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో భర్తీ చేసిన కాంట్రాక్టు ఉద్యోగులు, ఆర్థిక శాఖ ఆదేశాలతో నియామకం పొందిన కాంట్రాక్టు ఉద్యోగులు, కారుణ్య నియమకాల్లాంటి ప్రత్యేక విభాగాల ద్వారా భర్తీ అయిన ఉద్యోగులకు మాత్రమే ఎంటీఎస్ వర్తిస్తుందని స్పష్టం చేశారు. ఎంటీఎస్ ప్రకారం అందే ఆర్థిక ప్రయోజనాలను ఒకేమొత్తంలో నెలకోసారి ఇస్తారు. విడిగా ఎలాంటి అలవెన్సులు ఉండవు. ఎంటీఎస్ కింద వేతనాలు పొందే ఉద్యోగులకు ఆ మొత్తంపై వార్షిక ఇంక్రిమెంట్లు ఉండవు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఎంటీఎస్ ప్రయోజనాలు వర్తించవని పేర్కొన్నారు. ఇకపై ఆర్థిక శాఖ ఆమోదం లేకుండా కొత్తగా కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగుల నియామకం చేపట్టకూడదని పీయూష్ కుమార్ జీవోలో స్పష్టం చేశారు. ఈ ఆదేశాలు ఉల్లంఘించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతో, సీసీఏ నిబంధనల ప్రకారం భారీ జరిమానా విధిస్తామని వెల్లడించారు.

గురు గోవింద్‌సింగ్ జయంతి వేడుకల్లో పురందేశ్వరి

- ఖడ్గం బహూకరించిన సిక్కు పెద్దలు



సీతమ్మధార (విశాఖపట్నం), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరంలోని గురుద్వార కూడలిలో గల గురుద్వార మందిరంలో సిక్కుల పదో గురువు గురు గోవింద్ సింగ్ 358వ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రార్థనల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పాల్గొన్నారు. గురుద్వార సాద్ సంగత్ అధ్యక్షుడు డాక్టర్ డి.ఎస్.ఆనంద్ ఆధ్వర్యంలో సిక్కు మత పెద్దలు పురందేశ్వరికి స్వాగతం పలికి అనంతరం ఖడ్గం బహూకరించి సన్మానించారు. ప్రార్థనల్లో పాల్గొన్న స్థానిక బీజేపీ నాయకురాలు శ్యామల దీపికను కూడా సత్కరించారు.

తండ్రి కాదు...కామ పిశాచి...

- పదేళ్ల లోపున్న ఇద్దరు కూతుళ్లపై అఘాయిత్యం
- తల్లి ఫిర్యాదుతో అరెస్టు...పోక్సో కేసు నమోదు

నిమ్మనపల్లి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కామంతో కళ్లుపొరలు కమ్మి చిన్నారులైన కన్న బిడ్డలపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు ఓ వ్యక్తి. అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లి మండలంలో ఈ దారుణం చోటుచేసుకుంది. సీఐ రమేశ్‌బాబు తెలిపిన వివరాలు...మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి(28)కి భార్య, ఐదుగురు పిల్లలు ఉన్నారు. వీరిలో నలుగురు ఆడపిల్లలు. అతను దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. కొంతకాలం నుంచి 9, 7 ఏళ్ల వయసున్న కూతుళ్లపై అఘాయిత్యానికి పాల్పడుతున్నాడు. ఈ విషయం తెలిసి భార్య వారించింది. అయినా భర్త ధోరణిలో మార్పు రాకపోవడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల విచారణలో కూతుళ్లపై తండ్రి అఘాయిత్యానికి పాల్పడినది వాస్తవమని తేలడంతో అతడిపై పోక్సో కేసు నమోదు చేసి సోమవారం అరెస్టు చేశారు.

పత్తి తూకంలో మోసం.. వ్యాపారికి దేహశుద్ధి

చాట్రాయి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): తూకంలో మోసం చేస్తున్న పత్తి వ్యాపారికి రైతులు దేహశుద్ధి చేశారు. ఏలూరు జిల్లా చాట్రాయి మండలం పర్వతాపురంలో సోమవారం జరిగింది. తెలంగాణకు చెందిన ముగ్గురు పత్తి వ్యాపారులు పర్వతాపురంలో చొప్పరపు బజారుకు వచ్చారు. రైతుల వద్ద వున్న పత్తిని కొనుగోలు చేసి, వారి వెంట తెచ్చిన ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్‌తో కాటా వేస్తున్నారు. వ్యాపారుల్లో ఒకరు తన వద్ద ఉన్న రిమోట్‌తో ఎవరికి అనుమానం రాకుండా ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్‌ను ఆపరేట్ చేస్తున్నట్లు ఓ యువకుడు గమనించి రైతులకు చెప్పాడు. వెంటనే రైతులు వేరే వేయింగ్ విుషన్ తెచ్చి కాటా వేయగా వ్యాపారి 80 కిలోలు చెప్పిన బోరెం 125 కిలోలు ఉంది. దీనికి ఆగ్రహం చెందిన రైతులు ఒక వ్యాపారిని పట్టుకొని దేహశుద్ధి చేస్తుండగా మరో ఇద్దరు వ్యాపారులు పరారయ్యారు. తర్వాత వ్యాపారి తప్పు జరిగింది క్షమించమని వేడుకోవటంతో రూ.20 వేలు జరిమానా వసూలు చేసి వదిలేశారు.

'రైల్వే జోన్ డీపీఆర్'

- ఆలస్యంగా నడుచుచున్నది!.. ఐదేళ్లయినా దరిచేరని వైనం
- జోన్ ప్రధాన కార్యాలయానికి రేపు ప్రధాని మోదీ శంకుస్థాపన
- ఈలోగా అనుమతి లభించేనా?.. ఇక్కడ పనులు మొదలవకుండానే
- రాయగడ డివిజన్‌కు భూమిపూజ.. వాల్తేరు డివిజన్‌పైనా సందేహాలే

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)



రైల్వే స్టేషన్

ఉత్తరాంధ్ర ప్రజలు నాలుగు దశాబ్దాలుగా కోరుకుంటున్న ప్రత్యేక రైల్వే జోన్‌కు ప్రధాని నరేంద్రమోదీ బుధవారం శంకుస్థాపన చేయనున్నారు. అయితే దీనికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)కు రైల్వే బోర్డు ఆమోదం తెలపకపోవడం గమనార్హం. మరోవైపు విశాఖలో దక్షిణ కోస్తా జోన్‌కు శంకుస్థాపన జరగక ముందే ఈ ప్రక్రియలో భాగంగా ఏపీ నుంచి విడదీసిన కొన్ని ప్రాంతాలతో కలిపి కొత్తగా రాయగడ డివిజన్ ఏర్పాటు చేయబోతున్నారు. భవన నిర్మాణానికి టెండర్లు పిలిచారు. దాని నిర్మాణానికి ప్రధాని మోదీ సోమవారం ఆన్‌లైన్‌లో శంకుస్థాపన చేశారు. ఇక్కడ కూడా ఒడిశా రాజకీయ నాయకులు తమ ఆధిపత్యం చాటుకున్నారు. విశాఖలో జోన్ కార్యాలయం శంకుస్థాపనకు రెండు రోజుల ముందే ఒడిశాలో కొత్త డివిజన్‌కు శంకుస్థాపన జరిగిపోయింది. విశాఖపట్నానికి దక్షిణ కోస్తా జోన్ ఇస్తూ.. ప్రస్తుతం విశాఖ కేంద్రంగా నడుస్తున్న వాల్తేరు రైల్వే డివిజన్‌ను రద్దు చేస్తామని కేంద్రం ప్రకటించింది. అయితే, వాల్తేరు డివిజన్‌కు ఓ ప్రత్యేకత ఉంది. దేశంలో 70కి పైగా డివిజన్లు ఉండగా 12 వేల మంది ఉద్యోగులతో ఆదాయపరంగా మొదటి పది స్థానాల్లో ఈ డివిజన్ నిలుస్తోంది. ఇక్కడ కొత్తవలస-కిరండోల్(కేకే) లైన్ ద్వారా ఖనిజాల రవాణాతో అధిక ఆదాయం సమకూరుతోంది. వాల్తేరు డివిజన్ రద్దు చేస్తే విశాఖ కేంద్రంగా ఏర్పాటయ్యే జోన్‌కు ఉనికే ఉండదు. ఇదే విషయాన్ని ఈ ప్రాంత ప్రజా ప్రతినిధులు కేంద్ర మంత్రి, శ్రీకాకుళం ఎంపీ రామ్మోహన్‌నాయుడు, విశాఖ ఎంపీ శ్రీభరత్‌లు ఢిల్లీ పెద్దలకు చేరవేశారు. దీంతో వాల్తేరు డివిజన్ కొనసాగింపు విషయాన్ని పరిశీలిస్తామని హామీ లభించింది. కానీ, దీనిలో కేకే లైన్ ఉండకపోవచ్చని, దానిని రాయగడ డివిజన్‌కు ఇచ్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో బుధవారం జరిగే బహిరంగ సభలో వాల్తేరు డివిజన్‌ను కొనసాగించే విషయంపైనా, కేకే లైన్‌ను అందులోనే కొనసాగించే విషయంపైనా ప్రకటన చేయాలని ఉత్తరాంధ్ర ప్రజలు కోరుతున్నారు. వాస్తవానికి ఈ శంకుస్థాపన చేసే సమయానికే జోన్ డీపీఆర్‌కు రైల్వే బోర్డు ఆమోదముద్ర వేయాలి. రైల్వే స్థాయీ సంఘం ఛైర్మన్‌గా ఉన్న అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ ఈ మేరకు చొరవ తీసుకోవలసిన అవసరం ఉందని స్థానికులు చెబుతున్నారు. ఇదే కాకుండా జోన్ కార్యాలయానికి శంకుస్థాపన చేస్తూ, కార్యకలాపాలను కూడా తక్షణమే ప్రారంభించేలా 'ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ'(ఓఎస్‌డీ) కింద దక్షిణ కోస్తా జోన్‌కు జనరల్ మేనేజర్‌ను నియమించాలి. అవసరమైనన్ని భవనాలు అందుబాటులో ఉన్నందున కార్యకలాపాలు కూడా ప్రారంభిస్తే బాగుంటుందని విశాఖ ప్రజలు భావిస్తున్నారు.

'విశాఖ ఉక్కు'ను విక్రయించొద్దు!

నిధులిచ్చి బలోపేతం చేయాలి

- ఇతర ప్రభుత్వ రంగ సంస్థలను కూడా..
- కేంద్ర ఆర్థిక మంత్రికి బీఎంఎస్ వినతి

న్యూఢిల్లీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారాన్ని అమ్మకానికి పెట్టవద్దని భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) సహా పలు కార్మిక సంఘాలు కేంద్రాన్ని కోరాయి. ఈ కర్మాగారంతో పాటు ఇతర ప్రభుత్వ రంగ సంస్థలను కూడా విక్రయించవద్దని.. సాధ్యమైనంత మేరకు వాటికి నిధులు కేటాయించి బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశాయి. ప్రి-బడ్జెట్ సంప్రదింపుల్లో భాగంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం సీఐటీయూ, ట్రేడ్ యూనియన్ కోఆర్డినేషన్ సెంటర్ (టీయూసీసీ), బీఎంఎస్, ఐఎన్‌టీయూసీ సహా దేశంలోని 11 కార్మిక సంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. వారి నుంచి ప్రతిపాదనలు స్వీకరించారు. సంఘ్ పరివార్ అనుబంధ సంస్థ అయిన బీఎంఎస్ ప్రతినిధి పవన్‌కుమార్ విశాఖ ఉక్కు కర్మాగారంతో పాటు ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకాన్ని ఈ సందర్భంగా తీవ్రంగా వ్యతిరేకించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కేంద్రం ప్రవేశపెట్టిన కొత్త పింఛను పథకాన్ని రద్దు చేసి పాత పింఛను పథకాన్నే (ఓపీఎస్) పునరుద్ధరించాలని.. చివరగా తీసుకున్న జీతంలో సగం మొత్తం పింఛనుగా వచ్చేలా చూడాలని సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ వేతనాలకు చట్టబద్ధత కల్పించాలన్నారు. నిర్మాణ కార్మికులకు ఆయుష్మాన్ కార్డులు ఇవ్వాలని కోరారు. ఇళ్లలో పనిచేసేవారికి సామాజిక భద్రత కల్పించే విషయం పరిశీలిస్తామని నిర్మలా సీతారామన్ హామీ ఇచ్చినట్లు తెలిసింది. ఈపీఎఫ్ కనీస పెన్షన్‌ను రూ.5 వేలకు పెంచాలని, ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని రూ.10 లక్షలకు పెంచాలని సంఘాలు విజ్ఞప్తి చేశాయి. సోమవారంతో నిర్మలా సీతారామన్ జరిపిన 9 రౌండ్ల ప్రి-బడ్జెట్ సంప్రదింపుల పర్వం ముగిసింది.

రేపు విశాఖకు ప్రధాని మోదీ

- పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు

న్యూఢిల్లీ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఈ నెల 8న ప్రధాని మోదీ విశాఖపట్నం వస్తున్నారు. ఈ సందర్భగా ఆయన పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేస్తారు. రహదారి ప్రాజెక్టులను ప్రారంభిస్తారు. సుస్థిర పారిశ్రామికాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా విశాఖపట్నంలో రూ.2 లక్షల కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. విశాఖపట్నం సమీపంలోని పూడిమడక వద్ద.. జాతీయ హరిత హైడ్రోజన్ మిషన్ కింద మొదటి గ్రీన్ హైడ్రోజన్ హబ్... అత్యాధునిక ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ప్రాజెక్టుకు ప్రధాన మంత్రి శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు సుమారు రూ.1,85,000 కోట్లు పెట్టుబడి పెట్టనున్నారు. 2030 నాటికి భారత్ శిలాజేతర ఇంధన సామర్థ్యం 500 గిగావాట్ల లక్ష్యాన్ని సాధించడంలో ఈ ప్రాజెక్టు గణనీయంగా దోహదం చేస్తుంది. అంతేకాకుండా, రాష్ట్రంలో రూ.19,500 కోట్లకు పైగా విలువైన రైల్వే, రోడ్డు ప్రాజెక్టుల్లో కొన్నింటికి శంకుస్థాపన చేస్తారు. మరికొన్నింటిని ప్రారంభిస్తారు. విశాఖలో దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయానికి శంకుస్థాపన చేస్తారు. ఇతర ప్రాజెక్టులను ప్రధాని జాతికి అంకితం చేయనున్నారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కుకు, తిరుపతి జిల్లాలో చెన్నై- బెంగళూరు పారిశ్రామిక కారిడార్ పరిధిలోని కృష్ణపట్నం పారిశ్రామిక నగరం (క్రిస్ సిటీ)కు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా క్రిస్ సిటీని గ్రీన్ ఫీల్డ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతారు. ఈ ప్రాజెక్టు సుమారు రూ.10,500 కోట్ల పెట్టుబడులను ఆకర్షించనుంది.

ప్రధాని పర్యటనలో విశాఖ ఉక్కుపై ప్రకటన చేయాలి

- కార్మికుల ఆందోళన... బైఠాయింపు ర్యాలీ




బైక్‌లపై ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళుతున్న ఉక్కు ఉద్యోగులు

కూర్మన్నపాలెం (విశాఖ పట్నం), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలో కొనసాగిస్తామని లేదా సెయిల్‌లో విలీనం చేసి పూర్తిస్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో నడుపుతామని ఎనిమిదో తేదీన విశాఖ వస్తున్న ప్రధాని నరేంద్రమోదీ స్పష్టమైన ప్రకటన చేయాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ డిమాండ్ చేసింది. కమిటీ ఆధ్వర్యంలో కార్మికులు, నిర్వాసితులు సోమవారం ఉదయం 9.30 నుంచి 10.00 గంటల వరకూ కూర్మన్నపాలెం జంక్షన్‌లో కర్మాగారానికి వెళ్లే మార్గంలో బైఠాయించారు. ఈ సందర్భంగా కమిటీ ఛైర్మన్‌లు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ 1,425 రోజులుగా కార్మికులు వివిధ రూపాల్లో ఉద్యమం చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందని ఆరోపించారు. అనంతరం సుమారు 800 ద్విచక్ర వాహనాలపై ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్లారు.

ఇద్దరిని బలిగొన్న 'పగ'మంచు!

- కాలినడక భక్తులపైకి దూసుకెళ్లిన '108'
- ఒకరి పరిస్థితి విషమం.. మరో నలుగురికి గాయాలు



పెద్దరెడ్డమ్మ, లక్ష్మమ్మ

చంద్రగిరి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం నరసింగాపురం సమీపంలో సోమవారం తెల్లవారుజామున కాలినడకన వస్తున్న శ్రీవారి భక్తులపైకి 108 అంబులెన్సు దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇద్దరు మృత్యువాతపడ్డారు. పొగమంచు కారణంగా రహదారి సరిగా కనబడకపోవడంతో వాహనం వారిపైకి దూసుకెళ్లినట్లు పోలీసుల సమాచారం. పోలీసుల కథనం ప్రకారం.. అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం చంపాలపల్లె, శేగంవారిపల్లెకు చెందిన సుమారు 60 మంది భక్తులు బృందంగా తిరుమలకు కాలినడకన బయలుదేరారు. మరోవైపు.. అన్నమయ్య జిల్లా మదనపల్లెకు చెందిన హరికృష్ణకు గుండెపోటు రావడంతో 108 అంబులెన్సులో తిరుపతికి తీసుకొస్తున్నారు. సోమవారం తెల్లవారు జామున 3.30 గంటలకు భక్తుల బృందం చంద్రగిరి మండలం నరసింగాపురం సమీపంలో నారాయణ కళాశాల వద్ద మదనపల్లె- తిరుపతి జాతీయ రహదారిపై నడిచి వస్తున్నారు. అదే సమయంలో మదనపల్లె నుంచి వస్తున్న 108 అంబులెన్సు వారిపైకి దూసుకెళ్లింది. ఏడుగురికి తీవ్రంగాయాలు కావడంతో అదే అంబులెన్సులో తిరుపతిలోని రుయాస్పత్రికి తరలించారు. అప్పటికే పెద్దరెడ్డమ్మ(40), లక్ష్మమ్మ (50) మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తులసమ్మ(42), రమేష్, చిన్నరెడ్డమ్మ, రెడ్డమ్మ, యశోదమ్మ తీవ్ర గాయాలయ్యాయి. తులసమ్మ పరిస్థితి విషమంగా ఉంది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పాక్–అఫ్ఘాన్ వైరం!

అఫ్ఘానిస్థాన్‌మీద పాకిస్థాన్ వైమానికదాడులు జరిపి అనేకమంది ప్రాణాలు తీయడం గర్హనీయమని, ఖండిస్తున్నామని భారత దేశ విదేశాంగశాఖ ప్రతినిధి సోమవారం వ్యాఖ్యానించారు. ఎంతో మంది మహిళలు, పిల్లలు మరణించారంటూ ఘాటుగా విమర్శించడమే కాక, తన చేతగానితనానికి పొరుగుదేశాలను ఆడిపోసుకోవడం పాకిస్థాన్‌కు అలవాటేనని అన్నారాయన. దాదాపు పదిరోజుల క్రితం అఫ్ఘానిస్థాన్‌లోని తెహ్రీక్-ఎ-తాలిబాన్ పాకిస్థాన్ (టీటీపీ) స్థావరాల మీద పాకిస్థాన్ యుద్ధవిమానాలు బాంబులు కురిపించడంతో నలభై ఆరుమంది మరణించిన విషయం తెలిసిందే. దీనికి ప్రతీకారం తీర్చుకుంటానని ప్రకటించిన తాలిబాన్ మరో నాలుగురోజుల్లోనే పాకిస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో దాడులు జరిపింది. ఈ వరుస దాడుల్లో మంచిచెడ్డలను అటుంచితే, అఫ్ఘానిస్థాన్ పక్షాన పాకిస్థాన్‌ను భారతదేశం గట్టిగా తప్పుబట్టడం మారుతున్న రాజకీయానికీ, హెచ్చుతున్న సాన్నిహిత్యానికీ నిదర్శనం.

పాకిస్థాన్-అఫ్ఘానిస్థాన్ సరిహద్దుల్లో రెండువైపులా పెద్దసంఖ్యలో సైన్యాలు మోహరించివున్నాయని వార్తలు వస్తున్నాయి. తెహ్రీక్ తాలిబాన్‌మీద పాకిస్థాన్ వైమానికదాడులు చేయడం ఇది రెండోసారి. గత ఏడాది మార్చిలో కంటే ఇప్పుడు దాడులమీద తాలిబాన్ మరింత తీవ్రంగా స్పందించింది, ప్రతీకారం కూడా తీర్చుకుంది. అమెరికా అర్థంతరంగా అఫ్ఘానిస్థాన్‌ను వదిలేసి, తట్టాబుట్టా సర్దేసిన కొద్దిగంటల్లోనే, ఆ దేశం తాలిబాన్ల వశమైన విషయం తెలిసిందే. వారిని ఎదిరించలేక, అమెరికా శిక్షణ పొందిన అఫ్ఘాన్‌సైనికులు, పోలీసులు పరుగులు తీసిన దృశ్యాలు చూశాం. తాలిబాన్ల పునరాగమనంతో అఫ్ఘాన్లు వొణికిపోయారు. వందలాదిమంది దేశం విడిచిపోయారు. యావత్ ప్రపంచం తాలిబాన్ రాకకు భయపడుతూంటే, పాకిస్థాన్ మాత్రం ఎగిరిగంతేసింది. అమెరికా తనమాట విని దేశాన్ని తాలిబాన్‌కు వదిలేసినందుకు సంతోషించింది. అల్లా దయతోనే ఇదంతా జరిగిందన్నారు ఇమ్రాన్‌ఖాన్. అధికారాన్ని కైవసం చేసుకోవడానికి మార్గాన్ని సుగమంచేసిన తనపట్ల తాలిబాన్ విధేయంగా ఉంటుందని పాకిస్థాన్ పాలకులు భ్రమపడ్డారు. కానీ, అనతికాలంలోనే ఉభయుల మధ్యా వ్యవహారం పూర్తిగా చెడింది. గత అవతారానికి కాస్తంత భిన్నంగా, స్వతంత్రంగా వ్యవహరిస్తున్న తాలిబాన్ ఈ మారు పాకిస్థాన్ ఆదేశాలను, ఆలోచనలను లక్ష్యపెట్టలేదు.

ఇక, తాలిబాన్ ఆశీస్సులతోనే టీటీపీ తనపై ఇంతగా రెచ్చిపోతున్నదన్న పాకిస్థాన్ వాదన కాదనలేనిది. తాలిబాన్ మధ్యవర్తిత్వంతో 2021లో ఇమ్రాన్ ప్రభుత్వం టీటీపీతో చర్చలు జరిపింది. అవి ఫలితాన్నివ్వకపోవడంతో పాటు, అమెరికా వదిలిపోయిన చాలా ఆయుధాలు ఈ సంస్థ చేతుల్లో పడటంతో అది మరింత బలోపేతమైంది. టీటీపీ విషయంలో పాకిస్థాన్ ఎప్పటికప్పుడు తాలిబాన్‌ను హెచ్చరించినప్పటికీ ఫలితం లేకపోయింది. టీటీపీని నియంత్రించిన పక్షంలో అందులోని సాయుధులంతా ఐసిస్‌వంటి సంస్థల్లో చేరిపోయి తన ఉనికికే ప్రమాదం తేవచ్చునని తాలిబాన్ భయం. ఇతర ఉగ్రసంస్థలను నిలువరించడానికి తాలిబాన్‌కు టీటీపీతో స్నేహం ఉపకరిస్తోంది. టీటీపీని పెంచిపోషిస్తున్నందుకు పాకిస్థాన్ తీవ్రంగా మండిపడుతున్నప్పటికీ తాలిబాన్ లక్ష్యపెట్టడం లేదు. పాకిస్థాన్ సరిహద్దు ప్రాంతాలతో అది సాగిస్తున్న విధ్వంసానికి తాలిబాన్ పరోక్షంగా సాయపడుతున్నది కూడా. ఒకపక్క టీటీపీ, మరోపక్క బలూచ్, పష్తూన్ తిరుగుబాటుదారుల విధ్వంసకాండలతో పాకిస్థాన్ నలిగిపోతోంది. చైనా, సౌదీ పెట్టుబడులకు భద్రతకల్పించలేని స్థితికి అది జారుకుంది. తాలిబాన్‌తో నేరుగా యుద్ధానికి దిగి గెలిచేస్థితిలో పాకిస్థాన్ లేదు. కానీ, ఇలా అడపాదడపా సరిహద్దుల్లోకి చొరబడి, ఏవో కొన్ని దాడులు జరుపుతూ ఉగ్రవాదంమీద యుద్ధం చేస్తున్నట్టుగా ప్రజలను సమాధానపరచే ప్రయత్నమైతే పాక్ పాలకులు చేస్తున్నారు. పాకిస్థాన్‌లో ఉంటున్న లక్షలాదిమంది అఫ్ఘాన్లను వెళ్ళగొట్టిన ఘటన ఉభయదేశాల మధ్యా మరింత దూరం పెంచింది. ఒకవైపు పాకిస్థాన్‌తో సంబంధాలు ఇలా పతనమైపోతూంటే, మరోపక్క అఫ్ఘాన్-భారత్ సాన్నిహిత్యం పెరుగుతోంది. ఇటీవలే భారతదేశంలో అఫ్ఘానిస్తాన్ రాయబారిగా యువవిద్యార్థి ఇక్రముద్దీన్ కమిల్ నియమితుడైనాడు. పాక్‌ప్రేరేపిత ఉగ్రవాదసంస్థలను తన భూభాగంలో అనుమతించకుండా, భారతదేశానికి వ్యతిరేకంగా వ్యవహరించకుండా తాలిబాన్ ఉన్నంతకాలం ఈ స్నేహం కొనసాగుతుంది. పాకిస్థాన్‌ను తల ఎగరేయకుండా సరిహద్దుల్లో ఉంచేందుకు తాలిబాన్‌తో స్నేహం ఉపకరిస్తుంది.

ఆదివాసుల సమస్య అడవికే పరిమితమా?


కష్టాలు వేరు; అణిచివేత వేరు. కష్టాలు అందరికీ వుంటాయి. గౌతమ్ ఆదానీకీ, నరేంద్ర మోదీకీ కూడా కష్టాలు వుంటాయి. ప్రపంచంలో అందరికన్నా ఎక్కువగా అణచివేతకు గురవుతున్నది ఎవరూ? అని ప్రశ్నించుకుంటే మాత్రం మనకు రెండు సమూహాలు గుర్తుకు వస్తాయి. మొదటిది; ఆదివాసులు. రెండోది; ముస్లింలు.

ఆదివాసీ, ముస్లిం సమూహాలు ఈ భూమి మీద వుండడం మెగా కార్పొరేట్లకు ఇష్టం లేదు. ఎందుకంటే, ఆదివాసుల కాళ్ళ కింద వుండే ఖనిజాలు, ముస్లిం దేశాల్లో వున్న చమురు నిల్వలు మొత్తంగా వాళ్ళకు కావాలి. రాజకీయాలను, ఆర్థిక వ్యవస్థను మనం తరచూ విడదీసి చూస్తుంటాం. అవి ఒకే శరీరానికి వున్న రెండు తలలు అనుకోం. పైగా, మోదీ ప్రధాని కావడం వల్ల కొన్ని మెగా కార్పొరేట్ల సంపద పెరుగుతోంది అనే అపోహలో ఉంటాము. కానీ తమ సంపదను పెంచుకోవడానికి మెగా కార్పొరేట్లు తగిన ప్రధానమంత్రిని కూడా ఎన్నుకోగలవేమో అన్న ఆలోచన మనకు రాదు.

ఆదివాసులు, ముస్లింలను అంతరించిపోతున్న జాతులు అనాల్సినంతగా పరిస్థితులు మారిపోతున్నాయి. చంపాల్సిన కుక్కను పిచ్చిది అని ప్రచారం చేయాలన్నది ఓ కుటిలనీతి. ఇప్పుడు ఆదివాసులు, ముస్లింల మీద అలాంటి కుటిల ప్రచారమే జరుగుతున్నది. "ఆదివాసులు అనాగరీకులు; ముస్లింలు మూర్ఖులు"... ఇదీ ఆ ప్రచారం సారాంశం. ఈ ప్రచారాన్ని ఎక్కువమంది నమ్మరు. కానీ ఓటర్లలో ఓ మూడోవంతు నమ్మి ఓటేసినా దేశాధినేతలు మళ్ళీమళ్ళీ గెలువగలరు.

ఆ మధ్య కేంద్ర ప్రభుత్వం ఉమ్మడి పౌర స్మృతిని (UCC) అమలు చేయాలని ఒక ప్రయత్నం మొదలెట్టింది. ముస్లిం సమూహాన్ని ఇబ్బంది పెట్టడానికి తాము ఒక చట్టాన్ని తెస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వ పెద్దలు గట్టి సంకేతాలు ఇచ్చారు. తమ ప్రత్యేక ఉనికిని కోల్పోతున్నట్టు ముస్లిం సమాజం కూడ ఆందోళన చెందింది. మైదాన సమాజం 'అనాగరికులు' అంటూ తరచూ కించపరిచే ఆదివాసులకు ఈ చట్టం వెనుకనున్న అసలు కుట్ర అర్థం అయింది. మన దేశంలో ప్రస్తుతం ఏడు వందల రకాల ఆదివాసీ సమూహాలు ఉన్నాయి. ప్రతి ఒక్క సమూహమూ ప్రత్యేకమైన ఆచార వ్యవహారాలని పాటిస్తాయి. వైవిధ్యపూరితమైన తమ సంస్కృతిని అంతం చేయడానికే ఉమ్మడి పౌర స్మృతిని తెస్తున్నట్టు వాళ్ళకు బోధపడింది. ఆదివాసి సంఘాలు ఝార్ఖండ్‌లో పెద్ద సభ జరిపి ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ఆందోళన చేయాలని తీర్మానం చేశాయి.

నక్సల్‌బరీ శ్రీకాకుళం రైతాంగ సాయుధ ఉద్యమాల రూపంలో భారత గడ్డ మీద కమ్యూనిజానికి తిరిగి ప్రాణం పోసింది ఆదివాసులే. ఆ ఉద్యమాలను చూసి ఉలిక్కిపడిన ప్రభుత్వాలు మైదాన ప్రాంతాల్లో భూపరిమితి చట్టాల్ని, అటవీ ప్రాంతాల్లో ఆదివాసీ భూముల పరిరక్షణ చట్టాల్ని తెచ్చాయి. ఇప్పుడు ఆ చట్టాలను వరుసగా రద్దుచేసే పనిలో పడ్డాయి.


akbar

ఆదివాసులు, ముస్లింలను అంతరించిపోతున్న జాతులు అనాల్సినంతగా పరిస్థితులు మారిపోతున్నాయి. చంపాల్సిన కుక్కను పిచ్చిది అని ప్రచారం చేయాలన్నది ఓ కుటిలనీతి. ఇప్పుడు ఆదివాసులు, ముస్లింల మీద అలాంటి కుటిల ప్రచారమే జరుగుతున్నది. "ఆదివాసులు అనాగరీకులు; ముస్లింలు మూర్ఖులు"... ఇదీ ఆ ప్రచారం సారాంశం. ఈ ప్రచారాన్ని ఎక్కువమంది నమ్మరు. కానీ ఓటర్లలో ఓ మూడోవంతు నమ్మి ఓటేసినా దేశాధినేతలు మళ్ళీమళ్ళీ గెలవగలరు.

మణిపూర్‌లోని కొండలు అటవీ భూముల మీద ఆదివాసులైన కుకీజోలకు సాంప్రదాయిక హక్కు ఉంది. లోయలో ఉండే నాగరీకులయిన మెయితీలకు కూడా కొండలు, అటవీ భూముల మీద హక్కు కల్పిస్తూ కొత్త చట్టం చేయడంతో అక్కడ మంటలు రాజుకున్నాయి. ఇదంతా బహిరంగ రహస్యమే. దీని వెనుక అంతకుమించిందేదో ఉందని కుకీజోలకు గట్టి అనుమానం.

ఏడాదిన్నరగా అల్లర్లు చెలరేగుతున్నా మణిపూర్ మీద ప్రధాని కనీసం స్పందించలేదు. వారు మౌనంగా వుంటూనే పార్లమెంటులో ఇంకో పని చేశారు. అంతర్జాతీయ సరిహద్దుల నుండి వంద కిలోమీటర్ల లోపు ఉన్న అటవీ భూముల్ని దేశ ప్రయోజనాలకు అవసరమైన వ్యూహాత్మక ప్రాజెక్టుల కోసం వాడుకునేలా చట్ట సవరణ చేశారు.

ఇండియాకు ఏడు దేశాలతో అంతర్జాతీయ సరిహద్దులు ఉన్నాయి. వీటి పొడవు 15 వేల కిలోమీటర్లు. ఆ లెక్కన అటవీ భూముల సవరణ చట్టం కేటాయించిన భూముల విస్తీర్ణం దాదాపు 15 లక్షల చదరపు కిలోమీటర్లు. అంటే, 37 కోట్ల ఎకరాలు. ఇంతటి విస్తీర్ణమయిన భూమిని ఎవరి కోసం సేకరిస్తున్నారూ అనేది ఇప్పుడు చాలామందిని వేధిస్తున్న ప్రశ్న. దేశానికి వ్యూహాత్మక ప్రాజెక్టులంటే రక్షణ శాఖ ప్రాజెక్టులని ఎక్కువమంది భావిస్తారు. ఆదానీ, అంబానీలకు అవసరమైన భూముల్ని కూడ కేంద్ర ప్రభుత్వం దేశ ప్రయోజనాలకు అవసరమైన వ్యూహాత్మక ప్రాజెక్టులుగా పరిగణించే వీలు లేకపోలేదు.

ఈశాన్య రాష్ట్రాల్లో మణిపూర్‌తో సహా అనేకం ఈ వంద కిలోమీటర్ల పరిధిలోకి వస్తాయి. అంటే వ్యూహాత్మక ప్రాజెక్టులు వస్తే ఈ రాష్ట్రాలు అంతరించిపోతాయి. దేశంలోని రేవు పట్టణాలన్నీ ఈ పరిధిలోనికే వస్తాయి. ఆ వంద కిలోమీటర్ల పరిధిలో రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా ఎలాంటి అధికారాలు వుండవు.

మణిపూర్ మీద ఎందుకింత ప్రత్యేక ఆసక్తి? అనేది ఎవరికయినా రావలసిన సందేహం. ఈ సందర్భంగా అనేక వాదనలు వినిపిస్తున్నాయి. మణిపూర్‌ను ఆనుకుని మయన్మార్, లావోస్, థాయిలాండ్ దేశాలున్నాయి. మెకాంగ్, రువాక్ నదులు ఇక్కడే కలుస్తాయి. ఈ మూడు దేశాల సరిహద్దులు కలిసే ప్రాంతానికి 'గోల్డెన్ ట్రయాంగిల్' (బంగారు త్రిభుజి) అనే పేరుంది. ఓపియం, హెరాయిన్ వంటి మాదకద్రవ్యాలకు ఇది ప్రపంచ కేంద్రం.

పాకిస్తాన్, అఫ్ఘనిస్తాన్, ఇరాన్ సరిహద్దులు కలిసే ప్రాంతాన్ని 'గోల్డెన్ క్రిసెంట్' (బంగారు నెలవంక) అంటారు. అది సహజ మాదకద్రవ్యాల కేంద్రమయితే, 'బంగారు త్రిభుజి' సింథటిక్ మాదకద్రవ్యాల కేంద్రం. 'యాబా' అని పిలిచే మెథంఫెటమైన్ (Methamphetamine) సింథటిక్ మాదకద్రవ్యం వాణిజ్యం ఇటీవల ఈ ప్రాంతంలో విపరీతంగా పెరిగింది. డ్రగ్స్‌తో పాటు ఆయుధాలు, కమర్షియల్ సెక్స్ రవాణాలకు ఇది ట్రాన్సిట్ పాయింట్.

ప్రపంచ వాణిజ్యంలో నిజానికి ఆయుధాలకన్నా మాదకద్రవ్యాలది చాలా పెద్ద వాటా. ఐక్యరాజ్య సమితి ఆఫీస్ ఆన్ డ్రగ్స్ అండ్ క్రైమ్ (UNODC) అంచనా ప్రకారం మాదకద్రవ్యాల వాణిజ్యం 426 బిలియన్ డాలర్లు. ఆయుధాలకన్నా మాదకద్రవ్యాల అమ్మకాలు నాలుగు రెట్లు ఎక్కువగా వుండడానికి కారణం ఏమంటే, మనుషులు ఆయుధాలను ఎప్పుడో ఒకసారి వాడుతారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడితే ప్రతిరోజూ వాటిని కొనాల్సి వుంటుంది. అంచేత, వాణిజ్యంలో భారీ టర్నోవర్ ఆశించే మెగాకార్పొరేట్లు ఇప్పుడు మాదకద్రవ్యాల మీద దృష్టిపెట్టారని, గోల్డెన్ ట్రయాంగిల్ మీద పట్టుకోసమే మణిపూర్‌ను మండిస్తున్నారని కుకీ సంఘాలు ఆరోపిస్తున్నాయి.

అడవుల నుండి ఆదివాసుల్ని తరిమేస్తున్నట్టే పట్టణ శ్రామికవాడల నుండి ముస్లింలని ఒక పథకం ప్రకారం బుల్‌డోజర్లతో తరిమేస్తుండడాన్ని మనం తరచూ చూస్తున్నాం. భారత ముస్లింలలో కొందరు వ్యాపారులు, కొండొకచో కార్పొరేట్లు కూడ ఉన్నారు. కానీ, అత్యధికులు యంత్రయుగపు కులవృత్తుల్లో జీవిస్తున్నారు.

మెగా కార్పొరేట్ల ఆగడాలు అడవులకే పరిమితం కావు. ఆదానీ గ్రీన్ ఎనర్జీ సంస్థ నుండి పాతికేళ్ళపాటు సోలార్, పవన విద్యుత్తును అధిక ధరకు కొనడానికి జగన్ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. దీని కోసం నీకెంత నాకెంత (Quid pro quo) పద్ధతిలో భారీగా ముడుపులు అందుకుందని ఇటీవల అంతర్జాతీయ వేదికల మీద పెద్ద దుమారం రేగడం మనకు తెలుసు. ఒప్పుకున్న షరతుల ప్రకారం భారీ నష్టపరిహారాన్ని చెల్లించాలి గనుక ఈ ఒప్పందాన్ని రద్దు చేసుకోవడమూ చంద్రబాబు ప్రభుత్వానికి కుదరదు. ఫలితంగా ఆ భారాన్ని రాష్ట్ర ప్రజలే భరించాల్సి వుంటుంది. ఇది కూడా మనకు తెలుసు. కానీ మనకు తెలియాల్సిన మరో పార్శ్వం ఏమంటే ఆదానీ గ్రీన్ ఎనర్జీ సంస్థకు గుజరాత్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోనూ ప్లాంట్లున్నాయి. వీటి నిర్మాణానికి ఆయా ప్రాంతాల్లో ఆదివాసులతోపాటు, మత్స్యకారులు, వ్యవసాయదారులు, పేదవర్గాల్ని భారీ సంఖ్యలో సామూహిక స్థానభ్రంశానికి గురిచేశారు.


అణచివేత ఒకచోట మొదలయితే అది ఒకటి రెండు సమూహాలకు పరిమితమై ఆగిపోదు. హిట్లర్ ముందు కమ్యూనిస్టుల్ని, యూదుల్ని అణిచివేయాలనుకున్నాడు. అది అతిశయించి మొత్తం తన దేశ ప్రజల్ని అణచివేయడానికి సిద్ధమయ్యాడు. అత్యాశపరులయిన కార్పొరేట్ల ఆగడాలకు బలవుతున్నది అడవుల్లో ఆదివాసులు, పట్టణాల్లో మరొకరు మాత్రమే అనుకోవడానికి వీల్లేదు. వాటి దుష్ప్రభావాలు దేశ ప్రజలు అందరి పైనా ఉంటాయి; ఉంటున్నాయి.

■ డానీ

నవశకానికి నవ్యాంధ్ర పరుగు!

రాష్ట్రంలో ఐటీ-ఎలక్ట్రానిక్స్ రంగాలకు మహర్దశ పట్టనున్నది. ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ రంగాలలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామిగా నిలపాలనే లక్ష్యంతో దృఢమైన కార్యాచరణతో ఐటీ రంగం అభివృద్ధికి ఆ శాఖ మంత్రి నారా లోకేశ్ విశేష కృషి చేస్తున్నారు. శాస్త్ర సాంకేతికాంధ్రని దేశానికి దిక్సూచి చెయ్యాలన్న చంద్రబాబు స్వప్నాన్ని సాకారం చెయ్యడానికి శ్రమిస్తున్నారు. ఐటీ రంగాన్ని విస్తృతపరిచి యువతకి పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధికి పునాదులు వేస్తున్నారు. రానున్న ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పన దిశగా లోకేశ్ కృషి చేస్తున్నారు. రాష్ట్రానికి తరలివస్తున్న పరిశ్రమల అవసరాలను గుర్తించి అందుకు తగ్గట్టుగా యువతలో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు దేశంలోనే తొలిసారిగా స్కిల్‌సెన్సస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో యువతకు స్వయం ఉపాధి ఆధారిత నైపుణ్య కార్యక్రమాలను అమలు చేసి తద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఇటీవల సెంచూరియన్ యూనివర్సిటీతో ఒప్పందం కుదుర్చుకున్నారు. దీనిద్వారా దుస్తుల తయారీ, ఆటో విడిభాగాలు, డ్రాగన్ ఫ్రూట్ సాగు, స్మార్ట్ వ్యవసాయం, డ్రోన్ టెక్నాలజీ వంటి రంగాల్లో ఎంటర్‌ప్రైజ్ క్లస్టర్‌లను ఏర్పాటు చేసి ఆయా రంగాల్లో వృత్తి నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు. అగ్రిటెక్, ఏఐ అనుసంధానంతో రాష్ట్ర సాగు రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చి, ఉత్పాదకతను పెంచే సాగు విధానాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.

ప్రగతిశీల ఆలోచనలతో ఆరు నెలలుగా రాష్ట్రంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాలను ప్రోత్సహిస్తూ నవశకానికి నవ్యాంధ్రను పరుగు తీయిస్తున్నారు లోకేశ్. రాష్ట్రాన్ని ఐటీ హబ్‌గా మార్చేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. అమరావతిని ఏఐ క్యాపిటల్‌గా తీర్చిదిద్దేందుకు, అంతర్జాతీయంగా వస్తున్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా డీప్‌టెక్‌ను అభివృద్ధి చేసి తద్వారా యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో ఇన్నోవేషన్ యూనివర్సిటీ ఏర్పాటుకు ఫిజిక్స్ వాలాతో ఎంఓయు కుదుర్చుకున్నారు. ఆయన కృషి ఫలితంగా గూగుల్ క్లౌడ్, టీసీఎస్ వంటి దిగ్గజ కంపెనీలు రాష్ట్రంలో యూనిట్లను స్థాపించేందుకు ముందుకు వచ్చాయి. ఇప్పటికే ఐదువేల మందికి ఉపాధి కల్పిస్తున్న హెచ్‌సీఎల్ మరో 15 వేల ఉద్యోగాలు కల్పించేలా సంస్థను విస్తరించడానికి ముందుకు వచ్చింది. లోకేశ్‌తో చర్చల అనంతరం ఫాక్స్‌కాన్ సిటీ ఏర్పాటుకు ఆ సంస్థ ప్రణాళికలు రూపొందిస్తోంది.



సీఎం చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా సింపుల్ గవర్నమెంట్, ఎఫెక్టివ్ గవర్నెన్స్ కోసం విధానాల రూపకల్పన చేశారు నారా లోకేశ్. కేవలం ఐటీ, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలపైనే కాకుండా ఇతర భారీ పరిశ్రమలను రాష్ట్రానికి రప్పించేందుకు లోకేశ్ చేస్తున్న ప్రయత్నాలు విజయవంతం అవుతున్నాయి.

ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో ఐదేళ్లలో ఐదు లక్షలు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా ప్రణాళిక సిద్ధం చేశారు. పెట్టుబడిదారుల స్నేహపూర్వక విధానాలతో నూతన ఐటీ, ఎలక్ట్రానిక్స్ పాలసీలను ప్రకటించారు. అత్యుత్తమ ప్రోత్సాహకాలతో 2024–29లో ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్స్ తయారీ విధానం, ఆంధ్రప్రదేశ్ సెమీ కండక్టర్ డిస్‌ప్లే ఫ్యాబ్ పాలసీ, ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్ పాలసీ, ఆంధ్రప్రదేశ్ డేటా సెంటర్ పాలసీలను ప్రకటించారు. సీఎం చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా సింపుల్ గవర్నమెంట్, ఎఫెక్టివ్ గవర్నెన్స్ కోసం విధానాల రూపకల్పన చేశారు. ఢిల్లీలో పారిశ్రామిక పెట్టుబడిదారులతో సమావేశాలను ఏర్పాటు చేసి రాష్ట్రంలో అమలుచేస్తున్న ప్రోత్సాహకాలతో కూడిన సులభతర విధానాలను వివరించారు.

కేవలం ఐటీ, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలపైనే కాకుండా ఇతర భారీ పరిశ్రమలను రాష్ట్రానికి రప్పించేందుకు లోకేశ్ చేస్తున్న ప్రయత్నాలు విజయవంతమవుతున్నాయి. రెన్యువబుల్ ఎనర్జీ రంగంలో 40 వేల కోట్ల పెట్టుబడులకు టాటా గ్రూప్ సిద్ధమైంది. రాష్ట్రంలో 65 వేల కోట్లతో 500 కంప్రెస్డ్ బయో గ్యాస్ యూనిట్ల స్థాపనకు రిలయన్స్ ఎనర్జీ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. రెండు దశలుగా రాబోయే పదేళ్లలో రాష్ట్రంలో రూ.1,40,000 కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ఆర్సెలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ జాయింట్ వెంచర్ ముందుకు వచ్చింది. జనవరి 8న ప్రధాని నరేంద్ర మోదీ అనకాపల్లి వద్ద ఈ ప్రాజెక్టుకు భూమిపూజ చేయనున్నారు. ముంబైలో లోకేశ్ జరిపిన చర్చలతో వేదాంత అనుబంధ సంస్థ అయిన సెరెంటికా గ్లోబల్ రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు సంసిద్ధత వ్యక్తం చేసింది.

అయిదేళ్ల తర్వాత విశాఖలో తొలిసారిగా ఏపీ ఐటీ అసోసియేషన్ ప్రతినిధులతో ముఖాముఖి సమావేశమైన లోకేశ్, ఐటీ రంగ సమస్యలను తెలుసుకుని, సత్వర పరిష్కారానికి ఆదేశాలు జారీచేశారు. రాష్ట్రానికి కొత్తగా వచ్చే ఐటీ, ఎలక్ట్రానిక్స్ కంపెనీలకు సులభంగా అనుమతులు, ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు ఏపీ ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డును పునరుద్ధరించారు. రాష్ట్రంలో మారుమూల ప్రాంతాల్లో సైతం కమ్యూనికేషన్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చేందుకు నారా లోకేశ్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు.

దేశంలో ఏ రాష్ట్రానికీ లేని విధంగా మనకు ఓడరేవులు, విమానాశ్రయాలు, మెరుగైన రోడ్డు రవాణా, లాజిస్టిక్స్ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. దేశంలోని పశ్చిమ తీరం కంటే తూర్పు తీర ప్రాంతం రోడ్డు, రైలు, విమానయాన మార్గాలతో మెరుగైన రీతిలో అనుసంధానమై ఉంది. ఇవన్నీ పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే వారికి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ముఖ్యంగా గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, ఆక్వా, ఆహారశుద్ధి వంటి రంగాల్లో ఎక్కువ పరిశ్రమలు నెలకొల్పేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది.

○ నీరుకొండ ప్రసాద్

కొంచెం జాగ్రత్తపడదాం!

చైనాలో తాజాగా వైరస్ వ్యాప్తితో ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధి రోగులు తామరతంపరగా పెరుగుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఎప్పటిలాగే ఆ దేశం వాటిపై నిఖార్సయిన సమాచారం ఇతర దేశాలతో పంచుకోకపోవడంతో అనుమానాలు మరింత పెరుగుతున్నాయి. ఈ వ్యాధికి హెచ్‌ఎంపి వైరస్ కారకంగా తెలియవస్తోంది. అదే వైరస్ కేసులు ఇతర ప్రపంచ దేశాల్లో కూడా రిపోర్ట్ అవుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలియజేసింది. మన దేశంలో బెంగుళూరులో రెండు కేసులు బయటపడ్డాయి. అయితే వాటికీ, చైనాలో కేసులకు సంబంధం లేదని ఐసీఎంఆర్ ప్రకటించింది. అది కొంత ఊరటే.

ఈ నేపథ్యంలో మన దేశం అప్రమత్తంగా ఉండడం అవసరం. కొవిడ్ వ్యాప్తిలో జరిగిన అనుభవాల ఆధారంగా కొన్ని జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ వైరస్ వ్యాప్తి పట్ల సమాచారం వెంటవెంటనే అందజేసేటట్లు చూడాలి. చైనా, ఇతర దేశాల్లో పరిస్థితుల్ని నిశితంగా గమనించాలి. ప్రజా ఆరోగ్య విభాగాల్ని, సంబంధిత యంత్రాంగాన్ని సమాయత్తం చేయాలి. ఆక్సిజన్ నిల్వలు, సిబ్బంది, సపోర్ట్ సిస్టమ్‌లను రెడీ చెయ్యాలి. వీటన్నింటి కన్నా ముఖ్యంగా వ్యాప్తి నివారణ అంశాలపై దృష్టి పెట్టాలి. మాస్కుల వినియోగం, చేతుల శుభ్రత, గుంపుల నియంత్రణ తదితర అంశాలపై అవగాహన కలిగించాలి. కరోనా సమయంలో పాటించిన జాగ్రత్తలను ప్రజా సమూహాలు మళ్లీ అలవర్చుకోవాలి.

ముఖ్యమైన విషయమేమిటంటే ఈ హెచ్‌ఎంపీ వైరస్ కొత్తది కాదు.. ప్రమాదకరమైనది కాదు. 2001 నుండి తెలిసిందే. పిల్లల్లో శ్వాస సంబంధిత వ్యాధుల్లో 12 శాతం దీని వల్లే వస్తున్నాయి. పిల్లలు, వృద్ధులు, వ్యాధి నిరోధకశక్తి తక్కువగా ఉన్నవాళ్ళలో ప్రమాదకరంగా మారవచ్చు అన్న ఉద్దేశ్యంతో జాగ్రత్తపడాలి. శీతాకాలంలో సహజంగానే వైరస్ వ్యాప్తి ఎక్కువ. కాబట్టి కేసులు ఎక్కువ కనబడతాయి. నివారణ, జాగ్రత్తలతో వ్యాప్తిని వీలైనంత తగ్గిస్తే మంచిది. ఆ కోణంలోనే ఆలోచించి, తదనుగుణంగా ఆచరిస్తే సరిపోతుంది. భయం అక్కరలేదు. బాధ్యత ఉంటే చాలు.

– డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

హిందువులకు మార్గదర్శకులు ఎవరు?

హిందూ సమాజానికి సూచనలు, ఆదేశాలు ఇచ్చే అధికారం ఎవరిది అనే విషయంపై గత కొన్ని రోజులుగా ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. హిందూ సాంస్కృతిక సంస్థగా చెప్పబడే ఆర్‌ఎస్‌ఎస్ అధినేత ఒక ముఖ్య సూచనను ఇచ్చాడు. ప్రతి మసీదు వెనుక ఒక శివలింగాన్ని వెతకవద్దు అని హిందూ సమాజానికి, స్థానిక నాయకులకు ఒక సూచన ఇచ్చాడు. భారతదేశం ఒక శక్తివంతమైన దేశంగా ఎదగాలని, అది అందరూ కలిసి ఉన్నప్పుడే సాధ్యమవుతుందని చెప్పాడు. అలాగే మరొకచోట మాట్లాడుతూ మతం పేరిట గతంలో ఎన్నో హింసలు, ఘోరాలు అత్యాచారాలు జరిగాయి. అవన్నీ మతం స్వరూపంపై, ధర్మం అంటే ఏమిటి అనే విషయంపై అవగాహన లేక జరిగిన ఘోరాలు అని వ్యాఖ్యానించాడు. మత గ్రంథాలపై మానవ విలువల వెలుగులో సరైన వ్యాఖ్యల్ని తీసుకురావాలని కూడా చెప్పాడు.

పై సూచనపై ప్రముఖ మతాచార్యులు తీవ్రంగా స్పందించారు. హిందూ మతాన్ని గూర్చి సమాజానికి ఆదేశాలు ఇచ్చే అధికారం తమకే ఉన్నదని, సామాజిక సంస్థల నేతలకు లేదని చెప్పారు. 'మేం అతనికి ఆదేశాలిస్తాము, అతను మాకు ఇవ్వడం కాదు,' అంటూ ఇంకా కొంత తీవ్రంగా, ఆ నేత తుష్టీకరణ విధానానికి లొంగిపోయాడని, నాయకుడు కావాలనే ఆశతో ఉన్నాడని కూడా ఆరోపించారు. ఈ ఇద్దరూ హిందూ పక్షపాతులే. వారివి కేవలం భిన్న అభిప్రాయాలు కావచ్చు లేదా మరి ఎవరికైనా సంకేతం కావచ్చు. ఆ విషయంలోకి పోకుండా వారి మాటలను కేవలం ఒక చర్చ విషయంగా తీసుకొని విశ్లేషించడానికి ప్రయత్నిస్తాను.

ఇంతకూ ఆర్‌ఎస్‌ఎస్ నేత మాట్లాడినది ఏమిటి? స్థానిక నాయకులు సంయమనం పాటించాలని, అత్యుత్సాహానికి పోకూడదని చెప్పారు. కొత్త అంశాలని లేవనెత్తవద్దని ఆయన చెప్పడం స్పష్టంగా ఉంది. ఇదివరకే వివాదంలోనూ, చర్చల్లోనూ ఉన్న విషయాలను వదిలి కొత్త విషయాల్ని పెంచుకుంటూ పోతే అనేక చోట్ల ఘర్షణ వాతావరణం పెరుగుతుంది. దేశంలో ప్రతి మసీదు వెనుక ఒక దేవాలయం ఉన్నదని ఆందోళన చేస్తే దేశం వాతావరణం మొత్తం కలుషితమవుతుంది. దేశం ఆర్థికంగా ప్రగతి సాధించాల్సిన సమయంలో అంతర్గత సమస్యలను పెంచుకుంటూ పోతే అది భారత దేశాన్ని నిర్వీర్యం చేయాలని ప్రయత్నిస్తున్న శక్తులకు సహాయం చేసినట్లు అవుతుంది. వారికి ఒక ఆయుధాన్ని ఇచ్చినట్లు అవుతుంది.

ఆర్‌ఎస్‌ఎస్ నేత ఇచ్చిన రెండవ సలహా అన్ని మతాలకు అన్వయించేది. చరిత్రలో ఘోరాలు, నరమేధాలు చేసి; ప్రపంచమంతా తమ మతం మాత్రమే ఉండాలని శాశ్వత అజెండా ఉన్న మతాలు హిందూ మతాన్ని నిర్మూలించాలని ప్రయత్నాలు చేస్తున్న విషయం అందరికీ తెలుసు. హింసను ప్రోత్సహించే విధంగా తమ మత గ్రంథాలను అర్థం చేసుకున్నారని, మతం స్వరూపాన్ని, భగవంతుని స్వరూపాన్ని అర్థం చేసుకొని తమ గ్రంథాలను వ్యాఖ్యానించి ఆచరించాలని ఆయన సూచన. హిందూ సమాజానికి కూడా పై సూచన వర్తిస్తుంది. హిందూ సమాజంలో నరమేధాలు లేకపోయినా కొన్ని వర్గాల వారిని సామాజికంగా దూరం పెట్టడం అనే మానసిక హింస ఉంది. ఒకనాడు ఏ కారణాల వల్ల సమర్థించుకున్నా అలాంటి వివక్షకు ఈనాటి మానవ విలువలు పూర్తిగా వ్యతిరేకం. ఈ విషయంలో హిందూ మతాచార్యులు ఆలోచించాలని కూడా ఆయన మాటకు అర్థం.

హిందూ సమాజానికి సూచనలను ఇచ్చే అధికారం ఎవరికి ఉంది? కేవలం ధర్మాచార్యులే ఇవ్వాలా, మరి ఎవరికీ అధికారం లేదా? సమాజ శ్రేయస్సు గురించి ఎవరు సలహా ఇచ్చినా అది ధర్మమే అవుతుంది. సమాజానికి హాని కలిగించే ప్రయోగాల్ని ఎవరు చేసినా అది అధర్మమే అవుతుంది. దీర్ఘకాలికంగా దేశానికి మేలైన మార్గం ఏమిటి అని ఆలోచించే అధికారం ప్రతి ఒక్కరికీ ఉంది.



పై చర్చ వల్ల సామాన్య హిందువు మనసులో ఒక ప్రశ్న వస్తుంది. హిందూ సమాజానికి సూచనలను ఇచ్చే అధికారం ఎవరికి ఉంది? కేవలం ధర్మాచార్యులే ఇవ్వాలా, మరి ఎవరికీ అధికారం లేదా? సమాజ శ్రేయస్సు గురించి ఎవరు సలహా ఇచ్చినా అది ధర్మమే అవుతుంది. సమాజానికి హాని కలిగించే ప్రయోగాల్ని ఎవరు చేసినా అది అధర్మమే అవుతుంది. దీర్ఘకాలికంగా దేశానికి మేలైన మార్గం ఏమిటి అని ఆలోచించే అధికారం ప్రతి ఒక్కరికీ ఉంది.


ధర్మసూక్ష్మాలను కేవలం ధర్మాచార్యులే చెప్పగలరా మరి ఎవరికీ అధికారం లేదా అన్న విషయంపై భారతంలోనే రెండు కథలు ఉన్నాయి. ఒకటి కౌశికుడు అనే బ్రాహ్మణుడు ధర్మవ్యాధుడు అనే కటికవాడి వద్దకు వెళ్లి ధర్మాన్ని గూర్చి తెలుసుకోవడం. మరొకటి శాంతి పర్వంలోనిది. గొప్ప తపస్సు చేసిన జాజలి అనే బ్రాహ్మణుడు తులాధారుడు అనే ఒక సాధారణ వర్తకుడి వద్దకు వెళ్లి ధర్మ సూక్ష్మాన్ని తెలుసుకోవడం. ఏదైనా ఒక సందర్భంలో మనం చేయాల్సిన పని ధర్మబద్ధమో కాదో తెలుసుకోవాలంటే ఎవరో ఆచరించిన విధానాన్ని అనుసరించడం కాకుండా మనం మన బుద్ధితో విచారించి ధర్మాన్ని నిర్ధారించుకోవాలని తులాధారుడు చెప్తాడు. ఇలాంటి ఉదాహరణలు పురాణాల్లోనూ అనేకాలు ఉన్నాయి. అందువల్ల ఎవరి పరిధి ఎంతవరకు ఉన్నది అని పరిమితిని విధించలేము. ప్రతి ఒక్కరికి ఆలోచించి విమర్శించే అధికారం, అవకాశం ఉన్నాయి. అందువల్లే 14వ శతాబ్దంలోనే వచ్చిన 'సర్వదర్శన సంగ్రహం' అనే పుస్తకంలో ఆనాటి హిందూ సమాజంలో 16 దర్శనాలు (Schools of thought) ఉన్నట్టు చూడగలం. హిందూ ధర్మాచార్యులు కొత్త వివాదాల్ని సమర్థించడం వల్ల సమాజం ఒకటవుతుందని భావిస్తున్నారా అని ఆలోచించాలి. నిజానికి హిందూ సమాజం వీరితో ఉందా అన్నది కూడా ఒక ప్రశ్న. ఇలాంటి చర్చల వల్ల హిందూ సమాజంలోనే చాలామంది వీరికి ఇదివరకే దూరంగా ఉన్నారు, మరికొందరు దూరమయ్యే పరిస్థితి ఉంది. హిందూ ఐక్యత జరగకపోగా మిగతా వర్గాల వారిని ఏకం చేసినట్లు అవుతుంది. మతాచార్యులు దీన్ని కూడా ఆలోచించాలి.

హిందూ ధర్మాచార్యులు చేయగలిగిన, చేయాల్సిన పనులు చాలా ఉన్నాయి. హిందూ ఐక్యత దేశ రక్షణకు, దేశ సమగ్రతకు ఎంత అవసరమో ప్రజలకు తెలపాలి. దేశంలో ఘర్షణ వాతావరణం లేకుండా, దేశ సమగ్రతకు భంగం కాకుండా హిందువుల ఐక్యత ఉన్నప్పుడు, హిందువులు తమ సంస్కృతి గొప్పతనాన్ని తెలుసుకున్నప్పుడు ఇతర వర్గాలు వారు కూడా తమ మత స్వతంత్రాన్ని కలిగి భయం లేకుండా కలిసి ఉండవచ్చు.

అన్నింటికన్నా ముఖ్యంగా హిందూ ఆచార్యులు చేయగలిగిన పని హిందూ మతంపై వచ్చిన అనేక విమర్శలకు సమాధానాలు చెప్పడం. ఉదాహరణకు సనాతన ధర్మం అంటేనే కులం అని అందరి మనసులో నాటుకొని ఉన్నప్పుడు హిందువులు ఎందుకు మతాచార్యుల వెంట ఉండాలి? సనాతన ధర్మానికి కులానికి సంబంధం లేదు. సనాతన ధర్మం కులాన్ని సృష్టించినట్లు మన పుస్తకాలు అన్నింటినీ తిరగవేసినా ఎక్కడా కనిపించదు. కేవలం మనిషి స్వభావాన్ని బట్టి నాలుగు వర్ణాలను చెప్పారు కానీ సమాజంలో ఉన్న వేలకొద్దీ కులాల గురించి ఎవరూ చెప్పలేదు. మనుస్మృతిలో ఉంది కదా అని అడగవచ్చు. మనువు కాలానికే సమాజం చాలా అభివృద్ధి చెందింది. ఈనాడు సమాజంలో ఉన్న అన్ని రకాల లిటిగేషన్లు, వ్యాజ్యాలు అప్పుడు కూడా ఉన్నాయి, అందులో వివరింపబడ్డాయి కూడా. వర్ణసంకరం వల్ల పుట్టిన వారిని అదివరకే ఉన్న కులాలలో మనువు చేర్చాడు. అంతే కానీ అతను కొత్త కులాలను సృష్టించలేదు. బ్రాహ్మణులు కులాన్ని సృష్టించలేదనే విషయాన్ని అంబేడ్కర్ స్వయంగా చెప్పాడు. ఏ ఋషి కూడా కులాన్ని సృష్టించలేదు. మనుషుల్ని నిలబెట్టి నీవు ఆ పని చేయి, నీవు ఈ పని చేయి, నువ్వు గుడ్డలు నేయాలి, నువ్వు ఉతకాలి అంటూ ఎవరూ ఎప్పుడూ చెప్పలేదు. సమాజం అవసరాల్ని బట్టి ఏర్పడినవి కులాలు. హిందూ ధర్మాచార్యులు ఈ విషయాన్ని స్పష్టం చేయాలి. కుల ఆచారాల్ని వదలమని చెప్పాల్సిన పనిలేదు, కులాల సృష్టికి మతంతో సంబంధం లేదని మాత్రం చెబితే చాలు.

ముఖ్యమైన వివాదాస్పద విషయాలపై, సమాజంలో పేరుకుపోయిన సందేహాల గురించి ధర్మాచార్యులు సమాధానం చెబితే హిందువుల్లో ఐక్యత దానంతట అదే వస్తుంది. కులాల విషయంలో ప్రభుత్వాల పాలసీ ఎలా ఉన్నా మతాచార్యులకు అనవసరం. రాజకీయ పార్టీలు తమ అవసరాలకు కులాన్ని వాడుకోవచ్చు. ధర్మాచార్యులు మాత్రం వైదిక సిద్ధాంతంలో ఉన్న విషయాన్ని ప్రజలకు స్పష్టంగా చెబితే చాలు. అంతేకాక విద్యావంతులు ఎవరైనా ధర్మాన్ని గురించి విశ్లేషించి వ్యాఖ్యానించే సంప్రదాయం మన సమాజంలో ఉంది. అలాంటి స్వేచ్ఛ ఉండడం మన సంస్కృతి గొప్పదనం. దానికి మనం గర్విద్దాం.

• కె. అరవిందరావు
మాజీ డీజీపీ



● విజ్ఞాన యాత్ర





పుస్తక మహోత్సవంలో భాగంగా సోమవారం నగరంలో పుస్తకప్రియుల పాదయాత్ర జరిగింది. మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ అకాడమీ వద్ద మంత్రి కందుల దుర్గేష్ పాదయాత్రను ప్రారంభించగా, ఇందిరాగాంధీ స్టేడియం వరకు సాగింది. ఆంధ్రజ్యోతి మాజీ సంపాదకుడు కె.శ్రీనివాస్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సాహితీవేత్త రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, పుస్తకప్రియులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

6లో



వాలీబాల్ పోటీలు ప్రారంభం

మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ జూనియర్ కళాశాల వేదికగా 68వ జాతీయ వాలీబాల్ స్కూల్ గేమ్స్ అండర్-19 బాలికల టోర్నీ సోమవారం ప్రారంభమైంది. ఐదు రోజుల పాటు సాగే ఈ పోటీలను పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రారంభించారు.

8లో

పరిహారం.. ఫలహారం

» తోట్లవల్లూరులో శివ కాంతమ్మ ఆగ్రో ఏజెన్సీస్ యజమాని దండ భాస్కర రావు, ఆయన భార్య, కోడలుకు వరద నష్టపరిహారం అందింది. కానీ, వారు ఏ పంట పండించలేదు. వరద వల్ల నష్టపోయిందీ లేదు. అయినా వారికి పరిహారం అందింది. ఇదేంటని భాస్కరరావును ప్రశ్నించగా, వ్యవసాయాధికారి జి.నాగేశ్వరరావును అడగాలంటూ సమాధానమిచ్చారు.

» నందిని ఎంటర్‌ప్రైజెస్ యజమాని దొండపాటి శివరామకృష్ణకు పసుపు సాగు చేసినట్టుగా రూ.27,615, అరటి సాగు చేసినట్టుగా రూ.20,545, ఆయన భార్య అనూష అరటి సాగు చేసినట్టుగా రూ.20,825, వీరి దుకాణంలో పని చేసే వర్కర్ శ్రీకాకుళం కుసుమకుమారి అరటి సాగు చేసినట్టుగా రూ.20,545, ఈమె తల్లి కొల్లిపర శివసామ్రాజ్యం అరటి సాగు చేసినట్టుగా రూ.20,885 చొప్పున నష్టపరిహారం అందింది. దీనిపై శివరామకృష్ణను వివరణ కోరగా, తమ దుకాణంలో పురుగు మందులను రైతులు అప్పుగా తీసుకెళ్లి చెల్లించట్లేదని, నష్టపరిహారం వస్తుందని తెలిసి రైతులను అడగ్గా, ఆధార్ కార్డులు ఇవ్వమన్నారని, అలా తమకు డబ్బులొచ్చాయని చెప్పారు.

» ఆర్‌బీకేలోని వీఏఏ (విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్) తన తమ్ముడికి, కుటుంబ సభ్యులకు భారీగా పరిహారం ఇప్పించినట్టు వరద బాధిత రైతుల జాబితా చూస్తేనే తెలుస్తోంది.

.. ఇలా కృష్ణానది వరద నష్టపరిహారాన్ని పప్పుబెల్లాల్లా పంచుకున్నారు. పంట నష్టపోయిన రైతులను పక్కనపెట్టి, తమ కుటుంబ సభ్యులు, బంధువుల ఖాతాలకు పరిహారాన్ని జమ చేయించారు. తమకు పరిహారం అందలేదని 40 మంది బాధిత రైతులు రోజుల తరబడి గొల్లుమంటుంటే, వారి సమస్యను పరిష్కరించకపోగా, పరిహారం కింద అక్రమంగా అందిన సొమ్మును దర్జాగా అనుభవిస్తున్నారు. తోట్లవల్లూరు మండలంలో రైతుల పంట నష్టపరిహారం జాబితాను తప్పులతడకగా రూపొందించిన స్థానిక వ్యవసాయ, రెవెన్యూ అధికారులు, సిబ్బంది.. ఆ తర్వాత పాల్పడిన చీకటి వ్యవహారాలకు పై ఘటనలే నిదర్శనాలు.

తోట్లవల్లూరు రైతుల వరద పరిహారం మాయంలో ఎన్నో కథలు

వ్యాపారుల వద్ద రైతుల అప్పులు తీర్చేందుకేనట..!



- ఆధార్ ఇచ్చి పరిహారాన్ని వ్యాపారుల ఖాతాలకు మళ్లించారట..!
- వింతగా ఉన్న వ్యాపారుల సమాధానాలు
- సహకరించిన వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది
- తప్పులతడకగా వరద బాధిత జాబితా రూపకల్పన
- అసలు రైతులు కాకుండా బంధువుల పేర్లతో..
- గౌడ సొసైటీ భూములపై రూ.25 లక్షలు స్వాహా
- లబోదిబోమంటున్న అసలు రైతులు
- అవినీతి వ్యవహారంపై గొంతెత్తని రాజకీయ నేతలు
- అధికారులను రక్షించే ప్రయత్నాలు

తోట్లవల్లూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : గత ఏడాది సెప్టెంబరులో కృష్ణానది వరద కారణంగా తోట్లవల్లూరు నార్త్, సౌత్ లంకలు, రొయ్యూరు, తోడేళ్లదిబ్బలంక, వల్లూరుపాలెం, కాళింగదిబ్బలంక, పాములలంక, తుమ్మలపచ్చికలంక, పిల్లివానిలంక, భద్రిరాజుపాలెం, చాగంటిపాడు లంకలు, పొట్టిదిబ్బలంక, దేవరపల్లి, గుర్విందపల్లి, ఐలూరు, కనిగిరిలంక, ములకలపల్లిలంక పరిధిలో 5,237 మంది రైతులకు చెందిన 2,033.50 హెక్టార్లలో వివిధ రకాల ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. రైతులను ఆదుకునేందుకు వరద వచ్చిన 15 రోజుల్లోనే ప్రభుత్వం రూ.7.16 కోట్లు పరిహారంగా అధికారులు రూపొందించిన బాధిత రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేసింది. ఇంతవరకు బాగానే ఉన్నా.. అసలు కథ ఇక్కడే మొదలైంది.

గౌడ సొసైటీపైనే కన్ను

ఈ అక్రమాలు అధికంగా గౌడ ఫీల్డు సొసైటీ సర్వే నెంబరు 331/1 భూముల్లో జరగటం గమనార్హం. గౌడ కులస్తులకు కాకుండా, ఇతర కులస్తులకు ఇక్కడ పరిహారం రావటం అధికారుల అవినీతికి పరాకాష్ఠగా మారింది. ఇక్కడ రూ.25 లక్షల వరకు పరిహారం పక్కదారి పట్టిందని రైతులు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రమైన తోట్లవల్లూరులోనే ఇంత భారీ అక్రమాలకు పాల్పడ్డారంటే మారుమూల లంకల్లో పరిస్థితి ఏవిటోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. తోట్లవల్లూరులో 40 మంది రైతులకు నష్టపరిహారం రాలేదని తిరుగుతున్నా- న్యాయం చేసేందుకు ఏ ఒక్క నేత ముందుకు రాలేదని, పైగా అవినీతి అధికారుల రక్షణకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

ఏం జరిగింది..?

ఆగస్టులో పంటల ఈ-క్రాప్ నమోదు ప్రారంభం కాగా, మాగాణి పొలాల్లో నెలపాటు వరి, చెరుకు, మెట్టకంద, పసుపు పంటల నమోదు జరిగింది. ఆ తరువాత సెప్టెంబరులో సంభవించిన వరదల కారణంగా ఈ-క్రాప్ నమోదు చేయలేకపోయారు. అలా చేయని వారికి కూడా పది రోజుల్లోనే ఎన్యుమరేషన్ పూర్తిచేసి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. దాంతో అధికారులు.. ఈ-క్రాప్ నమోదును కార్యాలయాల్లో కూర్చుని, రైతులు ఏ పంట చెబితే అదే నమోదు చేసేశారు. ఈ వివరాలనే ఎన్యుమరేషన్‌గా ప్రభుత్వానికి పంపటంతో తక్షణమే నష్టపరిహారం రైతుల మిగతా 6లో..

పోలీస్ కస్టడీకి బియ్యం నిందితులు

నేడు ఏడు గంటల పాటు పోలీస్ విచారణ

» హాజరుకానున్న గోడౌన్ మేనేజర్, మిల్లు యజమాని, లారీ డ్రైవర్
» పేర్ని గోడౌన్‌లో బియ్యం మాయం కేసులో స్పెషల్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి ఉత్తర్వులు
» పౌరసరఫరాల శాఖ టెక్నికల్ అసిస్టెంట్ మేనేజర్ కోటిరెడ్డికి బెయిల్ మంజూరు

మచిలీపట్నం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి పేర్ని నాని గోడౌన్‌లో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) మాయం కేసులో రిమాండ్‌లో ఉన్న ముగ్గురు నిందితులను ఏడు గంటల పాటు పోలీస్ కస్టడీకి అనుమతినిస్తూ స్పెషల్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పేర్ని గోడౌన్ మేనేజర్ మానస్‌తేజ, మిల్లు యజమాని బొర్రా ఆంజనేయులు, లారీ డ్రైవర్ బోట్ల మంగారావును పోలీసులు మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విచారించనున్నారు. అనంతరం వీరిని మళ్లీ రిమాండ్‌కు పంపుతారు. ఈ కేసులో ఏ1గా ఉన్న పేర్ని జయసుధకు జిల్లా కోర్టు ముందస్తు బెయిల్‌ను డిసెంబరు 30వ తేదీన మంజూరు చేసింది. ఆ తర్వాత ఆమె పోలీసుల విచారణకు హాజరయ్యారు. సీఎంఆర్ బియ్యం మాయం కేసులో ఏ2గా ఉన్న గోడౌన్ మేనేజర్ మానస్‌తేజ పోలీసుల విచారణలో మాజీమంత్రి పేర్ని నాని చెప్పినట్లుగానే తాను చేశానని చెప్పడంతో పోలీసులు ఈ కేసులో ఏ6గా పేర్ని నాని పేరును చేర్చారు. అయితే, పేర్ని నాని తనపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా హైకోర్టును ఆశ్రయించారు. సోమవారం హైకోర్టులో ఈ కేసు విచారణకు రాగా, మంగళవారం నాటికి విచారణను వాయిదా వేశారు. దీర్ఘకాలం పాటు పేర్ని నాని గోడౌన్ నుంచి సీఎంఆర్ బియ్యం మాయం కావడం, ఈ వ్యవహారంలో గోడౌన్ మేనేజర్, మిల్లు యజమాని, లారీ డ్రైవర్, పేర్ని నాని కుటుంబ సభ్యుల ఖాతాలకు నగదు మళ్లింపు తదితర అంశాలపై పోలీస్ కస్టడీకి వచ్చే నిందితులను పోలీసులు విచారణ చేయనున్నారు. ఈ కేసులో మరిన్ని వాస్తవాలు వెలుగుచూసే అవకాశం ఉంది.

నిందితులను వారం పాటు పోలీసులు తమ కస్టడీకి ఇవ్వాలని కోరగా, ఏడు గంటలపాటు మాత్రమే కస్టడీకి అనుమతులు ఇచ్చారు. కాగా, ఇదే కేసులో జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న కోటిరెడ్డిని డిసెంబరు 30వ తేదీన పోలీసులు అరెస్ట్ చేసి కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. ఆయనకు స్పెషల్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి సోమవారం బెయిల్‌ను మంజూరు చేశారు.

ప్రొటోకాల్ పంచాయితీ!



ఇంద్రకీలాద్రిపై ప్రొటోకాల్ విధుల్లో నలుగురు కానిస్టేబుళ్లు

* తమకూ ఆ విధులు కేటాయించాలని ట్రాఫిక్, క్రైమ్ పట్టు.. ఉన్నతాధికారుల దృష్టికి వ్యవహారం

8లో

జిల్లా ఓటర్లు 17,06,983

పురుష ఓటర్లు 8,31,839 మంది, మహిళా ఓటర్లు 8,74,992 మంది

8లో

నేనెళ్లిపోతా..!

పీఆర్ఎస్‌కు ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఎస్ఈ దరఖాస్తు

» అప్పటివరకు మెడికల్ లీవ్ ఇవ్వాలని మరో దరఖాస్తు
» కుదరదని చెప్పిన ఉన్నతాధికారులు
» టెండర్లలో లోటుపాట్లు, ఫిర్యాదులు, కేసుల నేపథ్యంలోనే..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) ఉమ్మడి కృష్ణాజిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ) విద్యాసాగర్ స్వచ్ఛంద పదవీ విరమణ కోసం దరఖాస్తు చేసుకోవడం చర్చకు దారితీస్తోంది. డి.వెంకటరమణ బదిలీ తర్వాత ఆ స్థానంలో విద్యాసాగర్ ఇన్‌చార్జి ఎస్ఈగా వచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా టెండర్లు పిలవటంతో ఆయన అనేక కోర్టు కేసులను ఎదుర్కొన్నారు. ఈ విషయాలతో తీవ్ర ఆందోళన మిగతా 6లో..

సంక్రాంతి దందా

పండక్కి ప్రైవేటు బస్సు ఆపరేటర్ల బరితెగింపు » మూడు రెట్ల వరకు చార్జీల పెంపు

» హైదరాబాద్ నుంచి వచ్చేవారికి ముందస్తుగా..
» చెన్నై, బెంగళూరు, విశాఖపట్నంకు భారీగా..
» 11, 12, 13, 18, 19, 20 తేదీల్లో అమలు
» ఆర్టీసీ బస్సుల్లో మాత్రం నామమాత్రమే..



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : సంక్రాంతికి దూరప్రాంతాల నుంచి సొంతూర్లకు వచ్చే ప్రయాణికులను దోచుకునేందుకు ప్రైవేట్ బస్ ఆపరేటర్లు సిద్ధమవుతున్నారు. మూడు రెట్ల వరకు చార్జీలను పెంచి దోపిడీకి తెరతీస్తున్నారు. పెంచిన ధరలను తమతమ వెబ్‌సైట్లలోనూ ఉంచారు. సాధారణ రోజుల్లో హైదరాబాద్ నుంచి విజయవాడకు రూ.600కే ప్రయాణికులను తీసుకొచ్చే ప్రైవేట్ బస్సులు ఈ పండక్కి ఏకంగా రూ.2,225 మేర వసూలు చేయడానికి రంగం సిద్ధం చేస్తున్నాయి. లోకల్ ట్రావెల్ ఆపరేటర్లు అయితే రూ.2 వేలలోపు చార్జీ తీసుకుంటున్నారు. ఈనెల 11, 12, 13 తేదీల్లో సొంతూర్లకు వచ్చే వారిని, 18, 19, 20 తేదీల్లో ఇక్కడి నుంచి తిరిగి హైదరాబాద్ వెళ్లే వారిని టార్గెట్ చేసుకుని ఈ ధరలను పెంచుతున్నారు.

ఆర్టీసీలో సాధారణ చార్జీలే..

ఆర్టీసీ బస్సుల్లో మాత్రం సాధారణ చార్జీలే వసూలు చేస్తున్నారు. రవాణా నెట్‌వర్కింగ్ సైట్లలో హైదరాబాద్ నుంచి విజయవాడ వచ్చే ప్రైవేట్ బస్సుల ధరలు చూస్తే హడలెత్తిపోవాల్సిందే. ఇంటర్ సిటీ స్మార్ట్ బస్‌లో రూ.599 నుంచి రూ.2,259కు పెంచారు. ఫ్రెష్ మిగతా 6లో..

పుస్తక పఠనాన్ని మించిన సాధనం లేదు

- అన్ని జిల్లాల్లో పుస్తక మహోత్సవాలు
- పుస్తక ప్రియుల పాదయాత్రలో మంత్రి కందుల దుర్గేష్
- పుస్తకం సజీవం : సీపీఐ రామకృష్ణ
- మంచి ఆలోచనలకు పునాది : కె.శ్రీనివాస్

కల్చరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి పుస్తక పఠనాన్ని మించిన మార్గం లేదని సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో పుస్తక మహోత్సవాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్రంలో చారిత్రాత్మక గ్రంథాలయాల ఆధారంగా సాహితీ పర్యాటకానికి శ్రీకారం చుట్టబోతున్నామన్నారు. పుస్తక మహోత్సవంలో భాగంగా నిర్వహించే పుస్తక ప్రియుల పాదయాత్రను ఆయన సోమవారం ప్రారంభించారు. విజయవాడలో ప్రతీ ఏడాది ఆరంభంలో నిర్వహించే పుస్తక మహోత్సవంలో భాగంగా మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆకాడమీ వద్ద పాదయాత్రను మంత్రి దుర్గేష్ ప్రారంభించారు. పుస్తకప్రియులు, విద్యార్థులు ఈ యాత్రలో భాగస్వాములయ్యారు. కార్యక్రమంలో 'ఆంధ్రజ్యోతి' మాజీ సంపాదకుడు కె.శ్రీనివాస్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సాహితీవేత్త రాచపాలెం చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం రామోజీరావు సాహిత్య వేదికపై నిర్వహించిన ముగింపు సభలో మంత్రి మాట్లాడారు. ఏదైనా విషయంపై సమగ్ర అవగాహన ఏర్పరుచుకోవడానికి పుస్తకాన్ని మించిన సాధనం లేదన్నారు. డిజిటల్ యుగంలో పుస్తకాలకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా విజ్ఞానాన్ని సమకూర్చుకోవడం అవసరమేనని అభిప్రాయపడ్డారు. దాని కారణంగా పుస్తక పఠనకు దూరం కాకూడదని విద్యార్థులకు సూచించారు. పుస్తక మహోత్సవం పుస్తక పఠనను పెంపొందించడానికి దోహదం చేస్తుందన్నారు. భాషాసాహిత్య వికాసానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. తెలుగు మీడియం, ఇంగ్లీషు మీడియం రెండూ కొనసాగిస్తామని తెలిపారు. కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు పెనుగొండ లక్ష్మీనారాయణ, రమేష్ కార్తీక్ నాయక్‌కు అభినందనలు తెలియజేశారు. సభలో వారిని వక్తలు సత్కరించారు.

పుస్తకం సజీవం

- కె.రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి

డిజిటల్ యుగంలో ముద్రించిన పుస్తకానికి కాలం చెల్లిందనేది అవాస్తవం. రోజూ చదువుతూ ఉంటేనే చుట్టూ ఉన్న సమాజాన్ని అర్థం చేసుకుని తగిన విధంగా మనల్ని మనం అభివృద్ధి చెందడం సాధ్యపడుతుంది. పుస్తక మహోత్సవానికి స్టేడియాన్నిచ్చినందుకు పవన్ కళ్యాణ్‌కు అభినందనలు. ఇటువంటి పుస్తక మహోత్సవాలు అన్ని జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేయాలి.


పుస్తకాలు తిలకిస్తున్న పాఠశాల విద్యార్థినులు

మంచి ఆలోచనలకు పుస్తకం పునాది

- కె.శ్రీనివాస్, ఆంధ్రజ్యోతి మాజీ సంపాదకులు



పుస్తక పఠనం మంచి ఆలోచనలు ఇస్తుంది. మంచివైపు మొగ్గేలా చేస్తుంది. నేర్చుకునే శక్తిని ఇస్తుంది. బాలలంతా మంచి పుస్తకాలను, సాహిత్యాన్ని చదవడం అలవాటు చేసుకోవాలి. సినిమా, టీవీల కన్నా పుస్తకం గొప్పది. పుస్తకపఠనం ఆనందం కలిగిస్తుంది. మనిషికి తప్పొప్పులు తెలుస్తాయి. పుస్తకం ప్రతిపాదించే విలువలతోనే మంచి సమాజ నిర్మాణం సాధ్యపడుతుంది.



మంత్రి దుర్గేష్‌కు పుస్తకాలు అందజేస్తున్న వక్తలు

సంస్కారాన్ని నేర్పుతుంది

- సాహితీ వేత్త రాచపాలెం చంద్రశేఖరరెడ్డి

పుస్తకాలు చదివి ఎంతోమంది అభివృద్ధి చెందారు. సాటి మనుషుల పట్ల ఎలా మెలగాలి? సమాజంలో సంస్కారవంతంగా, ప్రయోజనకరంగా ఎలా బతకాలి అనే విషయాన్ని సాహిత్యం అలవరుస్తుంది. సాహిత్యం చదవడం విద్యార్థి జీవితంలో భాగం కావాలి. నేను పుస్తకాలు చదివి బాగుపడ్డాను. యువతరం సైన్సుతో పాటు సాహిత్యం చదవాలి. మానవ ప్రవర్తనకు మెరుగులు దిద్దేది సాహిత్యమే. నాగరిక, సంస్కార జీవన వేదికలు పుస్తకాలే. మంచి పౌరులుగా ఎదగాలంటే పుస్తకాలు చదవడం అనివార్యం.

మంచి పుస్తకాలను ప్రోత్సహించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

పిల్లలు మంచి పుస్తకాలను ఎంపిక చేసుకోవడం నేర్చుకోవాలి. అప్పుడే వారు రాబోయే కాలానికి దూతలుగా మారతారు. మంచి పుస్తకాలను సమాజంలోని వారంతా ప్రోత్సహించాలి. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు విజేత పెనుగొండ లక్ష్మీనారాయణ, సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత రమేష్ కార్తీక్ నాయక్, పుస్తక మహోత్సవ సంఘం అధ్యక్షుడు కె. లక్ష్మయ్య, కార్యదర్శి టి.మనోహర్ నాయుడు, గోళ్ల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ప్రచురణ కర్తలు

అతిపెద్ద పుస్తకం!

విజయవాడ సిటీలైఫ్ : ఆస్ట్రేలియా, అమెరికా, లండన్ దేశాల్లో స్థిరపడిన వారి సంతకాలు ఆ పుస్తకంలో కనిపిస్తాయి.. పుస్తక మహోత్సవానికి వచ్చిన వాళ్లంతా ఎటు నుంచి ఎటు తిరిగినా ఆ పుస్తకం వద్దకు కచ్చితంగా వెళ్తున్నారు. అదే స్టాల్ నంబరు196లో శ్రీనివాస పబ్లిషర్స్ ఏర్పాటు చేసిన అతిపెద్ద పుస్తకం. ఈ పబ్లిషర్స్ తమ స్టాల్ వద్ద ఎనిమిది అడుగుల ఎత్తు, ఏడు అడుగుల వెడల్పుతో రెండు పేజీలతో పెద్ద పుస్తకాన్ని ఏర్పాటు చేశారు. పుస్తక మహోత్సవానికి వచ్చిన వారు సంతకాలు చేసేందుకు దీన్ని ఏర్పాటు చేశారు. దీనికి నిర్వాహకులు 'బిగ్ బుక్-గెట్ క్లిక్' అని నామకరణం చేశారు. అమెరికా, ఆస్ట్రేలియా, లండన్ దేశాల్లో స్థిరపడి నగరానికి వచ్చిన వాళ్లంతా ఈ పుస్తకంపై సంతకాలు చేస్తున్నారు. పుస్తక మహోత్సవానికి వచ్చిన సాహితీవేత్తలు, పుస్తక ప్రియులు దీనిపై సంతకాలు చేయడంతోపాటు పెద్ద పుస్తకం ముందు నిలబడి ఫొటోలు తీసుకుంటున్నారు. పుస్తక మహోత్సవంలో ఈ అతిపెద్ద పుస్తకం ప్రత్యేకార్షణగా నిలిచింది.



ఉచితంగా బుక్‌మార్క్, జేబు క్యాలెండర్



శ్రీనివాస పబ్లిషర్స్ స్టాల్‌లో చిన్నారుల కోసం ఉచితంగా బుక్‌మార్క్‌లు, జేబులో పెట్టుకునే క్యాలెండర్లు ఇస్తున్నారు. పుస్తక మహోత్సవానికి వచ్చిన విద్యార్థులు ఈ స్టాల్‌కు వెళ్లి వాటిని తీసుకోవచ్చు. వాటిని వివిధ రంగుల్లో ఇక్కడ అందుబాటులో ఉంచారు. శ్రీనివాస పబ్లిషర్స్ ఇన్‌స్టా ఖాతాను అనుసరించిన వారికి పంచాంగం క్యాలెండర్‌ను ఉచితంగా ఇస్తున్నారు.



విజ్ఞాన యాత్ర!

- పుస్తక మహోత్సవంలో విద్యార్థుల సందడి
- ప్రముఖుల పుస్తకాలను పరిచయం చేస్తున్న ఉపాధ్యాయులు

విజయవాడ సిటీలైఫ్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ పుస్తక మహోత్సవంలో విద్యార్థుల సందడి మొదలైంది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు విద్యార్థులతో 'విజ్ఞాన' యాత్ర చేయిస్తున్నాయి. విద్యార్థులను పుస్తక మహోత్సవానికి తీసుకెళ్లి, ప్రముఖుల రచనలను పరిచయం చేయాలని జిల్లావిద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. దీనితో విద్యార్థులంతా పుస్తక మహోత్సవానికి తరలివస్తున్నారు. పుస్తకాల కొనుగోళ్లతో సంబంధం లేకుండా అన్ని స్టాల్స్‌లోకి విద్యార్థులను తీసుకెళ్తున్నారు. ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు ఆంగ్ల సాహిత్యాన్ని చూపించారు. బాలసాహిత్యంపై మక్కువతో పదో తరగతి విద్యార్థులు ఆల్ ఇన్ వన్‌ల కొనుగోలుకు ఆసక్తి చూపించారు. సోమవారం ఒక్కరోజే సుమారు 500 మంది విద్యార్థులు పుస్తక మహోత్సవాన్ని తిలకించారు. విద్యార్థుల రాకతో సాహిత్యప్రియులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పుస్తక మహోత్సవాలను విద్యార్థులతో సందర్శింప చేయడంతో పాటు పుస్తక పఠనను పెంచాలని అభిప్రాయపడుతున్నారు.


ప్రజా సమస్యలు వింటున్న కలెక్టర్ లక్ష్మీశ

గడువులోగా పరిష్కరించాల్సిందే

- రెవెన్యూ అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టండి
- సమన్వయ కమిటీలు క్రియాశీలంగా పనిచేయాలి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం ద్వారా అందిన అర్జీలను నిర్దేశ గడువులోగా పరిష్కరించాల్సిందేనని, రెవెన్యూ సదస్సుల అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యకరమంలో కలెక్టర్ లక్ష్మీశ, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, డీఆర్డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, జెడ్పీ సీఈవో కె.కన్నమనాయుడు, గ్రామ, వార్డు, సచివాలయాల ప్రత్యేక అధికారి పి.జ్యోతి తదితరులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీలను గడువులోగా పరిష్కరించేందుకు కృషిచేయాలని అధికారులను ఆదేశించారు. సమన్వయ భాగస్వామ్యంతో సమస్యల పరిష్కారానికి త్వరితగతిన కృషిచేయాలన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు!

- పందేల కట్టడికి ప్రత్యేక బృందాలు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : కోడిపందేలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని, ఉల్లంఘించిన వారిపై ఎంతటి వారైనా చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ హెచ్చరించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లాలో కోడిపందేలు నిర్వహించకుండా తీసుకోవాల్సిన చర్యలపై సోమవారం కలెక్టరేట్‌లో సమన్వయ శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కోడిపందేల నిషేధంపై రాష్ట్ర పశుసంవర్థకశాఖ రూపొందించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జంతుహింస నివారణ చట్టం ప్రకారం.. కోడిపందేలను నిషేధించడం జరిగిందన్నారు. చట్టాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

గ్రామ, మండలాల వారీగా తనిఖీ బృందాలు..

హైకోర్టు మార్గదర్శకాల మేరకు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో సంయుక్త తనిఖీ బృందాలను ఏర్పాటు చేసినట్టు వివరించారు. గ్రామస్థాయి బృందంలో వీఆర్వో, కానిస్టేబుల్, పశుసంవర్థకశాఖ సిబ్బంది, మండలస్థాయి బృందంలో తహసీల్దార్, ఎస్‌హెచ్‌వో, మండల పశుసంవర్థక అధికారి, జిల్లాస్థాయి బృందంలో ఆర్డీవో/సబ్‌కలెక్టర్, డీఎస్పీ/ఏసీపీ, పశుసంవర్థకశాఖ డిప్యూటీ డైరెక్టర్ సభ్యులుగా వుంటారన్నారు. ఈ బృందాలు స్థానిక ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, చట్టాల్లోని అంశాలను వివరించాలన్నారు. ఎవరైనా కోడిపందేలు నిర్వహించినా, పాల్గొన్నా చట్టప్రకారం నేరమేనని పేర్కొన్నారు. ఎక్కడా బరులు ఏర్పాటు కాకుండా క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా వుండాలని, నిబంధనల మేరకు తహసీల్దార్లు, ఆర్డీవోలు వారి పరిధిలోని పంచాయతీలకు నోటిఫికేషన్లు జారీచేయాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు.


అధికారులతో కలిసి పోస్టరు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

14 నుంచి జంతు సంక్షేమ పక్షోత్సవాలు

రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 14 నుంచి 31వ తేదీ వరకు జంతు సంక్షేమ పక్షోత్సవాలు జరుగనున్నాయని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. పశుసంవర్థకశాఖ, జంతు సంరక్షణ సంఘాలు, రెవెన్యూ, విద్య, పంచాయతీ రాజ్, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో సమన్వయం చేసుకొంటూ ఈ పక్షోత్సవాలు నిర్వహించాలని సూచించారు. పక్షోత్సవాల సందర్భంగా చర్చలు, నిపుణులతో ఇంటర్వ్యూలు, విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ తదితర పోటీలు నిర్వహించి విజేతలకు సర్టిఫికేట్లు, బహుమతులు అందించనున్నట్టు తెలిపారు. జంతు సంక్షేమ చట్టాలు, నిబంధనలు తదితరాలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో కైండ్‌నెస్‌క్లబ్‌లు ఏర్పాటు చేయడం జరుగుతోందని, అధికారులు, సిబ్బంది కీలక భాగస్వామ్యంతో పక్షోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, జిల్లా పశుసంవర్థక అధికారి ఎం.హనుమంతరావు, జెడ్పీ సీఈవో కె.కన్నమనాయుడు, డీఆర్డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డీపీవో పి.లావణ్యకుమారి, గ్రామ, వార్డు, సచివాలయాల ప్రత్యేక అధికారి పి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


నేనెళ్లిపోతా..!

(5వ పేజీ తరువాయి)

చెంది, స్వచ్ఛంద పదవీ విరమణ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. వీఆర్ఎస్‌కే కాకుండా, వెంటనే సెలవులకు కూడా ఆయన దరఖాస్తు చేశారు. అయితే, విద్యాసాగర్ సెలవు ప్రతిపాదనలపై ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. సెలవులు ఇవ్వటానికి నిరాకరించినట్టు తెలిసింది. అయినా.. మెడికల్ లీవ్స్ పెట్టేందుకు విద్యాసాగర్ ప్రయత్నిస్తున్నట్టు సమాచారం.

టెండర్లలో వివాదాలు

ఇటీవల మచిలీపట్నం సబ్ డివిజన్ పరిధిలో ఓఅండ్ఎం పనులకు నిబంధనలకు విరుద్ధంగా టెండర్లు పిలిచారు. దీనిపై పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదులు కూడా అందాయి. అయినప్పటికీ నిబంధనలకు విరుద్ధంగానే ఆకుమర్రు ఓఅండ్ఎం కాంట్రాక్టును కట్టబెట్టారు. దీనిపై ఇటీవలే ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ)కు ఫిర్యాదు అందింది. ఈ టెండర్ నిబంధనలకు విరుద్ధమని గారపాటి సూర్యకిరణ్ అనే కాంట్రాక్టర్ ఇన్‌చార్జి ఎస్ఈ దృష్టికి తీసుకెళ్లడంతో.. 'మమ్మల్నే ప్రశ్నిస్తావా..' అంటూ ఆ కాంట్రాక్టర్‌కు చెందిన వాటర్ బిల్స్ ఆపేయడంతో పాటు పేమెంట్లు రాకుండా చేస్తామని బెదిరించారు. తనను బెదిరించారంటూ ఆ కాంట్రాక్టర్ ఈఎన్‌సీకి ఫిర్యాదు చేశాడు. నందిగామలో కూడా ఓఅండ్ఎం స్కీమ్‌ల టెండర్లను నిబంధనలకు విరుద్ధంగా పిలిచారు. తప్పు జరిగిందన్న ఫిర్యాదులు వచ్చినపుడు ఇన్‌చార్జి ఎస్ఈగా ఉన్న విద్యాసాగర్ పునఃపరిశీలించాలి. ఆ పని చేయకపోవటం వల్ల విద్యాసాగర్ ప్రత్యక్ష పాత్ర ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నందిగామ ఓఅండ్ఎం పనులపై కూడా పలువురు కోర్టును ఆశ్రయించటానికి రంగం సిద్ధం చేస్తున్నారు. వీటన్నింటి నుంచి తప్పించుకోవటానికే విద్యాసాగర్ స్వచ్ఛంద పదవీ విరమణ ఆలోచన చేస్తున్నారన్న పుకార్లు వస్తున్నాయి.



నందిని ఫెర్టిలైజర్స్ యజమాని శివరామకృష్ణకు అందిన పరిహారం, శివరామకృష్ణ షాపులో పనిచేసే వర్కర్ తల్లి శివసామ్రాజ్యానికి అందిన నష్టపరిహారం

పరిహారం.. ఫలహారం

(5వ పేజీ తరువాయి)

ఖాతాలకు జమ అయ్యింది. ఈకేవైసీ వేలి ముద్రలు లేకున్నా, బ్యాంకు ఖాతా నెంబర్‌కు లింకైన ఆధార్‌కార్డు అందిస్తే చాలనే ప్రభుత్వ వెసులుబాటును అధికారులు, సిబ్బంది తెలివిగా ఉపయోగించుకున్నారు. అవినీతి, అక్రమాలకు తెరలేపారు. లంకల్లో ఒక్కో సర్వే నెంబరు కింద వందల ఎకరాలు ఉండటం కూడా వీరికి కలిసొచ్చింది. తమ బంధువులు, సన్నిహితులు, ఎరువులు, పురుగు మందుల దుకాణాల యజమానుల ఆధార్‌కార్డులు సేకరించేసి పంటల నష్టపరిహారాన్ని పక్కదారి పట్టించారు. అయితే, కొందరు నిజమైన వరద బాధిత రైతులకు నష్టపరిహారం అందలేదు. రైతులు ఆర్ఎస్‌కేలకు వెళ్లగా, సమయం దాటిపోయిందని సమాధానమిచ్చారు. అయితే, తోట్లవల్లూరుకు చెందిన బాధిత రైతులు.. వరద బాధిత జాబితా కావాలని అధికారులను నిలదీశారు. వ్యవసాయ, తహసీల్దార్ కార్యాలయం వద్ద లబ్ధిదారుల జాబితా ప్రదర్శించాల్సి ఉండగా, అధికారులు గుట్టుగా ఉంచారు. దాంతో బాధిత రైతులు సమాచార హక్కు చట్టం ద్వారా జాబితా సేకరించారు. వారంతా జాబితాలోని పేర్లు పరిశీలించడంతో ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చింది.

అధికారులదే ప్రధాన పాత్ర

ఈ అవినీతి బాగోతంలో వ్యవసాయ సిబ్బందితో పాటు రెవెన్యూ అధికారుల పాత్ర కూడా ఉందని తెలుస్తోంది. ఫీల్డుకు వెళ్లినప్పుడు పొలం ఏ రైతుదో వీఆర్వో నిర్ధారిస్తాడు. ఏ పంట ఉందో నమోదు చేసే బాధ్యత అగ్రికల్చర్ అసిస్టెంట్‌ది. వీరు జాబితా రూపొందించాక వ్యవసాయ, ఉద్యాన అధికారులు, తహసీల్దార్ సంతకం చేసి ప్రభుత్వానికి పంపిస్తారు. కానీ, ఎలాంటి పరిశీలన చేయకుండానే అధికారులు జాబితాలను ఆమోదించి ప్రభుత్వానికి పంపారు. వ్యవసాయాధికారి జి.నాగేశ్వరరావు మాత్రం సైట్ లాగిన్ వీఏఏల చేతుల్లోనే ఉంటుందని చెబుతున్నారు. తప్పులు జరిగిన మాట వాస్తవమేనని ఆయన అంగీకరిస్తున్నారు. కాగా, ఆ నిర్వాకంలో పాత్రధారులైన అధికారులు, సిబ్బంది సస్పెన్షన్లే కాకుండా, గుర్తించిన అవినీతి సొమ్మును రికవరీ చేయాలని రైతులు కోరుతున్నారు.

మాకు పరిహారం రానట్టేనా?

- అక్కినేని వినోద్, తోట్లవల్లూరు రైతు

పంట నష్టపరిహారం రాని 40 మంది బాధిత రైతులందరం జిల్లా అధికారులకు పూర్తి వివరాలతో వినతిపత్రాలు ఇచ్చాం. ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. నేను మూడు ఎకరాల పసుపు, నాలుగు ఎకరాల కంద, ఎకరం గుమ్మడితోట వేసి వరదలకు నష్టపోయాను. కానీ, ఎకరం కందకు, ఎకరం పసుపుకు మాత్రమే పరిహారం వచ్చింది. పంటలు సాగు చేయని, రైతులు కానివారికి చక్కగా పరిహారం ఇప్పించిన అధికారులు నిజమైన రైతులకు ఎందుకు ఇవ్వరు...?

దరఖాస్తుల ఆహ్వానం

కృష్ణలంక : ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎస్ఈఈడీఏపీ), డీఆర్డీఏ సంయుక్త ఆధ్వర్యంలో పీఎం ఫార్మలైజేషన్ ఆఫ్ ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్ఎంఈ) పథకం కింద జిల్లా రిసోర్స్ పర్సన్స్ ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా రిసోర్స్ పర్సన్స్‌గా నియమించడం జరుగుతుందన్నారు. మండలానికి ఇద్దరు రిసోర్స్ పర్సన్లను ఎంపిక చేయనున్నట్టు తెలిపారు. 2024, నవంబరు 1 నాటికి 21-30 ఏళ్లు నిండి, డిగ్రీ చదివిన యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవచ్చని, స్మార్ట్ ఫోన్, ఇంటర్నెట్, కంప్యూటర్ పరిజ్ఞానం వుండాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ లేదా నేచురల్ డెవలప్‌మెంట్ కార్యకలాపాల్లో అనుభవమున్నవారికి లేదా స్థానిక మండలాల వారికి ప్రాధాన్యత వుంటుందన్నారు. హెచ్‌టీటీపీఎస్://ఫార్మ్స్.జీఎల్ఈ/34టీడబ్ల్యూటీఎస్‌క్యూవీ8ఐఎస్‌యుఎంవీ8పీ6 లింక్ ద్వారా ఈనెల 8లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు 8019099919లో సంప్రదించాలన్నారు.

పాలీటెక్ ఫెస్ట్ ప్రారంభం 249 ప్రాజెక్టులు ప్రదర్శన.. నేడు మంత్రి లోకేశ్ సందర్శన

అమరావతి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యాశాఖ చేపట్టిన రాష్ట్ర స్థాయి పాలీటెక్ ఫెస్ట్ సోమవారం విజయవాడలో ప్రారంభమైంది. గతేడాది జిల్లా స్థాయిల్లో జరిగిన ప్రదర్శనల్లో 1302 ప్రాజెక్టులను పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రదర్శించగా, వాటిలో 249 ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయి ఫెస్ట్‌లో ప్రదర్శించారు. సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ గణేశ్ కుమార్ ఫెస్ట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విజేతలను పారదర్శక విధానంలో ఎంపిక చేస్తామన్నారు. ఇలాంటి కార్యక్రమాల్లో విద్యార్థులు ఎక్కువగా పాల్గొని సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు చేసే ప్రయత్నం చేయాలని కోరారు. ఐవోటీ, డ్రోన్లు, సౌరశక్తి, రిమోట్ సెన్సింగ్, ఏఐ, బ్లూటూత్ తదితర సాంకేతికతలతో ఈ ప్రాజెక్టులను విద్యార్థులు రూపొందించారు. కాగా, మంగళవారం మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ ఫెస్ట్‌ను సందర్శించనున్నారు. కాగా, ఉదయం 10గంటలకు ఫెస్ట్ ప్రారంభం కావాల్సి ఉండగా డైరెక్టర్ సమయానికి రాకపోవడంతో గంటన్నర ఆలస్యంగా ప్రారంభమైంది. డైరెక్టర్‌కు స్వాగతం పలికేందుకు ఎన్‌సీసీ యూనిఫాంతో గంటకు పైగా విద్యార్థులు ఎదురుచూశారు.


విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టును పరిశీలిస్తున్న సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ గణేశ్ కుమార్

సంక్రాంతి దందా

(5వ పేజీ తరువాయి)

బస్‌చార్జీ రూ.1,999గా నిర్ణయించారు. యోలో బస్ (బెంజ్) అయితే ఏకంగా రూ.2,900 ఉంది. ఎలక్ట్రిక్ బస్సుల ధర కూడా పెరిగింది. రూ.450 నుంచి రూ.900కు పెంచేశారు. విజయవాడ నుంచి చెన్నైకు రికార్డు స్థాయిలో రూ.3,500గా నిర్ణయించారు. వైఎస్ఆర్ ట్రావెల్స్ అనే సంస్థ ఏసీ సీటర్/ఏసీ స్లీపర్ సర్వీసుకు రూ.8,000 చార్జీ వసూలు చేస్తోంది. విజయవాడ నుంచి బెంగళూరుకు కూడా రికార్డు స్థాయిలో రూ.2,100 ధర నిర్ణయించారు. లోకల్ ట్రావెల్స్ అయితే రూ.2,500 నుంచి రూ.2,800 వరకు పెంచారు. విజయవాడ నుంచి విశాఖపట్నం వెళ్లే ప్రైవేట్ బస్సుల్లో కూడా భారీగా ధరలను పెంచేశారు. ఆన్‌లైన్ ఆపరేటర్స్‌తో పాటు లోకల్ ఆపరేటర్లు కూడా రూ.2,500 మేర వసూలు చేస్తున్నారు.



సంచార వైద్య సేవల వాహనం ప్రారంభం



ప్రభుత్వాసుపత్రి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విజయవాడ సిద్ధార్థ ప్రభుత్వ వైద్య కళాశాల, సమాజ వైద్య విభాగం తరుపున గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సర్వేలు, ఆరోగ్య శిబిరాలు, ఫీల్డ్ పర్యటనలు నిర్వహించేందుకు సంచార వాహనాన్ని సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అశోక్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ రజని, సత్యనారాయణ, శ్రీకాంత్, విజయలక్ష్మి, పి.మాధవి, తదితరులు పాల్గొన్నారు.

రన్నింగ్ విజేత నిషా షోకు అభినందన

విజయవాడ కల్చరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ఈ నెల 2న జరిగిన 59వ క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్స్-2025 6 కిలోమీటర్ల రన్నింగ్‌లో శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాల విద్యార్థిని నిషా షో(జూనియర్ ఇంటర్) పతకం గెలిచి నేషనల్ క్రాస్ కంట్రీ మీట్‌కి సెలక్ట్ అయ్యింది ఈ సందర్భంగా నిషా షోను కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ అభినందించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు నిషా షోని అభినందించారు.

పేదల సంక్షేమమే ప్రధాన ఎజెండా

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

గుణదల, జనవరి 6(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ప్రధాన ఎజెండాగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. 6వ డివిజన్ పరిధి మారుతీనగర్లో సోమవారం ఉదయం గద్దె రామ్మోహన్ పర్యటించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా ఉంటున్న విభిన్న ప్రతిభావంతుడు సత్యనారాయణకు స్వయం ఉపాధి కింద రూ. 25వేల ఖరీదు చేసే బడ్డీకొట్టును ఆయన సమకూర్చారు. ప్రభుత్వం నుంచి సంక్షేమ ఫలాలు కూడా సత్యనారాయణకు అందేలా కృషి చేస్తామని తెలిపారు. పూటగడవని వారికి ఉపాధి కల్పించే విషయంలో గద్దె మొదటి స్థానంలో ఉంటున్నారని 6వ డివిజన్ అధ్యక్షుడు పడాల గంగాధర్ అన్నారు. ఈ కార్యక్రమంలో 2వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు దాసరి గాబ్రియేలు, కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, స్థానిక నేతలు ముత్యాల కృష్ణ కిషోర్, పల్లి దుర్గాప్రసాద్, పి.మోహనరావు, వి.కేశవ్, టి.బాబూరావు, కె.అక్షిత, షేక్ షకీల తదితరులు పాల్గొన్నారు.



బడ్డీకొట్టు అందజేస్తున్న ఎమ్మెల్యే గద్దె

ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలి

భారతీయ యువశక్తి ట్రస్ట్ చాప్టర్ చైర్మన్ మోహనరావు సూచన

లబ్బీపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మహిళలు చాలా శక్తివంతులని, వారు తలచుకుంటే వేరొకరికి ఉపాధి కల్పించ గలిగిన స్థాయికి ఎదగ గలరని భారతీయ యువ శక్తి ట్రస్ట్ చాప్టర్ చైర్మన్ పువ్వాడ మోహనరావు అన్నారు. సిద్ధార్థ మహిళా కళాశాలలో కళాశాల వాణిజ్య, మేనేజ్‌మెంట్ విభాగం, ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్స్ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో నేషనల్ స్టార్టప్ డే సందర్భంగా సోమవారం ఉమెన్ ఇన్ స్టార్టప్ బ్రేకింగ్ బెరిమర్స్ అండ్ బిల్డింగ్ ఎంపైర్స్ అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎంట్రప్రెన్యూర్‌గా ఎదగడానికి అవకాశం ఉన్న అన్ని మార్గాలు ఉపయోగించుకుని ఇతరులకు ఉపాధిని కలిగించే స్థాయికి ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీనియర్ మేనేజర్ ఎం.శ్రీరామారావు, పొట్లూరి వెంకటేశ్వరరావు, ఆర్.లలిత, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన, స్పెషల్ ఆఫీసర్ ఆర్.మాధవి పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న పువ్వాడ మోహనరావు

ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించండి

కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర

చిట్టినగర్, జనవరి 6(ఆంధ్రజ్యోతి) : ప్రజల నుంచి వచ్చే సమస్యల అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని నగర కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. నగరంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను అర్జీలుగా కమిషనర్‌కు అందజేశారు. మొత్తం 10 ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమం అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్) డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ జి. సృజన, చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఇన్‌చార్జి డాక్టర్ సురేష్‌బాబు, ఎస్టేట్ ఆఫీస్ ఇన్‌చార్జి డాక్టర్ లత తదితరులు పాల్గొన్నారు.



ప్రజల అర్జీలు పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

విధుల్లోకి తీసుకోవాలని వలంటీర్ల నిరసన

ప్రభుత్వం తమను తక్షణమే విధుల్లోకి తీసుకొని బకాయి జీతాలు వెంటనే ఇవ్వాలని కోరుతూ సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ ధ్యానచంద్రను పలువురు వలంటీర్లు కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ 10వేల జీతం ఇవ్వాలని, న్యాయం చేయకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తాం ఎమ్మెల్యేలు, మంత్రుల ఇంటిని ముట్టడిస్తాం అంటూ పెద్ద ఎత్తున్న నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వలంటీర్లు, ఏఐవైఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వీఎంసీ ఎదుట నిరసన తెలుపుతున్న వలంటీర్లు

కాంట్రాక్ట్ కార్మికులకు ప్రాధాన్యత కల్పించాలని వినతి

కాంట్రాక్ట్ కార్మికులకు నగరపాలక సంస్థ పారిశుధ్య పోస్టులలో ప్రాధాన్యత కల్పించాలని విజయవాడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బుద్దె రాజా, మినిస్టీరియల్ ఆల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు దారా రాంబాబులు అన్నారు. సోమవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్రని కలిసి వినత పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సుమారు 60 మంది కాంట్రాక్టు కార్మికులు ఐదేళ్లుగా నగరంలో జరుగుతున్న పెద్దపెద్ద కార్యక్రమాలలో పని చేస్తున్నారన్నారు. నగరపాలక సంస్థ నుంచి అదనంగా తీసుకోనున్న పారిశుధ్య కార్మికుల పోస్టులకు సీనియారిటీ ప్రకారం వీరిని తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు జక్కి. జేమ్స్, నాయకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమయస్ఫూర్తితో లక్ష్యాన్ని ఎంచుకోవాలి



విదేశీయులతో కళాశాల యాజమాన్యం

భారతీనగర్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సమయస్ఫూర్తితో సరైన లక్ష్యాన్ని ఎంచుకోవాలని వక్తలు ఉద్ఘాటించారు. ఆంధ్రా లయోలా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఐక్యూఏసీ సెల్ కన్వీనర్ క్యాండీ ఆధ్వర్యంలో కళాశాల సెమినార్ హాలో సరైన లక్ష్యాన్ని ఎన్నుకోవడం అంశంపై సోమవారం సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా అమెరికా దేశంలోని ఫ్లోరిడాకి చెందిన సబ్రీనా, లారీ, హోళి, జిమ్, కార్ల, ఎమిలీ, కారెన్, పాట్రిక్, ఫాదర్ రాజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ విద్యార్థులు ఎంచుకునే లక్ష్యమే వ్యక్తిగత, వృత్తిపరమైన అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఫాదర్ బి. జోజిరెడ్డి, విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

ఆటోనగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ డిపోకు సంబంధించిన దూర ప్రాంతాల సర్వీసుల సలహాలు, సూచనలకు డయల్ యువర్ డీఎంను మంగళవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కె. ప్రవీణ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సలహాలు, సూచనలకు 99592 25463ను సంప్రదించాలని కోరారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

ప్రభుత్వాసుపత్రి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మాచవరం వాకర్స్ అసోసియేషన్ (ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాల) 2025-26 నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. నూతన కార్యవర్గం సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షుడిగా పొట్లూరు సుబ్బారావు, మహిళా అధ్యక్షురాలిగా ఆర్.కృష్ణవేణి, కార్యదర్శిగా చుండూరు నాగరాజు, కార్యనిర్వాహక కార్యదర్శిగా రంగ శ్రీనివాస్, కోశాధికారులుగా చెపేని వెంకటేశ్వరరావు, డాక్టర్ సుభాని, ఉపాధ్యక్షునిగా బి.వెంకట రెడ్డి, ఎన్.శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులుగా మేక సుబ్బారావు, సుధాతో పాటు మరో 15 మంది కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

మైక్రో డేటా రీసెర్చ్ సెంటర్ ప్రారంభం

మొగల్రాజపురం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పీబీ సిద్ధార్థ కళాశాలలో స్టాటిటిక్స్ విభాగంలో మైక్రో డేటా రీసెర్చ్ సెంటర్‌ను ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె. మధుమూర్తి, జనాభా లెక్కల ఆపరేషన్ ఏపీ, తెలంగాణా డైరెక్టర్ భారతీ హరాల్లికర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు డేటా వర్క్ స్టేషన్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో టీఎల్ఎస్ శివకుమార్, డిప్యూటీ రిజిస్ట్రార్ జనరల్ (సీ అండ్ టీ) నోడల్ అధికారి , కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, వివిధ కళాశాలల స్టాటిస్టిక్స్ లెక్చరర్స్ పాల్గొన్నారు.



డేటా వర్కుస్టేషన్ ప్రారంభం సందర్భంగా ప్రొఫెసర్ కె. మధుమూర్తి, భారతీ హుల్లికర్, స్టాటిస్టిక్స్ లెక్చరర్స్ తదితరులు

పొదుపు సంఘాల అభివృద్ధిపై సమీక్ష



ఆర్పీలతో సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

లబ్బీపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతే లక్ష్యంగా పొదుపు సంఘాల అభివృద్ధికి మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలతో 16వ డివిజన్‌లోని కమ్యూనిటీ హాల్‌లో సోమవారం ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటనారాయణ ఆర్పీలతో విక్టరీ టౌన్ లెవెల్ ఫెడరేషన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడం ఎలా, వారు తీసుకున్న రుణాలతో వారికి ఉపాధి ఎలా కలుగుతుంది వంటి విషయాలపై చర్చించారు. విక్టరీ సమైక్య వారు తీసుకున్న రుణాలు, పొదుపు, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలపై సభ్యులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో విక్టరీ టౌన్ లెవెల్ ఫెడరేషన్ అధ్యక్షురాలు గాయత్రి, జిల్లా సమైక్య ప్రెసిడెంట్ మీనాక్షి, నగరపాలక సంస్థ సీవోలు, ఆర్పీలు పాల్గొన్నారు.

పొలం కాగితాలు కాజేసి రూ. 8 కోట్లకు టోకరా

అజిత్‌సింగ్‌నగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : పొలం కాగితాలు కాజేసి ఫోర్జరీ సంతకాలతో ఓ బిల్డర్‌ను రూ. 8 కోట్లకు మోసం చేసిన వ్యక్తిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. అయోధ్యనగర్‌కు చెందిన బిల్డర్ మధిర రాముకు గుంటూరు జిల్లాలో రెండు ఎకరాల పొలం ఉంది. పొలం కాగితాలు జీపీ మీద ఉండటంతో గత ఏడాది సేల్ డీడ్ చేయించుకునేందుకు తెలిసిన వ్యక్తి కోనా ఇమ్మానియేల్‌ను తోడు తీసుకెళ్లాడు. రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ అనంతరం సేల్ డీడ్ కాగితాలు రావడానికి నాలుగు రోజులు సమయం పడుతుందని సిబ్బంది చెప్పడంతో కాగితాలు తాను తీసుకువస్తానని ఇమ్మానియేల్ బిల్డర్‌ను నమ్మబలికాడు. అనంతరం సేల్ డీడ్ కాగితాలను తీసుకెళ్లిన ఇమ్మానియేల్ బిల్డర్‌కు ఇవ్వకుండా తన వద్ద ఉంచుకున్నాడు. తర్వాత సదరు కాగితాలను ఫోర్జరీ సంతకాలతో ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో ఎంవోడీ చేసి రూ. 8 కోట్లు రుణం తీసుకున్నాడు. విషయం తెలుసుకున్న బిల్డర్ అదేమని ప్రశ్నిస్తే కాగితాలు త్వరలో ఇచ్చేస్తానని నమ్మబలికి ఇవ్వకుండా కాలయాపన చేస్తూ వచ్చాడు. దీంతో బాధితుడు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కుంగిన సిమెంట్ చప్టా

పటమట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : పటమట దర్శిపేట కార్పొరేషన్ పార్కు పక్కనే డ్రెయినేజీ మీద సిమెంట్ పలక కుంగిపోయి విరిగిపోవడానికి సిద్ధంగా ఉంది. ఈ మార్గంలో రోజూ వేల మంది ప్రయాణం చేస్తూ ఉంటారు. ఎస్ఎస్ఎం పాఠశాలకు తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ రోడ్డులోనే తీసుకెళ్తుంటారు. రామలింగేశ్వర్‌నగర్ నుంచి పటమట సెంటర్‌కు ఈ మార్గంలోనే ప్రయాణం చేస్తుంటారు. ప్రమాదం జరగకముందే సిమెంట్ పలకలను మార్చాలని స్థానికులు కోరుతున్నారు.



దర్శిపేట పార్కు పక్కన కుంగిపోయిన సిమెంట్ పలక

హెల్పింగ్ హాండ్స్ వితరణ



ఆటోనగర్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కండ్రికకు చెందిన దివ్యాంగురాలు షేక్ బిబులు జీవనోపాధి కోసం మొబైల్ ట్రై సైకిల్‌ను హెల్పింగ్ హాండ్స్ వెంకట్ సోమవారం అందజేశారు. ఈ మొబైల్ ట్రై సైకిల్‌లో టీ, స్నాక్స్ విక్రయించుకునే విధంగా మార్పులు చేసినట్లు వెల్లడించారు.

పోటీ పరీక్షలపై అవగాహన

లబ్బీపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ నిర్వహించే గేట్, ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీస్ పోటీ పరీక్షలపై సాయిమేధా కోచింగ్ సెంటర్‌లో సోమవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ డాక్టర్ జి.రమణ, కోచింగ్ సెంటర్ డైరెక్టర్ మజ్జిగ బాలకృష్ణ పాల్గొన్నారు.

జగన్ పాపాలు పండే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి

బెజవాడ నజీర్

పటమట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జగన్, అతని గ్యాంగ్ చేసిన పాపాలు పండే రోజులు దగ్గరలోనే ఉన్నాయని టీడీపీ నాయకులు బెజవాడ నజీర్ హెచ్చరించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రభుత్వ అధికారులను బెదిరించిన జగన్ గ్యాంగ్ అక్రమాల చిట్టా ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయని ఆయన మండిపడ్డారు. సోమవారం నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో నజీర్ మాట్లాడుతూ వందల కోట్ల ఆస్తులను అక్రమంగా రాయించుకున్న జగన్ గ్యాంగ్ అధికారులను బెదిరిస్తుండటంతో ప్రాణభయంతో ఓ సబ్ రిజిస్ట్రార్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మంత్రి లోకేష్‌కు స్కామ్‌లు గురించి లేఖ రాశారన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో కేబీఎన్ ప్రతిభ



వన్‌టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ గ్లోబల్ ప్రొఫెషనల్ సర్వీసెస్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తమ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి చెప్పారు. తమ కళాశాలలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు మొత్తం 21 మంది 3.44 లక్షల వార్షిక ప్యాకేజీతో ఎంపికయ్యారన్నారు. ప్రత్యేక శిక్షణ ఇవ్వడం ద్వారా విద్యార్థులు మంచి మార్కులు సాధించినట్లు ప్లేస్‌మెంట్ అధికారి శ్రీనివాసరెడ్డి చెప్పారు. సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో హిందూ హైస్కూల్స్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి డాక్టర్ వి.నారాయణ రావు, వైస్ ప్రిన్సిపాల్స్ పి.ఎల్.రమేష్, డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, డాక్టర్ కె.రామకృష్ణ ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించి, సత్కరించారు.

రౌడీషీటర్ అరెస్ట్ : 3 కిలోల గంజాయి స్వాధీనం

సత్యనారాయణపురం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): సత్యనారాయణపురం పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం పోలీసులు రౌడీషీటర్‌ను అదుపులోకి తీసుకొని మూడు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం ఖుద్దుస్‌నగర్ మట్టిరోడ్డులో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా సంచరిస్తున్నాడని సీఐ లక్ష్మీనరాయణకు వచ్చిన సమాచారం మేరకు అక్కడకు వెళ్లిన సిబ్బంది ఆ ప్రాంతంలో ఉన్న తుమ్మల మనోజ్(25)ను తనిఖీ చేయగా అతని వద్ద మూడు కిలోల గంజాయి దొరికింది. మధ్యవర్తుల సమక్షంలో అతనిని అదుపులోకి తీసుకోని పోలీసులు కేసు నమోదు చేసి అతనిని కోర్టుకు హాజరు పరిచారు. సత్యనారాయణపురం ఎన్నార్పీరోడ్డులో ఉంటున్న మనోజ్‌పై సత్యనారాయణపురం పోలీసు స్టేషన్‌లో రౌడీషీటు ఉందని పోలీసులు తెలిపారు.



మరమ్మతుల తర్వాత తారు రోడ్డు

థ్యాంక్స్... ఎమ్మెల్యే సార్..

పటమట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఐదేళ్లుగా గోతులతో ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేయించిన ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌కు థ్యాంక్స్ అంటూ వివేకానంద కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. పటమట పోలీస్ స్టేషన్ నుంచి కోనేరు రమాదేవి రోడ్డు , ఆటోనగర్ 100 అడుగుల రోడ్డుకు వెళ్లే మార్గం పూర్తిగా పాడైపోయింది. ఈ రోడ్డు గురించి రెవెన్యూ సదస్సులో స్థానిక ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ దృష్టికి తీసుకెళ్లగా, స్పందించిన ఆయన నాలుగైదు రోజుల్లోనే రోడ్డుకు మరమ్మతుల చేయించి వినియోగంలోకి తీసుకువచ్చారని ఆర్ఆర్ గార్డెన్, వివేకానంద కాలనీకి చెందిన బొలిశెట్టి అన్నపూర్ణ, కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు.



జ్యోతి వెలిగిస్తున్న మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

ఘనంగా జాతీయ వాలీబాల్ స్కూల్ గేమ్స్ పోటీలు

- ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి కందుల, ఎమ్మెల్యే గద్దె

విజయవాడ స్పోర్ట్సు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మొగల్రాజపురంలో పీబీ సిద్ధార్థ జూనియర్ కళాశాల వేదికగా 68 జాతీయ వాలీబాల్ స్కూల్ గేమ్స్ అండర్-19 బాలికల టోర్నీ అట్టహాసంగా సోమవారం ప్రారంభమైంది. ఐదు రోజుల పాటు సాగే ఈ పోటీలను పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌లు క్రీడాకారుల నుంచి గౌరవవందనం స్వీకరించారు. అనంతరం పోటీల డిక్లరేషన్‌ను గద్దె ప్రకటించారు. రాష్ట్రంలో క్రీడలకు చంద్రబాబు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని వారు అన్నారు. శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు మాట్లాడుతూ అంతర్జాతీయ, జాతీయ క్రీడల్లో సత్తా చాటిన క్రీడాకారులకు రూ.7కోట్ల వరకు నగదు ప్రోత్సాహకాలను ఈ సారి క్రీడా విధానంలో ప్రకటించామన్నారు. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో మ్యాచ్‌లు ఉత్కంఠగా ప్రారంభం అయ్యాయి. మొత్తం 25 రాష్ట్రాల టీమ్‌లు బరిలో దిగాయి. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి భానుమూర్తిరాజు, శాప్ మాజీ ఛైర్మన్ అంకమ్మ చౌదరీ, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి వి రవికాంత, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి దోనేపూడి దయాకర్, కళాశాల ప్రిన్సిపాల్ చుండీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



హోరాహోరీగా తలపడుతున్న ఆంధ్రప్రదేశ్, ఉత్తరాఖండ్ క్రీడాకారిణులు

ప్రొటోకాల్ పంచాయితీ!

దుర్గగుడిలో పోలీస్ ప్రొటోకాల్ పంచాయితీ నడుస్తోంది. పోలీస్ ఉన్నతాధికారులకే పరిమితమైన ప్రొటోకాల్ దర్శనాలను ప్రైవేటు వ్యక్తులకూ చేయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు ప్రొటోకాల్ కానిస్టేబుళ్లు. అయితే తమకు దుర్గగుడిపై ప్రొటోకాల్ విధులు కేటాయించాలని ట్రాఫిక్, క్రైమ్ విభాగాల వారూ పట్టుబట్టడంతో ఈ వ్యవహారం పోలీస్ ఉన్నతాధికారుల వద్దకు చేరింది. ఇంద్రకీలాద్రిపై భద్రతను గాలికొదిలేసిన పోలీస్‌శాఖ ప్రొటోకాల్ విధుల కోసం మాత్రం పోటీపడటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- విజయవాడ/వన్‌టౌన్ - ఆంధ్రజ్యోతి

ఇంద్రకీలాద్రిపై నిబంధనలకు విరుద్ధంగా దర్శనాలు చేయిస్తున్న ప్రొటోకాల్ కానిస్టేబుళ్లు

- విధుల్లో నలుగురు కానిస్టేబుళ్లు
- తమకు విధులు కేటాయించాలని ట్రాఫిక్, క్రైమ్ విభాగాల పట్టు
- పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి వ్యవహారం



ఇంద్రకీలాద్రికి వచ్చే పోలీస్ ఉన్నతాధికారులు, ఇతర అధికారుల కుటుంబాలను దుర్గమ్మ దర్శనానికి తీసుకువెళ్లేందుకు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి నలుగురు కానిస్టేబుళ్లను దుర్గగుడిపై ప్రొటోకాల్ బాధ్యతల్లో నియమిస్తుంటారు. వన్‌టౌన్ సీఐ ఆదేశాల మేరకు దేవస్థానానికి వచ్చే ఉన్నతాధికారులు, ఇతర అధికారులకు వారి కుటుంబ సభ్యులకు అమ్మవారి దర్శనం చేయించే బాధ్యత ఆ నలుగురు కానిస్టేబుళ్లు చూస్తుంటారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని కొండపై ప్రొటోకాల్ డ్యూటీ నిర్వహించే వారిలో ఇద్దరు కానిస్టేబుళ్లు నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు వ్యక్తులకూ అమ్మవారి దర్శనం చేయించి వారి నుంచి డబ్బులు తీసుకుంటున్నట్టు ఇటీవల ఆరోపణలు వచ్చాయి. నిబంధనల ప్రకారం ఉన్నతాధికారులు, అధికారుల వివరాలను వన్‌టౌన్ స్టేషన్ నుంచి కొండపైనున్న ప్రొటోకాల్ సిబ్బందికి తెలపాలి. అలాగే దేవస్థానం సమాచార కేంద్రంలోనూ తెలియపరచాలి. అయితే సమాచార కేంద్రంలో చెప్పకుండా ప్రొటోకాల్ సిబ్బంది పదుల సంఖ్యలో భక్తులను తీసుకువెళుతూ దర్శనం చేయిస్తున్నారు. దీనిపై ఇటీవల దేవస్థానం అధికారులు పోలీస్ అధికారులకు సమాచారం ఇచ్చినట్టు తెలిసింది.

మాకూ ప్రొటోకాల్ విధులు..!

వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సిబ్బందే ప్రొటోకాల్ విధులు నిర్వహిస్తుండటం తొలి నుంచీ వస్తున్న ఆనవాయితీ. అయితే ఇటీవల వన్‌టౌన్ ట్రాఫిక్, క్రైమ్ విభాగాల అధికారులు కూడా తమ విభాగాలకు చెందిన సిబ్బందిని దుర్గగుడిపై ప్రొటోకాల్ విధుల్లో నియమించేందుకు సిద్ధమవ్వడం గమనార్హం. ఈ మేరకు దుర్గగుడి అధికారులను కూడా కోరారు. అయితే ఈ విషయంపై పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో పశ్చిమ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ (ఏసీపీ) వద్దకు ప్రొటోకాల్ పంచాయితీ చేరింది. ట్రాఫిక్, క్రైమ్ విభాగాల సిబ్బందిని దుర్గగుడిపై ప్రోటోకాల్‌లో నియమించేందుకు ఏసీపీ నిరాకరించారు. దీంతో ఈ పంచాయితీ ఉన్నతాధికారుల వద్దకు చేరినట్టు సమాచారం.

దర్శనాలకే ప్రొటోకాల్ సిబ్బంది పరిమితం

దేవస్థానంలో విధులు నిర్వహించే వన్‌టౌన్ పోలీసులు కేవలం తమ శాఖకు చెందిన వారిని అమ్మవారి దర్శనం చేయించటమే తప్ప దేవస్థానంలో భక్తుల భద్రత గురించి పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో కొండపైన, కొండ దిగువన పోలీస్ నిఘా ఉండేది. లా అండ్ ఆర్డర్, క్రైమ్ విభాగం సిబ్బంది నిఘా బాధ్యతల్లో ఉండేవారు. ప్రస్తుతం కొండపైన, కొండ కింద క్రైం సిబ్బంది కనిపించడం లేదు. కేవలం ప్రొటోకాల్ సిబ్బంది మాత్రమే విధులు నిర్వహిస్తూ తమ శాఖకు చెందిన వారికి దర్శనం చేయించటానికి, డబ్బులు తీసుకుని ప్రైవేటు వ్యక్తులకు దర్శనాలు చేయించడానికే పరిమితమవుతున్నారు. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు నెలల తరబడి అన్నదాన విభాగంలో భోజనం చేస్తూ కొండపైనే ఉంటున్నారు. అలాంటి వారి గురించి వీరు పట్టించుకోవడం లేదని సిబ్బంది బహిరంగంగా ఆరోపిస్తున్నారు. రద్దీ వేళల్లో దొంగతనాలు జరిగినా పట్టించుకునే నాథుడే లేడని విమర్శలు వినిపిస్తున్నాయి. పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి దేవస్థానంపై పోలీస్ నిఘా ఏర్పాటు చేయాలని దేవస్థానం ఉద్యోగులు, భక్తులు కోరుతున్నారు.

ఎన్టీఆర్ జిల్లా ఓటర్లు 17,06,983

- పురుష ఓటర్లు 8,31,839
- మహిళా ఓటర్లు 8,74,992 మంది
- ఇతర ఓటర్లు 152
- జిల్లా వ్యాప్తంగా 1792 పోలింగ్ కేంద్రాలు

ఆంధ్రజ్యోతి, విజయవాడ: ఎన్టీఆర్ జిల్లా తుది ఓటర్ల జాబితాను ఎన్నికల అధికారులు విడుదల చేసింది. ఎస్ఎస్ఆర్ - 2025 ప్రకారం జిల్లావ్యాప్తంగా మొత్తం 17,06,983 మంది ఓటర్లున్నారు. పురుష ఓటర్లు 8,31,839 మంది కాగా, మహిళా ఓటర్లు 8,74,992 మంది ఉన్నారు. పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 43,153 మంది ఎక్కువగా ఉన్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ మహిళా ఓటర్లదే హవాగా ఉంది. జిల్లావ్యాప్తంగా థర్డ్ జెండర్ ఓటర్లు 152 మంది ఉన్నారు. జిల్లావ్యాప్తంగా 1792 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్టుగా ఎన్నికల సంఘం ప్రకటించింది.

అసెంబ్లీ	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	స్త్రీలు	థర్డ్ జెండర్	మొత్తం ఓటర్ల సంఖ్య
తిరువూరు	234	102182	105412	6	207600
విజయవాడ వెస్ట్	253	126865	129683	33	256581
విజయవాడ సెంట్రల్	267	134963	142975	50	277988
విజయవాడ ఈస్ట్	298	132388	138118	24	270530
మైలవరం	296	137212	145450	20	282682
నందిగామ	222	99513	106177	5	205695
జగ్గయ్యపేట	222	98716	107177	14	205907
మొత్తం	1792	831839	874992	152	1706983

రిటైర్డ్ ఉద్యోగులకు మెడికల్ స్కీమ్‌పై ఈయూ హర్షం

వన్‌టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా రవాణా సంస్థలో పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు మెడికల్ స్కీమ్‌ను అమలు చేసేందుకు ప్రభుత్వం అనుమతివ్వటంపై ప్రజా రవాణా సంస్థ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం ఉద్యోగులు ఈ పథకం కింద ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొందరు ఉద్యోగులకు ప్రతినెలా జీతంలో రూ.225 చొప్పున రికవరీ అవుతుందని, మొత్తంగా రూ.38,575 అవుతుందని, మరికొంతమంది ఉద్యోగులు నెలకు రూ.300 చొప్పున చెల్లిస్తున్నారని, వీరి మొత్తం రూ.51,425 అవుతుందన్నారు. ఒకేసారి మొత్తం డబ్బులు చెల్లించిన వారికి మాత్రమే స్కీమ్ వర్తిస్తుందని ఆర్టీసీ ప్రభుత్వం విలీనమైన తరువాత పదవీ విరమణ చేసిన వారందరికీ సుమారు 4వేల మందికి ఈ ప్రయోజనం చేకూరుతుందన్నారు. జీవో విడుదల చేసిందని ఉన్నతాధికారులకు, మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్..

బస్టేషన్: పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు హెల్త్ స్కీమ్ అమలు చేయటం హర్షదాయకమని ప్రజా రవాణా సంస్థ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పుట్టపర్తి వెంకట రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి, రవాణ శాఖ మంత్రి, ఆరోగ్య శాఖ మంత్రి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి. కృష్ణబాబు, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుకు వారు ధన్యవాదాలు తెలిపారు.

వన్‌మెన్ కమిషన్‌ను వ్యతిరేకిస్తున్నాం

- మాల సంఘాల జేఏసీ ఛైర్మన్ దేవిశ్రీప్రసాద్

భారతీనగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన అపాయింట్మెంట్ ఆఫ్ వన్‌మెన్ కమిషన్‌ను, కండక్ట్ ఆఫ్ సోషల్ ఆడిట్ జీవోలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు అఖిల భారత మాల సంఘాల జేఏసీ ఛైర్మన్ ఉప్పులేటి దేవిశ్రీప్రసాద్ అన్నారు. గురునానక్ కాలనీలోని జేఏసీ కార్యాలయంలో ఛైర్మన్ ఉప్పులేటి దేవిశ్రీప్రసాద్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం సోమవారం జరిగింది. రాజ్యాంగంలో ఏర్పాటు చేసిన రిజర్వేషన్లపై కేంద్రప్రభుత్వం మాత్రమే కవిషన్ ఆఫ్ ఎంక్వైరీ వేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హక్కు లేదన్నారు. దీనిపై హైకోర్టులో రిట్‌ఫైల్ చేశామన్నారు జేఏసీ వైస్ ఛైర్మన్ గుర్రం రామారావు, అధికార ప్రతినిధి మంచా నాగమల్లేశ్వరి, దారా దుర్గాప్రసాద్, చిన్న వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రిలో విజయవంతంగా మొదటి ప్లాక్ బ్లాకీ థెరపీ కంటి చికిత్స

పెనమలూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కంటి క్యాన్సర్ వైద్యంలో విప్లవాత్మకంగా పేర్కొనే చికిత్సను రాష్ట్రంలో మొదటిసారిగా ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారు. ఆయా వివరాలను వైద్యులు డాక్టర్ అనసూయ గంగూలీ సోమవారం వెల్లడించారు. ఈ వైద్య చికిత్స చరిత్రాత్మకమని, వినూత్న ఆవిష్కరణగా పేర్కొన్నారు. దైహిక చికిత్సల వంటి చికిత్సలు నిరుపయోగమైనప్పుడు రెటినోబ్లాస్టామా కేసుల్లో దీన్ని తరచుగా ఉపయోగిస్తారన్నారు. 2020లో ప్రారంభించి మౌలిక సదుపాయాల అభివృద్ధితో కూడిన అటామిక్ రెగ్యులేటరీ బోర్డుకు అనుగుణంగా నాలుగేళ్లపాటు చేసిన ప్రయోగాలకు ఇది ప్రతిఫలమని వ్యాఖ్యానించారు. విజయవాడ అమెరికన్ ఆంకాలజిస్టులు డాక్టర్ క్రాంతి కుమార్, డాక్టర్ రామకృష్ణ, ఫిజిసిస్ట్ సురేష్, హైదరాబాద్ అపోలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ విజయానంద్ రెడ్డి, ఫిజిసిస్ట్ పద్మగణేశన్ పాల్గొన్నారు.

జిల్లా శిష్టకరణం అసోసియేషన్ అధ్యక్షుడిగా బలివాడ

చిట్టినగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా శిష్టకరణం అసోసియేషన్ అధ్యక్షుడిగా బలివాడ శివకుమార్ పట్నాయక్ నియమితులయ్యారు. విజయవాడలో సోమవారం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రచార కార్యదర్శి సదాశివుని లక్ష్మణరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సంఘ గౌరవాధ్యక్షుడిగా వినం సుబ్బారావు, అధ్యక్షుడిగా బలివాడ శివకుమార్ పట్నాయక్‌ను నియమించారు. ప్రధాన కార్యదర్శిగా కాగాపు విజయ్ కుమార్, కోశాధికారి పట్నాయక్ ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా బలివాడ నరేంద్రబాబు, బలివాడ మల్లేశ్వరరావు, అల్లిన చక్రధర్ (చక్రి), నందివాడ గోపీ, కార్యనిర్వాహక కార్యదర్శి కొంపల్లి సంతోషిని, కార్యదర్శులుగా శేఖర్, మహంతి సతీష్, బెవర కృష్ణవేణి నియమితులయ్యారు. కంటిమంత్రి శివకుమార్ పట్నాయక్(యూత్ ప్రెసిడెంట్), కార్యవర్గ సభ్యులు బలివాడ రాజీవ్‌లత, కంటిమహంతి కల్పన, కంటిమహంతి దేవి, గుమ్మ సాయికుమార్, బలివాడ శ్రీను, కొంపల్లి గణపతిరావు, డొంకాడ నాని, పోచయ్యళి గణేష్ పట్నాయక్, మానాపురం రాజశేఖర్, బగ్గం రాజశేఖర్, ఓంద్రంగి సత్యనారాయణ, అడ్వైజరీ కమిటీ ఛైర్మన్ శేఖర్ మహంతి హేమసుందర్, అడ్వైజర్ కమిటీ సభ్యులు రఘుపాత్రుని మల్లేశ్వరరావు, మురళికృష్ణ, గోవిందరాజులు, గంగ్రెడ్డి తిరుపతిరావు, పట్నాయకుని రాధాకృష్ణ, కుప్పిలి శ్రీనివాసరావు, జగ్గుమంతి గణేష్ పట్నాయక్, జనరల్ సెక్రెటరీ కాగాపు విజయ్ కుమార్‌లు నియమితులయ్యారు.

అంగన్వాడీలకు రూ.26వేల వేతనం ఇవ్వాలి

- జిల్లా కార్యదర్శి రమాదేవి

మచిలీపట్నం టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కార్యకర్తలందరినీ రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలు నిర్ణయించాలని కృష్ణాజిల్లా అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ సంఘ ప్రధాన కార్యదర్శి ఏ రమాదేవి డిమాండ్ చేశారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఫెడరేషన్ 34వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుట్టాయిపేటలోని సీఐటీయూ కార్యాలయంలో సంఘ నేత జి.కుమారి జెండాను ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ రిటైరైన అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లకు కనీస పెన్షన్ రూ.10వేలు ఇవ్వాలన్నారు. సీఐటీయూ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు ఎం. పోలినాయుడు, బందరు మండల కార్యదర్శి సీహెచ్ జయరావు, మచిలీపట్నం ప్రాజెక్టు సంఘ అధ్యక్షురాలు టి.సుజాత, సౌజన్య మాట్లాడారు.

దుర్గగుడి ఈవోగా రామచంద్రమోహన్‌కు పూర్తి అదనపు బాధ్యతలు

వన్‌టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): దేవదాయ అదనపు కమిషనర్‌గా పనిచేస్తున్న కె.రామచంద్ర మోహన్‌ను దుర్గగుడి ఈవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ దేవదాయ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. జాయింట్ కమిషనర్ హోదాలో ఈవోగా ఆయన వ్యవహరించనున్నారు.



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరినాథ్‌కు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న డిప్యూటీ ఈవో రత్నరాజు, అర్చకులు

దుర్గమ్మ సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి

వన్‌టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మను సోమవారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలను అందజేశారు. అనంతరం ఆయన పంచహారతులు సేవలో పాల్గొన్నారు. అమ్మవారి దర్శనానంతరం వారికి డిప్యూటీ ఈవో రత్నరాజు, అర్చకులు ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు. వేదపండితులు ఆశీస్సులు అందజేశారు.

శృంగవృక్షం స్టేషన్‌లో ఆగకుండా వెళ్లిపోయిన పాసింజర్

- వెనక్కివచ్చి ప్రయాణికులను ఎక్కించుకున్నరైలు

పాలకోడేరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నర్సాపురం నుంచి విజయవాడ వెళ్లే పాసింజర్ రైలు సోమవారం ఉదయం 10.30 గంటల సమయంలో శృంగవృక్షం రైల్వేస్టేషన్‌లో ఆగకుండా ముందుకు వెళ్ళిపోయింది. స్టేషన్‌లో ప్రయాణికులు కేకలు వేయడంతో ముందుకు వెళ్లిన ట్రైన్ మళ్లీ వెనక్కు వచ్చి ప్రయాణికులను ఎక్కించుకువెళ్ళింది. ప్రతిరోజులానే నరసాపురం నుంచి విజయవాడ వైపు ఉదయం 10.30 గంటల సమయంలో పాసింజర్ రైలు వెళుతూ ఉంటుంది. శృంగవృక్షం రైల్వే స్టేషన్‌లో పాసింజర్ రైలు ఆగి ప్రయాణికులను ఎక్కించుకున్న తర్వాత భీమవరం మీదుగా విజయవాడ వెళుతూ ఉంటుంది. సోమవారం ఉదయం పాసింజర్ రైలు డ్రైవర్‌కు ఏమైందో ఏమో తెలియదుగాని ఆదమరచి శృంగవృక్షం మీదుగా పెన్నాడ వైపు రైలు ఆగకుండా వెళ్ళిపోయింది. దీంతో స్టేషన్‌లో రైల్వే సిబ్బందితోపాటు రైలు ఎక్కడానికి వచ్చిన ప్రయాణికులు కంగారుపడి కేకలు వేశారు. రైల్వేసిబ్బంది అదే ట్రైన్‌ను మళ్ళీ వెనక్కి రప్పించి ప్రయాణికులను ఎక్కించారు. ఈలోగా జాతీయ రహదారిపై శృంగవృక్షం వద్ద ఉన్న రైల్వే గేటు పది నిమిషాలపాటు తెరచుకోకపోవడంతో రెండు వైపులా పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ అయ్యింది. రైల్వే అధికారులను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని, సంబంధిత డ్రైవర్‌పై నివేదిక తీసుకుని దాని ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సమర్థవంతంగా శాప్ విధుల నిర్వహణ: అనిమిని

విజయవాడ స్పోర్ట్సు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు మెరుగైన సదుపాయాలు కల్పించే దిశగా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పిలుపునిచ్చారు. శాప్ కార్యాలయంలోని వివిధ విభాగాల అధికారులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా శాప్ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రీడాభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, ఆయా జిల్లాల్లో శాప్, ఖేలో ఇండియా, కేంద్ర ప్రభుత్వం నిధులతో చేపడుతున్న మల్టీపర్పస్ స్టేడియాల్లో నిర్మాణాలు నాణ్యంగా ఉండాలన్నారు. ఇండోర్ స్టేడియాలు, క్రీడా వికాసకేంద్రాలు, స్పోర్ట్సు ఎరీనాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని రవినాయుడు కోరారు. అధికారులు రమణ, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ ఎందుకు జాప్యం చేశారు..?

- వ్యవసాయశాఖ అధికారుల తీరుపై కలెక్టర్ ఆగ్రహం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఘంటసాల, నందివాడ మండలాల నుంచి పంట వివరాలు ఈ-క్రాప్‌లో నమోదు చేయలేదని, రైతుల నుంచి ధాన్యం సకాలంలో కొనుగోలు చేయడం లేదని రైతులు ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అర్జీలు అందజేసి 22 రోజులకు పైగా అయింది, ఇన్ని రోజులుగా సమస్యలను పరిష్కరించకుండా ఏం చేస్తున్నారని కలెక్టర్ సోమవారం కలెక్టరేట్‌లోని మీకోసం సమావేశపుహాలులో జరిగిన మీకోసం సమావేశంలో జిల్లా వ్యవసాయశాఖ జేడీ పద్మావతిపై కలెక్టర్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘంటసాల మండలం శ్రీకాకుళం, తెలుగురావుపాలెంకు చెందిన రైతు గుగులోతు కోటేశ్వరరావు ఇతర రైతులు తమ పొలాల్లో సాగుచేసిన పంట వివవరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేయకపోవడంతో ధాన్యం విక్రయించేందుకు అవకాశం లేకుండా పోయిందని 22 రోజుల క్రితం అర్జీ దాఖలు చేశారు. ఈ అంశంపై కలెక్టర్ ప్రశ్నించారు. జిల్లా వ్యవసాయశాఖ జేడీ పొంతనలేని సమాధానం చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్ వ్యవసాయ శాఖ నుంచి అధికంగా అర్జీలు రావని, వచ్చిన ఒకటీ, రెండు కూడా పరిష్కరించకుండా పెండింగ్‌లోనే పెడితే ఎలాగని ప్రశ్నించారు. దీనిపై తాను సమీక్ష చేస్తానని అన్నారు. ఇదే సమయంలో వ్యవసాయశాఖ జేడీ ఈ సమస్యలను పౌరసరఫరాలశాఖ అధికారులు పరిష్కరించాలని అనడంతో కలెక్టర్ మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ-క్రాప్ నమోదులో పౌరసరఫరాలశాఖకు సంబంధం లేదని కలెక్టర్ అన్నారు. ధాన్యం కొనుగోలు అంశాలు పెండింగ్‌లో ఎందుకు పెట్టారని కలెక్టర్ పౌరసరఫరాల శాఖ అధికారులను ప్రశ్నించారు. జిల్లా మేనేజర్ కిందిస్థాయి అధికారి సమావేశంలో ఉండటంతో ఆయన తనవద్ద సరైన సమాచారం లేదన్నారు. దీనిపై జేసీ కలుగజేసుకుని జిల్లా అధికారులు రాకుంటే, కిందిస్థాయి అధికారులు సరైన సమాచారంతో రావాలని, ఇక్కడకు వచ్చి కూర్చుని వెళ్లిపోతే ఎలాగని ప్రశ్నించారు. మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్, జిల్లా రిజిస్ట్రార్ విభాగం, నీటిపారుదల, వైద్యశాఖ, తదితర శాఖల్లో పెండింగ్‌లో ఉన్న మీకోసం అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.

కేంద్రీయ పోలీస్ కళ్యాణ్ బండార్ ప్రారంభం

రైల్వే స్టేషన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం కేంద్రీయ పోలీస్ కళ్యాణ్ బండార్ (ఆర్పీఎఫ్ డ్రై క్యాంటీన్), కొత్త వాహనాలను ప్రారంభించారు. డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. అధికారులతో కలిసి డ్రై క్యాంటీన్‌ను ప్రారంభించారు. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఈ క్యాంటీన్‌ను మంజూరు చేసింది. రైలు సురక్షా కళ్యాణ్ నిధి నుంచి రూ.10లక్షల గ్రాంట్‌తో డ్రై క్యాంటీన్‌ను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ఈ డ్రై క్యాంటీన్‌లో పదవీ విరమణ పొందిన ఆర్పీఎఫ్ సిబ్బందికి, వారి కుటుంబాలకు సేవలందిస్తారు. దీనికి సంబంధించి జారీ చేసిన కార్డు ద్వారా సదుపాయాలను పొందవచ్చు. ఈ క్యాంటీన్‌లో కిరాణా వస్తువులు, గృహ వినియోగానికి సంబంధించిన ఇతర వస్తువులు, యూనిఫారాలు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, ద్విచక్రవాహనాలు, కార్లు వంటి వాటిని రాయితీ ధరలతో పొందే అవకాశం ఉంది. మరోవైపు డివిజన్‌లోని ఆర్పీఎఫ్ కోసం 38 సీట్ల కొత్త బస్సు, 8 బుల్లెట్ మోటార్ సైకిళ్లను కూడా ఇదే సమయంలో ప్రారంభించారు. విజయవాడ - గూడూరు, విజయవాడ - విశాఖపట్నం, విజయవాడ - మచిలీపట్నం - నరసాపూర్ సెక్షన్ల పరిధిలోని వివిధ ప్రాంతాలకు ఆర్పీఎఫ్ సిబ్బందిని తరలించేందుకు ఈ బస్సును వినియోగిస్తారు. రైల్వే స్టేషన్లలో సంఘ విద్రోహక కార్యకలాపాలు, దాడులు వంటి సంఘటనలు జరిగినప్పుడు హుటాహుటిన ఆర్పీఎఫ్ సిబ్బందిని తరలించటానికి ఈ బస్సును వినియోగిస్తారు. దీంతో పాటు రాజమండ్రి, చీరాల, గుడివాడ, రాయనపాడు, క్రైం బ్రాంచ్, స్పెషల్ బ్రాంచ్, అప్పియార్డ్, డివిజనల్ సోర్స్‌లోని ఆర్పీఎఫ్ వినియోగించుకునేందుకు బుల్లెట్ మోటార్ సైకిళ్లను అందించారు. నేరాలు జరిగినప్పుడు అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు, ఇతరత్రా అత్యవసర పరిస్థితుల్లో సిబ్బంది స్పందించటానికి ఈ వాహనాలను వినియోగిస్తారు. ఇందుకోసం రైల్వేబోర్డు రూ.38 లక్షలను మంజూరు చేసింది. వాహనాల తాళం చెవులను డీఆర్ఎం సిబ్బందికి అందజేశారు. ఏడీఆర్ఎంలు పి.అడ్విన్, కొండా శ్రీనివాసరావు, ఆర్పీఎఫ్ విజయవాడ డివిజన్ అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ జి. మధుసూదనరావు, డివిజన్ సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ తోకల వల్లేశ్వర బాబూజీ, సంబంధిత అధికారులు, ఆర్పీఎఫ్ శాఖల ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



ఆర్‌పీఎఫ్ సిబ్బందికి తాళం చెవి అందజేస్తున్న డీఆర్ఎం నరేంద్ర పాటిల్

ఈ-ఆఫీసు విధానం ఎందుకు అమలు చేయట్లేదు..?

- దుర్గగుడి ఈఈ, డిప్యూటీ ఈఈ, ఏఈవో, సూపరింటెండెంట్, సిబ్బందికి ఈవో నోటీసులు

వన్‌టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిప్యూటీ ఈఈలు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు, సూపరింటెండెంట్‌లు, ఇతర సిబ్బంది అందరూ సంబంధిత లావాదేవీల ఫైళ్లను ఈ-ఆఫీసు ద్వారానే పంపించాలని, దుర్గగుడి ఈవో రామచంద్ర మోహన్ నోటీసులు జారీ చేశారు. తక్షణమే అందరూ కూడా ఈ-ఆఫీసు ద్వారానే లావాదేవీలు జరపాలని నోటీసులో పేర్కొన్నారు. ఇంతవరకు ఆయా విభాగాల వారు ఈ-ఆఫీసు ద్వారా ఫైళ్లు పంపించకుండా భౌతికంగా ఫైల్స్ పంపించటంపై వివరణ ఇవ్వాలని సూచించారు. ఈ-ఆఫీసును కచ్చితంగా నడపాలని 2022లోనే దేవదాయ కమిషనర్ ఉత్తర్వులిచ్చినా ఎందుకు అమలు చేయాలేదని ప్రశ్నించారు. దేవదాయ శాఖ కమిషనర్ 2022 ఫిబ్రవరి 10న, కిందటేడాది డిసెంబరు 31న రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో రాష్ట్రంలోని అన్ని ప్రధాన ఆలయాల్లో ఈ-ఆఫీసు సిస్టమ్‌ను అమలు చేయాలన్నారన్నారు. తాజాగా ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈ-ఆఫీసు విధానాన్ని అమలు చేయాల్సి ఉందన్నారు. ఇందులో అనేక ప్రభుత్వ విభాగాలు టైమ్‌లైన్‌ను విస్మరించి ఈ-ఆఫీసును అమలు చేయకపోవటంపై ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసిందన్నారు. ప్రభుత్వ ఇది అమలు చేసినట్టు నివేదిక పంపించాలని ఈవో తెలిపారు. ఈ మేరకు అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది తమ ఫైళ్లను భౌతికంగా కాకుండా ఈ-ఆఫీసు ద్వారానే పంపాలని, లేకుంటే చర్యలు తీసుకుంటానని ఆయన హెచ్చరించారు.



లయోలా మెయిన్ గేటు వద్ద ధర్నా చేస్తున్న వాకర్స్ సభ్యులు

మళ్లీ మొదటికొచ్చిన వాకర్ల సమస్య

- లయోలా గేటు ఎదురుగా నిరసన ప్రదర్శన
- పోలీసుల జోక్యంతో విరమించిన వాకర్లు

భారతీనగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): వాకర్ల పోరాటం మళ్లీ మొదటికొచ్చింది. ఆదివారం గేట్లు తెరచి నడవనిచ్చిన కళాశాల యాజమాన్యం సోమవారం అనుమతి నిరాకరించింది. ఉదయం 5గంటలకు నడవడానికి వచ్చిన వాకర్లు గంటకుపైగా నిలబడినా గేట్లు తెరవకపోవడంతో ఉద్రిక్తత ఏర్పడింది. దీంతో వాకర్లలంతా కళాశాలకున్న అన్ని గేట్లను బ్లాక్ చేస్తూ నిరసన ప్రదర్శన చేపట్టారు. అప్పటికే కళాశాల గ్రౌండ్‌లో నడుస్తున్న హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు అరగంటకు పైగా కళాశాలలో ఉండిపోయారు. కళాశాల విద్యార్థులు కూడా అరగంటకు పైగా కళాశాల బయట ఉండిపోయారు. నిరసన ప్రదర్శన ఉధృతం కావడంతో మాచవరం పోలీసులు రంగంలోకి దిగి విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా చూడాలని, నిరసన విరమించుకోవాలని వాకర్స్‌కు తెలిపారు. విద్యార్థుల పరీక్షల దృష్టి లో ఉంచుకొని ఏసీపీ దామోదర్ మాట్లాడగా వాకర్స్ నిరసనను విరమించారు.

నవ్య డాక్టర్

మంగళవారం • 7 జనవరి 2025

పోషకం

జాజి కాయతో...

విత్తనమైన జాజికాయతో పాటు దాని పైపొర జాపత్రిని కూడా వంటకాల్లో ఉపయోగిస్తూ ఉంటాం. అయితే రుచి పెంచడం కోసం ఉపయోగించే ఈ సుగంధద్రవ్యంలో ఆరోగ్య ప్రయోజనాలు కూడా దాగి ఉన్నాయి. అవేంటో తెలుసుకుందాం!

జాజికాయ, క్యాన్సర్‌తో పాటు, క్షీణింపజేసే వ్యాధులు, గుండెజబ్బులను అరికడుతుంది. దీన్లోని శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు, ఫ్రీ రాడికల్స్‌తో కణాలు దెబ్బతినకుండా రక్షణ కల్పిస్తాయి. జాజికాయలో ఉండే సయానిడిన్స్ అనే యాంటీఆక్సిడెంట్స్‌తో పాటు, ఫినైల్‌ప్రోపనాయిడ్స్, టర్పీన్స్ అనే ఎసెన్షియల్ ఆయిల్స్, ఫినోలిక్ సమ్మేళనాలు... ఫ్రీ ర్యాడికల్స్‌ను నిలువరించి, కణ నాశనాన్ని నివారిస్తాయి. అలాగు జాజికాయ యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలను కూడా కలిగి ఉంటుంది. దీన్లోని మోనోటర్పీన్స్, సాబీనిన్, టర్పినాల్, సయానిడీన్స్ లాంటి ఫినోలిక్ సమ్మేళనాలు ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తాయి.

దుష్ప్రభావాలు ఉన్నాయి

గర్భవిచ్ఛిత్తి కారకాలు కలిగి ఉండే జాజికాయకు గర్భిణులు దూరంగా ఉండడమే మేలు. బేక్ చేసే వీలున్న పదార్థాలతో పాటు తీపి వంటకాలలో జాజికాయను విరివిగా వాడుతూ ఉంటారు. అయితే జాజికాయతో ఆరోగ్య ప్రయోజనాలను పొందాలంటే, దాన్ని పరిమితంగానే వాడుకోవాలి. ఒకసారికి ఒక కిలో శరీర బరువుకు ఒకటి నుంచి రెండు మిల్లీగ్రాముల జాజికాయను వాడుకోవచ్చు. ఐదు గ్రాములకు మించితే విషపూరిత ప్రభావాలకు లోనయ్యే ప్రమాదం ఉంటుంది.



తెలుసుకుందాం

మందుల వాడకం ఇలా...

సాధారణంగా మాత్రలు మింగడానికి నీళ్లనే ఆశ్రయిస్తూ ఉంటాం. కానీ కొందరు పండ్లరసం, పాలతో మందులు మింగుతూ ఉంటారు. కానీ నిజానికి మందులను కొన్ని పదార్థాలతో జోడించి తీసుకోకూడదు. అవేంటంటే..


ఔషధాలను కొన్ని పదార్థాలతో జోడించినప్పుడు, వాటి ప్రభావాలు పెరగవచ్చు లేదా తగ్గిపోవచ్చు. అరుదుగా ఊహించని దుష్ప్రభావాలకు దారి తీయవచ్చు. కాబట్టి ఔషధాలతో కలపకూడని ఘన, ద్రవ పదార్థాల గురించి తెలుసుకుందాం!



- **ద్రాక్ష రసం:** ఔషధాలతో జోడించకూడని ద్రవ పదార్థమిది. ద్రాక్షరసం దాదాపు అన్ని మందులతో ప్రతికూలంగా ప్రతిస్పందిస్తుంది. అలాగే ద్రాక్షరసం శరీరం ఔషధాన్ని శోషించుకునే తీరును కూడా ప్రభావితం చేస్తుంది. ద్రాక్షరసం, స్టాటిన్స్ (రక్తంలో కొవ్వును కరిగించే మందులు), క్యాల్షియం ఛానల్ బ్లాకర్స్ (గుండె జబ్బు మందులు)... ఈ మూడు ప్రమాదకరమైన సమ్మేళనం. ఇవి గుండె వేగాన్ని, రక్తపోటును ప్రభావితం చేస్తాయి.
- **బ్రొకోలి, పాలకూర:** రక్తపు గడ్డలను అరికట్టే కొన్ని మందులను, విటమిన్ కె ఎక్కువగా కలిగి ఉండే బ్రొకోలి, పాలకూరలతో కలిపి తీసుకోకూడదు. ఇలా తీసుకోవడం వల్ల తీసుకునే మందుల ప్రభవం తగ్గిపోయే ప్రమాదం ఉంటుంది.
- **అరటిపండు, రెడ్ వైన్:** మానసిక కుంగుబాటుకు మందులు వాడుకునేవారు, అరటిపండు, రెడ్ వైన్ తీసుకోవడం వల్ల వారిలో రక్తపోటు విపరీతంగా పెరిగిపోయే ప్రమాదం ఉంటుంది.
- **కాఫీ:** కాఫీ లేదా కెఫీన్ కలిగి ఉండే పానీయాలు బ్రోంకోడిలేటర్స్‌ను ప్రభావితం చేస్తాయి. కేంద్ర నాడీ వ్యవస్థను ప్రభావితం చేసి, తలతిరుగుడు, వాంతులు, తలనొప్పి లాంటి దుష్ప్రభావాలను కలిగిస్తాయి. కాబట్టి శ్వాసకోశ సమస్యలకు మందులు వాడుకునే వాళ్లు కాఫీని పరిమితం చేయాలి.

ముత్యాల ముగ్గు





ఎన్. భావన
హైదరాబాద్

21 చుక్కలు
5 వరుసలు
ఇటు అటు
వదిలి
5 వరకు

ఈ-మెయిల్:
features@andhrajyothy.com



కొత్త సంవత్సరంలో పాత రుగ్మతలతో అడుగు పెడుతున్నారా? మధుమేహం లాంటి ఆరోగ్య సమస్యలు వెన్నంటే ఉంటాయి కాబట్టి, ఈ రుగ్మతను అదుపులో పెట్టుకుంటూ, కొత్త ఏడాదిని ఆరోగ్యకరంగా ఎలా కొనసాగించాలో తెలుసుకుందాం!

ఇన్సులిన్ పంప్స్

టైప్1 మధుమేహులు, ఏళ్ల తరబడి మధుమేహంతో బాధపడుతూ, నోటి మాత్రలు పని చేయని వారికీ ఇన్సులిన్ ఇవ్వవలసి వస్తుంది. ఈ కోవకు చెందిన వాళ్లు రోజులో మూడు నుంచి నాలుగు సార్లు ఇన్సులిన్ తీసుకోవలసి వస్తుంది. ఇలా ఇన్సులిన్ తీసుకోవడంలో ఇబ్బంది ఎదుర్కొనేవారి కోసం కొత్తగా ఇన్సులిన్ పంప్స్ అందుబాటులో కొచ్చాయి. శరీరంలో పొట్ట దగ్గర అమర్చుకునే ఈ పరికరం రక్తంలోని చక్కెరలను పరిశీలిస్తూ, తగిన మోతాదులో ఇన్సులిన్‌ను విడుదల చేస్తూ ఉంటుంది.

మధుమేహం
ముదురు పాకాన పడకుండా...

మధుమేహంలో ముందస్తు లక్షణాలేవీ కనిపించవు. కాబట్టి సాధారణ ఆరోగ్య పరీక్షల్లో మధుమేహం లేదా మధుమేహం ముందరి దశ బయటపడుతూ ఉంటాయి. అయితే మధుమేహం లేనప్పుడు, దాని ఫలితంగా ఎటువంటి ఆరోగ్య సమస్యలూ తలెత్తనప్పుడు, ముందుగానే జాగ్రత్తలు ఎందుకు పాటించాలి? అని ప్రశ్నించేవారూ ఉంటారు. కానీ ప్రి డయాబెటిక్, కచ్చితంగా డయాబెటిక్‌కు దారి తీస్తుంది. అయితే మధుమేహ ముందరి దశ, మధుమేహానికి దారి తీసే పరిస్థితిని వాయిదా వేయడానికి ముందస్తు జాగ్రత్తలు ఎంతో బాగా దోహదపడతాయి. మధుమేహులు ఎలాంటి ఆహార, ఆరోగ్య, వ్యాయామ నియమాలు పాటిస్తున్నారో అవే నియమాలను ప్రిడయాబెటిక్స్ కూడా అనుసరించడం మొదలుపెట్టాలి. అలాగే మధుమేహుల మాదిరిగానే 3 నుంచి 6 నెలలకోసారి మధుమేహాన్ని పరీక్షించుకుంటూ ఉండాలి. ప్రిడయాబెటిక్స్, డయాబెటిక్స్‌లా మందులు వాడుకోవలసిన అవసరం లేకపోవడం మినహా మిగతా నియమాలన్నీ తూచతప్పకుండా పాటించాలి.

లక్షణాలు కొందర్లోనే...

మధుమేహులు అందర్లో లక్షణాలు కనిపించాలనే నియమమేమీ లేదు. వంద మంది మధుమేహుల్లో కేవలం ఇరవై మందికే మధుమేహ లక్షణాలు బయల్పడతాయి. కాబట్టి మధుమేహాన్ని ముందస్తుగానే గుర్తించాలంటే 40 ఏళ్ల నుంచి ప్రతి ఏడాదీ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. కుటుంబ చరిత్రలో మధుమేహం ఉన్న వాళ్లు 35 ఏళ్ల నుంచే, వార్షిక పరీక్షలు చేయించుకోవడం మొదలుపెట్టాలి. టైప్1 మధుమేహం సాధారణంగా 15 ఏళ్ల లోపు పిల్లల్లో కనిపిస్తూ ఉంటుంది. క్లోమంలో ఇన్సులిన్ ఏమాత్రం తయారు కాని పరిస్థితి ఇది. బరువు తగ్గడం, కడుపు నొప్పి, వాంతులతో వైద్యులను సంప్రతించి, పరీక్షలు చేయించుకున్నప్పుడు, ఈ మధుమేహం బయల్పడుతూ ఉంటుంది. వీళ్లకు నోటి మాత్రలు పని చేయవు. కాబట్టి ఇన్సులిన్ ఇవ్వవలసి వస్తుంది. టైప్2 మధుమేహుల్లో కేవలం 20 శాతం మందిలోనే ఆకలి పెరగడం, అతి మూత్రం, దాహం పెరగడం లాంటి లక్షణాలతో వ్యాధి బయల్పడుతూ ఉంటుంది. మిగతా 80 శాతం మందికీ ఆరోగ్య ఏపరీక్షల ద్వారా సమస్య బయల్పడుతూ ఉంటుంది. వీళ్లలో హెచ్‌బిఎ1సి 6.4 కంటే ఎక్కువ ఉన్నప్పుడు, మందులు మొదలుపెట్టుకుంటూ, ఆహార, వ్యాయామ నియమాలు పాటించాలి.



పరీక్షలు క్రమం తప్పకుండా...

మధుమేహ మాత్రలు వాడుకోవడం ముఖ్యమే అయినా ఆహార నియమాలు పాటించడం, వ్యాయామం చేయడం, ఒత్తిడి తగ్గించుకోవడం లాంటి అంశాలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలి. మందుల్లో కూడా దాదాపు 7 రకాలుంటాయి. ఆహారపుటలవాట్లు, బరువు, దైనందిన జీవితం ఆధారంగా వైద్యులు నిర్దిష్ట మందులను సూచిస్తూ ఉంటారు. అయితే కొత్తగా మందులు మొదలుపెట్టినవాళ్లు వైద్యుల సూచించినంత కాలం అవే మందులు వాడుకుంటూ, మధుమేహ పరీక్షలు చేయించుకుంటూ ఉంటే సరిపోతుంది. కానీ ఐదు నుంచి పదేళ్లుగా మధుమేహంతో బాధపడుతున్నవాళ్లు, మధుమేహం హెచ్చుతగ్గులకు లోనవుతున్న వాళ్లు మందులు వాడుకుంటూనే, ప్రతి మూడు నెలలకూ మధుమేహాన్ని పరీక్షించుకుంటూ, ఏడాదికోసారి కొన్ని అదనపు పరీక్షలు కూడా చేయించుకుంటూ ఉండాలి. ఈ కోవకు చెందిన వాళ్లలో మధుమేహం ప్రభావంతో ఇతర ప్రధాన అంతర్గత అవయవాల మీద ప్రభావం పడుతుంది. కాబట్టి ఏడాదికోసారి కళ్లు, మూత్రపిండాలు, కాలేయం, గుండె పరీక్షలు కూడా చేయించుకుంటూ ఉండాలి.

సిజిఎమ్ తోడ్పాటుతో...

ఏళ్ల తరబడి ఆహార నియమాలను కచ్చితంగా పాటించలేక విసిగిపోయి, నచ్చినట్టు తినేసేవాళ్లలో, వ్యాయామాన్ని నిర్లక్ష్యం చేసేవాళ్లలో, ఒత్తిడిని అదుపులో పెట్టుకోలేకపోయిన వాళ్లలో మధుమేహం హెచ్చుతగ్గులకు లోనవుతూ ఉంటుంది. ఇలాంటి వ్యక్తుల కోసం తాజాగా సిజిఎమ్ (కంటిన్యూయస్ గ్లూకోజ్ మానిటరింగ్) అనే నానో చిప్ అందుబాటులోకొచ్చింది. 10 నుంచి పదేళ్ల పాటు పని చేసే ఈ నానోచిప్‌ను భుజానికి అంటించుకుని, సంబంధిత సాఫ్ట్‌వేర్‌ను ఫోన్లో ఇన్‌స్టాల్ చేసుకుని, చక్కెర మోతాదుల్లో హెచ్చుతగ్గులను పరీక్షించుకోవచ్చు. ఆ వివరాల ఆధారంగా చక్కెర పెరిగిన సమయాలు, కారణాలను గుర్తించి, చక్కెరను స్థిరీకరించే మందులను వైద్యులు సూచిస్తారు. చక్కెర హెచ్చుతగ్గులకు లోనయ్యే వారికీ, ఇన్సులిన్ తీసుకుంటున్న వాళ్లకూ సిజిఎమ్ ఎంతో బాగా అక్కరకొస్తుంది.



షిఫ్టుల్లో పని చేస్తున్నప్పుడు...

ప్రత్యేకించి రాత్రంతా మేలుకుని పని చేస్తూ, పగలు నిద్రపోయే ఉద్యోగులు మధుమేహం అదుపు తప్పకుండా ఉండడం కోసం కొన్ని ఆహార నియమాలు పాటించాలి. రాత్రి పనిలోకి దిగే ముందు, కడుపు నిండా భోంచేయొచ్చు. అయితే తెల్లవారిన తర్వాత, నిద్రకు ఉపక్రమించబోయే ముందు భారీ భోజనం చేయకూడదు. బదులుగా వీలైనంత తేలికపాటి అల్పాహారం మాత్రమే తీసుకోవాలి. ఉదయం నిద్రపోయే ముందు కడుపు నిండా తింటే, నిద్రపోయినంత సేపు, ఆరు నుంచి ఏడు గంటల పాటు రక్తంలో చక్కెర మోతాదులు అధికంగానే ఉండిపోతాయి. కాబట్టి పగటి షిఫ్టుల్లో పని చేసే వాళ్లైనా రాత్రి షిఫ్టుల్లో పని చేసేవాళ్లైనా నిద్రకు ముందు భారీ భోజనానికి బదులుగా అల్పాహారమే తీసుకోవాలి.

ఈ నియమాలు తప్పనిసరి

- **చక్కెర:** చక్కెరతో శరీరానికి అదనంగా ఎలాంటి ప్రయోజనం ఉండదు. పైగా మనం తినే పిండిపదార్థాల్లో చక్కెర ఉంటుంది. కాబట్టి నేరుగా చక్కెర తీసుకోవలసిన అవసరం లేదు.
- **పిండిపదార్థాలు:** ప్రత్యేకించి నిద్రకు ముందు వీలైనంత తక్కువ పిండిపదార్థాలు ఆహారంలో ఉండేలా చూసుకోవాలి. మరీ ముఖ్యంగా బియ్యం ఆధారిత పదార్థాలు మానేయాలి. అన్నానికి బదులుగా టిఫిన్ తింటున్నాం కాబట్టి ఫరవాలేదు అనుకునేవాళ్లూ ఉంటారు. కానీ ఇడ్లీ, దోశల్లాంటివి కూడా బియ్యంతోనే తయారవుతాయనే విషయాన్ని వాళ్లు గుర్తు పెట్టుకోవాలి. కాబట్టి రాత్రి భోజనంలో సాధ్యమైనంత తక్కువ పిండిపదార్థాలు ఉండేలా చూసుకోవాలి. వీలైతే పిండిపదార్థాలను పూర్తిగా మానేయాలి.
- **గ్లైసెమిక్ ఇండెక్స్:** అన్నానికి బదులుగా చపాతీలు, పుల్కాలు తినొచ్చు. అన్నంలో గ్లైసెమిక్ ఇండెక్స్ ఎక్కువ. కానీ చపాతీలు, పుల్కాల్లో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువ కాబట్టి రక్తంలో చక్కెరలు పెరగకుండా ఉంటాయి.
- **పండ్లు:** మామిడి, ద్రాక్ష, సపోటా, అరటి, పైనాపిల్‌లు తినకపోవడమే మేలు. వీటికి బదులుగా బొప్పాయి, యాపిల్, జామ పండ్లు రోజూ తినొచ్చు. ఈ పండ్లను రోజుకొకటి చొప్పున తినొచ్చు. కానీ రసం తీసి తాగకూడదు. గ్లాసుడు రసం కోసం మూడు నాలుగు పండ్లు అవసరమవుతాయి. కాబట్టి నేరుగా పండునే తినాలి. అలాగే కాలానుగుణంగా దొరికే పండ్లను పూర్తిగా మానేయవలసిన అవసరం లేదు. వారానికి ఒకట్రెండు పండ్ల ముక్కలను తినడం వల్ల నష్టం ఉండదు.

కృత్రిమ చక్కెర ప్రమాదమే!

చక్కెరకు బదులుగా పలు రకాల కృత్రిమ చక్కెరలు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. ఇవన్నీ సురక్షితమైనవేనని అనుకోకూడదు. కృత్రిమ స్వీటెనర్ల వల్ల పలురకాల దుష్ప్రభావాలున్నట్టు పలు అధ్యయనాలు నిరూపిస్తున్నాయి. వీటి వల్ల రక్తంలోని చక్కెరలు హెచ్చుతగ్గులకు లోనవడంతో పాటు థైరాయిడ్, క్లోమ క్యాన్సర్ల ముప్పు కూడా పొంచి ఉంటుంది. కాబట్టి కృత్రిమ చక్కెరలతో పాటు, షుగర్ ఫ్రీ స్వీట్లు, బెల్లం, తాటి బెల్లం, పటికలను కూడా తీసుకోకూడదు.

వ్యాయామం ఎంత?

మధుమేహులు వారంలో కనీసం వారంలో ఐదు రోజులు, 30 నిమిషాల పాటు వ్యాయామం చేయాలి. అయితే కొంతమందికి అంత సమయం కూడా దొరకకపోవచ్చు. అలాంటివాళ్లు రోజుకు కనీసం 20 నిమిషాలైనా వ్యాయామానికి కేటాయించాలి. అలాగే వ్యాయామం క్రమం తప్పకుండా చూసుకోవాలి. ఐదు రోజుల పాటు ఎలాంటి వ్యాయామం చేయకుండా శని, ఆది వారాల్లో గంట చొప్పున వ్యాయామం చేస్తే ఫలితం ఉండదు.

ఒకటికి రెండు మాత్రలు

'ఒకటికి రెండు మాత్రలు వేసుకుంటే సరిపోతుందిలే' అనే ఆలోచనతో తీపి తినేసేవాళ్లూ ఉంటారు. కానీ బిపి మాత్రలు, చక్కెర మాత్రలు వైద్యులు సూచించిన మోతాదు మించి వాడుకోకూడదు. తీపి తినడం వల్ల రక్తంలో చక్కెర పెరిగితే వెంటనే ముంచుకొచ్చే ముప్పేమీ ఉండదు. కానీ ఒక స్వీటు తిని ఒకటికి రెండు చక్కెర మాత్రలు వేసుకుంటే, రక్తంలో చక్కెర మోతాదు పడిపోయి, అత్యవసర వైద్య పరిస్థితికి దారితీసే ప్రమాదం ఉంటుంది. కాబట్టి ఎప్పుడైనా స్వీటు తిన్నా, రక్తంలో చక్కెర పెరిగి, తర్వాత నెమ్మదిగా దానంతటదే తగ్గిపోతుంది. కాబట్టి కంగారు పడవలసిన అవసరం లేదు. అలాగని స్వీట్లు కూడా తరచూ తినకూడదు.

డాక్టర్ సందీప్ ఘంటా
కన్సల్టెంట్ - డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇంటర్నల్ మెడిసిన్,
స్టార్ హాస్పిటల్,
నానక్‌రామ్‌గూడ, హైదరాబాద్.





మీకు తెలుసా?

చలి వేధిస్తోందా?

చలి కాలం చలి వేధించడం సహజమే! అయితే కొందరు కాస్త చలిని కూడా తట్టుకోలేకపోతూ ఉంటారు. తాపమానాలు ఏ కాస్త తగ్గినా చలితో బాధపడుతూ ఉంటారు. ఈ స్వభావం వెనక కొన్ని ఆసక్తికరమైన కారణాలున్నాయి. అవేంటంటే...

- **ఐరన్ లోపం:** హిమోగ్లోబిన్ ఉత్పత్తికి అత్యంత ముఖ్యమైన ఖనిజలవణం ఐరన్. ఐరన్ లోపిస్తే, శరీరంలో కణజాలాలకు ఆక్సిజన్ సరఫరా జరగక, చేతులు, కాళ్లూ చల్లబడిపోతాయి.
- **థైరాయిడ్ సమస్యలు:** మందకొడిగా పని చేసే థైరాయిడ్ వల్ల శరీరం శక్తిని ఖర్చు చేసుకునే వేగం తగ్గుతుంది. శరీరంలో వేడి జనించడానికి తోడ్పడే మెటబాలిజం కుంటుపడడంతో చలి వేధిస్తుంది.
- **మధుమేహం, హైపర్‌టెన్షన్:** మధుమేహం వల్ల రక్త ప్రసరణ బలహీనపడి చేతులు, పాదాలకు రక్త ప్రసరణ మందగిస్తుంది. ఫలితంగా చల్లదనం బాధిస్తుంది.
- **విటమిన్ బి12 లోపం:** ఎర్ర రక్తకణాల ఉత్పత్తికీ, నాడుల పనితీరుకూ విటమిన్ బి12 కీలకం. ఈ పోషక లోపంతో, శరీరానికి అందే ఆక్సిజన్‌లో కొరత ఏర్పడి, నాడీ వ్యవస్థ దెబ్బతింటుంది. దాంతో చలి, నిస్సత్తువలు వేధిస్తాయి.
- **డీహైడ్రేషన్:** వాతావరణ తాపమానాల క్రమబద్ధీకరణలో నీళ్లు కీలక పాత్ర పోషిస్తాయి. డీహైడ్రేషన్‌కు గురైనప్పుడు, శరీర తాపమానం నిర్వహణ క్రమం తప్పి, సాధారణంగా కంటే చలి ఎక్కువవవుతుంది. కాబట్టి సరిపడా నీళ్లు తాగుతూ ఉండాలి.

వ్యాయామం

చదునైన పొట్ట కోసం...

పొట్ట దగ్గర కొవ్వు అనారోగ్యానికి సూచన. కాబట్టి అక్కడి కొవ్వును కరిగించే వ్యాయామాల్లో ప్రత్యేకించి 'బ్యాలెన్సింగ్ ప్లాంక్'ను ఎంచుకోవాలి. ఈ వ్యాయామం ఎలా చేయాలంటే?

- మోకాళ్లు, అరచేతులు నేల మీద ఆనించి బొమ్మలో చూపించిన భంగిమలో ఉండాలి.
- రెండు అరచేతులు, పాదాలు మాత్రమే నేల మీద ఉండేలా శరీరాన్ని పైకి లేపాలి. ఇది 'ప్లాంక్'!



- తర్వాత కుడి చేయి, ఎడమ కాలు నేరుగా చాపి 30 అంకెలు లెక్క పెట్టాలి.
- ఈ భంగిమలో ఎడమ చేయి, కుడి కాలు మాత్రమే నేల మీద ఆనించి ఉంచి, వాటి మీదే శరీరం బరువును మోపాలి.
- తర్వాత ఎడమ చేయి, కుడి కాలును కూడా నేరుగా చాపి 30 అంకెలు లెక్కపెట్టి మామూలు స్థితికి రావాలి.
- ఇలా మార్చి మార్చి 5 సెట్లు చేయాలి.

కొత్త తల్లుల్లో కుంగుబాటు

కొత్తగా తల్లైన కొందరు మహిళల్లో, బిడ్డకు తల్లైన ఆనందం కంటే మానసిక కుంగుబాటు ఎక్కువైపోతుంది. బిడ్డ పోషణ పట్ల ఆసక్తి సన్నగిలి, అర్థం లేని భయాలు, అనుమానాలు ఆవరిస్తాయి. ఈ స్థితే... 'పోస్ట్‌పార్టమ్ డిప్రెషన్'!

సాధారణ మహిళలతో పోలిస్తే, చిన్నప్పటి నుంచీ డిప్రెషన్‌కు లోనవుతున్నవారు, భర్త ప్రేమను పొందలేని వారు, గతంలో ప్రసవ సమయంలో మానసిక కుంగుబాటుకు లోనయినవాళ్లు, గర్భం దాల్చిన తొలినాళ్లలోనే డిప్రెషన్ బారిన పడుతూ ఉంటారు. వీరిలో గర్భం దాల్చామనే ఆనందం మచ్చుకైనా కనిపించదు. తీవ్రమైన భావోద్వేగాలను వ్యక్తపరుస్తూ ఉంటారు. కొందరికి ప్రసవం ముందువరకూ లేని కుంగుబాటు, ప్రసవం తర్వాతి ఏడు రోజులు తీవ్రంగా బాధిస్తుంది. ఆ సమయంలో పిల్లలను దగ్గరకు తీసుకోరు. పాలివ్వడానికి ఇష్టపడరు. ఆ ఏడు రోజులు దాటితే ఈ మహిళలు తిరిగి మామూలుగా మారిపోతారు. ఇంకొందరిలో ప్రసవమైన 4వ నెలలో పోస్ట్‌పార్టమ్ డిప్రెషన్ తీవ్రత పెరుగుతుంది. పిల్లల పెంపకం వారిలో ఒత్తిడిని పెంచుతుంది. ఈ పరిస్థితి తొలిసారి తల్లయిన మహిళల్లో ఎక్కువ.

వైద్యుల దృష్టికి తీసుకెళ్లాలి

మహిళలు నిరాశానిస్పృహలను వ్యక్తం చేయడానికి ఇష్టపడరు. కానీ ఇలాంటి భావనలను నిర్లక్ష్యం చేయకూడదు. దానంతట అదే తగ్గిపోతుందిలే! అనే నిర్లక్ష్య ధోరణీ తగదు. అకారణంగా, ఏమాత్రం వేదనగా ఉన్నా, ఊరికే ఏడుపొస్తున్నా, తిండి మీద ఆసక్తి తగ్గినా, నిద్ర పట్టకపోతున్నా వెంటనే గైనకాలజిస్ట్‌ను కలిసి పరిస్థితి వివరించాలి. ఒకవేళ గతంలో డిప్రెషన్ బారిన పడి ఉంటే ఆ విషయాన్నీ వైద్యుల దృష్టికి తీసుకెళ్లాలి. ఏ మందులు వాడుతున్నదీ చెప్పాలి. ప్రసవం తర్వాత ఏడు రోజుల్లో ఇవే లక్షణాలు మొదటిసారి కనిపించినా అశ్రద్ధ చేయకూడదు. గతంలో ప్రసవానికి ముందుగానీ, తర్వాతగానీ ఈ లక్షణాలు ఎదుర్కొన్న మహిళలు గర్భం దాల్చిన వెంటనే ఈ విషయాన్ని వైద్యుల దృష్టికి తీసుకెళ్లాలి.

మానసికం



చికిత్సలున్నాయి!

ప్రసవం ముందైనా, తర్వాతైనా డిప్రెషన్ తాలూకు లక్షణాలు కనిపిస్తే మొదట కౌన్సెలింగ్ ఇవ్వవలసి ఉంటుంది. వారి వైద్య చరిత్ర ఆధారంగా డిప్రెషన్ గురించి లోతైన అవగాహన ఏర్పరుచుకుని, వైద్యులు తదనుగుణ చికిత్సను సూచిస్తారు. ప్రారంభంలో కౌన్సెలింగ్ ఉంటుంది. దీంతో చాలావరకూ కుంగుబాటు, పోస్ట్‌పార్టమ్ డిప్రెషన్‌లు తగ్గుముఖం పడతాయి. ఒకవేళ అప్పటికీ తగ్గకపోతే యాంటీడిప్రెసెంట్లు ఇవ్వవలసి ఉంటుంది. వీటితో కూడా అదుపు కాకుండా సైకోటిక్ దశకు చేరుకుంటే ఆ సమస్యకు తగిన చికిత్స ఇవ్వవలసి ఉంటుంది. ఏదేమైనా గర్భిణుల్లో, బాలింతల్లో ఈ భావోద్వేగాలను అలక్ష్యం చేయకూడదు. లక్షణాలు కనిపించిన వెంటనే కుటుంబ సభ్యులే చొరవ తీసుకుని వైద్యుల దగ్గరకు తీసుకెళ్లాలి. కొందరికి కొన్ని నెలలపాటు చికిత్స చేస్తే డిప్రెషన్ పూర్తిగా పోతుంది. కొందరికి అరుదుగా జీవితాంతం మందులు వాడవలసిరావొచ్చు.

రెయాన్ష్ రికార్డు ఫీట్



థానె: ఆరేళ్ల చిన్నారి రెయాన్ష్ కామ్కర్ సాగరంలో అద్భుతమైన ఫీట్‌తో ఇండియా బుక్ ఆఫ్ రికార్డుల్లోకెక్కాడు. అరేబియా సముద్రంలో 15 కిలో మీటర్లు ఈదిన పిన్నవయస్కుడిగా నిలిచాడు. మూడు గంటల్లో మాల్వే నుంచి వాగ్దన్ వరకు ఈదుకొంటూ చేరుకొన్నాడని మహారాష్ట్ర స్విమ్మింగ్ సంఘం తెలిపింది.

మంధానకు పగ్గాలు



హర్మన్, రేణుకలకు విశ్రాంతి

ఐర్లాండ్‌తో వన్డే సిరీస్‌కు భారత మహిళల జట్టు

న్యూఢిల్లీ: ఐర్లాండ్‌తో జరిగే మూడు వన్డేల సిరీస్‌కు భారత మహిళల జట్టు కెప్టెన్‌గా స్మృతీ మంధాన వ్యవహరించనుంది. 15 మందితో కూడిన భారత జట్టును బీసీసీఐ సోమవారం ప్రకటించింది. రాజ్‌కోట్‌లో ఈనెల 10,12,15వ తేదీల్లో మ్యాచ్‌లు జరుగనున్నాయి. అయితే రెగ్యులర్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌తో పాటు పేసర్ రేణుకా సింగ్‌లకు పని ఒత్తిడి కారణంగా ఈ సిరీస్ నుంచి విశ్రాంతి కల్పించారు. విండీస్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో గాయపడిన హర్మన్ చివరి రెండు మ్యాచ్‌లకు దూరమైంది. ఆ తర్వాత వన్డే సిరీస్‌లో మాత్రం ఆడింది. కొంతకాలంగా రేణుకా సింగ్ రెగ్యులర్‌గా క్రికెట్ ఆడుతోంది. మంధాన పరిమిత ఓవర్ల ఫార్మాట్లలో వరుస అర్ధసెంచరీలు బాదేస్తూ భీకర ఫామ్‌లో ఉన్న సంగతి తెలిసిందే.


భారత జట్టు
స్మృతీ మంధాన (కెప్టెన్), దీప్తి శర్మ, ప్రతీక, హర్లీన్, జెమీమా, ఉమా ఛెత్రి, రిచా ఘోష్, తేజల్, రాఘవి, మిన్ను, ప్రియా మిశ్రా, తనూజ, టిటాస్, సైమా ఠాకూర్, సయాలి.

'రిజర్వ్' పేస్‌లో పదునేది?


ఆకాశ్‌దీప్

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)


ముకేశ్


అర్ష్‌దీప్


ప్రసిద్ధ్

బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భారత బ్యాటర్ల ఆటతీరు విమర్శల పాలైంది. బౌలింగ్‌లో మాత్రం బుమ్రా బృందం అందరినీ ఆకట్టుకుంది. కానీ సునిశితంగా గమనిస్తే.. భారత రిజర్వ్ బెంచ్‌లో బ్యాటింగ్ కన్నా బౌలింగ్ వనరుల సమస్య ఎక్కువగా ఉండడం గమనార్హం. కెప్టెన్ రోహిత్, విరాట్‌ల వైఫల్యంతో వారి కెరీర్ ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఒకవేళ వారు వైదొలిగినా.. సమర్థులైన యువ బ్యాటర్లు ఆ స్థానాలను భర్తీ చేసేందుకు సిద్ధంగానే ఉన్నారు. కానీ బౌలింగ్ విషయానికి వస్తే.. ముఖ్యంగా పేస్ విభాగం కథ మరోలా ఉంది. బుమ్రా, షమి, ఇషాంత్‌ల స్థాయిని అందుకునేందుకు టెస్టు జట్టు కచ్చితంగా కొంతకాలం వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న బౌలర్లు జట్టు అవసరాలను తీర్చగలరా? అనేది సందేహమే. షమిని గాయాలు వెంటాడుతుండడంతో బుమ్రాపై అధిక భారం పడుతోంది. వీరిద్దరూ అందుబాటులో లేకపోతే పరిస్థితి ఏమిటి? అనేది తేలాల్సి ఉంది. ప్రస్తుతం జట్టులో ఉన్న సిరాజ్ 36 టెస్టులు ఆడినా గేమ్ చేంజర్‌గా మారలేదు. ప్రసిద్ధ్ కృష్ణ చాలా ఎక్కువగా లూజ్ బాల్స్ వేస్తుంటాడు. ఆకాశ్‌దీప్, ముకేశ్ కుమార్‌లకు నైపుణ్యం ఉన్నా అంతర్జాతీయ స్థాయిలో ఇంకా నిరూపించుకోలేదు. ఇక రంజీ సర్క్యూట్‌ను పరిశీలించినా సెలెక్టర్లను అంతగా ఆకట్టుకున్న పేసర్లు కనిపించడం లేదు. అన్నింటికన్నా ముఖ్యంగా జట్టుకు లెఫ్టామ్ పేసర్ అవసరం చాలా ఉంది. జహీర్ ఖాన్ తర్వాత ఇప్పటి వరకు ఆ స్థానాన్ని మరెవరూ భర్తీ చేయలేకపోయారు. అర్ష్‌దీప్, యష్ దయాళ్‌లపై ఇప్పటికీ నమ్మకం కుదరడం లేదు. వారు సుదీర్ఘ ఫార్మాట్‌కు సరిపోతారా? అనేది తేలాల్సి ఉంది.

బ్యాటర్లు సిద్ధంగా..

బ్యాటింగ్ విభాగంలో మాత్రం పరిస్థితి భిన్నంగా కనిపిస్తోంది. దేశవాళీల్లో పరుగుల వరద పారిస్తున్న బ్యాటర్లు జాతీయ జట్టులో చోటు కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఒకవేళ రోహిత్, విరాట్ లేకుండా సెలెక్టర్లు ముందుకు వెళ్లాలని భావిస్తే.. ఈ రెండు స్థానాల కోసం కనీసం అరడజను మంది సిద్ధంగా ఉన్నారు. ఇందులో దేవ్‌దత్ పడిక్కళ్, అభిమన్యు ఈశ్వరన్, రుతురాజ్ గైక్వాడ్, సాయి సుదర్శన్, రజత్ పటీదార్, శ్రేయాస్ అయ్యర్‌ల పేర్లు చెప్పుకోవచ్చు. అభిమన్యు 101 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 7674 పరుగులు సాధించినా జాతీయ జట్టు తరఫున అరంగేట్రం చేయలేకపోయాడు. ఇటీవలి బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలోనూ బెంచీకే పరిమితమయ్యాడు. స్టార్ ప్లేయర్లు ఎంతగా విఫలమవుతున్నా వారినే కొనసాగించడం కూడా యువ ఆటగాళ్లకు శాపంలా మారింది. అయ్యర్ షార్ట్ బాల్ బలహీనతను అధిగమించాల్సి ఉంటుంది. అయితే దేశవాళీల్లో ఆటగాళ్ల పరుగులు లేదా వికెట్లు మాత్రమే ఎంపికకు గీటురాయి కాకపోవచ్చు. అనుకూల పరిస్థితుల్లో రాణించడం కాకుండా.. పచ్చికతో కూడిన పిచ్‌పై సెంచరీ, ఫ్లాట్ వికెట్‌పై వికెట్లు తీయగల సామర్థ్యం కీలకమవుతుంది. ఏదిఏమైనా జూన్ వరకు టెస్టు సిరీస్‌లు లేవు కాబట్టి ఫిబ్రవరిలో దేశవాళీ సీజన్ ముగిసిన తర్వాతే ఆటగాళ్ల ఎంపికపై దృష్టి సారించే అవకాశముంది.

టెస్ట్ క్రికెట్‌లో రెండంచెల విధానం?

తెరవెనుక జోరుగా ప్రయత్నాలు

జై షా ఆసక్తి!

బీసీసీఐ కూడా ఓకే చెప్పే అవకాశం

న్యూఢిల్లీ: టెస్ట్ క్రికెట్‌ను కాపాడుకోవడంలో భాగంగా రెండంచెల విధానాన్ని తీసుకొచ్చేందుకు వేగంగా పావులు కదుపుతున్నట్టు తెలుస్తోంది. ఆస్ట్రేలియా-భారత్ మధ్య జరిగిన 5 టెస్టుల సిరీస్‌కు విపరీతమైన ప్రేక్షకాదరణ లభించింది. దీన్ని దృష్టిలో ఉంచుకొని టెస్ట్ క్రికెట్ ఆడే ప్రధాన దేశాలైన భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ మధ్య తరచూ సిరీస్‌లను నిర్వహించాలన్న చర్చ మొదలైంది. రెండంచెల విధానానికి ఐసీసీ చైర్మన్ జై షా సుముఖంగా ఉన్నట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో బీసీసీఐ, క్రికెట్ ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ క్రికెట్ బోర్డులతో ఈ నెలాఖరులో భేటీ అయ్యే అవకాశం ఉంది. అయితే, 2027 వరకు భవిష్యత్ టూర్ షెడ్యూల్ ఈపాటికే ఖరారైనా.. తాజా పరిణామాలు ఆసక్తి రేపుతున్నాయి. రెండంచెల విధానం ప్రతిపాదన కొత్తదేం కాదు. 2016లోనే ఈ ఆలోచన తెరపైకి వచ్చింది. కానీ, చిన్న జట్లకు అన్యాయం జరుగుతుందని బీసీసీఐ, జింబాబ్వే, బంగ్లాదేశ్ బోర్డులు వ్యతిరేకించాయి. కానీ, తొమ్మిదేళ్లలో చోటు చేసుకొన్న మార్పుల నేపథ్యంలో భారత మాజీ కెప్టెన్, ప్రముఖ కామెంటేటర్ రవిశాస్త్రి లాంటి వారు కూడా రెండంచెల విధానానికి ఓటేస్తున్నారు. టెస్ట్ క్రికెట్‌ను బతికించుకోవాలంటే ఇంతకుమించిన మార్గం లేదని శాస్త్రి బలంగా వాదిస్తున్నాడు. కాగా, వరల్డ్ టెస్ట్ క్రికెట్ చాంపియన్‌షిప్ విధానాన్ని ఇంగ్లండ్ కెప్టెన్ బెన్‌స్టోక్స్ కూడా తీవ్రంగా విమర్శించాడు. తనకు ఇది ఏమాత్రం అర్థం కాలేదన్నాడు.



టూ-టైర్ అంటే..

టెస్ట్ క్రికెట్ ఆడే దేశాలను రెండు డివిజన్లుగా వర్గీకరిస్తారు. డివిజన్-1లో అత్యుత్తమ టెస్ట్ క్రికెట్ జట్లు భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, సౌతాఫ్రికా, శ్రీలంక, పాకిస్థాన్‌ల మధ్య తరచూ సిరీస్‌లు నిర్వహించేలా చూస్తారు. టెస్ట్ క్రికెట్‌లో ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న అఫ్ఘానిస్థాన్, బంగ్లాదేశ్, ఐర్లాండ్, జింబాబ్వే లాంటి జట్లను ద్వితీయశ్రేణి జట్లుగా గుర్తించి వాటి మధ్య మ్యాచ్‌లు నిర్వహిస్తారు. ఇటీవలి కాలంలో సుదీర్ఘ ఫార్మాట్‌లో అంతగా రాణించలేకపోతున్న వెస్టిండీస్‌ను కూడా దిగువస్థాయి జట్టుగానే పరిగణించే అవకాశం ఉంది. ఇలా వర్గీకరించడం వల్ల ప్రధాన జట్ల మధ్య ఎక్కువ మ్యాచ్‌లు జరిగే అవకాశం ఉంది. ఇప్పటి వరకు నాలుగేళ్లలో రెండుసార్లు తలపడే జట్లు.. ఇదే సమయంలో మూడుసార్లు ఆడే చాన్సులున్నాయి. కాగా, డివిజన్-2లోని జట్లకు ఉన్నతి ఉంటుందా? లేదా? అనే విషయంపై ఇంకా చర్చలు జరగాల్సిన అవసరం ఉంది. ఒకరకంగా రంజీ ట్రోఫీలో ఎలీట్, ప్లేట్ గ్రూప్ తరహా విధానాన్ని అంతర్జాతీయ స్థాయిలో అమలు చేసే ప్రయత్నంగా చెప్పుకోవచ్చు.

'సెలెక్టర్లే నిర్ణయం తీసుకొంటారు'



ఆస్ట్రేలియాతో సిరీస్ కోల్పోవడంతో పాటు టీమిండియా డబ్ల్యూటీసీ ఫైనల్ అవకాశాలు గల్లంతు కావడాన్ని బీసీసీఐ తీవ్రంగా పరిగణిస్తున్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా రోహిత్, కోహ్లీ ప్రదర్శనపై బోర్డు పెద్దలు అసంతృప్తి వ్యక్తం చేసినట్టు సమాచారం. 'జట్టు ప్రదర్శనను మెరుగుపరిచే విషయంలో బోర్డు కఠినంగా వ్యవహరించే అవకాశం ఉంది. ఈ ఇద్దరి విషయంలో సరైన సమయంలో సెలెక్టర్లే తగిన నిర్ణయం తీసుకొంటారు. వీరి వరుస వైఫల్యాలపై ప్రత్యేకంగా చర్చిస్తార'ని బోర్డు అధికారి వెల్లడించారు.

దృష్టంతా సాత్విక్ జోడీపైనే!



నేటి నుంచి మలేసియా ఓపెన్

కౌలాలంపూర్: భారత స్టార్ డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి మంగళవారం నుంచి జరిగే మలేసియా ఓపెన్‌తో కొత్త ఏడాదిని ఘనంగా ఆరంభించాలనుకొంటోంది. లక్ష్యసేన్, బ్రేక్ తర్వాత బరిలోకి దిగుతున్న హెచ్‌ఎస్ ప్రణయ్ అదిరే ప్రదర్శనపై గురిపెట్టారు. తొలి రౌండ్‌లో తైపీకి చెందిన మింగ్ చె లు-టాంగ్ కై వితో సాత్విక్ జోడీ తలపడనుంది. పురుషుల సింగిల్స్‌లో చి యు జెన్ (చైనీస్ తైపీ)తో లక్ష్య సేన్, బ్రియాన్ అయాంగ్ (కెనడా)తో ప్రణయ్ ఆడనున్నారు. ఇటీవలే వివాహం చేసుకొన్న పీవీ సింధు టోర్నీకి దూరం కాగా.. మహిళల సింగిల్స్‌లో ఆకర్షి, మాళవిక, అనుపమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. డబుల్స్‌లో ట్రీసా జాలీ-గాయత్రి, రుతుపర్ణ-శ్వేతపర్ణ, మిక్స్‌డ్‌లో తనీషా-ధ్రువ్ కపిల జంటలు బరిలోకి దిగనున్నాయి.

అఫ్ఘాన్‌దే సిరీస్

రెండో టెస్ట్‌లో గెలుపు

బులవాయో: జింబాబ్వేతో రెండో టెస్ట్‌లో అఫ్ఘానిస్థాన్ 72 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో రెండు టెస్టుల ఈ సిరీస్‌ను అఫ్ఘాన్ 1-0తో కైవసం చేసుకుంది. తొలి మ్యాచ్ డ్రాగా ముగిసిన సంగతి తెలిసిందే. 278 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వే రెండో ఇన్నింగ్స్‌లో 205 పరుగులకే కుప్పకూలింది. ఓవర్‌నైట్ స్కోరు 205/8తో ఆఖరిరోజైన సోమవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆతిథ్య జట్టు ఒక్క పరుగు కూడా చేయకుండానే మిగతా రెండు వికెట్లను కోల్పోయింది. రషీద్ ఖాన్ (7/66) ఏడు వికెట్లతో జింబాబ్వే పతనాన్ని శాసించాడు. మొదటి ఇన్నింగ్స్‌లో 157 రన్స్ చేసిన అఫ్ఘాన్.. రెండో ఇన్నింగ్స్‌లో 363 పరుగులు చేసింది. జింబాబ్వే తొలి ఇన్నింగ్స్‌లో 243 రన్స్ సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా రషీద్, 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా రహ్మత్ షా నిలిచారు.

ఆంధ్రప్రదేశ్ బోణీ

స్కూల్‌గేమ్స్ జాతీయ వాలీబాల్

విజయవాడ: ఆంధ్రప్రదేశ్ బాలికల జట్టు స్కూల్‌గేమ్స్ అండర్-19 జాతీయ వాలీబాల్ పోటీల్లో శుభారంభం చేసింది. ఇక్కడి పీబీ సిద్ధార్థ జూనియర్ కళాశాల వేదికగా సోమవారం మొదలైన ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ 25-15, 25-15, 25-15 పాయింట్లతో ఉత్తరాఖండ్‌ను ఓడించింది. మరో మ్యాచ్‌లో తెలంగాణ 17-25, 25-21, 24-26, 22-25తో హిమాచల్ ప్రదేశ్ చేతిలో పరాజయం పాలైంది. ఇతర మ్యాచ్‌ల్లో మధ్యప్రదేశ్, ఒడిశా, సీబీఎస్ఈ, ఉత్తర ప్రదేశ్, కర్ణాటక జట్లు విజయాలు సాధించాయి. కాగా అంతకు ముందు విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన రావు ఈ పోటీలను ప్రారంభించారు. రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

దక్షిణాఫ్రికా క్లీన్‌స్వీప్

కేప్‌టౌన్: పాకిస్థాన్‌తో ముగిసిన రెండో టెస్ట్‌లో ఆతిథ్య దక్షిణాఫ్రికా పది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. అలాగే సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఫాలోఆన్‌లో సోమవారం నాలుగో రోజు పాక్ 478 పరుగులకు ఆలౌటైంది. షాన్ మసూద్ (145), సల్మాన్ ఆఘా (48), రిజ్వాన్ (41) పోరాడారు. రబాడ, కేశవ్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత 58 పరుగుల స్వల్ప ఛేదన కోసం బరిలోకి దిగిన సౌతాఫ్రికా 7.1 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 61 పరుగులు చేసి నెగ్గింది. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 615, పాక్ 194 పరుగులు చేశాయి.

వైరస్ కలకలం

రూ.11 లక్షల కోట్ల సంపద ఫట్ • సెన్సెక్స్ 1,258 పాయింట్లు పతనం

78,000 దిగువ స్థాయికి సూచీ

388 పాయింట్లు నష్టపోయిన నిఫ్టీ

చిన్న కంపెనీల షేర్లు విలవిల

ముంబై: చైనాను వణికిస్తోన్న హ్యూమన్ మెటానిమో వైరస్ (హెచ్ఎంపీవీ) భారత్‌కూ వ్యాపించిందన్న వార్తలతో స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం కుప్పకూలాయి. సెన్సెక్స్ ఒక దశలో 1,441 పాయింట్లకు పైగా పతనమైంది. చివరికి 1,258.12 పాయింట్ల (1.59 శాతం) నష్టంతో 77,964.99 వద్ద స్థిరపడింది. దాంతో సూచీ 78,000 కీలక స్థాయిని కోల్పోయినట్లైంది. నిఫ్టీ 388.70 పాయింట్లు (1.62 శాతం) క్షీణించి 23,616.05 వద్దకు జారింది. కొత్త వైరస్ కలకలంతో పాటు మూడో త్రైమాసికంలో కంపెనీల ఆదాయ వృద్ధిపై ఆందోళనలు, రూపాయి క్షీణత-డాలర్ బలోపేతం, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల ఉపసంహరణ, అమెరికా కొత్త అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య విధానాలపై అనిశ్చితి, భవిష్యత్‌లో వడ్డీ రేట్ల తగ్గింపుపై ఫెడ్ రిజర్వ్ కఠిన వైఖరి వంటి అంశాలు మార్కెట్‌ను మరింత కుంగదీశాయి. దాంతో మదుపరులు అన్ని విభాగాలు, రంగాల షేర్లలో అమ్మకాలను పోటెత్తించారు. మార్కెట్ సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజే రూ.10.98 లక్షలకు పైగా పతనమై రూ.438.79 లక్షల కోట్లకు (5.11 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది.



- సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో టైటాన్, హెచ్‌సీఎల్ టెక్ మినహా అన్నీ నష్టపోయాయి. టాటా స్టీల్ షేరు 4.41 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. ఎన్‌టీపీసీ, కోటక్ మహీంద్రా బ్యాంక్, పవర్‌గ్రిడ్, అదానీ పోర్ట్స్ షేర్లు 3 శాతానికి పైగా విలువను కోల్పోయాయి.
- ప్రధాన కంపెనీలతో పోలిస్తే చిన్న, మధ్య స్థాయి సంస్థల షేర్లలో మదుపరులు భారీగా అమ్మకాలకు పాల్పడ్డారు. దాంతో బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్ సూచీ 3.17 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 2.44 శాతం క్షీణించాయి.
- అన్ని రంగాల సూచీలూ నేలచూపు చూశాయి. యుటిలిటీస్ ఇండెక్స్ అత్యధికంగా 4.16 శాతం పతనమైంది. పవర్, సర్వీసెస్, మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్, ఎనర్జీ సూచీలు మూడు శాతానికి పైగా నష్టపోయాయి.
- బీఎస్ఈలో 4,244 కంపెనీల షేర్లు ట్రేడవగా.. 3,530 నష్టపోయాయి. 611 లాభపడగా, 114 యథాతథంగా ముగిశాయి. 113 సంస్థల షేర్లు 52 వారాల కనిష్ఠానికి జారుకోగా.. 176 ఏడాది గరిష్ఠాన్ని తాకాయి.
- ఎన్ఎస్ఈ విషయానికొస్తే, నిఫ్టీతో పాటు బ్యాంక్ నిఫ్టీ సూచీలు 200 రోజుల చలన సగటు (డీఎంఏ) కిందికి పడిపోయాయి.
- మార్కెట్ భారీగా నష్టపోవడం వరుసగా ఇది రెండో రోజు. గత శుక్రవారం సెషన్‌లో సెన్సెక్స్ 720 పాయింట్లు, నిఫ్టీ 183 పాయింట్లు నష్టపోయాయి.
- డాలర్‌తో రూపాయి మారకం విలువ 11 పైసలు పెరిగి రూ.85.68 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో నష్టపోయిన రూపీ.. ఆర్‌బీఐ జోక్యంతో మళ్లీ పుంజుకుందని ఫారెక్స్ వర్గాలు పేర్కొన్నాయి.
- అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడి చమురు పీపా ధర ఒక దశలో 76.27 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.
- దేశ రాజధాని ఢిల్లీ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.700 తగ్గి రూ.79,000కు దిగిరాగా.. కిలో వెండి రూ.300 పెరిగి రూ.90,700కు చేరుకుంది. కాగా, అంతర్జాతీయ విపణిలో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ 2,659.60 డాలర్లు, సిల్వర్ 30.87 డాలర్ల స్థాయిలో ట్రేడయ్యాయి.

వెండి నగలకూ హాల్‌మార్కింగ్

- రంగం సిద్ధం చేస్తున్న బీఐఎస్
- ఆరు నెలల్లో అమలు చేసే అవకాశం!

న్యూఢిల్లీ: వెండి నగలు, వస్తువులకూ 'హాల్‌మార్కింగ్'ను తప్పనిసరి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అవసరమైన విధి విధానాలు ఖరారు చేయాలని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి.. భారతీయ ప్రమాణాల సంస్థ బీఐఎస్‌ను కోరారు. బీఐఎస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆయన విలేకరులతో ఈ విషయం చెప్పారు. ప్రస్తుతం బంగారంతో చేసిన నగలు, వస్తువులకు మాత్రమే 'హాల్‌మార్క్' గుర్తును తప్పనిసరి చేశారు. వెండి నగల్లో కల్తీని నిరోధించేందుకు, వాటికీ హాల్‌మార్కింగ్ తప్పనిసరి చేయాలని వినియోగదారుల నుంచి పెద్దఎత్తున విజ్ఞప్తులు అందుతున్నాయి. దీంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు జోషి చెప్పారు. బీఐఎస్ ఇందుకు అవసరమైన విధి విధానాలు ఖరారు చేశాక అందరితో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. కాగా దీనిపై ఇప్పటికే కసరత్తు ప్రారంభమైందని ఇదే కార్యక్రమంలో పాల్గొన్న బీఐఎస్ డైరెక్టర్ జనరల్ ప్రమోద్ కుమార్ తివారీ చెప్పారు. ఇందులో భాగంగా వెండి నగల స్వచ్ఛతను తెలిపేందుకు అవసరమైన హాల్‌మార్కింగ్‌ను రూపొందించి పరిశ్రమ వర్గాలతో చర్చిస్తున్నట్టు తెలిపారు. ఈ చర్చలు పూర్తయితే మూడు నుంచి నాలుగు నెలల్లో వెండి నగలకూ హాల్‌మార్కింగ్ అమలు చేస్తామన్నారు.

స్టాండర్డ్ గ్లాస్ ఐపీఓకు అపూర్వ స్పందన

ప్రారంభమైన కొద్ది నిమిషాల్లోనే పూర్తి సబ్‌స్క్రిప్షన్

ఆఫర్ తొలి రోజునే 13.32 రెట్ల బిడ్ల దాఖలు

హైదరాబాద్‌కు చెందిన స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కు ఇన్వెస్టర్ల నుంచి అద్భుత స్పందన లభించింది. సోమవారం ప్రారంభమైన కొద్ది నిమిషాల్లోనే ఈ ఇష్యూ పూర్తిగా సబ్‌స్క్రైబ్ అయింది. ఎన్ఎస్ఈ డేటా ప్రకారం.. తొలి రోజు పూర్తయ్యేసరికి ఈ ఐపీఓకు ఇష్యూ సైజుతో పోలిస్తే 13.32 రెట్ల బిడ్లు లభించాయి. సంస్థాగతేతర ఇన్వెస్టర్లకు కేటాయించిన షేర్లకు గాను 25.42 రెట్లు, రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి 14.46 రెట్ల బిడ్లు వచ్చాయి. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్స్ వాటా 1.82 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రమోటర్లు, వాటాదారులకు చెందిన షేర్ల విక్రయం ద్వారా మొత్తం రూ.410 కోట్ల సమీకరణ లక్ష్యంతో స్టాండర్డ్ గ్లాస్ ఐపీఓను ప్రారంభించింది. ఇష్యూ ధరల శ్రేణిని రూ.133-140గా నిర్ణయించింది.

అచేతన ఖాతాల సెటిల్‌మెంట్ నిబంధనల సడలింపు : సెబీ

30 రోజుల పాటు అచేతనంగా ఉన్న ట్రేడింగ్ ఖాతాల్లోని క్లయింట్ల నిధుల సెటిల్‌మెంట్‌కు సంబంధించిన నిబంధనలను క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ సడలించింది. ఇన్వెస్టర్ల ప్రయోజనాలను రక్షించే ఉద్దేశంతో సరళీకరించిన నియమావళి తక్షణమే అమలులోకి వస్తుందని సెబీ స్పష్టం చేసింది. ఇప్పటివరకు అమలైన నిబంధనల ప్రకారం.. స్టాక్ బ్రోకర్లు అచేతన ఖాతాలను రోజువారీగా గుర్తించి, వాటిలోని నిధులను క్లయింట్లకు 3 పని దినాల్లో బదలాయించాల్సి వచ్చేది. ఇకపై స్టాక్ బ్రోకర్లు ఎక్స్ఛేంజీలు తమ వార్షిక క్యాలెండర్‌లో నోటిఫై చేసిన నెలవారీ రన్నింగ్ అకౌంట్ సెటిల్‌మెంట్ సైకిల్ ప్రకారంగా అచేతన ఖాతాల్లోని సొమ్మును పరిష్కరించాల్సి ఉంటుంది.

ఇక పక్కాగా పరపతి సమాచారం

బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలకు ఆర్‌బీఐ ఆదేశాలు

ముంబై: ఖాతాదారుల పరపతి చరిత్రలో ఏమైనా మార్పులు జరిగితే బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఇక ఆ విషయాన్ని పక్కాగా ఖాతాదారులకు ఎస్ఎంఎస్‌లు, ఈ-మెయిల్స్ ద్వారా అందజేయాలి. అలాగే ఏవైనా సంస్థలు ఖాతాదారుల పరపతి సమాచార నివేదిక (సీఐఆర్) తీసుకున్నా ఆ విషయాన్ని కూడా బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఖాతాదారులకు తెలియజేయాలి. దీనికి సంబంధించి భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) సోమవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. లోపాలను సరిదిద్దుకునేందుకు ఖాతాదారులు సమర్పించిన సమాచారాన్ని బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు తిరస్కరించినా, ఆ విషయాన్ని కూడా 30 రోజుల్లోగా ఖాతాదారులకు తెలియజేయాలి. లేకపోతే రోజుకు రూ.100 చొప్పున జరిమానా చెల్లించాల్సి ఉంటుందని ఆర్‌బీఐ తెలిపింది. తాజా ఆదేశాలతో ఖాతాదారుల పరపతి నిర్ధారణ ఎప్పటికప్పుడు నవీకరించబడి, రుణ వితరణ సులభమవుతుందని భావిస్తున్నారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	78,700 ▼	72,140 ▼	99,000 ▼
విజయవాడ	79,500 ▼	75,000 ▼	92,000 ▲
విశాఖపట్నం	77,380 ▼	70,930 ▼	90,790 ▲
రాజమండ్రి	78,710 ▼	71,150 ▼	90,400 ▲
ప్రొద్దుటూరు	78,750 ▼	72,920 ▼	90,300 ▼
ముంబై	77,161 ▼	70,680 ▼	89,152 ▲

పెట్రోకెమికల్స్ వ్యాపారంలోకి అదానీ

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ పెట్రోకెమికల్స్ వ్యాపారంలోకి ప్రవేశిస్తోంది. ఇందుకోసం థాయ్‌లాండ్ కేంద్రంగా పనిచేసే ఇండోరమా రీసోర్సెస్ లిమిటెడ్‌తో కలిసి సంయుక్తం (జేవీ)గా వలోర్ పెట్రోకెమికల్ లిమిటెడ్ (వీపీఎల్) పేరుతో ప్రత్యేక కంపెనీ ఏర్పాటు చేసింది. ఈ జేవీ ఈక్విటీలో అదానీ గ్రూప్, ఇండోరమా కంపెనీకి చెరి సగం వాటా ఉంటుంది. అదానీ పెట్రోకెమికల్స్ అనే కంపెనీ ద్వారా అదానీ గ్రూప్ ప్రధాన కంపెనీ అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఈ పెట్టుబడి సమకూరుస్తుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా గుజరాత్‌లో ఒక రిఫైనరీ, పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌లు, స్పెషాలిటీ కెమికల్స్ తయారీ యూనిట్లను రెండు దశల్లో ఏర్పాటు చేస్తారు. ఏటా 20 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటు చేసే ఈ పెట్రోకెమికల్ ప్లాంటు కోసం 400 కోట్ల డాలర్ల (సుమారు రూ.34,000 కోట్లు) వరకు ఖర్చు చేయనున్నట్టు అదానీ గ్రూప్ చైర్మన్ గౌతం అదానీ ప్రకటించారు. ఇందులో 10 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటు చేసే తొలి దశ వచ్చే ఏడాది, ఇంకో 10 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటు చేసే రెండో దశ 2027లో పూర్తవుతుంది.

సౌదీ అరేబియా అప్పుల వేట

రియాద్: సౌదీ అరేబియా ఆర్థిక కష్టాల్లో ఉందా? పరిస్థితులను గమనిస్తే అలాగే అనిపిస్తోంది. పెట్రో డాలర్లతో తులతూగుతున్న ఈ దేశం కూడా ఇప్పుడు అప్పుల వేటలో పడింది. ఇందులో భాగంగా సోమవారం రుణ పత్రాల ద్వారా 700 కోట్ల డాలర్లు (సుమారు రూ.60,000 కోట్లు) సమీకరించింది. బడ్జెట్ లోటు పూడ్చుకోవడంతో పాటు వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు అవసరమైన నిధుల సమీకరణలో భాగంగా సౌదీ అరేబియా ప్రభుత్వం ఈ రుణ పత్రాలు జారీ చేస్తోంది. గత ఏడాది కూడా రుణ పత్రాల జారీ ద్వారా సౌదీ ప్రభుత్వం 2,500 కోట్ల డాలర్లు సమీకరించింది. ఈ సంవత్సరం ఇది 3,700 కోట్ల డాలర్ల (సుమారు రూ.3.17 లక్షల కోట్లు) వరకు ఉంటుందని అంచనా. బ్యారల్ ముడి చమురు ధర తన అంచనా అయిన 90 డాలర్లకు దిగువకి పడిపోవడంతో సౌదీ అరేబియా కూడా నిధుల కొరత ఎదుర్కొంటోంది. దీంతో అప్పుల వేటలో పడింది.

ఆస్తమా స్క్రీనింగ్ కోసం సిప్లా మొబైల్ యాప్

న్యూఢిల్లీ: ఫార్మా దిగ్గజం సిప్లా ఉబ్బసం (ఆస్తమా) రోగుల స్క్రీనింగ్ కోసం ఒక మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. సిప్ఎయిర్ పేరిట తయారుచేసిన ఈ మొబైల్ యాప్ ప్రస్తుతం ఆండ్రాయిడ్ ఫోన్లపై అందుబాటులో ఉండగా త్వరలోనే ఐఓఎస్ డివైస్‌లకు కూడా అందుబాటులోకి తెస్తామని కంపెనీ తెలిపింది. దేశంలో ఉబ్బసం రోగుల సంఖ్య 3.43 కోట్లున్నట్టు అంచనా అని గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజ్ నివేదిక తెలియచేసింది. ఉబ్బసం కారణంగా మరణించిన వారు, ఏ పనీ చేయలేని స్థితిలో ఉన్న వారి సంఖ్య ప్రపంచ దేశాలతో పోల్చితే మన దేశంలో మూడు రెట్లు అధికంగా ఉంది. ఉబ్బసం వ్యాధిని సరిగ్గా గుర్తించలేకపోవడం, గుర్తించిన కేసుల్లో సరైన చికిత్స చేయకపోవడం ఇందుకు కారణమని చెబుతున్నారు.

ఎన్ఎండీసీ-కేఐఓసీఎల్ విలీనం!

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మరో రెండు ప్రభుత్వ రంగ సంస్థల విలీనానికి రంగం సిద్ధమవుతోంది. ఇనుప ఖనిజ ఉత్పత్తిలో ఉన్న ఎన్ఎండీసీ లిమిటెడ్, కేఐఓసీఎల్ లిమిటెడ్ కంపెనీలను విలీనం చేయాలని కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనను ప్రభుత్వ రంగ సంస్థల శాఖ (డీపీఈ), కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖల ఆమోదం కోసం పంపించింది. ఇందులో ఎన్ఎండీసీ లిమిటెడ్ నవరత్న పీఎస్‌యూ, కేఐఓసీఎల్ వినీ రత్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ. ఒకే రంగంలో ఉన్న ఈ రెండు సంస్థల విలీనంతో వాటి వాణిజ్య కార్యకలాపాలకు మరింత బలం లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

7వ తేదీ			
హైదరాబాద్	475	విజయవాడ	500
వరంగల్	477	గోదావరి	500
చిత్తూరు	523	విశాఖపట్నం	510
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	114	విజయవాడ	116
వరంగల్	114	గుంటూరు	115
కరీంనగర్	114	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	114	చిత్తూరు	87
కర్నూలు	114	నెల్లూరు	92
విశాఖపట్నం	107	అనంతపురం	92
గోదావరి	116		

12న అరకులోయకు సుప్రీం జడ్జీల బృందం

▸ సీజే, 25 మంది న్యాయమూర్తులు కూడా..

అరకులోయ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయను ఈ నెల 12వ తేదీన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, 25 మంది న్యాయమూర్తులు, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సందర్శించనున్నారు. న్యాయమూర్తుల పర్యటన ఏర్పాట్లపై అల్లూరి జిల్లా జేసీ అభిషేక్ గౌడ, పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సోమవారం జిల్లా అడిషనల్ జడ్జి రత్నకుమార్‌తో కలిసి ఇక్కడి పున్నమి రిసార్టులో సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానిక రెవెన్యూ, పోలీస్, టూరిజం అధికారులకు పలు సూచనలు చేశారు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌తోపాటు 25 మంది న్యాయమూర్తులు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆదివారం ఉదయం విశాఖపట్నం నుంచి రైలులో బయలుదేరి పదిన్నర గంటలకు అరకులోయ చేరుకుంటారని జేసీ, పీవో తెలిపారు. హరిత వేలీ రిసార్టులో కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న అనంతరం గిరిజన మ్యూజియం, గిరి గ్రామదర్శిని, అనంతగిరి కాఫీ తోటలు, బొర్రా గుహలు సందర్శించి విశాఖపట్నం వెళతారన్నారు. న్యాయమూర్తుల రాక నేపథ్యంలో భద్రత ఏర్పాట్ల నిమిత్తం ఒక రోజు ముందుగానే పర్యాటక ప్రాంతాలను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకోనున్నట్లు తెలిపారు.

..వారి వల్లే సంధ్య థియేటర్ దుర్ఘటన

▸ అల్లు అర్జున్ మేనేజర్, సెక్యూరిటీకి ముందస్తు బెయిల్ ఇవ్వొద్దు

▸ హైకోర్టులో పోలీసుల వాదన

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పుష్ప-2 సినిమా ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట జరిగిన కేసులో నిందితులు పెట్టుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌పై సోమవారం హైకోర్టులో విచారణ జరిగింది. వీటిపై జస్టిస్ కే సుజన ధర్మాసనం విచారణ చేపట్టింది. అల్లు అర్జున్ మేనేజర్ ఎ.శరత్‌చంద్ర నాయుడు, వ్యక్తిగత సెక్యూరిటీ సిబ్బంది చెరుకు రమేశ్, శ్రీరాముల రాజులకు ముందస్తు బెయిల్ ఇవ్వరాదని పోలీసుల తరఫున రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు కోరారు. ఓ మహిళ మృతి, ఓ చిన్నారి చావుబతుకుల మధ్య ఉండటానికి నిందితులు కారణమయ్యారని పేర్కొన్నారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ప్రకాశ్‌రెడ్డి వాదిస్తూ..అది అనుకోకుండా జరిగిన దుర్ఘటన అని, ఆ ఘటన జరగాలని ఎవరూ కోరుకోలేదని తెలిపారు. ఆ ఘటనతో వారికి ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్పందిస్తూ తొక్కిసలాట జరగడానికి పిటిషనర్లు కారణమయ్యారని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం తీర్పును రిజర్వు చేసింది.

'రియల్' నిబంధనలు సరళతరం

రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ పుంజుకునేలా చర్యలు

▸ బిల్డర్లు, డెవలపర్లు నిబంధనలు పాటించాలి

▸ 2 రోజుల్లో భవన నిర్మాణాలకు కొత్త రూల్స్

▸ పెండింగ్‌లో ఉన్న టీడీఆర్ బాండ్ల జారీ

▸ మీడియాతో మంత్రి నారాయణ

▸ ఏపీ రెరాలో పెండింగ్ దరఖాస్తులపై స్పెషల్ డ్రైవ్

అమరావతి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి చెందాలనేది సీఎం చంద్రబాబునాయుడి లక్ష్యమని, దానికి అనుగుణంగా నిబంధనలు సరళతరం చేస్తున్నామని మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ చెప్పారు. విజయవాడలో ఉన్న రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(రెరా) కార్యాలయంలో మున్సిపల్ శాఖ కార్యదర్శి, రెరా చైర్మన్ కన్నబాబు, రెరా సభ్యులు, అధికారులతో కలిసి పెండింగ్ దరఖాస్తులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడారు. "భవనాలు, ప్లాట్లు కొనుగోలు చేసేవారు తప్పుడు ప్రకటనలు చూసి మోసపోకుండా ఉండేలా చూడటమే రెరా లక్ష్యం. బిల్డర్లు, డెవలపర్లు నిబంధనలు కచ్చితంగా పాటించాలి. రెరాలో ఇప్పటి వరకూ 167 దరఖాస్తులు వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్నాయి. దరఖాస్తులు పరిష్కారం కావడం లేదని ఫిర్యాదులొచ్చాయి. దీంతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాం. 30 మంది క్లయింట్లు, బిల్డర్లు, డెవలపర్లు తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చారు. దరఖాస్తుల పరిష్కారానికి అధికారులకు పలు సూచనలు చేశాం. పెండింగ్ దరఖాస్తులన్నీ ఈ నెలాఖరులోగా పరిష్కరిస్తాం. ఇతర రాష్ట్రాల్లో అమల్లో ఉన్న విధానాలనూ పరిశీలించాం. రెరా నిబంధనలు మరింత కఠినతరం చేసేలా కమిటీ వేసి ముందుకెళ్తాం. రెరా అనుమతులు ఆఫ్‌లైన్‌లో కాకుండా ఆన్‌లైన్‌లో జరిగేలా త్వరలో మార్పులు చేస్తున్నాం. గత ప్రభుత్వంలో బిల్డర్లు, డెవలపర్లతో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ప్రజలు ఎంతో ఇబ్బందులు పడ్డారు. భవన నిర్మాణాలకు సంబంధించి కొత్తగా రూపొందించిన నిబంధనలను గురువారం జారీచేస్తాం. ప్రభుత్వానికి బిల్డర్లు సహకరించాలి.

నెలాఖరులోగా పెండింగ్ టీడీఆర్ బాండ్లు జారీ

గతంలో తణుకు, తిరుపతిలో టీడీఆర్ బాండ్ల జారీలో అక్రమాలు జరగడంతో అన్ని చోట్ల బాండ్ల జారీ నిలిపేశాం. తాజాగా ఒకట్రెండు చోట్ల మినహా మిగిలిన అన్ని చోట్లా పెండింగ్‌లో ఉన్న టీడీఆర్ బాండ్లను జారీ చేస్తున్నాం. తణుకులో టీడీఆర్ కుంభకోణంపై విచారణ పూర్తయిన తర్వాత సీఎం చంద్రబాబుతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. ప్రస్తుతం రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న వాటిలో 321 టీడీఆర్‌ల వెరిఫికేషన్ పూర్తయింది. మరో 501 టీడీఆర్‌ల వెరిఫికేషన్ జరగాల్సి ఉంది. విశాఖపట్నంలో 184, తిరుపతిలో 153, కర్నూలులో 93, గుంటూరులో 120, కాకినాడలో 91, రాజమండ్రిలో 50, కడపలో 46, విజయవాడలో 30తో పాటు ఇతర కార్పొరేషన్‌లలో మరికొన్ని పెండింగ్‌లో ఉన్నాయి. మొత్తంగా 822 టీడీఆర్‌లకు సంబంధించి ఈ నెలాఖరు కల్లా జారీ ప్రక్రియ పూర్తి చేస్తాం.

అక్రమ లేఅవుట్లపై స్పష్టత

రాష్ట్రంలో అనధికార లేఅవుట్లు చాలా వరకు ఉన్నాయి. ఎక్కడెక్కడ ఎన్నెన్ని అక్రమ లేఅవుట్లు ఉన్నాయన్న దానిపై ఇప్పటికే ఒక క్లారిటీ వచ్చింది. అనుమతులు లేని లేఅవుట్లలో ప్లాట్లు కొనడం ద్వారా కొనుగోలుదారులు అనేక ఇబ్బందులు పడతారు. మరోవైపు భవన, లేఅవుట్ల క్రమబద్ధీకరణ విషయంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలపై ఎలా ముందుకెళ్లాలనే దానిపై అధ్యయనం చేస్తున్నాం" అని మంత్రి చెప్పారు.



ఏపీ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీలో పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో మంత్రి నారాయణ, తదితరులు

ఉల్లంఘనలు లేకుంటే ట్రాన్సిట్ పర్మిట్ ఇవ్వండి

▸ మార్గదర్శకాలు పాటించండి

▸ గనుల శాఖకు హైకోర్టు ఆదేశం

అమరావతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గతేడాది అక్టోబరు 21న జారీ చేసిన మార్గదర్శకాలను అనుసరించి.. ఉల్లంఘనలకు పాల్పడని మైనర్ మినరల్ లీజు దారులకు నెల రోజుల్లోగా ట్రాన్సిట్ పర్మిట్లు జారీ చేయాలని గనులశాఖ డైరెక్టర్‌ను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు ఏకసభ్య ధర్మాసనం న్యాయమూర్తి సోమవారం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. గత ఏడాది సెప్టెంబరు 27 నుంచి వ్యాజ్యం పలుమార్లు విచారణకు వచ్చిందని, ఇప్పటి వరకు కౌంటర్ దాఖలు చేయలేదని న్యాయమూర్తి అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా ట్రాన్సిట్ పర్మిట్లు జారీ చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు. వ్యాజ్యంపై విచారణను ఫిబ్రవరి 10కి వాయిదా వేశారు. రాష్ట్రంలోని క్వార్ట్జ్, మైకా, సిలికాశాండ్ వంటి మైనర్ మినరల్ లీజు దారులకు ట్రాన్సిట్ పర్మిట్లు జారీ చేసేలా మైనింగ్‌శాఖ అధికారులను ఆదేశించాలని కోరుతూ ఫెడరేషన్ ఆఫ్ మైనింగ్ మినరల్ ఇండస్ట్రీ(ఫెమ్మీ) ప్రధాన కార్యదర్శి చెట్టి హనుమంతురావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం సోమవారం విచారణకు రాగా.. పిటిషనర్ తరపు న్యాయవాదులు వాదనలు వినిపించారు. "ఫెమ్మీ సభ్యులకు మైనింగ్ లీజు అనుమతులు ఉన్నాయి. అయినప్పటికీ వారందరూ జూన్, 2024 నుంచి మైనింగ్ పోర్టల్‌లో ట్రాన్సిట్ పర్మిట్‌లు పొందలేకపోతున్నారు. పర్మిట్లు జారీ చేసేలా అధికారులను ఆదేశించాలి" అని అభ్యర్థించారు. గనులశాఖ తరఫున ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపించారు. "ఉల్లంఘనలకు పాల్పడని మైనింగ్ లీజుదారులకు పర్మిట్లు జారీ చేసే విషయంలో గనుల శాఖ ముఖ్యకార్యదర్శి గత ఏడాది అక్టోబరు 21న మార్గదరకాలు ఇచ్చారు. దీనికి సంబంధించిన మెమోను కోర్టు ముందు ఉంచాం" అని వివరించారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి పైవిధంగా ఉత్తర్వులు జారీ చేశారు.

ఏటీఎస్‌ల సమస్య కేంద్రం దృష్టికి!

▸ ఢిల్లీ వెళ్లిన రవాణా మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డి

▸ నేడు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో చర్చ

▸ రాష్ట్రంలో కనీసం 63 చోట్ల ఏటీఎస్‌లు ఉండాలి

▸ కర్ణాటకలో ప్రభుత్వమే ఏర్పాటు చేసింది

▸ ఏపీలోనూ ఏర్పాటుకు సహకరించాలని విజ్ఞప్తి?

అమరావతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): 'ఆటోమేటిక్ ఫిట్నెస్ పరీక్ష కేంద్రాలు ఆటోవాలాకు బాగా దూరం అవుతున్నాయ్. శైవ క్షేత్రం శ్రీశైలం నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే 200 కి.మీ దూరం ప్రయాణించాలి. ఇతర జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న ఫిట్నెస్ సెంటర్లలోనే ఆటోమేటిక్ టెస్టింగ్ సెంటర్లు(ఏటీఎస్) ఏర్పాటు చేయండి' అంటూ రాష్ట్రంలోని వాహనదారులు చేసిన విన్నపాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లేందుకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి ఢిల్లీకి వెళ్లారు. అన్ని రాష్ట్రాల రవాణా మంత్రులు, ముఖ్య కార్యదర్శులతో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఢిల్లీలో సమావేశం ఏర్పాటు చేశారు. మన రాష్ట్రంలో మూడు ప్రధాన అంశాలను మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డి ఈ సమావేశంలో కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి సహకారం కోరనున్నారు. ప్రధానంగా ఏటీఎస్‌ల ఏర్పాటు, పదిహేనేళ్లు దాటిన వాహనాలను గుజిరీకి వేయడం, వాటి యజమానులకు కొత్త వాహనాల కొనుగోలులో పదిశాతం రాయితీ, డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్స్ ఎలక్ట్రికల్ ద్వారా పాస్ అయితేనే లైసెన్స్ జారీ, వాహన్ పరివాహన్‌లో సమస్యలపై రామ్ ప్రసాద్ రెడ్డి చర్చించనున్నారు. రాష్ట్రంలో కోటిన్నరకుపైగా వాహనాలు ఉండటంతో రవాణా శాఖ 63 ఫిట్నెస్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. అయితే ఏటీఎస్‌లను ఏర్పాటు చేయాల్సిందేనని రాష్ట్రాలపై కేంద్రం ఒత్తిడి తేవడంతో ఏపీలో జిల్లాకొకటి చొప్పున 25 ఏటీఎస్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం టెండర్లు పిలిచింది. దీనిపై ఆటో, ట్యాక్సీ డ్రైవర్ల నుంచి విద్యాసంస్థల వాహనాల నిర్వాహకులు, లారీ యజమానుల వరకూ ఇబ్బందులు వ్యక్తం చేశారు. వాహన ఫిట్నెస్ కోసం జిల్లా కేంద్రానికి వెళ్లడం కష్టంగా ఉందని, ఇటీవల శ్రీశైలంలో వాహనదారులు నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరికి విజ్ఞప్తి చేశారు. 200 కి.మీ. దూరంలోని నంద్యాలకు వెళ్లాలంటే ఆ రోజు ఇక తిరిగి రాలేమని, శ్రీశైలంలో ఒక ఎఫ్‌సీ ఏర్పాటు చేయించాలని కోరారు. లేదా ఆత్మకూరులో కొనసాగించినా కొంత ఫలితం ఉంటుందన్నారు. అనంతపురం జిల్లాలోనూ రాయదుర్గం, బొమ్మనహల్, డీ హీరేహల్ నుంచి జిల్లా కేంద్రానికి వచ్చి వెళ్లాలంటే ఒక రోజు కుదరని పని. ఇలాంటి పరిస్థితుల్లో ఆటోవాలాలు ఎఫ్‌సీ చేయించుకోరని అంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇదే సమస్య ప్రధానంగా వినిపిస్తుండటంతో కనీసం 100 వరకూ డీఎల్, ఎఫ్‌సీ కోసం ఆఫీసులు ఏర్పాటు చేయాలని రవాణా అధికారులు మంత్రికి తెలిపారు. ప్రధాని సొంత రాష్ట్రం గుజరాత్‌లో 250 కేంద్రాలకు అనుమతి ఉందని, 150 కేంద్రాలు పని ప్రారంభించాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇదే సమస్యను పలువురు వాహన యజమానులూ మంత్రి దృష్టికి తీసుకురావడంతో కేంద్రాన్ని సాయం కోరనున్నట్లు తెలిసింది.

రోజుకు 24 మించి ఇవ్వలేమంటున్న ఎంవీఐలు

కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ మార్గదర్శకాల ప్రకారం ఏటీఎస్‌లలో 43 పరీక్షలు చెయ్యాలని, వాటిలో చూసి పరిశీలించేవి 29 ఉన్నాయని, అవన్నీ చేయాలంటే రోజుకు(ఎనిమిది గంటల్లో) 20 నుంచి 24 వాహనాలకు మించి ఎఫ్‌సీ ఇవ్వలేమని ఎంవీఐలు చెబుతున్నారు. భారీ వాహనానికి 43 నిమిషాలు, చిన్న వాహనానికి 15 నిమిషాలు పడుతోందని, జిల్లా నలుమూలల నుంచి వాహనాలు ఒకే కేంద్రానికి వస్తే రోజుకు ఎన్ని చెయ్యగలమని ప్రశ్నిస్తున్నారు. ఎక్కువ సెంటర్ల ఏర్పాటే ఏకైక పరిష్కార మార్గమని స్పష్టం చేస్తున్నారు. మే 15 నుంచి జూన్ 15 వరకు రాష్ట్రవ్యాప్తంగా విద్యా సంస్థలకు చెందిన 33 వేల వాహనాలకు ఫిట్నెస్ సర్టిఫికెట్లు ఇవ్వడం ఈ 26 ఏటీఎస్‌లతో ఎట్టి పరిస్థితుల్లోనూ సాధ్యం కాదని మంత్రి కేంద్రం దృష్టికి తీసుకెళ్లనున్నారు. కనీసం 63 చోట్ల ప్రభుత్వమే సొంతంగా ఏటీఎస్‌ల ఏర్పాటుకు సహకారం అందించాలని, రోడ్ సేఫ్టీ ఫండ్ నుంచి రూ.200 కోట్లు మంజూరు చేయాలని మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డి కేంద్రానికి విన్నవించబోతున్నారు. ఇటీవల కర్ణాటకలో పర్యటించిన అనుభవాలను వివరించి అక్కడ ఏటీఎస్‌ల ఏర్పాటు రాష్ట్ర ప్రభుత్వానికి ఎంత ఉపయోగకరమో వివరించనున్నట్లు తెలిసింది. అలాగే, కాలం చెల్లిన వాహనాలను స్వచ్ఛందంగా తుక్కుకు ఇచ్చేసి, కొత్త వాహనాన్ని కొనుగోలు చేస్తే ఇచ్చే పది శాతం రాయితీలో అక్రమాలు జరిగే అవకాశం ఉన్నట్లు రాష్ట్ర రవాణా శాఖ కేంద్రం దృష్టికి తీసుకెళ్లనుంది. పదిహేనేళ్ల క్రితం కొన్న మారుతి 800ను గుజిరీకి ఇచ్చేసి ఇప్పుడు ఇన్నోవా లేదా ఫార్చ్యూనర్ కొనుగోలు చేస్తే ఆ పాత కారు కన్నా కొత్త కారుపై ఇచ్చే రాయితీ ఎక్కువగా ఉంటుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేయనున్నట్లు తెలిసింది. చిన్న, మధ్య, లగ్జరీ కార్లను పరిగణనలోకి తీసుకుని రాయితీ నిర్ణయించాలని రాష్ట్ర రవాణా అధికారులు కోరనున్నారు. అలాగే, వాహన్ పరివాహన్ ద్వారా ఎదురవుతోన్న సమస్యలు, ఎలక్ట్రిక్ డ్రైవింగ్ టెస్ట్ ద్వారా లైసెన్స్‌ల జారీలో ఇబ్బందులనూ ఢిల్లీలో జరిగే సమావేశంలో మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డి ప్రస్తావించనున్నట్లు రవాణా శాఖ వర్గాలు తెలిపాయి.

చిత్రజ్యోతి

SINCE 1965

మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం



రామ్‌చరణ్ హీరోగా నటించిన 'గేమ్ ఛేంజర్' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను రాజమహేంద్రవరంలో శనివారం నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ వేడుకకు కాకినాడ జిల్లా గైగోలుపాడుకు చెందిన మణికంఠ(23), తోకాడ చరణ్(22) అనే ఇద్దరు యువకులు హాజరయ్యారు. ఇద్దరూ బైక్‌పై ఇంటికి తిరిగి వెళ్తుండగా ప్రమాదవశాత్తు వ్యాన్ ఢీకొని మరణించారు. వీరి మృతిపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హీరో రామ్‌చరణ్, నిర్మాత దిల్ రాజు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. జనసేన పార్టీ తరఫున మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయాన్ని పవన్ కల్యాణ్ ప్రకటించారు. ప్రభుత్వం నుంచి తగిన సహాయం అందించే ఏర్పాట్లు చేయాలని తన కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. కాగా, ఘటన గురించి తెలిసిన వెంటనే రామ్‌చరణ్ తన మనుషులను మృతుల కుటుంబ సభ్యుల వద్దకు పంపించారు. ఆ రెండు కుటుంబాలకు చెరొక రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. నిర్మాత దిల్ రాజు కూడా రెండు కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం చేస్తానని ప్రకటించారు. భవిష్యత్తులో కూడా ఆ కుటుంబాలకు అండగా నిలుస్తానన్నారు.

అద్భుతమైన పాత్రతో...



మంచు విష్ణు టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'కన్నప్ప'. ముఖేశ్ కుమార్ దర్శకత్వంలో డా.మోహన్ బాబు నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాలో నటిస్తున్న పలువురు నటీనటుల ఫస్ట్ లుక్స్‌ను మేకర్స్ విడుదల చేశారు. తాజాగా, ఈ సినిమాలో పార్వతీదేవీగా నటించిన కాజల్ అగర్వాల్ ఫస్ట్ లుక్ రివీల్ చేశారు. 'ముల్లోకాలు ఏలే తల్లి.. భక్తుల్ని ఆదుకునే త్రిశక్తి.. శ్రీకాళహస్తిలో వెలసిన శ్రీ జ్ఞాన ప్రసూనాంబిక' అంటూ కాజల్ పోషిస్తున్న పార్వతీ దేవి లుక్‌ను పరిచయం చేశారు మేకర్స్. ఈ పోస్టర్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు కాజల్. సినిమాలో పార్వతీ దేవీ పాత్ర పోషిస్తున్నందుకు ఆనందం వ్యక్తం చేశారు. 'ఇది నేను ఎన్నాళ్లుగానో కలలుగంటున్న పాత్ర. ఇప్పటికి నా కల నెరవేరింది. ఇటువంటి పవిత్రమైన.. అద్భుతమైన పాత్రతో కొత్త ఏడాదిని ఆరంభిస్తున్నందుకు సంతోషంగా ఉంది' అని పేర్కొన్నారు. ఏప్రిల్ 25న సినిమా విడుదల కానుంది. అక్షయ్‌కుమార్ శివుడిగా నటించిన ఈ చిత్రంలో ప్రభాస్, మోహన్‌బాబు, మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్, ఆర్.శరత్‌కుమార్, బ్రహ్మానందం, ప్రీతి ముకుందన్ కీలక పాత్రలు పోషించారు.

సినిమా మామూలుగా ఉండదు



వెంకటేశ్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. ఐశ్వర్య రాజేశ్, మీనాక్షి చౌదరి కథానాయికలు. దిల్‌రాజు, శిరీష్ నిర్మించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. సోమవారం సినిమా ట్రైలర్‌ను మహేశ్‌బాబు ఆన్‌లైన్‌లో విడుదల చేశారు. నిజామాబాద్ కలెక్టర్ గ్రౌండ్స్‌లో జరిగిన వేడుకలో వెంకటేశ్ మాట్లాడుతూ "మీరు నాపై చూపించే ప్రేమాభిమానాలకు కృతజ్ఞతలు. ఇప్పటివరకూ నాకు 'బొబ్బిలిరాజా', 'చంటి', 'గణేశ్', 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు', 'ఎఫ్ 2', 'ఎఫ్ 3' ఇలా ఎన్నో విజయాలు ఇచ్చారు. ఇప్పుడు 'సంక్రాంతికి వస్తున్నాం'. ఇది పక్కా సంక్రాంతి సినిమా. వినోదాత్మకంగా ఉంటుంది. ఈ సినిమాతో పాటు 'గేమ్ ఛేంజర్', 'డాకు మహారాజ్' కూడా ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నాను. దిల్‌రాజు నిర్మాణంలో చేసిన నాలుగు సినిమాలూ సూపర్ హిట్లు అయ్యాయి. వారితో మరిన్ని సినిమాలు చేయాలని ఉంది. అనిల్ సినిమాను అద్భుతంగా తెరకెక్కించారు. పెళ్లాలకి మీ ఫ్లాష్‌బ్యాకులు చెప్పొద్దు. సినిమా చూడండి. మామూలుగా ఉండదు" అని అన్నారు. నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ "వెంకటేశ్, అనిల్, శిరీష్ ఈ సినిమాను ఓ బాధ్యతగా తీసుకుని 72 రోజుల్లోనే పూర్తి చేశారు. ఓ సినిమా వేడుక పూర్తిస్థాయిలో నిజామాబాద్‌లో జరగడం ఇదే ప్రథమం. శిరీష్‌కూ, నాకూ సినిమాలపై ఇష్టం ఏర్పడింది ఇక్కడే. ఈ సంక్రాంతి మా సంస్థకు బ్లాక్‌బస్టర్ పొంగల్‌గా మారుతుంది" అని చెప్పారు. "నేను వేదికపై ఎప్పుడూ మాట్లాడింది లేదు. ఈ సినిమా కచ్చితంగా అందరినీ అలరిస్తుంది. ఈ సినిమాలో భాగమైన అందరికీ ధన్యవాదాలు" అని నిర్మాత శిరీష్ తెలిపారు. "మీరు ట్రైలర్‌లో చూసింది కొంతే. సినిమాలో చాలా చాలా ఉంది. ఇది టిపికల్ జోనర్ సినిమా. వెంకటేశ్ అద్భుతంగా నటించారు. సినిమాలో చాలా ఆసక్తికరమైన మలుపులు ఉంటాయి పండక్కి. పెద్ద హిట్ కొట్టబోతున్నాం. ఈ సినిమాలో వెంకటేశ్ పోషించిన పాత్ర.. ఆయన కెరీర్‌లోనే భిన్నమైనది" అని అన్నారు.

- నిజామాబాద్ కల్చరల్, ఆంధ్రజ్యోతి

టికెట్ ధరల పెంపుపై సీఎంను కలుస్తా : దిల్ రాజు

తెలంగాణలో 'గేమ్ ఛేంజర్' సినిమా టికెట్ ధరల పెంపుపై సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేస్తానని ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎఫ్‌డీసీ) చైర్మన్, నిర్మాత దిల్ రాజు అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ చిత్రానికి తెలంగాణలో కూడా టికెట్ ధరలు పెంచేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని, ఈ విషయంలో ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తారని ఆశిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. టికెట్ రేట్లు పెంచడం వల్ల ప్రభుత్వానికి 18 శాతం ట్యాక్స్ రూపంలో ఆదాయం సమకూరుతుందని చెప్పారు. 'గేమ్ ఛేంజర్', 'సంక్రాంతికి వస్తున్నాం' తనకు కమ్ బ్యాక్ ఫిల్మ్స్ అని నమ్ముతున్నట్లు దిల్‌రాజు చెప్పారు.


దెయ్యం పాత్రలో పూజా హెగ్డే!



హీరోయిన్ పూజా హెగ్డే దెయ్యం పాత్రలో కనిపించనున్నారు. దర్శక నటుడు రాఘవ లారెన్స్ రూపొందించనున్న 'కాంచన' సీక్వెల్ నాలుగో భాగంలో ఆమె దెయ్యంగా నటించనున్నట్టు సమాచారం. ఇందులోనే హీరోయిన్‌గా పూజాను ఎంపిక చేసినట్టు సమాచారం. ఇప్పటివరకు వచ్చిన తొలి మూడు భాగాలు సూపర్‌హిట్ అయిన విషయం తెల్సిందే. దీంతో నాలుగో భాగాన్ని రూపొందించే పనిలో రాఘవ లారెన్స్ నిమగ్నమయ్యారు. ఇందుకోసం టెక్నీషియన్స్, నటీనటుల ఎంపిక జరుగుతోంది.

మా నటన సరిపోవట్లేదు

- బ్రహ్మాజీ



ఎక్స్ వేదికగా నటుడు బ్రహ్మాజీ పెట్టిన ఓ పోస్ట్ ఇప్పుడు వైరల్ అవుతోంది. 'ఎక్కడ చూసినా బౌన్సర్లే.. వాళ్ల ఓవరాక్షన్ ముందు మా నటన సరిపోవట్లేదు. బయట ఓకే.. సెట్స్‌లో కూడానా' అని పోస్ట్ చేశారు. తాజా పరిణామాల నేపథ్యంలో ఆయన పెట్టిన ఈ పోస్ట్ హాట్‌టాపిక్‌గా మారింది. అయితే, ఎవరి బౌన్సర్లను ఉద్దేశించి ఈ పోస్ట్ పెట్టారో మాత్రం ఆయన చెప్పలేదు.

విశాల్‌కు అనారోగ్యం!



నెల రోజులుగా హీరో విశాల్ వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నారు. ఆయన నటించిన తాజా చిత్రం 'మదగజరాజా' ప్రీరిలీజ్ ఈవెంట్ ఆదివారం జరిగింది. ఈ వేడుకకు రావొద్దని మేకర్స్ వారించినప్పటికీ విశాల్ వినిపించుకోకుండా హాజరయ్యారు. ఈ సభలో మాట్లాడుతున్నప్పుడు విశాల్ చేతులు వణుకుతూ కనిపించాయి. అలాగే, మాట్లాడడానికి కూడా ఆయన ఇబ్బంది పడ్డారు. విశాల్ వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నారనీ, విశ్రాంతి తీసుకోవాలని సూచించినట్లు చెన్నై అపోలో ఆస్పత్రి వైద్య బృందం పేర్కొంది.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)

వేధింపులు సహించను



ఒక వ్యాపారవేత్త కారణంగా తను ఇబ్బంది పడుతున్నాననీ, ఆయన వేధింపులు తట్టుకోలేక పోలీసులకు ఫిర్యాదు చేశానని మలయాళ నటి హనీ రోజ్ వెల్లడించారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ఎర్నాకులం నగర పోలీసులు 27 మందిపై కేసు నమోదు చేసి, వారిలో ఒకరిని అరెస్టు చేశారు. ఆ వ్యాపారవేత్త పిలిచిన కార్యక్రమాలకు కొన్ని కారణాల వల్ల హాజరు కాలేకపోయా. దాంతో నాపై ప్రతీకారంతో ఆయన కావాలని అవమానించేలా కామెంట్స్ చేస్తున్నారని హనీ రోజ్ తెలిపారు. ఇలా అసభ్యంగా కామెంట్స్‌ను ఏ మాత్రం సహించననీ, అలా కామెంట్స్ చేసే వారిపై న్యాయపోరాటం చేస్తానని హనీ రోజ్ చెప్పారు.

విచారణ వాయిదా



జర్నలిస్టుపై దాడి కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ నటుడు మోహన్‌బాబు దాఖలు చేసిన పిటిషన్ విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఈ నెల 9న విచారణ చేపడతామని తెలిపింది. హైదరాబాద్‌లోని జల్‌పల్లిలో ఉన్న తన నివాసం వద్ద జర్నలిస్టుపై దాడి కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని మోహన్‌బాబు దాఖలు చేసిన పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు గత నెల 23న కొట్టివేసింది. దీంతో ఆయన సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. ఈ పిటిషన్ సోమవారం జస్టిస్ సుధాంశు ధులియా, జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాలతో కూడిన ద్విసభ ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చింది. మోహన్‌బాబు తరఫున వాదించాల్సిన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ అందుబాటులో లేరని, అందువల్ల పాస్ ఓవర్ ఇవ్వాలని బృందంలోని ఇతర న్యాయవాదులు కోరారు. దీంతో తదుపరి విచారణను గురువారం చేపడతామని ధర్మాసనం పేర్కొంది.

- న్యూఢిల్లీ (ఆంధ్రజ్యోతి)

గంగై అమరన్‌కు తీవ్ర అస్వస్థత



సీనియర్ సంగీత దర్శకుడు, ఇళయరాజా సోదరుడు గంగై అమరన్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయనను మదురైలో ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. 77 యేళ్ల గంగై అమరన్ ఓ కొత్త చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ మానామదురై, శివగంగై ప్రాంతాల్లో జరుగుతోంది. ఈ షూటింగ్‌లో పాల్గొనేందుకు వెళ్లిన ఆయన ఉన్నట్టుండి తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. దీంతో ఆయనను హుటాహుటిన మానామదురైలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పి ప్రాథమిక వైద్యం చేయించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్య సేవల కోసం మదురై ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న గంగై అమరన్ కుమారుడు, దర్శకుడు వెంకట్ ప్రభు, నటుడు ప్రేమ్‌జీ అమరన్ మదురైకు చేరుకున్నారు. చలికాలం కావడంతో అమరన్ శ్వాస పీల్చడంలోనే సమస్యలు వినహా ఆరోగ్యపరంగా బాగానే ఉన్నారని వైద్యులు వెల్లడించారు.

నా కెరీర్‌లో ఇదే బెస్ట్ క్యారెక్టర్

- అంజలి



రామ్‌చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'గేమ్ ఛేంజర్'. దిల్‌రాజు, శిరీష్ నిర్మించారు. ఈనెల 10న తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా సినీ నటి అంజలి మాట్లాడుతూ' ఈ సంక్రాంతికి తెలుగులో 'గేమ్ ఛేంజర్', తమిళంలో విశాల్ చిత్రం రాబోతున్నాయి. ఈ రెండు చిత్రాలకు మంచి రెస్పాన్స్ వస్తుందని ఆశిస్తున్నా. 'గేమ్ ఛేంజర్'లో నా పాత్ర పేరు పార్వతి. మా అమ్మ పేరు కూడా పార్వతి. డైరెక్టర్ కథ చెప్పినప్పుడు, క్యారెక్టర్ చెప్పినప్పుడు మా అమ్మే గుర్తుకు వచ్చారు. సెట్స్ నుంచి వచ్చాక కూడా ఈ పాత్ర చాలా రోజులు నన్ను వెంటాడుతూనే వచ్చింది. నా కెరీర్‌లో ఇదే బెస్ట్ క్యారెక్టర్. రామ్ చరణ్ తన కో స్టార్స్‌ని ఎంతో గౌరవిస్తారు. సెట్స్‌లో అందరితోనూ చక్కగా మాట్లాడతారు. అప్పన్న, పార్వతీల ప్రేమ, వారి బంధం చాలా గొప్పగా ఉంటుంది. శంకర్, మణిరత్నం చిత్రాల్లో నటించాలని అందరికీ ఉంటుంది. శంకర్ చిత్రంలో నటించే అవకాశం రావడం ఆనందంగా ఉంది. గేమ్ ఛేంజర్ వల్ల నా ఆలోచనాధోరణి మారింది. ఈ ప్రయాణంలో ఎంతో నేర్చుకున్నా'.

వారి బెయిల్ పిటిషన్లకు విచారణార్హత లేదు!

- గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసు
- పలువురి ముందస్తు బెయిల్ పిటిషన్లు కొట్టివేసిన హైకోర్టు

అమరావతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి వ్యవహారంలో పలువురు నిందితులు దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్లకు విచారణార్హత లేదంటూ సోమవారం హైకోర్టు కొట్టివేసింది. పిటిషనర్లపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద కేసులు నమోదైన నేపథ్యంలో చట్టనిబంధనల ప్రకారం దిగువ కోర్టులోనే బెయిల్ పిటిషన్లు దాఖలు చేసుకోవాలని గుర్తు చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. వైసీపీ హయాంలో కృష్ణాజిల్లా గన్నవరం టీడీపీ కార్యాలయంపై మూకదాడి జరిగింది. 2023లో గన్నవరం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ సీహెచ్ కృష్ణారావు మరో 32 మంది హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపించారు.

పేర్ని నాని బెయిల్‌పై విచారణ నేటికి వాయిదా

అమరావతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): గోడౌన్ నుంచి రేషన్ బియ్యం మాయమైన వ్యవహారంలో వైసీపీ మాజీ మంత్రి పేర్నినానిపై బుధవారం వరకు ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. వ్యాజ్యంపై విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పేర్ని నాని సతీమణి జయసుధ మచిలీపట్నంలోని తన గోడౌన్‌ను పౌరసరఫరాలశాఖకు లీజుకిచ్చారు. దీనిలో నిల్వ చేసిన రేషన్ బియ్యం మాయం అయ్యాయని పేర్కొంటూ చింతం కోటిరెడ్డి అనే అధికారి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశారు.

జయసుధకు పెనాల్టీపై వివరాలివ్వండి: హైకోర్టు

అమరావతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం మాయం వ్యవహారంలో రూ.1.67కోట్ల పెనాల్టీ చెల్లించాలంటూ ఇచ్చిన నోటీసును సవాల్ చేస్తూ పేర్ని జయసుధ దాఖలు చేసిన పిటిషన్‌పై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని పౌర సరఫరాల శాఖను హైకోర్టు ఆదేశించింది. విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఉత్తర్వులు జారీ చేశారు.

విజయ్‌కుమార్‌రెడ్డి బెయిల్ పిటిషన్ మరో బెంచ్‌కు!

అమరావతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): సాక్షి పత్రిక, చానల్‌కు అనుచిత లబ్ధి చేకూర్చారనే ఆరోపణలతో ఏసీబీ అధికారులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ సమాచార పౌర సంబంధాల శాఖ పూర్వ కమిషనర్ తుమ్మా విజయ్‌కుమార్‌రెడ్డి వేసిన పిటిషన్ విచారణ నుంచి తప్పుకొంటున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి శుక్రవారం ప్రకటించారు. మరోబెంచ్ ముందు పిటిషన్ విచారణకు వచ్చేలా చూడాలని రిజిస్ట్రీని ఆదేశించి, విచారణను జనవరి 8కి వాయిదా వేశారు.

అంబటి ఫిర్యాదుపై వివరాలివ్వండి: హైకోర్టు

అమరావతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): తానిచ్చిన ఫిర్యాదులపై కేసు నమోదు చేసేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ వైసీపీ మాజీ మంత్రి అంబటి రాంబాబు దాఖలు చేసిన పిటిషన్‌పై వివరాలు సమర్పించాలని హోంశాఖను హైకోర్టు ఆదేశించింది. విచారణను జనవరి 4వ వారానికి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. తమ పార్టీ అధినేత జగన్‌తోపాటు తన కుటుంబ సభ్యులపై పోస్టులు పెడుతున్నవారిపై చర్య లు తీసుకోవాలని ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయకపోవడాన్ని సవాల్ చేస్తూ అంబటి పిటిషన్ దాఖలు చేశారు.

ఐపీఎస్ సంజయ్ బెయిల్‌పై విచారణ వాయిదా

అమరావతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): సీఐడీ మాజీ చీఫ్ సంజయ్ బెయిల్ పిటిషన్‌పై విచారణను హైకోర్టు మంగళవారానికి వాయిదా వేసింది. నిధులు దుర్వినియోగం ఆరోపణలతో ఏసీబీ అధికారులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ సంజయ్ దాఖలు చేసిన పిటిషన్ సోమవారం విచారణకు వచ్చింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ... ఈ వ్యవహారంలో కౌంటర్ దాఖలు చేస్తామన్నారు. విచారణను వాయిదా వేయాలని కోరారు. అందుకు అంగీకరించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి విచారణను వాయిదా వేశారు. మరోవైపు ఇదే కేసులో నిందితులుగా ఉన్న క్రిత్వ్యాప్ టెక్నాలజీస్ సంస్థకు చెందిన శరణు వినయ్ కుమార్, పాలవలస వెంకట తులసిరామ్, సౌత్రికా టెక్నాలజీస్ అండ్ ఇన్‌ఫ్రాకు చెందిన డైరెక్టర్లు శరణు సూర్య లలిత, వీరమాచనేని శ్రీహరిత వేర్వేరుగా హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ కూడా మంగళవారానికి వాయిదా వేశారు.

వర్రా పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయండి

- పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): తన భర్తను పోలీసులు అక్రమంగా నిర్బంధించారంటూ వర్రా రవీంద్రారెడ్డి సతీమణి కళ్యాణి దాఖలు చేసిన పిటిషన్‌పై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ప్రధాన వ్యాజ్యంపై ఇప్పటివరకు కౌంటర్ దాఖలు చేయకపోవడంపై తీవ్రంగా ఆక్షేపించింది. పలువురు అధికారులను ప్రతివాదులుగా చేరుస్తూ పిటిషనర్ వేసిన అనుబంధ పిటిషన్లను అనుమతించింది. విచారణను ఈనెల 28కి వాయిదా వేసింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాపతో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది. సామాజిక మాధ్యమాలలో అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యవహారంలో తన భర్తను పోలీసులు అక్రమంగా నిర్బంధించారని, కోర్టు ముందు హాజరుపర్చేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ వర్రా రవీంద్రారెడ్డి సతీమణి కళ్యాణి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్ సోమవారం విచారణకు రాగా రవీందర్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. తప్పుడు అఫిడవిట్ వేసిన అధికారులను ప్రాసిక్యూట్ చేయాలని కోరారు. కడప జిల్లా ఎస్పీపై ఆరోపణలు చేస్తూ కేసులో నిందితులు అఫిడవిట్ వేశారన్నారు. అయినప్పటికీ ఆయన కౌంటర్ దాఖలు చేయలేదన్నారు. ధర్మాసనం జోక్యం చేసుకుంటూ పిటిషనర్ నిర్దిష్టంగా ఆరోపణలు చేస్తున్నప్పుడు కౌంటర్ ఎందుకు వేయడం లేదని ప్రశ్నించింది. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) టి.విష్ణుతేజ వాదనలు వినిపిస్తూ.. అన్నమయ్య జిల్లా ఎస్పీ కౌంటర్ వేశారన్నారు. ఆయనే కడప జిల్లా ఇన్‌చార్జి ఎస్పీగా ఉన్నారన్నారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి కౌంటర్ వేయాలని ఆదేశించారు.

తులసిబాబుకు మళ్లీ నోటీసులు

ఒంగోలుక్రైం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ట్రిపుల్‌ఆర్ కస్టోడియల్ టార్చర్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రైవేటు వ్యక్తికి పోలీసులు సోమవారం మళ్లీ నోటీసులు జారీచేశారు. సీఐడీ కస్టడీ సమయంలో ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు గుండెలపై కూర్చుని వేధించారనే అనే ఫిర్యాదు మేరకు కామేపల్లి తులసిబాబును ఈ నెల 3న విచారణకు హాజరుకావాలని ఆ కేసు విచారణాధికారి అయిన ప్రకాశం ఎస్పీ ఏఆర్ దామోదర్ నోటీసులు జారీచేశారు. అయితే తాను అనారోగ్యంతో ఉన్నానంటూ తులసిబాబు గడువు కోరాడు. అయితే ఈ నెల 8న జరిగే విచారణకు హాజరుకావాలని ఎస్పీ మరోసారి అతనికి నోటీసులు జారీచేశారు.



మత్స్యకారుల గాలాలకు చిక్కిన వైట్ ఫిట్

అచ్యుతాపురం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం పూడిమడక మత్స్యకారులకు వైట్ ఫిష్‌లు చిక్కాయి. ఆపరేషన్ తర్వాత కుట్లు వేసే దారాన్ని ఈ చేప పిట్టుతో తయారుచేస్తారు. గాయం మానిన తరువాత ఈ దారం శరీరంలో కలిసిపోతుంది. అందుకే ఈ చేప ధర ఎక్కువగా ఉంటుందని మత్స్యకారులు చెబుతుంటారు. అయితే మూడు కిలోలు, అంతకంటే ఎక్కువ బరువున్న చేపలకు మంచి ధర లభిస్తుంది. పూడిమడకలో ఇటువంటి చేపలు సోమవారం ఎక్కువగానే పడ్డాయి. రెండు చేపలు మాత్రం పెద్దవి పడ్డాయి. రెండూ కలిపి 21 కిలోలు బరువు తూగాయి. వ్యాపారులు కిలో 400 చొప్పున కొనుగోలు చేశారు. చిన్న చేపలను కిలో 100చొప్పున కొనుగోలు చేశారు.

ఓఎన్‌జీసీకి టోకరా

(మొదటి పేజీ తరువాయి)

సహకరించారు. ఇంటిదొంగల అండతో కేంద్ర సంస్థకు తీవ్ర నష్టం చేకూర్చారు. కార్పొరేషన్ భద్రతా ప్రమాణాలను ప్రమాదంలో పడేశారు. ఏపీఎండీసీకి కూడా ఆర్థికంగా నష్టం చేకూర్చారు. ఏపీఎండీసీలోని కొన్ని కీలక ఫైళ్లను పరిశీలించినప్పుడు కేంద్ర సంస్థకు సరఫరా చేసిన బెరైటీస్ వివరాలేవీ కనిపించకపోవడంతో ఈ దోపిడీ గుట్టు రట్టయింది.

నయా దోపిడీ

సాధారణంగా బీ గ్రేడ్ ముగ్గురాయి టన్ను రూ.13,067 రూపాయలు ఉంటుంది. అయితే కొందరు కడప వ్యాపారులు తాము రూ.11,926కే సరఫరా చేస్తామని ఓఎన్‌జీసీకి చెప్పారు. అంటే.. మార్కెట్ రేటుతో పోలిస్తే తాము రూ.1,141 నష్టాన్ని భరించి సరఫరా చేస్తామని నివేదించారు. వాస్తవానికి బీ గ్రేడ్ బైరటీస్ టన్ను ధర రూ.7,800 ఉంటుంది. రవాణా, ప్రాసెసింగ్, ప్యాకింగ్, ఇత ర బెనిఫిసియేషన్ చార్జీలతో కలిపి రూ.13,067 అవుతుందని ఎండీసీ లెక్కలు చెబుతున్నాయి. కానీ వ్యాపారులు మార్కెట్ రేటు కంటే తక్కువకే సరఫరా చేస్తామని ఓఎన్‌జీసీకి ఆఫర్ ఇచ్చాయి. ఇలా గత ఐదేళ్లుగా ముగ్గురాయి పౌడర్‌ను సరఫరా చేస్తున్నాయి. ఏ వ్యాపారి అయినా తన కు పది రూపాయలు లాభం వచ్చేలా వ్యాపారం చేస్తాడు. మార్కెట్ రేటు కంటే కాస్త ఎక్కువ లేదా దానికి సమానమైన ధరకు సరుకును అమ్మాలని కోరుకుంటారు. అంతేకానీ నష్టం వచ్చేలా ఎవరూ వ్యాపారం చేయరు. ఎండీఎల్ లైసెన్స్ కలిగి వ్యాపారుల అవతారం ఎత్తిన వైసీపీ నేతలు కొందరు మోసం, నయవంచన, దగాతో వ్యాపారాన్ని చేస్తున్నారు. వాస్తవానికి ఓ వైసీపీ నేత కనుసన్నల్లోని ఈ సిండికేట్ ఓఎన్‌జీసీకి సరఫరా చేసేది బీ గ్రేడ్ 4.10 కాదు. సీడీడబ్ల్యూ గ్రేడ్ (3.7 -3.6)పౌడర్‌నే సరఫరా చేస్తున్నారు. ఇది ముగ్గురాయిలో అతి తక్కువ నాణ్యత కలిగినది. బ్లోఅవుట్ ఆపరేషన్స్‌కు పెద్దగా వినియోగించరు. బెరైటీస్‌ను ప్రాసెస్ చేసే క్రమంలో వచ్చే వేస్టేజీని కూడా ఇందులోనే కలిపేస్తారు. దీని విలువ టన్నుకు 2 వేల రూపాయల లోపే ఉంటుంది. వ్యాపారులు ఎండీసీతో పాటు మిల్లుల నుంచి నాసిరకం ముగ్గురాయిని కొనుగోలు చేసి ప్రాసెస్ చేసి ఓఎన్‌జీసీకి సరఫరా చేస్తున్నారు. ఇందుకు వీరికి అవుతున్న మొత్తం ఖర్చు 5,500 రూపాయలు. ఇందులోనే రవాణా, లోడింగ్, ప్యాకింగ్, ప్రాసెసింగ్ వంటి ఖర్చులు ఉన్నాయి. అంటే.. బీ గ్రేడ్ పేరిట ఓఎన్‌జీసీకి సీడీడబ్ల్యూ గ్రేడ్ ముగ్గురాయిని సరఫరా చేయడం వల్ల వ్యాపారులకు టన్నుకు రూ.5,426 మిగులుతోంది.

మార్కెట్లో బీ గ్రేడ్ బెరైటీస్ టన్ను ధర రూ.13,067. కానీ వ్యాపారులు రూ.11,926కే సరఫరా చేస్తామని ఓఎన్‌జీసీకి ఆఫర్ చేశారు. అంటే.. మార్కెట్ రేటు కంటే రూ.1,141 నష్టానికి..! ఇక్కడే అసలు కిటుకు ఉంది. ఏపీఎండీసీ నుంచి వ్యాపారులు తక్కువ నాణ్యత గల బెరైటీస్‌ను టన్ను రూ.2 వేలు చొప్పున కొనుగోలు చేస్తున్నారు. దీన్ని ప్రాసెస్ చేసి పౌడర్‌గా మార్చి ఓఎన్‌జీసీకి సరఫరా చేస్తున్నారు. ప్రాసెస్‌తో పాటు రవాణా, లోడింగ్, ప్యాకింగ్ వంటి ఖర్చులన్నీ కలిపి టన్నుకు రూ.5,500 ఖర్చు అవుతుంది. బీ గ్రేడ్ పేరిట సీడీడబ్ల్యూ గ్రేడ్ బెరైటీస్‌ను సరఫరా చేయడం వల్ల టన్నుకు రూ.5,426 మిగులుతోంది.

జగన్ హయాం నుంచి గత ఐదేళ్లుగా ఈ దందా సాగుతోంది. ఏటా 1.20 లక్షల టన్నుల మేర ఓఎన్‌జీసీకి బెరైటీస్‌ను సరఫరా చేస్తున్నారు. ఓఎన్‌జీసీ నుంచి అదనంగా బిల్లులు పొందుతున్నారు. కార్పొరేషన్‌లోని కొందరు పెద్దలు వ్యాపారులతో కుమ్మక్కయ్యారు. ఈ వ్యవహారంలో కడప జిల్లాకు చెందిన ఓ వైసీపీ నేత పాత్ర ఉన్నట్టు తెలుస్తోంది.

బెరైటీస్‌ను ఎందుకు వాడుతారంటే..

దేశంలో ఆయిల్ ఇండియా కార్పొరేషన్(ఓఐఎల్), ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ)లు భారీగా బెరైటీస్‌ను వాడుతున్నాయి. ఆయిల్ బావుల నుంచి ఇంధనం తవ్వి తీసే క్రమంలో భూ ఉత్పాతాన్ని తగ్గించడానికి, భారీ విస్ఫోటనాలు నిరోధించేందుకు బీ గ్రేడ్ ముగ్గురాయి(బెరైటీస్ 4.10 ఎస్‌జీ)ని వాడుతారు. చక్కటి కూలంట్‌గా ఈ పౌడర్ పనిచేస్తుంది. అందుకే 4.10 బెరైటీస్ పౌడర్‌కు విలువ ఎక్కువ. దేశీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో దీనికి డిమాండ్ ఉంది. అంతర్జాతీయ కంపెనీలు ఏ గ్రేడ్ 4.2, బీ గ్రేడ్ 4.10ను కొనుగోలు చేస్తాయి. దేశీయంగా ఓఐఎల్, ఓఎన్‌జీసీలకు కడప జిల్లా నుంచి కొందరు వ్యాపారులు బీ గ్రేడ్ ముగ్గురాయిని సరఫరా చేస్తున్నారు.

ఏటా 1.20 లక్షల టన్నుల మేర ఓఎన్‌జీసీకి ముగ్గురాయిని సరఫరా చేస్తున్నారు. ఈ మేరకు ఏటా 69.55 కోట్ల రూపాయలు ఓఎన్‌జీసీ నుంచి అదనంగా బిల్లులు పొందుతున్నారు. ఇలా గత ఐదేళ్ల కాలంలో రూ.347.76 కోట్ల మేర ఓఎన్‌జీసీ నుంచి అప్పనంగా దోచుకున్నారు. ఓఎన్‌జీసీలోని కొందరు పెద్దలు ఇక్కడి వ్యాపారులతో కుమ్మక్కై.. సీడీడబ్ల్యూ గ్రేడ్‌ను బీ గ్రేడ్‌గా నమోదు చేయించి పౌడర్‌ను తీసుకుంటున్నట్లుగా వెలుగుచూసింది. వ్యాపారులు ఏ కంపెనీకైనా బీ గ్రేడ్ బెరైటీస్‌ను పౌడర్ రూపంలో సరఫరా చేసి ఉంటే అది ఏపీఎండీసీలో రికార్డు అవుతుంది. కానీ గత ఐదేళ్ల కాలంలో ఓఎన్‌జీసీకి బీ గ్రేడ్ ముగ్గురాయిని సరఫరా చేసినట్లుగా ఒక్క రికార్డు కూడా అందుబాటులో లేదు.

తెరవెనుక కడప నేత

ఈ సిండికేట్‌లో కడప జిల్లాకు చెందిన ఓ వైసీపీ నేత కంపెనీ ఉంది. గతంలో మంగంపేటలోని ఎండీసీ స్టాక్‌పాయింట్ల నుంచి సీడీ డబ్ల్యూ ముగ్గురాయి పేరిట 2 లక్షల టన్నుల ఏ గ్రేడ్ సరుకును ఎత్తుకెళ్లిపోయారు. ఇది విజిలెన్స్ తనిఖీల్లో వెల్లడయినా నాటి సీఎం జగన్ అస్మదీయుడు అనే కారణంతో ఏ చర్యలు తీసుకోకుండా వదిలేసింది. ఆయన నేతృత్వంలోని కంపెనీ కొందరు వ్యాపారులతో సిండికేట్ చేయించి కేంద్ర సంస్థనే బురిడీ కొట్టిస్తోంది. కేంద్ర సంస్థ ఈ మోసాన్ని ఇప్పటికైనా కనిపెట్టాల్సి ఉంది.



సోమవారం గురజాల ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షల అనంతరం తురకా కిశోర్, శ్రీకాంత్‌ను కోర్టుకు తీసుకెళ్తున్న పోలీసులు

తురకా కిశోర్‌కు రిమాండ్

- అతడి సోదరుడు శ్రీకాంత్‌కు కూడా
- మాచర్లలో 2022లో టీడీపీ కార్యాలయం, నేతల ఇళ్లు, వాహనాల ధ్వంసం
- 14 రోజుల రిమాండ్ విధించిన న్యాయాధికారి
- గుంటూరు జిల్లా జైలుకు తరలింపు

మాచర్ల టౌన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మాచర్ల నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అతని సోదరుడు వెంకట్రామిరెడ్డిల అండతో అరాచకాలు, దోపిడీలకు పాల్పడిన మాచర్ల మున్సిపాలిటీ మాజీ చైర్మన్ తురకా కిశోర్‌కు మాచర్ల కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. అతడి తమ్ముడు శ్రీకాంత్‌ను కూడా రిమాండ్‌కు పంపింది. వైసీపీ సర్కారు హయాంలో రెచ్చిపోయిన కిశోర్.. టీడీపీ కూటమి ప్రభుత్వం రాగానే తన తమ్ముడితో కలిసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. ఏడు నెలల తర్వాత వారిద్దరినీ మాచర్ల పోలీసులు చాకచక్యంగా హైదరాబాద్‌లోని టీఎన్జీవో కాలనీలో ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. అదేరోజు రాత్రి పిడుగురాళ్ల పోలీసు స్టేషన్‌కు తరలించారు. సోమవారం మాచర్ల కోర్టులో హాజరుపరిచేందుకు తీసుకెళ్తూ మార్గమధ్యంలోని గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. తర్వాత ఇద్దరినీ మాచర్ల పట్టణ సీఐ ప్రభాకరరావు, ఎస్ఐలు మహ్మద్ షఫీ, వలీ ఆధ్వర్యంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయాధికారి ఎదుట హాజరుపరిచారు. కిశోర్, శ్రీకాంత్ తరఫున న్యాయవాది బారెడ్డి నాగిరెడ్డి, పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవీంద్రకుమార్ వాదనలు వినిపించారు. అనంతరం కిశోర్, శ్రీకాంత్‌లకు న్యాయాధికారి శ్రీనివాస కల్యాణ్ 14 రోజులపాటు జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. తర్వాత వారిని పటిష్ఠ బందోబస్తు నడుమ పోలీసులు గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. 2022 డిసెంబరు 16వ తేదీన మాచర్లలో టీడీపీ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో 'ఇదేం కర్మ రాష్ట్రానికి' కార్యక్రమం నిర్వహిస్తుండగా.. పురపాలక సంఘ కార్యాలయం సమీపంలో కిశోర్ తన రౌడీమూకలతో దాడికి పాల్పడ్డాడు. అనంతరం కిశోర్ తన రౌడీ గ్యాంగ్‌తో టీడీపీ కార్యాలయాన్ని ధ్వంసం చేశారు. టీడీపీ సానుభూతిపరుల గృహాలు, వాహనాలపైనా దాడులు చేసి తగులబెట్టారు. అయితే అప్పట్లో పోలీసులు కిశోర్‌పై ఐపీసీ 143, 147, 448, 427, 435, 436, 323 సెక్షన్లతో మాత్రమే కేసు(క్రైం నం.199) పెట్టారు. ఇప్పుడు పోలీసులు కొన్ని సెక్షన్లను మార్చి.. 143, 147, 148, 448, 427, 435, 436, 303, 120బీ, 109, 307, రెడ్ విత్ 34, 149 సెక్షన్లను పేర్కొన్నారు.

ప్రజాప్రతినిధుల కోర్టులో

జగన్‌కు ఎదురుదెబ్బ

- 'పాస్‌పోర్టు' పిటిషన్‌ను కొట్టేసిన న్యాయస్థానం
- గడువు ముగిసినందున కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని ఆదేశం





విజయవాడ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డికి విజయవాడలోని ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తాను విదేశాలకు వెళ్లడానికి వీలుగా పాస్‌పోర్టు ఇప్పించాలని, దీనిపై పాస్‌పోర్టు అధికారులకు ఆదేశాలు ఇవ్వాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. విదేశాల్లో ఉన్న తన కుమార్తెల జన్మదిన వేడుకలకు వెళ్లడానికి అనుమతి ఇవ్వాలని జగన్ గత ఏడాది ఆగస్టులో హైదరాబాద్‌లోని సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఐదేళ్ల కాలానికి పాస్‌పోర్టు ఇవ్వాలని సీబీఐ కోర్టు ఆదేశాలు ఇచ్చింది. విజయవాడ ప్రజాప్రతినిధుల కోర్టు మాత్రం.. పాస్‌పోర్టును ఏడాది మాత్రమే పునరుద్ధరిస్తామని, జగన్ తమ ముందు హాజరై రూ.20 వేల స్వీయ పూచీకత్తు సమర్పించాలని ఆదేశించింది. దీనిని సవాల్ చేస్తూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. ఆ షరతులను పాక్షికంగా సవరించారు. ఐదేళ్ల పాటు పాస్‌పోర్టు జారీకి వీలుగా ఎన్‌వోసీ జారీ చేయాలని ప్రజాప్రతినిధుల కోర్టును ఆదేశించారు. అయితే సదరు ఎన్‌వోసీ పొందేందుకు జగన్ ప్రత్యేక కోర్టు ముందు హాజరై స్వీయ పూచీకత్తు సమర్పించాల్సిందేనని తేల్చిచెప్పారు. గత ఏడాది సెప్టెంబరు 20వ తేదీతో జగన్ పాస్‌పోర్టు గడువు ముగిసిపోయింది. దీనిపై వారం క్రితం ఆయన తరఫున న్యాయవాది వెంకటేశ్వర్లు ప్రజాప్రతినిధుల కోర్టులో మరో పిటిషన్ దాఖలు చేశారు. పాస్‌పోర్టు ఇచ్చేలా అధికారులను ఆదేశించాలని కోరారు. ప్రభుత్వ న్యాయవాది తెల్లాప్రగడ సుబ్బారావు వాదనలు వినిపిస్తూ.. జగన్ పాస్‌పోర్టుకు 2024 సెప్టెంబరులోనే గడువు ముగిసిందని.. గడువు తీరే తేదీకి ఆరు నెలలకు ముందే పాస్‌పోర్టు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవలసి ఉందని గుర్తుచేశారు. ఆయన వాదనలతో ఏకీభవించిన న్యాయాధికారి ఎస్.శ్రీదేవి.. పాస్‌పోర్టు కోసం ఆ కార్యాలయంలో కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని ఆదేశిస్తూ జగన్ పిటిషన్‌ను కొట్టివేశారు.

స్వీయ పూచీకత్తు ఇవ్వడానికి.. ప్రత్యేక కోర్టుకు వెళ్లనక్కర్లేదు!

పాస్‌పోర్టుకు ఎన్‌వోసీ జారీపై జగన్ వాదనలు

హైకోర్టులో పిటిషన్.. లంచ్‌మోషన్‌గా విచారణ

అమరావతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): పాస్‌పోర్టు మంజూరు కోసం నిరభ్యంతర పత్రం(ఎన్‌వోసీ) జారీ విషయంలో తమ ముందు హాజరై రూ.20 వేల స్వీయ పూచీకత్తు సమర్పించాల్సిందేనని స్పష్టం చేస్తూ విజయవాడ ప్రత్యేక కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ మాజీ సీఎం జగన్ దాఖలు చేసిన వ్యాజ్యంపై హైకోర్టులో వాదనలు ముగిశాయి. తీర్పు రిజర్వు చేస్తున్నట్లు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి ప్రకటిస్తూ సోమవారం ఆదేశాలిచ్చారు. మంత్రి పి.నారాయణ వేసిన పరువు నష్టం కేసులో విజయవాడ ప్రత్యేక కోర్టు ముందు హాజరు నుంచి తనకు హైకోర్టు మినహాయింపు ఇచ్చినప్పటికీ.. పాస్‌పోర్టు మంజూరు నిమిత్తం అవసరమైన ఎన్‌వోసీ జారీ విషయంలో తమ ముందు హాజరై రూ.20 వేల స్వీయ పూచీకత్తు సమర్పించాల్సిందేనని విజయవాడ ప్రత్యేక కోర్టు ఉత్తర్వులు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ జగన్ మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యాన్ని జస్టిస్ శ్రీనివాసరెడ్డి సోమవారం లంచ్‌మోషన్‌గా స్వీకరించారు. జగన్ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపించారు. పిటిషనర్‌కు ఐదేళ్ల పాటు పాస్‌పోర్టు జారీకి వీలుగా ఎన్‌వోసీ జారీ చేయాలని ప్రజాప్రతినిధుల కోర్టును హైకోర్టు ఆదేశించిందన్నారు. ఆ కోర్టు ముందు హాజరు నుంచి మినహాయింపు ఇస్తూ ఇదే కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. ఈ నేపథ్యంలో జగన్ స్వయంగా హాజరై పూచీకత్తు సమర్పించాల్సిన అవసరం లేదన్నారు. అయితే స్వీయ పూచీకత్తు సమర్పించాల్సిందేనని హైకోర్టు అనాలోచితంగా ఆదేశాలిచ్చిందని తెలిపారు. జగన్ కుమార్తె లండన్‌లో ఉన్నత చదువులు పూర్తి చేశారని.. ఈ నెల 16న ఆమె స్నాతకోత్సవానికి ఆయన హాజరుకావలసి ఉందని.. స్వీయ పూచీకత్తు సమర్పించాల్సిన అవసరం లేకుండా ఎన్‌వోసీ జారీ చేసేలా ప్రత్యేక కోర్టును ఆదేశించాలని కోరారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ.. ఎన్‌వోసీ జారీకి ప్రత్యేక కోర్టు ముందు హాజరై స్వీయ పూచీకత్తు సమర్పించాల్సిందేనని హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను నిర్వీర్యం చేసేందుకే జగన్ ఈ వ్యాజ్యం వేశారన్నారు.



టీచర్ల పనితీరుకు

పాయింట్లు!

దాని ఆధారంగా బదిలీల్లో పెద్దపీట?

'బదిలీ చట్టం'పై పాఠశాల విద్యాశాఖ కసరత్తు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

విద్యార్థులను జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేలా తీర్చిదిద్దే టీచర్లు కొందరు. విద్యార్థులను వినూత్నంగా ఆలోచింపజేసి ఆవిష్కరణలు చేయించే ఉపాధ్యాయులు మరికొందరు. అద్భుతమైన బోధనా పద్ధతులతో విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దే టీచర్లు ఇంకొందరు. వీరంతా ఇప్పటి వరకు 'ప్రత్యేక గుర్తింపు'నకు నోచుకోవడం లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కష్టపడే టీచర్లకు పెద్దపీట వేయాలని, ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. టీచర్లు అందరినీ ఒకే గాటన కట్టకుండా మెరుగైన పనితీరు కనబరిచిన వారికి ప్రోత్సాహకంగా బదిలీల్లో ప్రాధాన్యత ఇవ్వాలని యోచిస్తోంది. కొత్తగా తీసుకురాబోయే ఉపాధ్యాయ బదిలీల చట్టంలో 'పనితీరుకు పాయింట్లు' ఇచ్చే దిశగా పాఠశాల విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. అయితే దీన్ని కచ్చితంగా అమలు చేస్తారా అనేదానిపై స్పష్టత రాలేదు. కానీ, బాగా పనిచేసేలా టీచర్లకు ఎంతో కొంత ప్రోత్సాహం లేకపోతే పనితీరులో పోటీ లేకుండా పోతుందని, ఎలా పనిచేసినా ఒక్కటే అనే భావన పెరుగుతుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి. గతంలోనూ టీచర్ల పనితీరు మదింపునకు పదో తరగతి మార్కులను ప్రామాణికంగా తీసుకోగా, అది సరైన విధానం కాదని భావించి ప్రతి సబ్జెక్టులో వేర్వేరు అంశాలను పెట్టాలని చూస్తున్నారు.

ఇదీ లెక్క!

- వ్యాయామ ఉపాధ్యాయులకు క్రీడాంశాలను ప్రామాణికంగా తీసుకుంటారు. క్రీడా పోటీల్లో రాష్ట్ర, జిల్లా స్థాయిలో వారి విద్యార్థులు పాల్గొన్నారా? అవార్డులు సాధించారా? అనే ప్రాతిపదికన బదిలీల్లో పాయింట్లు ఇస్తారు. జాతీయ స్థాయిలో పాల్గొనే స్థాయికి తీసుకెళ్తే రెండు పాయింట్లు, అవార్డు సాధిస్తే మూడు పాయింట్లు ఇస్తారు. అలాగే స్కౌట్స్ అండ్ గైడ్స్‌ను కూడా ప్రామాణికంగా తీసుకుంటారు.
- సైన్స్ టీచర్లకు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి సైన్స్ ఫెయిర్‌లను ప్రామాణికంగా తీసుకుంటారు. ఆ ఫెయిర్లలో వారి విద్యార్థుల ఎన్ని ప్రాజెక్టులు ప్రదర్శించారు? వాటికి ఎలాంటి ప్రశంస లభించింది? అనేది ఆధారంగా పాయింట్లు ఇస్తారు.
- సోషల్ టీచర్లకు క్విజ్‌లు, జనరల్ నాలెడ్జ్ పోటీలను ప్రామాణికంగా చూస్తారు.
- హిందీ టీచర్లకు.. విద్యార్థులు మాధ్యమిక లాంటి పరీక్షలు రాశారా? వారి ప్రతిభ ఏ స్థాయిలో ఉందనేది పరిగణనలోకి తీసుకుంటారు.
- గణిత ఉపాధ్యాయులకు విద్యార్థులు ఒలంపియాడ్ లాంటి పోటీల్లో పాల్గొనే స్థాయికి తీసుకువెళ్లారా? బహుమతులు పొందారా? అనేది లెక్క చూస్తారు.
- ఇంగ్లిష్ టీచర్లకు 'స్పెల్ బీ' పోటీలు, ఇతరత్రా ఆంగ్ల సంబంధిత పోటీల ఆధారంగా పాయింట్లు ఇస్తారు. తెలుగు టీచర్లకు కూడా కొన్ని అంశాలను పెట్టాలనే యోచనలో ఉన్నారు. ఇలా ప్రతి సబ్జెక్టు టీచర్‌కు కొన్ని అంశాలు ప్రామాణికంగా తీసుకుని, మెరుగ్గా ఉన్నవారికి కొంత ప్రాధాన్యత ఇవ్వాలని భావిస్తున్నారు. దానివల్ల మిగిలిన టీచర్లు కూడా వారి విద్యార్థులు మెరుగ్గా ఉంటే, బదిలీల్లో తమకు ప్రాధాన్యత పెరుగుతుందని భావించి వృత్తిలో పోటీ పడతారనే ఆలోచన చేస్తున్నారు.

బదిలీలకు విద్యా సంవత్సరమే

బదిలీలకు చేయబోయే చట్టంలో పాఠశాల విద్యాశాఖ మరో కీలక మార్పు చేసింది. టీచర్లు డిమాండ్ చేస్తున్నట్లుగా బదిలీలకు సాధారణ సంవత్సరం స్థానంలో విద్యా సంవత్సరాన్నే ప్రామాణికంగా తీసుకుంటుంది. దాని ప్రకారం 2 నుంచి 5 విద్యా సంవత్సరాలు పూర్తిచేసుకున్న ప్రధానోపాధ్యాయులు, 2 నుంచి 8 విద్యా సంవత్సరాలు పూర్తిచేసుకున్న టీచర్లు బదిలీలకు అర్హులు. 5 ఏళ్లు దాటిన హెచ్‌ఎంలు, 8ఏళ్లు దాటిన టీచర్లు తప్పనిసరి బదిలీల పరిధిలోకి వస్తారు. అయితే జీరో సర్వీసు టీచర్లకు కూడా బదిలీ అవకాశం కల్పించాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. కానీ, పాఠశాల విద్యాశాఖ దానికి అవకాశం ఇవ్వకూడదని నిర్ణయించింది.

ఎస్సీ వర్గీకరణపై పోటెత్తిన వినతులు

- నినాదాలతో దద్దరిల్లిన ప్రకాశం కలెక్టరేట్
- వినతులు స్వీకరించిన కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా

ఒంగోలు నగరం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ జరగాల్సిందేనంటూ ఎమ్మార్పీఎస్, అది రాజ్యాంగ విరుద్ధమంటూ మాలమహానాడు, దాని అనుబంధ సంఘాలు పోటాపోటీగా నినదించాయి. కొన్ని కులాల వారు అనుకూలంగా, మరికొన్ని కులాల వారు వ్యతిరేకంగా వందల సంఖ్యలో ప్రకాశం జిల్లా కలెక్టరేట్ వద్ద మోహరించారు. ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా సోమవారం ఒంగోలులోని ప్రకాశం భవనం(కలెక్టరేట్) స్పందన హాలులో అభిప్రాయ సేకరణ చేపట్టారు. ఎస్సీలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు వందల సంఖ్యలో ఎస్సీలు అక్కడ మోహరించారు. అంతకుముందు నగరంలో పోటాపోటీగా ప్రదర్శనలు నిర్వహించి, మధ్యాహ్నానికి ఇరువర్గాలు కలెక్టరేట్‌కు చేరుకొని నినాదాలు హోరెత్తించాయి. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొని.. తోపులాట చోటు చేసుకుంది. జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు వచ్చి పరిస్థితిని అదుపుచేశారు. అయినప్పటికీ ఇరువర్గాలు కమిషన్‌కు గోడు వినిపించేందుకు పోటీ పడ్డాయి. ఇది రాజ్యాంగ విరుద్ధమని మాల మహానాడు, దాని అనుబంధ సంఘాలు చెప్పగా, ఎమ్మార్పీఎస్‌లోని రెండు వర్గాలు ఎస్సీ వర్గీకరణతోనే ఉపకులాల అభివృద్ధి సాధ్యమనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాయి. ఇరువర్గాలు కమిషన్ చైర్మన్ ముందు తమ వాదనలను బలంగా వినిపించాయి. మాల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కూడా పెద్దఎత్తున ఉద్యోగులు తరలివచ్చి చైర్మన్‌కు వినతిపత్రాలను అందజేశారు. ఎస్సీలకు ఉమ్మడి రిజర్వేషన్ పెంచాలని, అంబేద్కర్ పేరుతో బ్యాంకు ఏర్పాటు చేసి రుణాలు అందజేయాలని కోరారు.



వినతిపత్రాలు స్వీకరిస్తున్న కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్‌మిశ్రా

అమరావతి రైల్వే లైను పనులకు తొలి అడుగు

» వైకుంఠపురం నుంచి నంబూరు మార్గంలో విద్యుత్ లైన్ల సర్వే ప్రారంభం


వైకుంఠపురం కృష్ణానది నుంచి కరకట్ట మీదుగా వడ్డమాను వైపు రైల్వే లైను వెళ్లే మార్గంలో సర్వే నిర్వహిస్తున్న అధికారులు

అమరావతి, జనవరి 6: తెలంగాణలోని ఎర్రుపాలెం నుంచి రాజధాని అమరావతిని కలుపుతూ నంబూరు వరకు నూతనంగా నిర్మించనున్న 56.53 కి.మీ రైల్వేలైను పనులకు సంబంధించి సోమవారం తొలి అడుగు పడింది. ఉమ్మడి గుంటూరు జిల్లా వైకుంఠపురం వద్ద ఉన్న కృష్ణానది నుంచి నంబూరు వరకు రైలు మార్గం ఏర్పాటు చేసే ప్రాంతంలో రైల్వే సర్వేయర్, రైల్వే విద్యుత్ శాఖ అధికారులు సర్వే ప్రారంభించారు. రైల్వే లైను మార్గంలో అడ్డుగా ఉండే విద్యుత్‌లైన్లు తొలగించేందుకు, రైల్వే లైనుకు ఏర్పాటు చేయాల్సిన విద్యుత్ లైన్లకు సంబంధించి ఈ సర్వే చేస్తున్నారు. కాగా, ఈ ప్రాజెక్టుకోసం 534.23ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది.

జగన్‌కు ప్రత్యేక రాజ్యాంగం ఉందా?: కళా వెంకట్రావు

బొబ్బిలి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): 'మాజీ సీఎం జగన్ చేసిన పాపాలు శాపాలుగా మారి రాష్ట్రాన్ని వెంటాడుతున్నాయి. అభివృద్ధి సాధనకు ఆటంకాలుగా మారాయి' అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కిమిడి కళా వెంకట్రావు అన్నారు. 'రూ.వేల కోట్ల కుంభకోణంలో అరెస్టు అయిన జగన్ 12 ఏళ్లుగా సీబీఐ కేసు నుంచి ఎలా తప్పించుకుని తిరగగలుగుతున్నారు? ఆయనకేమైనా ప్రత్యేక రాజ్యాంగం ఉందా?' అని ప్రశ్నించారు.


టీడీపీ కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్న ఆ పార్టీ నేతలు

వైసీపీ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

» టీడీపీ గ్రీవెన్స్‌లో బాధితుల అర్జీలు

అమరావతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు బంధువు మోదాల శ్రీనివాసరావు, అతడి అనుచరులు అక్రమంగా జామాయిల్ తోటలోకి ప్రవేశించి, రూ.25లక్షల విలువైన చెట్లను నరికి అమ్ముకున్నారని, పైగా పొలంలోకి వెళ్తే చంపేస్తామని బెదిరిస్తున్నారని ప్రకాశం జిల్లా అర్ధవీడుకు చెందిన అంజిరెడ్డి వాపోయారు. కబ్జాదారుల నుంచి పొలాన్ని విడిపించి, తనకు రావాల్సిన సొమ్మును ఇప్పించాలని సోమవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన గ్రీవెన్సు సెల్‌లో వేడుకున్నారు. తాను స్నానం చేస్తుండగా ఎదురింటిలో ఉండే పుష్ప అనే మహిళ, నగ్నంగా ఫోటోలు తీసి, బెదిరించి, రూ.50లక్షల నగదు, 80సవర్ల బంగారం తీసుకుని, ఆ ఫొటోలతో ఆమె కుటుంబ సభ్యులు బ్లాక్ మెయిల్ చేస్తుండటంతో ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఏర్పడిందని సింగరాయకొండ మండలానికి చెందిన ఓ మహిళ వాపోయింది.

ఆపదలో అండగా లోకేశ్

» ఖతర్ నుంచి స్వస్థలానికి కదిరి మహిళ



అమరావతి, కదిరి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): గల్ఫ్‌లో ఆపదలో చిక్కుకున్న శ్రీసత్యసాయి జిల్లా కదిరికి చెందిన మహిళకు మంత్రి నారా లోకేశ్ అండగా నిలిచారు. ఉపాధి కోసం ఖతర్ దేశానికి వెళ్లి, ఏజెంట్ చేతిలో మోసపోయిన ఆమె, లోకేశ్ చొరవతో క్షేమంగా స్వస్థలానికి చేరుకున్నారు. ఖతర్‌లో యజమాని చిత్రహింసలు పెడుతున్నాడని, కనీసం తినడానికి తిండి, తాగటానికి నీళ్లు కూడా ఇవ్వడం లేదని రసీదా అనే మహిళ 'ఎక్స్'లో లోకేశ్‌ను మొరపెట్టుకున్నారు. దీనిపై లోకేశ్ స్పందించి తన టీమ్‌ను రంగంలోకి దింపారు. వారు రసీదాను ఖతర్ యజమాని చెర నుంచి విడిపించారు. హైదరాబాద్‌కు ఆదివారం చేసుకున్న రషీదా, అక్కడి నుంచి నేరుగా కదిరికి వచ్చారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆమె సోమవారం సెల్ఫీ వీడియో విడుదల చేశారు.

8న కేంద్ర బృందం పర్యటన

» కరువు మండలాల్లో రైతులతో భేటీ

అమరావతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2024 ఖరీఫ్ కరువు పరిస్థితుల అధ్యయనానికి కేంద్ర బృందం ఈనెల 8న శ్రీసత్యసాయి, అనంతపురం, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో పర్యటించనున్నది. కేంద్ర వ్యవసాయ శాఖ, రైతు సంక్షేమ శాఖ సంయుక్త కార్యదర్శి పెరిన్‌దేవి నేతృత్వంలోని పది మంది సభ్యులు మూడు బృందాలుగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తారు. 9న సీఎం చంద్రబాబుతో కేంద్ర బృందం భేటీ అయ్యే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ తెలిపారు.

ఉర్దూ అకాడమీలో 'స్కాం'పై విచారణాధికారి

అమరావతి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉర్దూ అకాడమీలో జరిగిన రూ.3.15 కోట్ల నిధుల దుర్వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ సంక్షేమశాఖ కమిషనర్‌ను విచారణాధికారిగా నియమించింది. ఈ మేరకు మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శి హర్షవర్ధన్ ఉత్తర్వులు జారీ చేశారు.

కేంద్ర మంత్రి కుమారస్వామితో టీజీ భరత్ భేటీ

అమరావతి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పరిశ్రమల మంత్రి టీజీ భరత్ సోమవారం ఢిల్లీలో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామితో సమావేశమయ్యారు. ఏపీలోని నక్కపల్లి వద్ద నెలకొల్పనున్న ఆర్సెలర్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు ఇనుప ఖనిజం సరఫరా చేయాలని కోరారు.

రైతుల ఖాతాల్లో రూ. 6,083 కోట్లు జమ

» మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి

అమరావతి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులు ఈ ఖరీఫ్ సీజన్‌లో పండించిన ధాన్యం ఇప్పటివరకు 27 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. సేకరించిన ధాన్యానికి 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేస్తున్నామని, ఇలా ఇప్పటివరకు రూ. 6,083 కోట్లు జమ చేశామని ఒక ప్రకటనలో వెల్లడించారు.

అర్బన్ పీహెచ్‌సీలకు అభివృద్ధి సొసైటీలు

అమరావతి, జనవరి6(ఆంధ్రజ్యోతి): అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో ఆస్పత్రి అభివృద్ధి సొసైటీలను నియమించేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ మేరకు ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు జారీచేశారు.

సీఎస్‌కు విద్యుత్ శాఖ అదనపు బాధ్యతలు

అమరావతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌కు ప్రభుత్వం విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించింది. విజయానంద్ విద్యుత్ శాఖ స్పెషల్ సీఎస్‌గా ఉన్నప్పుడే ప్రభుత్వం సీఎస్‌గా బాధ్యతలు అప్పగించింది. దీంతో విద్యుత్ శాఖపై సుదీర్ఘ అనుభవం, పట్టు ఉండడంతో ప్రభుత్వం ఆయనకే అదనపు బాధ్యతలు ఇచ్చింది.



మా ఊరి సమస్యలను పరిష్కరించండి

ఎమ్మెల్యే శ్రావణిశ్రీకి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు వినతి

శింగనమల జనవరి 6(ఆంధ్రజ్యోతి): తన సొంతూరిలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీటీడీ సభ్యుడు, శ్రీసత్యసాయి జిల్లా మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు.. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ ఇచ్చారు. శింగనమల మండలం అలంకరాయునిపేటకు చెందిన ఆయన... సోమవారం శింగనమల తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన డివిజన్ స్థాయి సమస్యల పరిష్కార వేదికకు వచ్చారు. అక్కడ అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీని కలిసి, తమ ఊరి సమస్యలను వివరించారు. 'మా ఊరిలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. మురుగునీటి కాలువలను నిర్మించాలి. మా ఊరి నుంచి సలకంచెరువు పాఠశాలకు చాలామంది విద్యార్థులు కాలినడకన వెళతారు. దారి మధ్యలో ఉన్న వంకపై కల్వర్టును నిర్మించాలి. గ్రామ సమీపంలో బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలి. ఉపాధి హామీ పథకం కింద పార్కు ఏర్పాటు చేయాలి' అని ఎమ్మెల్యే రాజు కోరారు. ఆమేరకు వారికి వినతిపత్రం సమర్పించారు. కలెక్టర్, ఎమ్మెల్యే శ్రావణిశ్రీ సానుకూలంగా స్పందించారు.

అనంతపురం జిల్లా కలెక్టర్, శింగనమల ఎమ్మెల్యేకి తమ ఊరి సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

'కాకినాడ' నుంచి సండూర్ దాకా!

(మొదటి పేజీ తరువాయి)

విచారించింది. సుమారు ఆరు గంటలకుపైగా సాగిన విచారణలో కాకినాడ సెజ్, కాకినాడ సీ పోర్ట్స్ లిమిటెడ్ షేర్ల బదలాయింపునకు సంబంధించిన అంశాలపై ఈడీ అధికారులు ప్రశ్నించారు. షేర్లకు సంబంధించిన నగదు బదలాయింపులపైనా అధికారులు ఆరా తీశారు. రంగనాథం అండ్ కంపెనీ, సంతానం అండ్ కంపెనీలను ఎవరు ప్రభుత్వానికి పరిచయం చేశారు... 'అరబిందో' శరత్ చంద్రారెడ్డి ఎలా పరిచయం అంటూ ప్రశ్నించారు. దానిపై విజయసాయి రెడ్డి ఇచ్చిన సమాధానాలను ఈడీ అధికారులు రికార్డు చేశారు. కేసు విచారణకు అవసరమైన కీలక సమాచారం విజయసాయి నుంచి రాబట్టే విధంగా ప్రత్యేకంగా రూపొందించిన ప్రశ్నావళి ఆధారంగా అధికారుల బృందం ముందుకెళ్లింది. ఎక్కువ ప్రశ్నలకు ఆయన సమాధానం దాట వేసినట్లు తెలిసింది. 'తెలియదు, నాకు సంబంధంలేదు' అని చెప్పినట్లు సమాచారం.

సండూర్ గురించి తెలియదనే...

సండూర్ పవర్ కేసులో జగన్ ఏ1 కాగా, విజయసాయి రెడ్డి ఏ2గా ఉన్నారు. ఆ కంపెనీ ఆడిటర్ కూడా ఆయనే. కాకినాడ పోర్టు, సెజ్‌కు సంబంధించిన ప్రశ్నలకు తగిన 'సమాధానాల'తో సిద్ధమై వెళ్లిన సాయిరెడ్డి... అక్కడ సండూర్ పవర్ అంశం తెరపైకి వచ్చేసరికి షాక్‌కు గురైనట్లు తెలిసింది. 'సండూర్ పవర్‌లో పెట్టుబడులు ఎక్కడ నుంచి వచ్చాయి?' అని ప్రశ్నించగా... 'తెలియదు' అని బదులిచ్చారు. "ఈ కేసులో మీరు రెండో నిందితుడు. పైగా కంపెనీ ఆడిటర్. అయినా పెట్టుబడుల గురించి తెలియదా' అని ప్రశ్నించగా... "కావొచ్చు. ఎప్పుడో ఇరవై సంవత్సరాల క్రితం వ్యవహారం అది. ఇప్పుడెలా గుర్తుంటుంది?" అని ఎదురు ప్రశ్నించినట్లు తెలిసింది. పెట్టుబడుల విషయాలు బాగా తెలుసు కదా అని ఆరా తీయగా... ఇప్పుడు తనకేవీ గుర్తు లేవని చెప్పినట్లు తెలిసింది. అవసరమైతే మళ్లీ విచారణకు పిలుస్తామని సాయిరెడ్డిని ఈడీ అధికారులు పంపించారు. ఈడీ విచారణ తర్వాత బయటికి వచ్చిన సాయి రెడ్డి.. ఈడీ పాత కేసుల్లో ఉచ్చు బిగిస్తున్నట్లు అనుమానంగా ఉందని తన సన్నిహితులకు చెప్పినట్లు సమాచారం.

కేవీ రావు ఎవరో తెలియదు: సాయిరెడ్డి

ఈడీ విచారణ అనంతరం విజయసాయి రెడ్డి మీడియాతో మాట్లాడారు. "కేవీ రావు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈడీ అధికారులు నన్ను ప్రశ్నించారు. నేను మే 2020లో కేవీ రావుకు ఫోన్ చేసి విక్రాంత్ రెడ్డితో కాకినాడ సీ పోర్ట్స్ విషయం మాట్లాడాలని చెప్పాననేది నాపై ప్రధాన ఆరోపణ. రంగనాథన్ అండ్ కంపెనీ చార్టెడ్ అకౌంటెంట్స్, శ్రీధరన్ అండ్ కంపెనీ చార్టెడ్ అకౌంటెంట్స్...ఈ రెండు కంపెనీలను ఫోరెన్సిక్ ఆడిటింగ్‌కు నేను సిఫారసు చేశానని కేవీ రావు ఆరోపణలు చేశారు. ఈ విషయంలో ఈడీ అధికారులు ప్రశ్నించగా, కేవీ రావు అనే వ్యక్తి ఎవరో నాకు తెలియదు అని చెప్పాను. కేవీ రావు ఫిర్యాదులో వాస్తవాలు ఉంటే ఆయన పేరులోనే వెంకటేశ్వరరావు అని ఉంది కాబట్టి... తిరుపతి వెంకటేశ్వర స్వామి సమక్షంలో ఆయన ఇచ్చిన ఫిర్యాదులోని అంశాలు వాస్తవమని స్వామివారి ముందు చెప్పాలి. మా ఇద్దరికి క్రాస్ ఎగ్జామినేషన్ ఏర్పాటు చేయాలని అధికారులను అడిగాను. కేవీ రావు ఇచ్చిన ఫిర్యాదు తప్పుడు ఫిర్యాదు అని రుజువైనా...ఆ కేసును ఏపీ ప్రభుత్వం విత్‌డ్రా చేసుకున్నా... కోర్టు ఈ ఫిర్యాదు తప్పుడు ఫిర్యాదు అని చెప్పినా... కేవీ రావుపై సివిల్, క్రిమినల్ పరువునష్టం దావా వేస్తానని ఈడీ అధికారులకు చెప్పాను. ఈడీ అడిగిన 25 ప్రశ్నలకు సమాధానం చెప్పాను. సుబ్బారెడ్డి కొడుకుగా మాత్రమే విక్రాంత్ రెడ్డి తెలుసునని చెప్పాను. సండూర్ గురించి పదే పదే ప్రశ్నించారు" అని విజయసాయి రెడ్డి మీడియాకు వెల్లడించారు.


ఏపీ పేపరుమిల్లు ఎదుట కార్మికుల ఆందోళన

ఆంధ్ర పేపరు మిల్లు

కార్మికుల సమ్మె విరమణ

» 9 యూనియన్లు అంగీకారం..
2 మాత్రం వ్యతిరేకం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పేపరుమిల్లు కార్మికులు వేతన ఒప్పందం కోసం చేపట్టిన సమ్మెను 9 యూనియన్లు విరమించుకున్నాయి. కూటమి ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణల చొరవతో సోమవారం రాత్రి పరిశ్రమల శాఖ అధికారులను తీసుకుని కార్మిక సంఘాలు, మిల్లు యాజమాన్య ప్రతినిధులతో సుమారు గంటపాటు చర్చించారు. దీంతో 9 యూనియన్లు సమ్మెను విరమించేందుకు అంగీకారం తెలిపాయి. వెంటనే మిల్లు యాజమాన్యం కూడా లాకౌట్‌ను ఎత్తివేసేందుకు అంగీకరించింది. దీంతో కార్మికులు మంగళవారం ఉదయం నుంచి విధులకు హాజరు కాబోతున్నారు. అయితే మొత్తం 11 యూనియన్లకు గాను 9 యూనియన్లు సమ్మెను విరమించేందుకు అంగీకరించగా, మరో రెండు యూనియన్లు వ్యతిరేకించాయి. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ.. పేపరు మిల్లు కార్మికుల వేతన ఒప్పందానికి సంబంధించి సీఎం చంద్రబాబు రాష్ట్ర పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శికి ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ఉన్నత స్థాయి కమిటీని నియమిస్తున్నారని, మిల్లు కార్మికులకు కూటమి ప్రభుత్వం తప్పక న్యాయం చేస్తుందన్నారు. కార్మికులకు మంచి ఒప్పందాన్ని చేస్తుందని చెప్పారు. కాగా మిగిలిన రెండు యూనియన్ల వైఖరి మంగళవారం స్పష్టం కానుంది.

వెదురుతోనూ విద్యుత్తు!

» షోలాపూర్ ఎన్టీపీసీ థర్మల్ కేంద్రంలో బొగ్గుతో కలిపి మండించాలని నిర్ణయం

ముంబై, జనవరి 6: స్వచ్ఛ ఇంధన ఉత్పత్తిలో భాగంగా దేశంలోనే తొలిసారి 'జాతీయ థర్మల్ విద్యుత్తు సంస్థ (ఎన్టీపీసీ)' కీలక నిర్ణయం తీసుకుంది. విద్యుదుత్పత్తి కోసం బొగ్గుతో పాటు వెదురును కూడా కలిపి మండించనుంది. మహారాష్ట్రలోని షోలాపూర్‌లో ఉన్న థర్మల్ విద్యుత్కేంద్రంలో తొలిసారిగా ఈ ప్రక్రియను చేపట్టాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. దేశంలోనే తొలిసారి షోలాపూర్‌లోని సూపర్ థర్మల్ విద్యుత్కేంద్రంలో 'బయోమాస్ (వెదురు)' ఆధారిత విద్యుత్తును ఉత్పత్తి చేయాలంటూ మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ ఎన్టీపీసీకి లేఖ రాశారు. థర్మల్ విద్యుత్కేంద్రానికి అవసరమైన వెదురును షోలాపూర్, సమీప రైతుల నుంచి కొనుగోలు చేస్తామని సీఎం టాస్క్‌ఫోర్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పాషా పటేల్ చెప్పారు. ప్రస్తుతం షోలాపూర్ థర్మల్ పవర్ ప్లాంట్‌లో విద్యుదుత్పత్తి కోసం ఏటా 40 లక్షల టన్నుల బొగ్గును వినియోగిస్తున్నారని.. ఒక కిలో బొగ్గును మండిస్తే 2.08 కిలోల కార్బన్ విడుదల అవుతుందని, అంటే ఏటా ఏ స్థాయిలో కార్బన్ ఉత్పత్తి అవుతుందో ఊహించుకోవచ్చని పటేల్ అన్నారు. చాలా దేశాల్లో థర్మల్ పవర్ ప్లాంట్లను మూసివేస్తున్నారని గుర్తుచేశారు. ఈ విషయంలో మన దేశంలోనూ కొంత పురోగతి ఉందన్నారు.


పశ్చిమగోదావరి జిల్లా పెద అమిరంలో రతన్ టాటా విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి లోకేశ్, డిప్యూటీ స్పీకర్ రఘురామ రాజు, కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ తదితరులు

నెలకు 4 వేల కోట్లు లోటు

» ఆర్థిక ఇబ్బందుల్లో రాష్ట్రం
» అధిగమించేందుకు ప్రయత్నాలు
» దేశానికే రతన్ టాటా ఒక బ్రాండ్: లోకేశ్

భీమవరం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. ప్రతి నెలా రూ.4,000 కోట్లు లోటు బడ్జెట్‌తో ప్రభుత్వం నడుస్తోంది. అయినా అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నాం. లోటును తగ్గించే ప్రయత్నాలు చేస్తున్నాం' అంటూ రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా ఉండి, భీమవరం నియోజకవర్గాల్లో సోమవారం ఆయన పర్యటించారు. దాతల సహకారంతో డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు ఉండిలో పునరుద్ధరించిన జిల్లా పరిషత్ ప్రభుత్వం పాఠశాలను లోకేశ్ ప్రారంభించారు. పెద అమిరంలో పద్మవిభూషణ్ రతన్‌టాటా కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'భారతదేశ చరిత్రలో విలువలతో కూడిన వ్యాపారాన్ని నిర్వహించిన పారిశ్రామికవేత్త రతన్‌టాటా. ఆయన ఒక బ్రాండ్. నష్టాల్లో వున్న కంపెనీలను తీసుకుని లాభాలబాట పట్టించారు. భారత్ దేశం బ్రాండ్ తగ్గిపోతుందని తాజ్ హోటళ్లను ఇతర దేశాలకు విస్తరించలేదు. పరిశ్రమలతోపాటు, వ్యాపార రంగంలోకి అడుగుపెట్టి భారతీయ యువతకు రోల్ మోడల్‌గా నిలిచారు. మా అమ్మమ్మ క్యాన్సర్‌తో చనిపోయారు. ఆ వ్యాధితో ఎవరూ చనిపోకూడదనే ఉద్దేశంతో తాతయ్య ఎన్టీఆర్ హైదరాబాద్‌లో బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. అప్పట్లో మొదట రతన్ టాటా విరాళంగా రూ.25 కోట్లు ఇచ్చారు. హుద్‌హుద్ తుఫాను సమయంలో సహకరించాలని కోరితే రూ.3 కోట్లు సాయమందించారు. విశాఖలో టీసీఎస్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో దాదాపు 10 వేల మందికి ఉద్యోగాలు కల్పించేలా అభివృద్ధి చేస్తున్నారు' అని తెలిపారు.

మిత్రులను సంపాదించండి

ఉండి జడ్పీ హైస్కూల్, భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాలల్లో విద్యార్థులతో మాట్లాడుతూ... 'విద్యార్థులు చదువుకోవడంతోపాటు కళాశాలల్లో మిత్రులను సంపాదించాలి. చంద్రబాబు అరెస్టు సమయంలో కళాశాల మిత్రులు నాకు ఎంతగానో అండగా నిలిచారు' అని అన్నారు. 'విద్యాలయాల్లో రాజకీయాలు ఉండకూడదు. అందుకే ఫ్లెక్సీల్లో రాజకీయ నాయకుల ఫొటోలు లేవు. పేర్లు లేవు. ఆ పిచ్చి మాకు లేదు. విద్యా సంస్థల్లో రాజకీయాల జోలికి పోము. అందుకే విద్యా శాఖను రాజకీయాలతో సంబంధం లేకుండా నడిపిస్తున్నాం. విద్యార్థుల అన్ని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం' అని లోకేశ్ చెప్పారు. ఈ సందర్భంగా జడ్పీ హైస్కూల్ విద్యార్థినులు... 'ప్లస్-2ని ఇంటర్‌లో విలీనం చేస్తున్నట్టు ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్త నిజమేనా? మాకు పాఠశాలల్లో ఇంటర్ ఉండదా?' అని మంత్రి లోకేశ్‌ను అడిగారు. 'ఆంధ్రజ్యోతి వాస్తవాన్నే రాసింది. అందులో తప్పులేదు. ప్లస్-2ని ఇంటర్ విద్యలో కలిపి అభివృద్ధి చేస్తాం. విద్యార్థుల ఇబ్బందులను తొలగిస్తాం' అని లోకేశ్ భరోసా ఇచ్చారు.

ఆ పదవి నుంచి తప్పుకొంటున్నా

'తెలుగుదేశం పార్టీలో సామాన్యులకు పెద్ద పీట వేస్తాం. రాష్ట్ర, జాతీయ స్థాయి రాజకీయాల్లో అందరూ ఎదగాలి. పార్టీ అటువంటి అవకాశాలను కల్పిస్తుంది. జాతీయ ప్రధాన కార్యదర్శి హోదా నుంచి తప్పుకోవాలనుకుంటున్నా. ఇప్పటికే మూడుసార్లు ఆ పదవిలో కొనసాగా. మున్ముందు ఇతరులకు అవకాశం ఇవ్వాలని భావిస్తున్నాం. పార్టీ పదవుల్లో సామాన్యులకు అవకాశం కల్పిస్తాం' అంటూ లోకేశ్ కార్యకర్తలకు భరోసా కల్పించారు. రఘురామరాజు నివాసంలో ఉత్తమ కార్యకర్తలతో సమావేశమైన ఆయన... ప్రతి ఒక్కరూ పార్టీలో అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. 'రాష్ట్రంలో కూటమిని విడదీసే పనిలో సైకో జగన్ ఉన్నాడు. కూటమిలో మిస్ ఫైర్, క్రాస్ ఫైర్, విడాకులు ఉండవు. సైకో కుయుక్తులు సాగవు' అని లోకేశ్ అన్నారు. భీమవరంలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మను పరామర్శించిన అనంతరం కూటమి నాయకులతో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. 'సమన్వయంతో కూటమి ముందుకు వెళ్లాలి. లేదంటే సైకో పాలన మళ్లీ వచ్చేస్తుంది. సైకో మళ్లీ వస్తే రాష్ట్రం సర్వ నాశనమైపోతుంది' అని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ అన్నారు.

కరెంటు బిల్లుల భారం ఇక ఉండదు!

(మొదటి పేజీ తరువాయి)


స్వర్ణ కుప్పం విజన్ 2029పై మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

దశాబ్దాలుగా ప్రాతినిధ్యం వహిస్తున్న చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో మూడ్రోజుల పర్యటన కోసం సోమవారం ఆయన బెంగళూరు మీదుగా వచ్చారు. తొలి రోజు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మొదట ద్రవిడ విశ్వవిద్యాలయంలో 'స్వర్ణ కుప్పం విజన్-2029' డాక్యుమెంట్‌ను ఆవిష్కరించారు. వచ్చే ఐదేళ్లలో నియోజకవర్గ అభివృద్ధిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రజలను పేదరికం నుంచి బయటపడేసే పీ-4(పబ్లిక్, ప్రైవేటు, పీపుల్, పార్ట్‌నర్‌షిప్) విధానంతో నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలుపుతానన్నారు.

లబ్ధిదారుల కుటుంబ సభ్యులతో..

అనంతరం కుప్పం మండలంలోని నడిమూరులో 'పీఎం సూర్యఘర్ పైలట్ ప్రాజెక్టును చంద్రబాబు ప్రారంభించారు. గ్రామంలో 132 ఇళ్లు ఉండగా.. 96 ఇళ్లను ఈ పథకానికి ఎంపిక చేశారు. 15 ఇళ్లకు సౌర ఫలకాలను అమర్చి సోలరైజేషన్ ప్రారంభించారు. లబ్ధిదారులు సుబ్రమణ్యం, నాగరాజు, పద్మావతి, చిన్నస్వామి ఇళ్లల్లో వాడుతున్న సౌరవిద్యుత్ పనితీరును చంద్రబాబు స్వయంగా పరిశీలించి.. వారి కుటుంబ సభ్యులతో కలిసి టీ తాగారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ సోలార్ విద్యుత్ పనితీరును వివరించారు. లబ్ధిదారులు, గ్రామస్థులతో సీఎం ముఖాముఖి నిర్వహించారు. 'సూర్యఘర్ పథకంతో భవిష్యత్‌లో కరెంటు బిల్లు కట్టే భారం ఉండదు. ప్రతి ఇల్లూ నెలకు 200 యూనిట్లు ఉత్పత్తి చేసుకునే అవకాశం ఉంది. మిగులు కరెంటుతో ఏడాదికి రూ.4 వేల ఆదాయం వస్తుంది' అని ఆయన చెప్పారు. జూన్‌లోగా కుప్పానికి హంద్రీ-నీవా జలాలను తీసుకొస్తామన్నారు. ఆ తర్వాత.. నియోజకవర్గాన్ని కాలుష్యరహితంగా తయారుచేసే 'నెట్ జీరో కాన్సెప్ట్‌పై కాన్పూర్ ఐఐటీ ప్రతినిధులతో ఎంవోయూ కుదుర్చుకున్నారు. చీగలపల్లెలో 'ఆర్గానిక్ కుప్పం' కార్యక్రమంలో వ్యవసాయం చేస్తున్న రైతులతో చంద్రబాబు మాట్లాడారు. రాత్రికి ద్రవిడ యూనివర్సిటీకి చేరుకుని టీడీపీ శ్రేణులతో సీఎం సమావేశమయ్యారు.

'ఎనీవేర్'లో 156 కోట్ల అక్రమాలు!

» శ్రీకాంత్ కుటుంబం పేరుతో ఇలా 40 డాక్యుమెంట్లు
» 'ఇబ్రహీంపట్నం' భూవ్యవహారంలో తేల్చిన అధికారులు

అమరావతి, విజయవాడ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో తెచ్చిన 'ఎనీవేర్ రిజిస్ట్రేషన్ల' ముసుగులో సాగించిన భారీ దందాల గుట్టు పూర్తిగా రట్టయింది. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు ఇబ్రహీంపట్నం మాజీ సబ్ రిజిస్ట్రార్ లాలా బాలనాగధర్మ సింగ్ రాసిన లేఖ ఆధారంగా విచారించి ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులు నివేదిక ఇచ్చారు. సాధారణంగా ఏదైనా ఒక ఆస్తి ఒకరిపేరు నుంచి మరొకరి పేరుకు బదిలీ అయ్యే క్రమంలో విక్రేత లేదా దాత ఉండటం ముఖ్యం. కానీ ఇబ్రహీంపట్నం పరిధిలో అధిక భాగం లావాదేవీలు వారెవరూ లేకుండానే జరిగిపోయాయని ఉన్నతాధికారులు తెలిపారు. ఈ దందాలో మొత్తం రూ.156 కోట్ల విలువైన లావాదేవీలు జరిగినట్టు నిర్ధారించారు.

నివేదికలోని ముఖ్యాంశాలు..

- చీమకుర్తి శ్రీకాంత్, ఆయన తండ్రి శేషుబాబు, సతీమణి వనం దివ్య తదితర కుటుంబ సభ్యులు, బంధువుల పేరుమీద మొత్తం 40 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ లావాదేవీలు జరిగాయి. ప్రభుత్వలెక్కల ప్రకారం వీటి విలువ రూ.106 కోట్లు. స్థానికంగా ఉన్న భూమి ధరల ప్రకారం వాటి విలువ రూ.156 కోట్లు.
- ఆదాయపన్ను నిబంధనల ప్రకారం ఎవరైనా ఒక స్థిరాస్తిని అమ్మినప్పుడు లేక కొన్నప్పుడు దాటి విలువ రూ.5 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ ఉంటే పాన్ కార్డు తప్పనిసరిగా సమర్పించాలి. శ్రీకాంత్, ఆయన కుటుంబ సభ్యుల పేరుతో జరిగిన భూక్రయవిక్రయాల లావాదేవీల్లో పాన్ నంబర్ ఎక్కడా లేదు. ఈ భూముల కొనుగోళ్ల వ్యవహారంలో పూర్తిగా నగదు చేతులు మారింది.
- డాక్యుమెంట్లను ఎలాంటి సహేతుక కారణం లేకుండా అత్యవసర ప్రాతిపదికన రిజిస్ట్రేషన్ చేశారు. ఇలా చేయడం ఆ లావాదేవీల్లోని డొల్లతనానికి నిదర్శనం.
- అన్నీ తెలిసీ ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ సింగ్ అప్పట్లో ఈ రిజిస్ట్రేషన్లు చేశారు. లోతుగా ఆయనపై విచారణ జరపాలి.

అదిరిపోయే 'లింకు'

శ్రీకాంత్ కుటుంబ సభ్యులు, బంధువుల పేర్లతో జరిగిన రిజిస్ట్రేషన్లకు సంబంధించిన కొన్నింటికి లింక్ డాక్యుమెంట్లు లేకుండానే రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఆస్తి తమదే అని చెప్తున్నప్పటికీ వాటి యాజమాన్య హక్కుల బదిలీ నిబంధనల ప్రకారం జరగలేదు. ఉదాహరణకు 2021 మార్చి 31న డాక్యుమెంట్ నంబర్ 3469/2021ను గుణదల సబ్‌రిజిస్ట్రార్ నమోదు చేశారు. దీని లింక్ డాక్యుమెంట్ నెంబర్ 3030/2021ను కూడా అదే కార్యాలయంలో అదే రోజు రిజిస్ట్రేషన్ చేశారు. 2021 ఆగస్టు 12న డాక్యుమెంట్ నంబర్ 7027ను నమోదు చేశారు. దీని లింక్ డాక్యుమెంట్ నంబర్ 7022/2021ను కూడా అదే రోజున రిజిస్ట్రేషన్ చేశారు.

పిల్లల ఆలనాపాలనపై ఆందోళన

ఎవరి కోసం విదేశానికి వచ్చారో వారి కోసం ఇంటికి తిరుగుముఖం

ఉద్యోగాలు వదిలి స్వదేశానికి ప్రవాసులు

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలానికి చెందిన గడ్డం శ్రీనివాస్ ఉపాధి నిమిత్తం సౌదీ అరేబియాలో ఉంటుండగా అతని కుమారుడు, మైనర్ బాలుడు సంజయ్ స్వగ్రామంలో ఇంటి వ్యవహారాలు చూసుకునేవాడు. ఈ క్రమంలో కుటుంబ అవసరాల కోసం శ్రీనివాస్ తన భార్య శ్రీలక్ష్మి పేరిట ఓ ద్విచక్ర వాహనాన్ని కొనుగోలు చేశారు. సంజయ్ ఆ వాహనాన్ని నడుపుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. దీంతో పోలీసులు సంజయ్‌ను అరెస్టు చేసి బాలల సంరక్షణ కేంద్రానికి తరలించారు. వాహన యజమాని అయిన సంజయ్ తల్లి శ్రీలక్ష్మిని కూడా పోలీసులు అరెస్టు చేయగా ఆమె బెయిల్‌పై విడుదలైంది.

ఏపీకి చెందిన ఓ వ్యక్తి తన కుమార్తెను బంధువుల వద్ద వదిలి ఉపాధి నిమిత్తం కువైత్ రాగా.. వారి సమీప బంధువు ఆ బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయం తెలుసుకున్న సదరు ప్రవాసీయుడు స్వదేశానికి వచ్చి ఆ బంధువును హతమార్చాడు.

ఉపాధి కోసం కుటుంబాలను వదిలి ఎడారి దేశాలకు వలస వచ్చిన ప్రవాసీయులను హడలెత్తిస్తున్నాయి. ఏ పిల్లల బంగారు భవిష్యత్తు కోసం వారు కుటుంబాన్ని, సొంతూరిని వదిలి ఎడారి దేశాలకు వచ్చారో.. తిరిగి అదే కుటుంబం, పిల్లల రక్షణ కోసం అన్ని వదిలి ఇంటికి వెళ్లేలా చేస్తున్నాయి. స్వదేశంలో భార్య బిడ్డలను వదిలి ఎడారి దేశాలకు వచ్చి రేయింబవళ్లు కష్టపడి సంపాదిస్తున్న వారి పరిస్థితి ఆందోళనకరంగా మారుతోంది. ఇంటి పెద్ద దిక్కు గల్ఫ్‌లో ఉండడం.. స్వగ్రామంలోని ఇంట్లో ఉన్న పిల్లలకు తల్లి మాత్రమే దిక్కుగా ఉంటుండడంతో ప్రవాసీయులకు పలు సమస్యలు ఎదురవుతున్నాయి. కుటుంబానికి సరైన మార్గదర్శకత్వం లేక గల్ఫ్ వలసల ప్రభావం ఎక్కువగా ఉన్న జిల్లాల్లో పరిస్థితి గాడి తప్పుతుంది. దీంతో గల్ఫ్‌లో చేస్తున్న ఉద్యోగాలను వదిలి రాలేక ఇటు మాతృభూమిలో కుటుంబాలను సరిగ్గా చూసుకోలేక ప్రవాసీయులు సతమతమవుతున్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లాకు చెందిన శ్రీనివాస్ కుటుంబంలో జరిగిన ఘటన కుటుంబాలను వదిలి విదేశాల్లో



నివసిస్తున్న ప్రవాసీయులందరికీ వణుకు పుట్టించింది. ఈ ఘటన కంటే ముందు రాజన్న సిరిసిల్ల జిల్లాకే చెందిన ఇద్దరు ప్రవాసీయులకు చెందిన పిల్లలు ప్రమాదాల్లో మరణించారు. ఆ ప్రవాసీయులు తమ పిల్లలను కడసారి కూడా చూసుకోలేకపోయారు. ఎవరి కోసం ఎడారికి వచ్చామో వారే చనిపోయాకా ఈ ఉద్యోగం, డబ్బు ఎందుకని ఆవేదన వ్యక్తం చేస్తూ వారిద్దరూ స్వదేశానికి వెళ్లిపోయారు. ఇక, పిల్లలను బంధువుల వద్ద ఉంచి ఉపాధి కోసం విదేశాలకు వచ్చిన ప్రవాసీయుల పరిస్థితి మరోలా ఉంటుంది. అయిన వారే అత్యాచారాలకు పాల్పడడం, హింసించడంతో పిల్లల జీవితాలు నాశనం అవుతుండగా, తల్లిదండ్రులు ఆవేశంలో నేరాలకు పాల్పడుతున్నారు. ఫలితంగా కుటుంబాలు నాశనం అవుతున్నాయి. తన కుమార్తె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడనే కారణంతో ఆంజనేయ ప్రసాద్ అనే వ్యక్తి కువైత్ నుంచి ఏపీలోని అన్నమయ్య జిల్లా ఓబులవారి పల్లె మండలానికి వెళ్లి తన సమీప బంధువును హతమార్చాడు. అంతకముందు ఒమాన్‌లో నివాసముండే ఓ ప్రవాసీ కుమార్తె(మైనర్ బాలిక).. ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా చాగల్లు మండలంలో అత్యాచారానికి గురైంది. ఇలాంటి ఘటనలు ప్రవాసీలను హడలెత్తిస్తున్నాయి. దీంతో పిల్లలు ఎదుగుతున్న కొద్ది డబ్బు అవసరం ఉన్నప్పటికీ వారి ఆలనాపాలన కోసం చాలా మంది ఉద్యోగాలకు రాజీనామా చేసి స్వదేశానికి తిరిగి వచ్చేస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి

భర్త చనిపోయిన 6 రోజులకు గుర్తించిన భార్య

- ఒకే ఇంట్లో ఉంటున్నా పదేళ్లుగా మాటల్లేవు
- కోయంబత్తూరులో వెలుగుచూసిన ఘటన

చెన్నై, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): దంపతుల మధ్య ఏర్పడే అగాధం ఎంతటి విపరీతానికి దారి తీస్తుందో ఈ సంఘటనే ఓ ఉదాహరణ! ఒకే ఇంట్లో ఉంటున్నా ఆ దంపతుల మధ్య పదేళ్లుగా మాటల్లేవ్! దీంతో భర్త ఏమయ్యాడో కూడా తెలుసుకోలేకపోయిన భార్య.. ఎట్టకేలకు ఆరు రోజుల తర్వాత ఇంట్లోనే పడివున్న అతడి మృతదేహాన్ని గుర్తించింది. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటన తమిళనాడులోని కోయంబత్తూరులో చోటు చేసుకుంది. కోయంబత్తూర్ ఇరుగూర్ ఈశ్వరన్ ఆలయ వీధిలో రాజమాణిక్యం (73), రాజసులోచన (63) దంపతులు నివాసముంటున్నారు. పిల్లలిద్దరికీ వివాహమై వేర్వేరు ప్రాంతాల్లో ఉంటున్నారు. ఈ దంపతుల మధ్య తలెత్తిన విభేదాల కారణంగా పదేళ్లుగా వారు మాట్లాడుకోవడం లేదు. మిద్దెపై ఉన్న గదిలో ఉంటున్న రాజమాణిక్యం, రోజూ కిందికి వచ్చి భోజనం, తాగునీరు తీసుకెళ్లేవాడు. ఈ నేపథ్యంలో గత నెల 29వ తేదీ మధ్యాహ్నం కిందికి వచ్చిన రాజమాణిక్యం.. అన్నం తీసుకెళ్లాడు. ఆయనకు అదే ఆఖరి భోజనం. ఆరు రోజులైనా అతడు కిందికి రాకపోవడంతో వేరే ఊరికి వెళ్లి ఉంటాడని రాజసులోచన భావించింది. ఈ క్రమంలో శనివారం రాత్రి పైగది నుంచి దుర్వాసన రావడంతో రాజసులోచన అక్కడికి వెళ్లగా, తలుపు మూసి ఉంది. కిటికీ నుంచి చూడగా, రాజమాణిక్యం మృతదేహం కుళ్లిన స్థితిలో కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సామాజిక సేవ అంటూ.. 200 కోట్లు కొట్టేశారు!

- ఏపీ, తెలంగాణ, ఒడిశాల్లో భారీగా మోసాలు
- గుంటూరు ఎస్పీని ఆశ్రయించిన బాధితులు

గుంటూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): థర్డ్ పార్టీ ఫండ్ (టీపీఎఫ్) కంపెనీ అంటూ నమ్మించారు. అనేక స్కీమలు పెట్టి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల్లోని అమాయక ప్రజల నుంచి సుమారు రూ.200 కోట్లు వసూలు చేశారు. తీరా డబ్బులేవని అడుగుతుంటే అదిగో.. ఇదిగో అంటూ మాయమాటలు చెబుతున్నారు. దీంతో మోసపోయామని గ్రహించిన కొందరు బాధితులు సోమవారం గుంటూరులో ఎస్పీ సతీష్‌కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. పెదనందిపాడుకు చెందిన గోవాడ సంధ్య శివపార్వతి, షేక్ హుస్సేన్ వలి గతంలో క్రిప్టో కాయిన్స్ తరహాలో కీబో కాయిన్స్‌లో పనిచేశారు. ఆ సమయంలో వారికి గుంటూరులోని రాజేంద్రనగర్‌కి చెందిన వేజండ్ల శివకుమారి అనే మహిళతో పరిచయమమైంది. థర్డ్ పార్టీ ఫండ్స్ (టీపీఎఫ్) అనే కంపెనీ ఉందని, ఈ కంపెనీ పేదలను ఆదుకునేందుకు.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కార్పొరేట్ కంపెనీలు తమ లాభాల్లో 2% వాటాను కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) ఫండ్ కింద ఈ కంపెనీకి కేటాయిస్తాయని శివకుమారి నమ్మబలికింది. నల్లపాడుకు చెందిన నవీన్‌ను టీపీఎఫ్ కంపెనీకి సౌత్ ఇండియా హెడ్‌గా పరిచయం చేసింది. సీఎస్ఆర్ ద్వారా వచ్చే నిధులను పేదలకు ఖర్చు చేయగలరని నమ్మకం కుదరాలంటే ముందుగా రూ.1.2 లక్షలు ఆ కంపెనీలో పెట్టుబడి పెట్టాలని తెలిపింది. పెట్టుబడి పెడితే రోజుకు రూ.30 వేల చొప్పున మన



కొలగాని నవీన్‌బాబు



వేజండ్ల శివకుమారి

బ్యాంకు ఖాతాల్లో కంపెనీ జమ చేస్తుందని పేర్కొంది. రూ.15 వేలు మీరు ఉంచుకొని మిగిలిన రూ.15 వేలు కంపెనీకి ఇవ్వాలని చెప్పింది. ఇలా మొదటి 4 నెలల్లోనే పెట్టిన పెట్టుబడి తిరిగొస్తుందని, తర్వాత 8 నెలలు డబ్బు మీ పేరుతో తెరిచే ఎన్జీవో ట్రస్ట్ ఖాతాలో జమ అవుతాయని చెప్పింది. అందులో రూ.2. లక్షలు మీరు ఉంచుకొని రూ.40వేలు పేదలకు, సామాజిక సేవా కార్యక్రమాలకు ఖర్చు చేయాలని తెలిపింది.

ఆస్తి పత్రాలు తాకట్టు పెట్టి మరీ...

బాధితులు తమ ఆస్తి పత్రాలు తాకట్టుపెట్టి రూ.1.2 లక్షలు సంస్థలో పెట్టుబడి పెట్టారు. వారు చెప్పినట్లుగానే రోజుకు రూ.30 వేలు చొప్పున కొంతకాలం జమ చేశారు. వారు పెట్టిన పెట్టుబడి మొదటి 4 నెలల్లోనే రావడంతో బాధితులు తమకు తెలిసిన వారందరినీ సభ్యులుగా చేర్చారు. వారి ఖాతాల్లో కూడా ప్రతిరోజు డబ్బులు వేశారు. ఈ క్రమంలో శివకుమారి, కొలగాని నవీన్ బాబు, ఆయన తమ్ముడు వేణు, నవీన్ భార్య సుభాషిణి, వారి బంధువులు గణేష్, మణికంఠ, చిన్న అలియాస్ వెంకటేశ్వర్లు తదితరులు నల్లపాడులో కార్యాలయాన్ని ప్రారంభించారు. అక్కడే ఫ్లేవర్స్ ఓషన్ అనే ఐస్‌క్రీమ్ తయారీ కంపెనీని ప్రారంభించి దానికి జిల్లాల వారీగా డిస్ట్రిబ్యూషన్స్ ఇస్తున్నామని, జిల్లా డిస్ట్రిబ్యూటర్ కావాలంటే రూ.25 లక్షలు, మండల డిస్ట్రిబ్యూటర్ కావాలంటే రూ.5 లక్షలు చెల్లించాలని చెప్పారు. టీపీఎఫ్ ఖాతా ఉన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా డిస్ట్రిబ్యూషన్ తీసుకోవాలని షరతు విధించారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో రూ.25 లక్షలు చెల్లించి పల్నాడు జిల్లా డిస్ట్రిబ్యూషన్ తీసుకున్నానని శివపార్వతి తెలిపారు. వలి కూడా రూ.5 లక్షలు చెల్లించి చిలకలూరిపేట మండల డిస్ట్రిబ్యూషన్ తీసుకున్నారు. ఇలా టీపీఎఫ్ కంపెనీలో అనేక మందిని సభ్యులుగా చేర్చి వారితో నవీన్, శివకుమారిలకు రూ.80 లక్షల వరకు కట్టించామని చెప్పారు. ఈ సంస్థ 2023 మేలో ప్రారంభమైందని మొదట్లో తనకు 9 నెలలు డబ్బులు రాగా మిగిలిన వారికి 2-3 నెలలు వచ్చాయని చెప్పారు. నమ్మకం కలిగాక 3 రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో సభ్యులుగా చేరి రూ.లక్షలు పెట్టుబడిగా పెట్టారన్నారు. అయితే 10 నెలల నుంచి ఎవరికీ డబ్బులు రావడం లేదన్నారు. అదేమంటే ఎన్నికల కోడ్ వచ్చిందని, నిధులు ఆగిపోయాయని మాయ మాటలు చెబుతూ కాలయాపన చేస్తూ వచ్చారన్నారు.

టీపీఎఫ్ కంపెనీకి రూ.3.3 కోట్లు కట్టించా

టీపీఎఫ్, సీఎస్ఆర్ ద్వారా పేదలకు సహాయం చేసే అవకాశం ఉంటుందని నమ్మించి సభ్యులుగా చేర్చుకున్నారని కాకినాడ జిల్లా జగ్గంపేటకు చెందిన బి క్రాంతి కుమార్ దంపతులు గుంటూరులో ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఒక్కొక్కరూ 50 మందిని సభ్యులుగా చేర్పిస్తే.. వారికి నెలకు రూ.8 లక్షలు చొప్పున జీతం ఇస్తామని చెప్పడంతో తాను 50 మందితో సంస్థకు రూ.3.3 కోట్లు కట్టించానని తెలిపారు. నెల క్రితం ఇల్లు వదిలి గుంటూరు వచ్చి నల్లపాడులో ఉంటున్నామని చెప్పారు. నవీన్‌బాబుకు ఫోన్ చేస్తే కాంబోడియాలో ఉన్నానని, తర్వాత దుబాయ్ వెళ్లాలి, అమెరికా వెళ్లాలి, బ్రిటన్ వెళ్లాలంటూ మాయ మాటలతో కాలం గడుపుతున్నాడని అన్నారు. కాకినాడ ప్రాంతంలో తనలాగే మరో 11 మంది వరకు రూ.కోట్లు సంస్థకు కట్టించారన్నారు.

ఆత్మహత్య తప్ప మార్గం లేదు!

టీపీఎఫ్, సీఎస్ఆర్ పేర్లతో అమాయక ప్రజలకు డబ్బు ఆశ కల్పించి ఏపీ తెలంగాణ, ఒడిశాల్లో 200 మందిని సభ్యులుగా చేర్చుకొన్న ఈ సంస్థ రూ.200 కోట్ల వరకు వసూళ్లకు పాల్పడినట్లు బాధితులు వాపోయారు. ఈ వ్యవహారంలో వి.శివకుమారి కీలకపాత్ర పోషించారన్నారు నవీన్‌బాబు, షేక్ గౌస్‌తో పాటు వారి కుటుంబసభ్యులు, వారికి సహకరించిన వారందరిపైనా కఠిన చర్యలు తీసుకుని, తమ డబ్బులు ఇప్పించాలని బాధితులు కోరారు. న్యాయం చేయకుంటే ఆత్మహత్య తప్ప మరో మార్గం లేదని వారు కన్నీరు పెట్టుకున్నారు.



ఫైరింగ్ శిక్షణ సమయంలో పక్కనే ఉన్న చిన్నారులు

పిల్లల సమక్షంలో గన్ ఫైరింగ్

- వివాదాస్పదంగా జైళ్ల శాఖ అధికారుల తీరు

పెద్దాపురం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురంలో సోమవారం పోలీస్ ఫైరింగ్ రేంజ్‌లో జైళ్ల శాఖ అధికారులు వ్యవహరించిన తీరు వివాదాస్పదమైంది. చిన్నారులను పక్కన కూర్చోబెట్టుకుని జైళ్ల శాఖ సిబ్బందికి వార్షిక ఫైరింగ్ శిక్షణ ఇవ్వడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఇదంతా కోస్టల్ ఆంధ్రా జైళ్ల డీఐజీ సమక్షంలో జరగడం గమనార్హం. జైళ్ల శాఖ ఎస్ఐలు, ఇతర సిబ్బందికి ఫైరింగ్ శిక్షణ ఇచ్చారు. అదే సమయంలో ముగ్గురు చిన్నారులను కుర్చీలో కూర్చోబెట్టి వారి ఎదురుగా ఒకేసారి టార్గెట్‌లకు గన్ ఫైరింగ్ చేయడం పోలీస్ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది. చిన్నారుల సమక్షంలో ఇటువంటివి చేయకూడదని నిబంధనలు ఉన్నా పట్టించుకోకపోవడంతో నిబంధనలు అతిక్రమించినట్లైంది. ఫైరింగ్ సమయంలో అక్కడున్న చిన్నారులు ఓ పోలీస్ అధికారికి చెందిన సంతానంగా తెలుస్తోంది. వారికి కూడా గన్ ఇచ్చి ఫైరింగ్ చేయించినట్లు సమాచారం. ఇది బయటకు తెలియడంతో భయపడిన పోలీస్ అధికారులు ఈ వీడియోలను డిలీట్ చేయించినట్లు తెలిసింది.

గంజాయి సాగు వీడండి

- గిరిజనులకు ఈగిల్ ఐజీ ఆకే రవికృష్ణ పిలుపు
- అల్లూరి జిల్లాలో గంజాయి తోటల ధ్వంసం



గంజాయి మొక్కలను దహనం చేస్తున్న ఐజీ ఆకే రవికృష్ణ, పోలీసులు

పెదబయలు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): గిరిజనులు గంజాయి సాగు వీడాలని 'ఈగిల్' (ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) ఐజీ ఆకే రవికృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్‌తో కలసి ఆయన పెదబయలు మండలం పాతపాడు గ్రామాన్ని సందర్శించారు. అక్కడ 8ఎకరాల్లో గంజాయి సాగు చేస్తున్నట్టు డ్రోన్ల ద్వారా గుర్తించి ధ్వంసం చేశారు. గంజాయి సాగు చేస్తున్న రైతులపై కేసులు నమోదు చేయాలని స్థానిక ఎస్ఐ కె.రమణను ఆదేశించారు. అనంతరం గ్రామస్థులతో ఐజీ మాట్లాడుతూ గంజాయిని వదిలి ఇతర పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. గంజాయి అనేక ప్రాణాలను బలిగొంటోందని, దానిని రవాణా చేస్తూ పట్టుబడిన వందలాది యువకులు జైళ్లలో మగ్గుతున్నారని, వారిలో గిరిజన ప్రాంతానికి చెందినవారే ఎక్కువని చెప్పారు. జిల్లాలో ఎక్కడ గంజాయి సాగవుతోందో పోలీసులకు తెలుసని, వాటిని రైతులే స్వచ్ఛందంగా ధ్వంసం చేయాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మొత్తం ఓటర్లు 4,14,40,447

- పురుషులతో పోలిస్తే 7.3 లక్షల మంది మహిళా ఓటర్లే అధికం
- 2025-తుది జాబితా విడుదల

అమరావతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరోసారి మహిళా ఓటర్లే పైచేయి సాధించారు. ప్రభుత్వాల ఏర్పాటులో వారే కీలక పాత్ర పోషించనున్నారు. 2025కు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం తాజాగా ఇచ్చిన ఓటర్ల జాబితాలో పురుష ఓటర్ల కంటే కూడా మహిళా ఓటర్లు 7,31,415 మంది అధికంగా ఉన్నారు. ఈ మేరకు 'ఓటర్ల తుది జాబితా-2025'ను రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వివేక్ యాదవ్ సోమవారం విడుదల చేశారు. రాష్ట్రంలో మొత్తం 4,14,40,447 మంది ఓటర్లు ఉన్నట్లు ఆయన వెల్లడించారు. ఎన్నికల సంఘం విడుదల చేసిన 2025 ముసాయిదా ఓటర్ల జాబితాలో రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 4,14,20,935 మందిగా ఉండగా తాజా జాబితాలో 19,512 మంది ఎక్కువగా నమోదయ్యారు. దీంతో మొత్తం ఓటర్ల సంఖ్య 4,14,40,447కు చేరింది.

మరిన్ని వివరాలు

- ముసాయిదా ఓటర్ల జాబితాలో పురుషులు 2,03,47,738 ఉండగా.. ఇప్పుడు ఆ సంఖ్య 2,03,52,816కు చేరింది.
- మహిళా ఓటర్లు ముసాయిదా జాబితాలో 2,10,69,803 ఉండగా ఇప్పుడు వారి సంఖ్య 2,10,84,231కి చేరింది.
- థర్డ్ జెండర్ల ఓట్లు 3400కి చేరాయి.
- సర్వీసు ఓటర్లు సంఖ్య 67,143 మంది ఉండగా తాజాగా వారు 66,690కి తగ్గారు.
- ప్రవాసాంధ్రుల(ఎన్ఆర్ఐ) ఓట్లు 8,043 ఉన్నాయి.
- ఎలక్టోరల్ టు పాపులేషన్(ఈపీ-ఉన్న జనాభాలో ఓటర్ల సంఖ్య) రేషియో 719గా నమోదైంది.
- రాష్ట్రంలో మొత్తం 46,397 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి.
- ముసాయిదా జాబితా తర్వాత.. తాజాగా విడుదల చేసిన తుది జాబితా నాటికి 1,02,227 మంది కొత్త ఓటర్లు చేరారు.
- మరణించిన, బదిలీ అయిన, రిపీటెడ్ ఓటర్లు 82,262 మందిని ముసాయిదా జాబితా నుంచి తొలగించారు.
- 18-19 ఏళ్ల మధ్య వయసున్న ఓటర్లు 5,14,646 మంది.

26 జిల్లాల్లో ఓటర్లు వీరే..

జిల్లా పేరు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	థర్డ్ జెండర్	మొత్తం జెండర్
శ్రీకాకుళం	9,47,254	9,48,874	126	18,96,254
విజయనగరం	7,77,728	7,94,286	71	15,72,085
మన్యం	3,85,467	4,01,865	73	7,87,405
అల్లూరి	3,72,268	4,01,079	41	7,73,388
విశాఖపట్నం	9,97,794	10,21,634	119	20,19,547
అనకాపల్లి	6,31,835	663,168	28	12,95,031
కాకినాడ	8,06,282	8,31,035	189	16,37,506
కోనసీమ	7,59,781	7,72,181	21	15,31,983
తూర్పు గోదావరి	7,91,687	8,29,790	95	16,21,572
పశ్చిమ గోదావరి	7,21,453	7,50,211	76	14,71,740
ఏలూరు	7,99,936	8,38,171	126	16,38,233
కృష్ణా	7,46,922	7,93,948	55	15,40,925
ఎన్టీఆర్	8,32,181	8,75,024	152	17,07,357
గుంటూరు	8,68,522	9,27,673	161	1796,356
బాపట్ల	6,33,807	6,61,640	80	12,95,527
పల్నాడు	8,47,934	8,88,646	189	17,86,769
ప్రకాశం	9,12,358	9,13,632	113	18,26,103
నెల్లూరు	9,51,145	9,93,309	210	19,44,664
కర్నూలు	10,18,647	10,45,225	312	20,64,184
నంద్యాల	6,84,239	7,10,248	262	13,94,749
అనంతపురం	10,01,381	10,22,660	247	20,24,288
శ్రీ సత్యసాయి	7,02,416	7,09,851	64	14,12,331
కడప(వైఎస్సార్)	8,04,511	8,39,333	215	16,44,059
అన్నమయ్య	7,02,900	7,28,261	130	14,31,291
చిత్తూరు	7,75,253	7,96,723	72	15,72,048
తిరుపతి	8,79,115	9,25,764	173	18,05,052
మొత్తం ఓటర్లు	2,03,52,816	2,10,84,231	3,400	414,40,447

అక్కాచెల్లెళ్లు సజీవదహనం

- తల్లికి తీవ్రగాయాలు.. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం
- ఇంట్లో నిద్రిస్తుండగా అర్ధరాత్రి ఘటన

పర్చూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అగ్నికీలలకు అక్కాచెల్లెళ్లు సజీవ దహనమైన ఘటన బాపట్ల జిల్లా పర్చూరులో ఆదివారం అర్ధరాత్రి తూర్పువారివీధిలో చోటుచేసుకుంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇంట్లో మంటలు చెలరేగాయి. ఇద్దరు కుమార్తెలు నాగమణి(34), మాధవీలత(30) మంటల్లో చిక్కుకుని మృతిచెందగా, తల్లి లక్ష్మీరాజ్యం తీవ్ర గాయాలతో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. పోలీసుల కథనం ప్రకారం.. పర్చూరుకు చెందిన దాసరి వెంకటేశ్వర్లు, లక్ష్మీరాజ్యం దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. వెంకటేశ్వర్లు స్థానికంగా లారీ ఆఫీస్‌లో నైట్ వాచ్‌మన్‌గా ఉంటున్నారు. కుమారుడు లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. కుమార్తె నాగమణి(34) అనారోగ్యంతో మంచంపై ఉంటోంది. రెండో కుమార్తె మాధవీలత(30) ఫిట్స్ వ్యాధితో బాధపడుతోంది. ఆదివారం అర్ధరాత్రి తల్లి, ఇద్దరు కుమార్తెలు ఇంట్లో నిద్రిస్తున్న తరుణంలో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. మొదట నాగమణి మంటల్లో కాలిపోయింది. ఆమె కేకలు విని లేచిన తల్లి వారిని కాపాడే ప్రయత్నం చేసింది. అదేసమయంలో రెండో కుమార్తె మాధవీలతకు మంటలు అంటుకోగా తల్లి ఆర్పే ప్రయత్నం చేసింది. అయితే దట్టమైన పొగ కమ్ముకోవడంతో ఊపిరి ఆడక మాధవీలత మృతిచెందింది. ఇద్దరు కూతుళ్లను రక్షించే క్రమంలో తల్లికి తీవ్రగాయాలు కాగా, చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



నాగమణి, మాధవీలత



కాకినాడలో ర్యాలీ చేస్తున్న వేలాది మంది యూటీఎఫ్ ఉపాధ్యాయులు

ప్రమాదంలో దేశ విద్యావ్యవస్థ

- కాషాయీకరణ, కార్పొరేటీకరణే కారణం: కేరళ మాజీ మంత్రి ఎంఏ బేబి
- యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభకు అతిథిగా హాజరు



కాకినాడ కలెక్టరేట్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం దేశంలో విద్యావిధానం బలహీనపడుతోందని.. కాషాయీకరణ, కార్పొరేటీకరణ, కేంద్రీకరణతో ప్రమాదంలో పడిందని కేరళ మాజీ విద్యాశాఖ మంత్రి ఎంఏ బేబి అన్నారు. కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల్లో రెండో రోజు సోమవారం జరిగిన విద్యాసదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో ప్రస్తుతం విద్యా విధానాన్ని ఆర్ఎస్ఎస్, బీజేపీ ప్రభావితం చేస్తున్నాయని ఆరోపించారు. విద్య విషయంలో కేరళ దేశంలోనే ప్రథమ స్థానంలో ఉండటానికి ప్రధాన కారణం నాణ్యమైన విద్య అందించడమేనన్నారు. మాతృభాషలో విద్య బోధించడం వల్ల విద్యార్థులు నేర్చుకోవడానికి ఎంతో అనుకూలంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ప్రముఖ విద్యావేత్త వి.బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 2023లో విదేశాల్లో చదువుతున్న భారతీయ విద్యార్థులు ఆయా దేశాలకు చెల్లించిన ఫీజులు లక్షా రెండు వేల కోట్ల రూపాయలు అని, వీటిలో రెండు తెలుగు రాష్ట్రాల విద్యార్థులు రూ.42 వేల కోట్లు చెల్లించారని తెలిపారు. ఇక్కడి విద్యావ్యవస్థలో అన్ని సౌకర్యాలు ఉంటే మన విద్యార్థులు ఇతర దేశాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండదన్నారు. కేరళ, తమిళనాడు, ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్‌లలో విద్యావిధానం అద్భుతంగా ఉందని, ఈ రాష్ట్రాల్లో 70-80 శాతం విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకుంటున్నారన్నారు. యూటీఎఫ్ ఉపాధ్యాయులు ప్రభుత్వ బడులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. తమిళనాడు మదురై విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ రాజ్‌మాణిక్యం మాట్లాడుతూ జాతీయ నూతన విద్యావిధానం విద్యావ్యవస్థను విచ్ఛిన్నం చేస్తుందని, విద్యాహక్కు చట్టానికి తూట్లు పొడుస్తుందన్నారు.

ఉపాధ్యాయుల ర్యాలీతో ఎరుపెక్కిన కాకినాడ

వేలాది మంది ఉపాధ్యాయులు సోమవారం మధ్యాహ్నం యూటీఎఫ్ ఎర్ర జెండాను పట్టుకుని కాకినాడలో భారీ ర్యాలీ చేశారు. దీంతో కాకినాడ నగరం ఎరుపెక్కింది. 117 జీవో, సీపీఎస్ రద్దు చేయాలని, ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని నినాదాలు చేశారు. ప్రభుత్వ పాఠశాలలో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. ప్రభుత్వ బడుల బలోపేతానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. సరెండర్ లీవులు, పీఆర్సీ సెలవుల బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. పీఆర్ కళాశాల నుంచి బాలాజీ చెరువు సెంటర్ వరకు ర్యాలీ సాగింది. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, అసోసియేట్ అధ్యక్షుడు సురేష్‌కుమార్, ఏపీఎన్జీవో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివారెడ్డి, విద్యాసాగర్, యూటీఎఫ్ కాకినాడ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నగేష్, చక్రవర్తి పాల్గొన్నారు.

లీగల్ సర్వీసెస్ చైర్మన్‌గా జస్టిస్ రఘునందనరావు



అమరావతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్‌గా న్యాయమూర్తి జస్టిస్ ఆర్. రఘునందనరావు నియమితులయ్యారు. ఈ నియామకానికి సంబంధించి ప్రభుత్వం సోమవారం గెజిట్ ప్రచురించింది. ఏపీ హైకోర్టు సీజే, ఏపీ న్యాయ సేవాధికార సంస్థ ప్యాట్రన్ ఇన్ చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ నిర్ణయం మేరకు ఈ నియామకం జరిగింది.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.